Dwaraka

సోమవారం
8•1•2018
హైదరాబాద్
• వెల.5 రూ.

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

• సంపుటి 7 • సంచిక 212
• పేజీలు : 16 + (20/16)

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

తాగుబోతు బీభత్సం

జూబ్లీహిల్స్‌లో అతివేగంగా స్కూటీని ఢీకొట్టిన కారు

మహిళ మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

డ్రంక్ అండ్ డ్రైవ్‌కు మరో ప్రాణం బలైంది.. హైదరాబాద్‌లో శనివారం అర్ధరాత్రి మద్యం మత్తులో మాదాపూర్ నుంచి కారును మితిమీరిన వేగంతో నడుపుతూ వచ్చిన ఓ తాగుబోతు జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10లో రోడ్డుపై వెళ్తున్న స్కూటీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

6





హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నం. 10లో స్కూటీని ఢీకొట్టిన కారు. (ఇన్‌సెట్) తాగి డ్రైవింగ్ చేసిన విష్ణువర్ధన్, ప్రమాదంలో మరణించిన మస్తానీ (ఫైల్ ఫొటో)

పాక్ సరిహద్దు వెంబడి 14,000 బంకర్లు

13,029 వ్యక్తిగత, 1431 సామాజిక భూగర్భ రక్షణగృహాల నిర్మాణం

కేంద్రం ఆమోదం.. 415 కోట్ల నిధులు విడుదల

సరిహద్దు గ్రామాల్లో ప్రాణనష్టాన్ని అరికట్టే దిశగా చర్యలు

5





తుమ్మిళ్ల పైలాన్

తుమ్మిళ్లకు నేడు శంకుస్థాపన

మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా అధికారికంగా పనులు మొదలు

అప్రోచ్ చానల్, పంపుహౌజ్ పనుల్లో వేగం

46 శాతం పూర్తయిన మట్టి పనులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాజోలిబండ డైవర్షన్ స్కీం (ఆర్డీఎస్) ఆయకట్టుకు జీవంపోసే తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి టీ హరీశ్‌రావు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు మంత్రి పర్యటన షెడ్యూలు ఖరారైంది. రూ.783 కోట్ల అంచనా విలువతో రూపొందించిన ఈ పథకాన్ని రెండు దశల్లో చేపట్టేందుకు నిర్ణయించగా మొదటి దశ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. తన అధికారిక కార్యక్రమం వరకు వేచిచూడకుండా పనులు మొదలుపెట్టాలని మంత్రి హరీశ్‌రావు ముందుగానే ఆదేశించడంతో అధికారులు చాలారోజుల కిందటే పనులు ప్రారంభించారు. కాగా కార్యక్రమంలో సోమవారం మధ్యాహ్నం మంత్రి లాంఛనంగా శంకుస్థాపన చేస్తున్నారని నీటిపారుదలశాఖ వర్గాలు తెలిపాయి. ఈ పథకం పూర్తయితే చాలాకాలంగా అరకొర నీటితో బాధపడుతున్న ఆర్డీఎస్ ఆయకట్టుకు శాశ్వత పరిష్కారం దొరకనున్నది. ఈ పథకం ద్వారా 70 రోజుల్లో 5.44 టీఎంసీల నీటిని సుంకేశుల రిజర్వాయర్ నుంచి ఆర్డీఎస్ కాల్వలో

మిగతా 11వ పేజీలో

బడ్జెట్ లెక్కల కసరత్తు

ప్రగతిశీలకంగా రూపకల్పన

15% అధిక అంచనాలతో ప్రతిపాదనలు!

నేడు అన్నిశాఖల కార్యదర్శులతో సీఎస్ సమీక్షా సమావేశం



పౌరసేవలతోపాటు ఏడు అంశాలతో ఎజెండా ఖరారు

- సంక్షేమానికి, ప్రాజెక్టులకు పెద్దపీట
- బీసీలకు కేటాయింపుల పెంపు
- రైతులకు పెట్టుబడి నిధుల కేటాయింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌ను అత్యంత ప్రగతిశీలకంగా రూపొందించడానికి కసరత్తు ప్రారంభించింది. రైతులకు పెట్టుబడి కల్పన, బీసీలకు కేటాయింపుల పెంపుతోపాటు, శరవేగంగా సాగుతున్న నీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తూ.. సంక్షేమ, అభివృద్ధి రంగాల మధ్య సమతుల్యం పాటించేలా బడ్జెట్ ఉండాలన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశానుసారంగా ప్రగతి పద్దుకు నిధుల కేటాయింపు అధికంగా జరుపనున్నారు. రానున్న వార్షిక బడ్జెట్ అంచనాలు కనీసం 15శాతం అధికంగా ఉండొచ్చని సమాచారం. కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి 1న ప్రవేశపెడుతున్నందున.. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌ను కూడా వేగంగా పూర్తిచేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ నేతృత్వంలో సోమవారం మధ్యాహ్నం 12గంటలకు సచివాలయంలో అన్ని శాఖల కార్యదర్శులతో సమీక్షా సమావేశం జరుగనున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూపొందిస్తున్న బడ్జెట్‌ను అన్ని రంగాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రూపొందిస్తున్నారు. కొత్త బడ్జెట్‌లో అత్యంత ప్రధానంగా రాష్ట్ర రైతాంగానికి రూ.4వేల పెట్టుబడి పథకానికి నిధుల కేటాయింపు జరుగనున్నది. భూ ప్రక్షాళన కార్యక్రమం విజయవంతం కావడంతో రాష్ట్రంలో ఉన్న అన్ని రకాల భూముల వివరాలపై ప్రభుత్వానికి స్పష్టత రావడంతోపాటు, రుణమాఫీ కూడా పూర్తి అయినందున.. రైతాంగానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి పథకాన్ని

మిగతా 11వ పేజీలో

కరీంనగర్‌లో ఐటీ టవర్

నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి కేటీఆర్

పలు కంపెనీలతో ఎంవోయూలు

3



ఐటీ టవర్ నమూనా చిత్రం

పంచాయతీరాజ్ చట్టం బిల్లు రూపకల్పనకు మంత్రివర్గ ఉపసంఘం

మంత్రి జూపల్లి నేతృత్వంలో ఏడుగురు మంత్రులతో కమిటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : నూతన పంచాయతీరాజ్ చట్టం బిల్లు రూపకల్పనకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసింది. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చైర్మన్‌గా ఏడుగురు మంత్రులతో కూడిన కమిటీని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నియమించారు. గతంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రులుగా పనిచేసిన వ్యవసాయశాఖమంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్‌శాఖ మంత్రి కే తారక రామారావు, జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితోపాటు, ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావును ఉపసంఘంలో సభ్యులుగా నియమించారు. ఈ కమిటీ కొత్త పంచాయతీరాజ్ చట్టం బిల్లు రూపకల్పనతోపాటు, రాష్ట్రంలో సహకారసంఘాల ఎన్నికల నిర్వహణపై కూడా అధ్యయనం చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు.

పొంచివున్న ఉష్ణ ముప్పు

రాష్ట్రంలో సగటు ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీలు పెరిగే అవకాశం

కుండపోత వానలు, ఆకస్మిక వరదలొచ్చే ప్రమాదం ■ నల్లగొండ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు!

గతి తప్పుతున్న రుతుపవనాలు ■ ఆశాకిరణంగా హరితహారం, మిషన్ కాకతీయ ■ ఈపీటీఆర్ఐ నివేదికలో వెల్లడి

పర్యావరణానికి దోహదపడేలా ప్రభుత్వ చర్యలు ■ హర్షం వ్యక్తంచేసిన శాస్త్రవేత్తలు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

విశ్వవ్యాప్తంగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, గ్లోబల్‌వార్మింగ్ ప్రభావం ఇలాగే కొనసాగితే వచ్చే మూడుదశాబ్దాల్లో తెలంగాణలో సగటు ఉష్ణోగ్రతలు మరో 1.5 డిగ్రీల వరకు పెరుగవచ్చని 'ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్, ట్రైనింగ్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ) తాజాగా రూపొందించిన నివేదికలో వెల్లడించింది. సమీప భవిష్యత్‌లో నల్లగొండ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్న క్రమంలో తెలంగాణలో అకస్మాత్తుగా కుండపోత వర్షాలు (క్లౌడ్ బరస్ట్), మెరుపు వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) పెరిగే ప్రమాదముందని పేర్కొన్నది. ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే నైరుతి, ఈశాన్య రుతుపవనాలు క్రమంగా గతి తప్పుతున్నాయని..



వానకాలంలో నాలుగునెలలపాటు కురవాల్సిన వర్షాలు నాలుగు రోజుల్లోనే పడే ఆస్కారముంటుందని వెల్లడించింది. అయితే, తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన తెలంగాణకు హరితహారం, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాలను ఒక ఆశాకిరణంగా ఈపీటీఆర్ఐ పేర్కొన్నది. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన ఈ చర్యలతోపాటు సోలార్, విండ్‌పవర్ పూర్తిగా వినియోగంలోకి వచ్చి రవాణారంగంలో వాహన కాలుష్యాన్ని తగ్గించగలిగితే పగటి ఉష్ణోగ్రతలు పెరుగకపోవచ్చని అభిప్రాయపడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 2015 నుంచి 2016 మార్చి వరకు రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులపై ఈపీటీఆర్ఐ అధ్యయనం చేసి ఈ మేరకు వివరాలు వెల్లడించింది.

నాలుగేండ్లకోసారి అధ్యయనం

వాతావరణంలో వస్తున్న పెనుమార్పులను తట్టుకోవడానికి ఎటువంటి ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలి? పర్యావరణాన్ని ఎలా పరిరక్షించాలి? పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం ద్వారా స్థిరమైన అభివృద్ధిని ఎలా సాధించవచ్చనే అంశాలపై ఈపీటీఆర్ఐ తన నివేదికలో కొన్ని నిర్దిష్టమైన సూచనలను చేసింది. ప్రస్తుతం తెలంగాణలో వాతావరణ పరిస్థితుల్లో

మిగతా 11వ పేజీలో

తీగలు పట్టుకుంటే మాడిపోతారు!

విద్యుత్ వ్యతిరేక శక్తులకు ఎంపీ కవిత హెచ్చరిక

2

పక్కాగా తేలిన భూముల లెక్క

- ముగిసిన రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం
- ఆక్రమణలకు, అక్రమాలకు చెల్లుచీటీ
- వ్యవసాయేతర భూములకూ రికార్డు
- ప్రక్షాళన చేసిన రికార్డుల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు
- అన్ని రికార్డుల కంప్యూటరీకరణ
- తహసీల్దారు నుంచి సీసీఎల్‌ఏ వరకు ఆన్‌లైన్ లింక్
- రికార్డుల్లో మార్పులన్నీ ఎప్పటికప్పుడు నమోదు
- రాష్ట్రంలో భూ వివాదాలకు ప్రక్షాళనతో చరమగీతం
- వ్యవసాయ పెట్టుబడికి మార్గం సుగమం

3



పవర్ లిఫ్టర్లు నలుగురు దుర్మరణం

ఢిల్లీ ఔటర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

డివైడర్ పోల్‌ను ఢీకొట్టిన కారు

తీవ్రంగా గాయపడిన ప్రపంచ చాంపియన్ సాక్ష్యం యాదవ్

ఆట పేజీలో



ఆదివారం ప్రగతిభవన్‌లో కరీంనగర్ జిల్లా ప్రజాపరిషత్ డైరీ -2018ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఈటల రాజేందర్, హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ కే కేశవరావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్, కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ కూడా ఉన్నారు.


కరీంనగర్ జెడ్పీ డైరీని ఆవిష్కరించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరీంనగర్ జిల్లా ప్రజా పరిషత్ డైరీ-2018ని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదివారం ప్రగతిభవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు టీ హరీశ్‌రావు, ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పార్లమెంట్ సభ్యుడు కే కేశవరావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు పాల్గొన్నారు.

నయవంచనకు నిదర్శనం కాంగ్రెస్

భరించలేకే అధికారానికి దూరంపెట్టారు • ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్ సమాధానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ పార్టీని ఐదు దశాబ్దాల పాటు దేశ ప్రజలు భరించారని, ఇక భరించలేకే అధికారానికి దూరం పెట్టారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఆ పార్టీది అభివృద్ధి వ్యతిరేకధోరణి అని వ్యాఖ్యానించారు. నయవంచనకు నిదర్శనమని అన్నారు. ప్రణయ్‌జ్యోతి అనే ఓ నెటిజన్ ఆదివారం చేసిన ట్వీట్‌కు మంత్రి కేటీఆర్ ఆసక్తికర సమాధానమిచ్చారు. 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మొదటి ఏడాది విద్యుత్ కోతలు ఉంటే.. అది ప్రభుత్వ వైఫల్యమని కాం గ్రెస్ నేతలు ఆరోపించారు. ఇప్పుడు రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తుంటే.. అది కాంగ్రెస్ ఘనతే అని ప్రచారం చేసుకొంటున్నారు. ఇందులో మతలబు ఏమిటి మంత్రి కేటీఆర్ గారు?' అని ప్రణయ్‌జ్యోతి ట్వీట్ చేశారు. దీనికి మంత్రి కేటీఆర్ స్పందిస్తూ 'నయవంచన, అవకాశవాదం, వ్యతిరేక రాజకీయాలు, అజ్ఞానాల భయంకర కలయిక కాంగ్రెస్. వారిని అధికారానికి దూరం పెట్టాల్సిన అవసరం ఉన్నది. ఐదు దశాబ్దాపాటు పరీక్షించి, వారిని ప్రజలు చెత్తబుట్టలో వేశారు. అదే వారికి సరైంది' అని ట్వీట్ చేశారు.



మంత్రి కే తారకరామావు చేసిన ట్వీట్





నాసా మాజీ వ్యోమగామి జాన్ యంగ్ (ఫైల్)

రికార్డుల వ్యోమగామి జాన్ యంగ్ మృతి

చంద్రుడిపై నడువడంతోపాటు ఆరుసార్లు అంతరిక్షయానం చేసిన యంగ్

వాషింగ్టన్, జనవరి 7: చంద్రుడిపై నడువడంతోపాటు ఆరుసార్లు అంతరిక్షయానం చేసిన నాసా మాజీ వ్యోమగామి జాన్ యంగ్(87) మృతి చెందారు. ఆయన కొంతకాలంగా న్యూమోనియాతో బాధపడుతున్నారని శుక్రవారం హ్యూస్టన్‌లో తుదిశ్వాస విడిచారని నాసా తెలిపింది. యంగ్ మృతి పట్ల సంతాపం ప్రకటించింది. అమెరికా నౌకాదళంలో పైలట్‌గా పనిచేస్తున్న యంగ్‌ను 1962లో నాసా ఎంపిక చేసుకొని శిక్షణ ఇచ్చింది. 1965లో నాసా ప్రయోగించిన జెమిని-3లో మొదటిసారి అంతరిక్షంలోకి వెళ్లారు. అంతరిక్ష యాత్రలకు సంబంధించి యంగ్ పేరిట పలు రికార్డులు నమోదయ్యాయి. ఆరుసార్లు అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి వ్యక్తిగా, నాసాకు చెందిన జెమిని, అపోలో మిషన్లలో పాలుపంచుకున్న ఏకైక వ్యక్తిగా, అంతరిక్షంలో ఎక్కువ సమయం గడిపిన వ్యోమగామిగా ఆయన గతంలో రికార్డు నెలకొల్పారు. మొట్టమొదటి స్పేస్ షటిల్ జెమిని-10ను నడిపిన ఘనత కూడా యంగ్ ఖాతాలోనే ఉన్నది. 1969లో అపోలో-10 మిషన్‌లో భాగంగా చంద్రుడి చుట్టూ తిరిగి వచ్చిన యంగ్.. 1972లో అపోలో-16 మిషన్‌లో భాగంగా చంద్రుడిపై విజయవంతంగా దిగి నడిచారు. నేవీలో పనిచేసిన సమయంలో ఎఫ్-4 ఫాంటమ్ జెట్‌ను ధ్వనివేగం కన్నా మూడురెట్లు అధిక వేగంతో(దాదాపు గంటకు 3,700 కి.మీలు) నడిపి రికార్డు సృష్టించారు. యంగ్ ఎప్పుడూ దూకుడుగా ఉండేవారని సహచరులు చెప్తుంటారు. ఆయన ఒకసారి నిబంధనలకు విరుద్ధంగా బీఫ్ సాండ్‌విచ్‌ను తన స్పేస్ సూట్‌లో దాచుకొని అంతరిక్షంలోకి తీసుకెళ్లారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే నాసా వాటిని ధ్రువీకరించలేదు.

ముహూర్తం



సూర్యోదయం: 6.52 గంటలకు



సూర్యాస్తమయం: 5.54 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, సప్తమి మధ్యాహ్నం 3.49 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: ఉత్తర తె. 1.11 వరకు తదుపరి హస్త, అమృత ఘడియలు: రాత్రి 7.38 నుంచి 9.37 వరకు, రాహుకాలం: ఉదయం 8.15 నుంచి 9.37 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.01 నుంచి 12.45 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.57 నుంచి 3.41 వరకు, వర్జ్యం: ఉదయం 9.47 నుంచి 11.23 వరకు.

లోకం పోకడ



తీగలు పట్టుకుంటే మాడిపోతారు

- విద్యుత్ వ్యతిరేక శక్తులకు ఎంపీ కవిత హెచ్చరిక
- 20 వేల మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌ది
- ఉద్యోగుల కృషితోనే 24 గంటల విద్యుత్
- జెన్‌కో ఉద్యోగులకు హెల్త్ కార్డులు
- టీఆర్‌వీకేఎస్‌లో చేరిన పలు విద్యుత్ సంఘాల నాయకులు



తెలంగాణభవన్‌లో టీఎస్పీఈయూ ప్రధాన కార్యదర్శి కేపీ కృష్ణమోహన్‌కు కండువా కప్పి టీఆర్‌వీకేఎస్‌లోని ఆహ్వానిస్తున్న ఎంపీ, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత. చిత్రంలో ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌ను అందించడంలో ఉద్యోగుల కృషి ఎంతోఉందని నిజామాబాద్ ఎంపీ, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చెప్పారు. నిరంతర, ఉచిత విద్యుత్‌పై దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయన్నారు. అడ్డుకున్నవారు ఇప్పుడు కరంటుతీగలు ముట్టుకుంటే మాడిపోతారని ఎద్దేవా చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏఐటీయూసీ, టీఎస్పీఈయూ -1535, ఐఎన్టీయూసీ 1327, 1104 యూనియన్లకు చెందిన పలువురు నాయకులు టీఆర్‌ఎస్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం(టీఆర్‌వీకేఎస్)లో చేరారు. వీరికి ఎంపీలు కవిత, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. అసాధ్యమనుకున్న అంశాన్ని సీఎం కేసీఆర్ సుసాధ్యం చేసి చూపించారని కవిత చెప్పారు. ఇందులో భాగస్వాములైన ప్రతిఒక్కరినీ అభినందిస్తున్నానని తెలిపారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కోర్టులకు వెళ్లినా విద్యుత్‌శాఖలో 20 వేల మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో విద్యుత్ ఉద్యోగులు వారి గుండెల మీద జెండా కప్పుకొని రాష్ట్రంకోసం పోరాడారని గుర్తుచేశారు. కరంటు సరఫరా నిరంతర ప్రక్రియ అని, పారిశ్రామిక ప్రగతి, పిల్లల చదువు, వ్యవసాయానికి, ఇండ్లకు నిత్యం అవసరమన్నారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. పీఆర్సీలో మెరుగైన వేతనాలు అందిస్తామని, సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా 650 సీజేఎల్‌ఎం పోస్టులను రెగ్యులరైజ్ చేయిస్తామని అన్నారు. జెన్‌కో ఉద్యోగులకు హెల్త్ క్రెడిట్‌కార్డులు, కేటీపీఎస్-7లో అదనపు పోస్టులు మంజూరు, విలీన ప్రక్రియలో మిగిలిపోయిన డ్రైవర్లు, వాచ్‌మెన్లు, సెక్యూరిటీ గార్డుల భర్తీ తదితరాలపై సానుకూల నిర్ణయం తీసుకునేందుకు కృషిచేస్తామని కవిత చెప్పారు. తెలంగాణ జెండాను భుజానికెత్తుకునేందుకు ముందుకొచ్చిన ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర బాధ్యులు కొడూరు ప్రకాశ్, జాన్సన్, టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. టీఆర్‌వీకేఎస్‌లో చేరిన వారిలో టీఎస్పీఈయూ 1535కి చెందిన ప్రధాన కార్యదర్శి కేపీ కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు జితేందర్‌సింగ్, సంయుక్త కార్యదర్శులు సీహెచ్ గణేశ్ బాబు, జీ వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నుంచి కార్యదర్శి దుర్గా అశోక్, ఎస్ పరమేశ్, బీ రమణ, బీ రవి, బీ శంకర్ తదితరులు ఉన్నారు.

మార్కెటింగ్‌పై మరింత అధ్యయనం

- ఇతరరాష్ట్రాల్లో పర్యటనకు మార్కెటింగ్ అధికారులు
- రైతులకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు
- ఈ నెల 13లోగా నివేదిక తయారుచేయాలి
- మెట్రోస్టేషన్లలో మన కూరగాయల కేంద్రాలు
- మార్చి చివరికి గోదాముల నిర్మాణం పూర్తికావాలి
- మార్కెటింగ్‌శాఖ పనితీరుపై సమీక్షలో మంత్రి హరీశ్



ఆదివారం హైదరాబాద్‌లోని మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఆ శాఖ పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మార్కెటింగ్‌శాఖ మంత్రి టీ హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో రైతులకు మార్కెటింగ్‌శాఖ ఇంకా మెరుగైన సేవలు అందించాలని, ఇందుకోసం ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని మార్కెటింగ్‌శాఖ మంత్రి టీ హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, హర్యానా తదితర రాష్ట్రాలలో మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారుల బృందం పర్యటించాలని సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ కార్యాలయంలో శాఖ పనితీరుపై మంత్రి హరీశ్‌రావు సమీక్షించారు. ఆయారాష్ట్రాల్లో వివిధ వ్యవసాయ ఉత్పత్తుల సాగు, దిగుబడి, రైతులకు ప్రభుత్వాల నుంచి లభిస్తున్న కనీస మద్దతు ధరలను పరిశీలించాలని సూచించారు. అక్కడ అవలంబిస్తున్న మంచి పద్ధతుల్లో తెలంగాణ రాష్ట్రానికి అనుగుణంగా కొత్త విధానాలు ప్రవేశపెట్టడానికి ఈ నెల 13లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

ఈ నెల 13లోగా అన్నిరకాల మిల్లులపై నివేదిక

రాష్ట్రంలోని రైస్, జిన్నింగ్, పప్పు, ఆయిల్ మిల్లుల వివరాలు, వాటి మిల్లింగ్ సామర్థ్యం, వాటి పరిధుల్లో అంచనా వేసిన వివిధ పంటల ఉత్పత్తులు తదితర వివరాలను ఈ నెల 13లోగా సంబంధిత జిల్లాల మార్కెటింగ్ అధికారులు ప్రధాన కార్యాలయానికి సమర్పించాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. మన కూరగాయల కేంద్రాలను అనువైన మెట్రో స్టేషన్లలో త్వరలో ప్రారంభించాలని, వాటిల్లో ఆర్గానిక్ కూరగాయలు, సేంద్రియ బియ్యం అమ్మకాలు జరిగేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.

మార్చినాటికి మిగిలిన గోదాముల నిర్మాణం పూర్తిచేయాలి

మొత్తం 330 నాబార్డు గోదాముల్లో అసంపూర్తిగా మిగిలిన 18 గోదాముల నిర్మాణాన్ని మార్చినాటికి పూర్తిచేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. మూడోదశలో నిర్మిస్తున్న 34 గోదాముల నిర్మాణం కూడా త్వరగా పూర్తికావాలని సూచించారు. సంబంధిత జిల్లా కలెక్టర్లతో మాట్లాడి స్థల సేకరణ వెంటనే పూర్తయ్యేలా చూడాలన్నారు. సూర్యాపేట, చివ్వెంలలో స్థలం విషయంలో నెలకొన్న సమస్యపై మంత్రి జగదీశ్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. నిర్మాణాలు పూర్తయిన గోదాములను సంబంధిత మార్కెట్ కమిటీలకు వెంటనే అప్పగించాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వరంగ సంస్థలు మార్కెటింగ్‌శాఖ గోదాములను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ 'మోడల్ చట్టం' ప్రకారం రాష్ట్రంలో నూతన లైసెన్స్‌లను జారీచేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వారికి కూడా వ్యాపార లైసెన్స్‌లు జారీ చేయాలని, వ్యాపారంలో పోటీని పెంచి, పంటకు ఎక్కువ ధర వచ్చేటట్టు చూడాలని కోరారు. వ్యవసాయమార్కెట్ల నియంత్రణలో నడుస్తున్న పశువుల సంతల ద్వారా మార్కెట్ ఫీజు వసూలు సక్రమంగా లేదని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. గ్రామ పంచాయతీల్లో నిర్వహించే పశువుల సంతల్లో కోట్ల రూపాయల్లో ఆదాయం వస్తుంటే మార్కెట్ కమిటీలలో నిర్వహిస్తున్న పశువుల సంతల ద్వారా లక్షల్లో మాత్రమే వస్తున్నదని అసంతృప్తి వ్యక్తంచేశారు. మార్చిలోగా అన్ని పశువుల సంతలను ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీ చేయించాలని ఆదేశించారు. మార్కెటింగ్‌శాఖలో వివిధ హోదాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరితగతిన భర్తీచేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో అవసరమైన మేరకు నూతన పోస్టుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపాలని సూచించారు. సమీక్షా సమావేశంలో మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మిబాయి, సంయుక్త సంచాలకుడు లక్ష్మణుడు, రవికుమార్, మార్కెట్ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో తగ్గిన మృతులు

- గత ఏడాది కంటే 9.73శాతం తగ్గుదల
- ఫలిస్తున్న రాష్ట్ర సర్కారు చర్యలు
- రాష్ట్ర పోలీస్‌శాఖ వార్షిక నివేదికలో వెల్లడి


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సర్కారు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. రోడ్డు భద్రత నిబంధనలు కఠినతరం చేసి, భారీ ప్రచారం కల్పిస్తుండటంతో వాహనదారుల్లో మార్పు వస్తున్నది. 2016తో పోలిస్తే గతేడాది రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య 9.73శాతం తగ్గడమే ఇందుకు నిదర్శనం. రోడ్డు ప్రమాదాల సంఖ్యలోనూ స్వల్పంగా తగ్గుదల నమోదైనట్టు రాష్ట్ర పోలీస్‌శాఖ వార్షిక నివేదిక- 2017లో వెల్లడించింది. నిబంధనలను అతిక్రమించడం, మద్యంతాగి వాహనాలు నడుపడంతోనే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించిన సర్కారు, వీటి నివారణపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కొరడా ఝళిపిస్తున్నది.

మృతుల్లో 46శాతం యువతే

గతేడాది జరిగిన రోడ్డుప్రమాదాల్లో దాదాపు 46 శాతం మంది 18-35 ఏండ్ల యువతే మృత్యువాతపడింది. బైకులతో రయ్‌య్‌మంటూ రోడ్లపైకి వచ్చే యువకులు.. మద్యంతాగి, నిబంధనలను ఉల్లంఘించి ప్రమాదాల బారినపడుతున్నారు. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగులుస్తున్నారు. చాలావరకు ప్రమాదాలు సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల మధ్య నమోదైనట్టు వార్షిక నివేదికలో పేర్కొన్నారు. 2017 లో జనవరి-నవంబర్ మధ్య రోడ్డు ప్రమాద కేసులు గమనిస్తే సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 3,274, హైదరాబాద్‌లో 2,568, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 1,072 కేసులు నమోదయ్యాయి. రోడ్డు ప్రమాద మృతుల సంఖ్యను చూస్తే.. అత్యధికంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 684 మంది, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 617 మంది, వరంగల్ కమిషనరేట్ పరిధిలో 387 మంది, నల్లగొండ జిల్లాలో 357 మంది మృత్యువాతపడ్డారు. హైవేలు ఉన్న ప్రాంతాల్లోనే మృతుల సంఖ్య ఎక్కువ నమోదవుతున్నది.

75,64,561కేసులు.. రూ.163 కోట్ల జరిమానా

నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝళిపిస్తున్నారు. 2017లో జనవరి నుంచి నవంబర్ వరకు 75,64,561 మందిపై కేసులు నమోదుచేశారు. వీరి నుంచి చలాన్ల రూపంలో రూ.163కోట్లు వసూలు చేశారు. 2016లో 71,07,173 మందిపై కేసులు నమోదు చేయగా, వీరి నుంచి రూ.124కోట్లు జరిమానా వసూలుచేశారు.



రోడ్డు ప్రమాదాల వివరాలు (ప్రతి ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు)

అంశం	2014	2015	2016	2017
ఎంవీయాక్ట్ కింద కేసులు	49,67,534	56,28,137	71,07,173	75,64,561
జరిమానాలు (రూ.కోట్లలో)	95	101	124	163.04
రోడ్డు ప్రమాదాలు	20,078	21,252	22,811	20,378
రోడ్డుప్రమాదాల్లో మృతులు	6,906	7,110	6,606	5,963
గాయపడ్డవారు	21,636	22,948	24,217	21,697

కాంగ్రెస్‌కు విపక్ష హోదా కూడా రాదు

- అధికారంపై యావే తప్ప.. అవగాహన లేని నేతలు
- అధికారంలో ఉండగా రైతులను విస్మరించి.. ఇప్పుడు మొసలి కన్నీరా?
- టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ భానుప్రసాదరావు



ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ టీ భానుప్రసాదరావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అధికారంలో ఉండగా ఏనాడూ రైతుల గురించి పట్టించుకోని కాంగ్రెస్ నేతలకు అధికారం పోయాక హఠాత్తుగా రైతులు గుర్తుకొచ్చారని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ టీ భానుప్రసాదరావు విమర్శించారు. కాంగ్రెస్ నాయకులకు అధికారంలోకి రావాలన్న యావ తప్ప.. ఎలాంటి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాదని చెప్పారు. రైతు సమస్యలపై కాంగ్రెస్ పార్టీ విడుదలచేసిన ఆర్మూర్ డిక్లరేషన్ రైతులను మభ్యపెట్టే విధంగా ఉన్నదని అన్నారు. ఆదివారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో భానుప్రసాద్‌రావు మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్‌చేస్తే పెడచెవిన పెట్టారని ఆరోపించారు. జలయజ్ఞంలో నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్, ఎన్నింటిని పూర్తిచేసిందో చెప్పాలని డిమాండ్‌చేశారు. 2009 నుంచి 2014వరకు ఎర్రజొన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయకపోవడంతో టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ కరంటు, ఎరువులు, విత్తనాలను రైతులకు అందించలేకపోయారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పదేండ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు స్పందించకుండా ఎస్సీ వర్గీకరణపై ఇప్పుడు డిమాండ్ చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పసుపుబోర్డుపై ఎంపీ కవిత కృషిచేస్తున్న విషయం ప్రజలందరికీ తెలుసునని, కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మాజీ ఎంపీ మధుయాష్కీ ఏం చేశారని ప్రశ్నించారు. వ్యవసాయానికి నిరంతరాయంగా ఉచిత కరంటుపై స్వామినాథన్ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును అభినందించారని తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టులను రీడిజైన్ చేసి ప్రతి ఎకరానికి నీటిని అందించడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని వెల్లడించారు. గత మూడున్నరేండ్లలో టీఆర్‌ఎస్ ప్రభుత్వంపై మాఫియా, అవినీతి అంటూ ఆరోపణలు చేసినా ఒక్కటి కూడా నిరూపించలేకపోయారన్నారు. కాంగ్రెస్ పదేండ్ల పాలనలో ఇసుకపై రూ.39కోట్ల ఆదాయం వస్తే మూడున్నరేండ్ల టీఆర్‌ఎస్ హయాంలో ఇసుకపై ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లు వచ్చాయని, ఇసుకమాఫియా ఎవరిదో ఈ గణాంకాలే చెప్తున్నాయని భానుప్రసాదరావు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతల పరిస్థితి ఏడారిలో దారితప్పిన బాటసారిలాగా ఉందని ఆయన విమర్శించారు.

రాష్ట్రానికి పట్టిన చీడపురుగు రేవంత్‌రెడ్డి

టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రానికి పట్టిన చీడపురుగు రేవంత్‌రెడ్డి అని టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు విమర్శించారు. బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలతో పబ్బం గడుపుతున్న రేవంత్‌రెడ్డికి ప్రజలు సమాధి కట్టే రోజులు దగ్గరలో ఉన్నాయని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసం, సంచలనాల కోసం సీఎం కేసీఆర్, ఇతర మంత్రులపై ఆరోపణలు చేయడం ఆయన దినచర్యగా మారిందని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో సమైక్యవాదుల తరఫున పోరాడిన రేవంత్‌రెడ్డికి మంత్రి కేటీఆర్ పేరెత్తే అర్హత లేదన్నారు. రేవంత్‌రెడ్డి లాంటి చిల్లర నాయకుల హెచ్చరికలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని బాలమల్లు పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరినా రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకం కావడంతో టీఆర్‌ఎస్ నేతలపై పూటకో ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

రాష్ట్రాభివృద్ధిపై ఇతర రాష్ట్రాల దృష్టి

తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి లక్ష్మారెడ్డి


సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆసక్తిగా గమనిస్తున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సీ లక్ష్మారెడ్డి తెలిపారు. వాటిని తమ రాష్ట్రాల్లో ప్రవేశపెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ 2018 డైరీ, క్యాలెండర్‌ను ఆదివారం సాయంత్రం పబ్లిక్ గార్డెన్‌లోని లలిత కళాతోరణంలో ఆవిష్కరించారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాలను ఉద్యోగసంఘాలు డైరీల్లో పొందుపరిచి ప్రతిఒక్కరికీ చేరేలా కృషిచేశారన్నారు. రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత తమ సమస్యలను లెక్కచేయకుండా ఉద్యోగులు అదనంగా పనిచేయడాన్ని మంత్రి అభినందించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ దవాఖానలపై ప్రజల్లో నమ్మకం ఉండేది కాదని, నేడు ఆ పరిస్థితులు మారి ప్రభుత్వ దవాఖానలన్నీ రోగులతో నిండిపోతున్నట్టు చెప్పారు. ప్రభుత్వ దవాఖానల పట్ల ప్రజల్లో ఉన్న అపోహ తొలిగిపోయి ఆరోగ్య తెలంగాణ దిశగా ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆశయ సాధన బంగారు తెలంగాణ నిర్మాణానికి ఉద్యోగులు మరింత ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో మంత్రిగా పనిచేయడంపై మంత్రి లక్ష్మారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. అంతకుముందు తెలంగాణ ఉద్యోగుల సంఘం (టీఈఏ) అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిలగాని సంపత్‌కుమారస్వామి ఆధ్వర్యంలో రూపొందించిన తీర్మానాలను తాను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సమస్యలన్నీ తెలుసని, ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడుపుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జీ నిర్మల, తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు జీ నిర్మల, ప్రొఫెసర్ లక్ష్మణ్, ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ, కే రాములు, ఓరుగంటి వెంకటేశంగౌడ్, ప్రొఫెసర్ కిశోర్‌రెడ్డి, ఆనంద్‌యాదవ్, బాలస్వామి, యాదగిరి, పుష్పారాజ్, మద్ది శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ శ్రీనివాస్, టీ శ్రీనివాస్, నవీన్‌కుమార్, కుమారస్వామి, బసబత్ని రాజేశం, ఎస్తేర్ తదితరులు పాల్గొన్నారు.

మేడారానికి పోటెత్తిన భక్తజనం

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ

- ముందస్తు మొక్కులకు తరలివచ్చిన భక్తులు
- ఒకేరోజు మూడులక్షల మంది సందర్శన
- జాతర ప్రారంభానికి ముందు ఇదే రికార్డు
- కిక్కిరిసిన అమ్మవార్ల గద్దెల ప్రాంగణం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడారంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సమ్మక్కసారలమ్మను దర్శించుకుని ముందస్తు మొక్కులు చెల్లించుకునేందుకు రికార్డుస్థాయిలో భక్తులు తరలి రావడంతో సమ్మకసారలమ్మ గద్దెల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరుగనున్న విషయం తెలిసిందే. అయితే, సమ్మక్కసారలమ్మ మహాజాతర ప్రారంభం కావటానికి నెలాపదిహేను రోజుల ముందునుంచే భక్తులు మేడారం చేరుకుని అమ్మవార్లకు ముందస్తు మొక్కులు సమర్పించుకోవటం ఆనవాయితీగా వస్తున్నది. జాతరసమయంలో అమ్మవార్ల దర్శనం కోసం సుమారు కోటి మంది తరలివస్తుండడంతో తోపులాట, తొక్కిసలాట చోటుచేసుకునే అవకాశం ఉన్నందున భక్తులు ముందస్తు మొక్కులకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈసారి మహాజాతర ప్రారంభం కావటానికి మరో 23 రోజులు మాత్రమే ఉండటం, ఆదివారం సెలవు దినం కావటంతో రాష్ట్రంతోపాటు, ఇతర రాష్ట్రాలనుంచి రికార్డుస్థాయిలో మూడులక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. రద్దీతీవ్రత దృష్ట్యా అమ్మవార్ల గద్దెలపైకి భక్తులు వెళ్లకుండా గ్రిల్స్ మూసివేశారు. దీంతో భక్తులు బయటనుంచే అమ్మవార్లను దర్శించుకున్నారు. మేడారం పరిసరాల్లోని అటవీప్రాంతం వాహనాలతో నిండిపోయింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు వాహనాలను మేడారంలోని అమ్మవార్ల గద్దెల పరిసరాల్లోకి అనుమతించలేదు. అధికారులు కూడా ముందస్తుగా తరలివచ్చే భక్తులకు అన్నివసతులూ కల్పించారు. అమ్మవార్లను దర్శించుకోవటానికి ముందు భక్తులు స్నానాలాచరించే జంపన్నవాగువద్ద సాగునీటి శాఖ ఇంజినీర్లు స్నానఘట్టాలకు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్(బీఓటీ)లను అమర్చారు. గ్రామీణ నీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) ఇంజినీర్లు మేడారం పరిసరాల్లో తాగునీటి సరఫరా ఏర్పాట్లుచేశారు. మరుగుదొడ్లు నిర్మించారు. పంచాయతీశాఖ అప్పుడే పారిశుద్ధ్య పనులు చేపట్టింది. గద్దెల ప్రాంగణంలో చలువపందిళ్లు వేశారు. ఇదిలా ఉండగా, మేడారం బయలుదేరిన భక్తులతో ములుగు డివిజన్ కేంద్రం శివారులో ఉన్న గట్టమ్మ గుడి కిటకిటలాడింది. సమ్మక్కసారలమ్మ దర్శనం కోసం మేడారం బయలుదేరిన భక్తులు తొలుత ములుగు వద్ద ఆగి గట్టమ్మను దర్శించుకుంటారు.



ఆదివారం భక్తులతో నిండిపోయిన మేడారంలోని సమ్మక్కసారలమ్మ గద్దెల ప్రాంగణంలోని క్యూలైన్లు



కరీంనగర్‌లో నిర్మించనున్న ఐటీ టవర్ నమూనా చిత్రం

మరో ద్వితీయశ్రేణి నగరానికి ఐటీ

నేడు కరీంనగర్‌లో ఐటీ టవర్‌కు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన

పలు కంపెనీలతో ఎంవోయూలు

హైదరాబాద్/కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఐటీ పరిశ్రమను హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా ద్వితీయశ్రేణి నగరాలకు విస్తరించేందుకు ఐటీశాఖ మంత్రి కే తారక రామారావు మరో ముందడుగు వేశారు. తెలంగాణ జిల్లాల్లోని యువతకు సైతం ఐటీ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్రంలోని కీలక జిల్లాకేంద్రాలకు ఐటీ పరిశ్రమను విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో కరీంనగర్ జిల్లాకేంద్రంలోని దిగువ మానేరు జలాశయం పరిధిలోని ఉజ్వల పార్క్ వద్ద రూ.25 కోట్లతో ఏర్పాటుచేయనున్న ఐటీ టవర్ నిర్మాణ పనులకు సోమవారం మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. పలు ఐటీ కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకోనున్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడనున్నారు. జీ ప్లస్ 5గా నిర్మించే ఈ టవర్‌లో మొదటి విడుతగా వెయ్యిమందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. దీనికి భూమి కేటాయింపులు కూడా పూర్తయ్యాయి. ఇప్పటికే వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ఐటీ హబ్ పనులు ప్రారంభమయ్యాయి. త్వరలో మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఐటీ సెంటర్లను ఏర్పాటుచేయనున్నట్టు మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో వెల్లడించారు. అక్కడ కంపెనీలు ఏర్పాటుచేసేందుకు సైతం పలువురు ముందుకొచ్చారు. మహబూబ్‌నగర్‌లో కంపెనీల ఏర్పాటుకు 18 సంస్థలు అంగీకారపత్రాలను అందించాయి. ఐటీ విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం ఎన్నారైలను సైతం ఆకట్టుకుంది. గత ఏడాది పలువురు ఎన్నారైలు ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితను కలిసి తమ ఆసక్తిని తెలియజేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన రూరల్ టెక్ పాలసీలోని ఆకర్షణీయ అంశాలు ఆకట్టుకున్నాయని ఎన్నారైలు సంతోషం వ్యక్తంచేశారు. టీఆర్‌ఎస్ ఎన్నారై కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల ఇటీవల జరిపిన ఆస్ట్రేలియా పర్యటనలో దాదాపు 60 కంపెనీలు రాష్ట్రానికి వచ్చేందుకు సంసిద్ధత వ్యక్తంచేశాయి. టీఆర్‌ఎస్ ఆస్ట్రేలియాశాఖ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి కాసర్లతో కలిపి జరిపిన భేటీలో ఆరు కంపెనీలు నిజామాబాద్, కరీంనగర్‌లో కంపెనీలు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తూ లేఖలు ఇచ్చాయి.

పెద్ద ఎత్తున తరలివస్తున్న కంపెనీలు

కరీంనగర్ జిల్లాకేంద్రంలోని ఏర్పాటుచేయనున్న ఐటీ టవర్‌కు వీలైనన్ని ఎక్కువ కంపెనీలను రప్పించేందుకు మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్, కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఇప్పటికే పలు కంపెనీలతో చర్చలు జరిపారు. మొత్తం ఆరు కంపెనీలు తమ శాఖలను ఏర్పాటుచేసేందుకు ముందుకొచ్చినట్టు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. ఇందులో ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌కు చెందిన నేవి ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వందమందికి, యూఎస్‌ఏ అట్లాంటాకు చెందిన ఎస్-2 ఐటీ గ్రూపు అల్‌పరేట్ట 50 మందికి, టెక్సాస్‌కు చెందిన టెక్నిక్స్ ఇంటిగ్రేషన్ టెక్నాలజీస్ లిమిటెడ్ 100 మందికి, కరీంనగర్‌కు చెందిన వే ఐటీ సొల్యూషన్స్ 40 మందికి, హైదరాబాద్‌కు చెందిన సంస్కృతి సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ 50 మందికి, హైదరాబాద్‌కు చెందిన టీజే నోవండీ ఎల్‌ఎల్‌పీ 150 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సోమవారం మంత్రికి ఒప్పంద పత్రాలు ఇస్తాయని చెప్పారు. ఐటీ టవర్ నిర్మాణ పనుల శంకుస్థాపన అనంతరం బహిరంగసభలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతారు. తర్వాత జిల్లాకేంద్రంలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. కరీంనగర్ రెనోవేషన్ ప్రాజెక్టులో భాగంగా రూ.250 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి వన్‌టౌన్ ఎదురుగా నిర్మించిన పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. ఆ తర్వాత కరీంనగర్ కార్పొరేషన్ కార్యాలయంలో సిటిజన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించి, కార్పొరేటర్లతో మాట్లాడుతారు. చౌరస్తాల పనుల ఆధునీకరణ పనులకు భూమిపూజ చేస్తారు. కేటీఆర్ రాక సందర్భంగా అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. మంత్రికి ఘనస్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. కరీంనగర్ జిల్లా పర్యటన అనంతరం మంత్రి రాజన్న-సిరిసిల్ల జిల్లాలో పర్యటిస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఈ జిల్లాలోని పెద్దూరు గ్రామం వద్ద డబుల్‌బెడ్‌రూం ఇండ్ల పనులకు శంకుస్థాపన చేస్తారు. సిరిసిల్లలో లైబ్రరీ భవనం, బార్ అసోసియేషన్ భవనాల పనులకు శంకుస్థాపన చేస్తారు. తదుపరి తంగళ్లపల్లి మండలంలోని శ్రీరాములపల్లి, జిల్లెల్ల గ్రామాల పరిధిలోని డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.



కరీంనగర్‌లో ఐటీ టవర్ నిర్మాణ పనుల శంకుస్థాపన అనంతరం జరిగే సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

పక్కాగా తేలిన భూముల లెక్క

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

- ముగిసిన రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం
- ఆక్రమణలకు, అక్రమాలకు చెల్లుచీటీ
- వ్యవసాయేతర భూములకూ రికార్డు
- ప్రక్షాళన చేసిన రికార్డుల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు
- అన్ని రికార్డుల కంప్యూటరీకరణ
- తహసీల్దారు నుంచి సీసీఎల్‌ఏ వరకు ఆన్‌లైన్ లింక్
- రికార్డుల్లో మార్పులన్నీ ఎప్పటికప్పుడు నమోదు
- రాష్ట్రంలో భూ వివాదాలకు ప్రక్షాళనతో చరమగీతం
- వ్యవసాయ పెట్టుబడికి మార్గం సుగమం



సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లిలో భూ రికార్డుల ప్రక్షాళన దృశ్యం(ఫైల్)

రాష్ట్రంలో భూమి లెక్కల గందరగోళానికి తెలంగాణ ప్రభుత్వం తెరదించింది. ఆదిలాబాద్ జిల్లాలోని భీమ్‌పూర్ మండలం నుంచి జోగులాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ మండలం వరకు రాష్ట్రంలోని 10,830 రెవెన్యూ గ్రామాల్లో భూ రికార్డుల ప్రక్షాళన పూర్తయింది. సొంత భూమికి కూడా పట్టాలేకుండా తరతరాలుగా సాగుచేసుకుంటున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా భూమి పట్టా సర్టిఫికెట్లు ఇంటింటికీ తిరిగి ఇచ్చింది. రైతుల భూమికి వారి యాజమాన్య హక్కులను తెలియజేసే రికార్డులు పక్కాగా రూపొందించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మార్గదర్శనం చేశారు. భూమి సమస్యలపై అపార అనుభవం ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణను భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం మిషన్ డైరెక్టర్‌గా నియమించారు. రాష్ట్రంలో 1507 రెవెన్యూ బృందాలు సెప్టెంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు నిర్దిష్ట కార్యక్రమంతో గ్రామాలకు వెళ్లాయి. దేశంలోనే మొట్టమొదటిసారిగా జిల్లా కలెక్టర్ నుంచి వీఆర్వో వరకు రెవెన్యూ యంత్రాంగం 'మీ భూమి ఇది.. ఇదిగో మీ పట్టా' అంటూ ఇంటింటికీ తిరిగింది. ఒక్కో గ్రామంలో 10 రోజులు మకాం వేసి, రైతుల భూమి సమస్యలు వినడం చరిత్రలో మొదటిసారి. రాజులకాలం నుంచి పన్నులు వసూలుచేయడానికి అధికారులు గ్రామాలకు వెళ్లారు కానీ 'మీ భూమి రికార్డు తీసుకోండి' అని చెప్పడం ఇదే మొదటిసారి. ఈ పనికోసం అధికారులు గ్రామాలకు రావడం చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనైన రైతులు.. తమ బాధలు తీరాయని సంతోషించారు. చివరకు పట్టా కాగితాలు చేతికి అందడంతో పట్టరాని ఆనందంతో ఉన్నారు.

పక్కాగా 71,75,096 మంది రైతుల భూములు

రాష్ట్రంలో 71,75,096 మంది రైతుల భూములు పక్కాగా ఉన్నాయని అధికారులు తేల్చారు. నిరుపయోగంగా ఉన్న దాదాపు 8 లక్షల డబుల్ ఖాతాలు, డెత్ ఖాతాలు తొలిగించారు. డెత్ ఖాతాలు తొలిగించి, భూమిని సాగు చేసుకుంటున్న యజమానులకు పట్టా కాగితాలు అందివ్వడంతో భూ తగాదాలకు చెక్‌పడింది. భూ ఆక్రమణలకు, అక్రమాలు, గెట్టు, పుట్ట తగాదాలకు రికార్డుల ప్రక్షాళన స్వస్తి పలికింది. ముఖ్యంగా హైదరాబాద్ శివారు ప్రాంతమైన రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో దాదాపు భూ అక్రమాలు, ఆక్రమణలకు చరమగీతం పాడినట్లేనని ప్రతాపరెడ్డి అనే భూయజమాని సంతోషం వ్యక్తంచేశారు. 'నకిలీ డాక్యుమెంట్ల సృష్టికర్తలతో అనేక తప్పుడు డాక్యుమెంట్లు మార్కెట్‌లోకి వచ్చాయి. మా భూములు మావేనని నిరూపించుకోవడానికి ఏండ్ల తరబడి ఆఫీసులు, కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉంది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంతో నకిలీలు, డూప్లికేట్లకు చెక్ పడింది' అని ఆయన తెలిపారు.

పెట్టుబడికి ప్రణాళికలు

రాష్ట్రంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల లెక్కలను పక్కాగా తేల్చడంతో రైతులకు సాగు పెట్టుబడి ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. ఈ మేరకు 1.42 కోట్ల ఎకరాలకు పెట్టుబడి ఇవ్వడానికి ఇప్పటికే అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ రైతులకు ఏవిధంగా పెట్టుబడి అందించాలనే విషయంపై గ్రామాలకు తిరుగుతూ రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నది. రాష్ట్రంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణతో శివారు ప్రాంతాల భూములు వ్యవసాయేతర భూములుగా మారుతున్నాయి. ఇలా రాష్ట్రంలో 11,95,889.10 ఎకరాల వ్యవసాయేతర భూములున్నాయి. ఎక్కువగా పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉన్న వీటికి సంబంధించిన రికార్డులను కూడా ప్రభుత్వం పక్కాగా రూపొందించింది.

రాజీకొస్తే బీ క్యాటగిరీకీ పరిష్కారం

రాష్ట్రంలో కేవలం 7% భూములు మాత్రమే పరిష్కారం కాలేదు. 2.45 కోట్ల ఎకరాల భూరికార్డులు ప్రక్షాళన చేయగా అన్ని రకాల సమస్యలతో ఉండి పరిష్కారం కాకుండా 'బీ' క్యాటగిరీలోకి వెళ్లిన భూములు 17,89,585 ఎకరాలు మాత్రమే. ఇందులో సివిల్‌కోర్టుల్లో 1,11,258 ఎకరాలు, రెవెన్యూ కోర్టుల్లో 41,961.01 ఎకరాలు మాత్రమే ఉన్నాయి. కేసులను రాజీ చేసుకుని ముందుకు వస్తే వీటినీ పరిష్కరించాలని సీసీఎల్‌ఏ నుంచి రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు వెళ్లాయి. కుటుంబ సరిహద్దు వివాదాలున్న భూములు 2,74,697 ఎకరాలుండగా ఇతర వివాదాలున్నవి 3,98,295.17 ఎకరాలు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరుల చేతుల్లో గిరిజనుల భూములు 95,214.15 ఎకరాలు ఉన్నాయి. వీటిని దశాబ్దాలుగా గిరిజనేతర సామాన్య రైతులే దున్నుకుంటున్నారు. అయితే వీరికి ఈ భూములపై ఎలాంటి హక్కులు లేవు. ఈ సమస్యపై ప్రభుత్వం సానుకూలంగానే ఉన్నప్పటికీ, పటిష్ఠమైన కేంద్రచట్టాల ఆధారంగా ఏమీ చేయలేని పరిస్థితి. దీనిపై అసెంబ్లీలోనూ చర్చ జరిగింది. అలాగే చేతులు మారిన అసైన్డ్ భూములు 2.41 లక్షల ఎకరాలుండగా, సాదాబైనామాలో పరిష్కారం కాకుండా ఉన్న వివాదాస్పద భూములు 2.46 లక్షల ఎకరాలు ఉన్నాయి. వీటిపై సంక్రాంతి పండుగ తర్వాత ప్రత్యేక కార్యక్రమం తీసుకొని పరిష్కరించే ప్రయత్నం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

భద్రంగా రికార్డులు

భూ రికార్డుల ప్రక్షాళన మొదటి దశను పూర్తిచేసిన ప్రభుత్వం, రికార్డులన్నింటినీ చేతి రాతతో పూర్తిస్థాయి ఫైళ్లుగా తయారుచేయాలని ఆదేశించింది. వాటిని కేంద్రానికి కూడా పంపిస్తారు. మాన్యువల్‌గా రూపొందించిన డాక్యుమెంట్లన్నింటినీ కంప్యూటరీకరిస్తారు. ఇందుకోసం ప్రతి మండలానికీ ఒక ఐటీ అధికారిని నియమిస్తారు. కంప్యూటరీకరించిన రికార్డుల సర్వర్ లింకు తహసీల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్, సీసీఎల్‌ఏ కార్యాలయాలకు ఉంటుంది. ప్రతి మార్పు సీసీఎల్‌ఏ వరకు వెళుతుంది. ఎవరు మార్చారు? ఎందుకు మార్చారు? అనేది తెలిసిపోతుంది. ఏ స్థాయిలో తప్పుచేసినా వెంటనే దొరికిపోతుంది. దీంతో అధికారులు లంచాలకు ఆశపడి రికార్డులు మార్చాలంటే భయపడే పరిస్థితి ఏర్పడుతుంది. మాన్యువల్ రికార్డులను డిజిట్ రికార్డురూమ్‌లో భద్రపరుస్తారు. ఈ రూమ్‌లోకి పెన్నులతో వెళ్లడాన్ని నిషేధిస్తారు. ఎవరైనా సరే ఎంట్రీ రిజిస్టర్‌లో సంతకం చేసిన తర్వాతే రికార్డు రూములోకి వెళ్లాల్సి ఉంటుంది. కొత్తగా రూపొందిస్తున్న రికార్డు రూముల్లో కాగితాలు చినిగిపోకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

రైతులు సంతోష పడుతున్నారు



మా మండలంలో అనుకున్న సమయంలోగా రికార్డుల ప్రక్షాళన పూర్తిచేశాం. వివాదాస్పద భూములను రెండోదశలో పూర్తిచేస్తాం. అవి ఒక శాతమే ఉన్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల రైతులు చాలా సంతోషంగా ఉన్నారు. భూముల పరిశీలనకు వెళ్లినపుడు చాలా మంది ప్రభుత్వం చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు.

- ఎన్ రాజేశ్, తహసీల్దార్, వెల్గటూర్ మండలం, కరీంనగర్ జిల్లా

భూ సమస్యలకు పరిష్కారం



గ్రామాల్లో భూ వివాదాలు చాలా ఉంటాయి. కుటుంబ తగాదాలకు దారి తీసేవి. చాలా భూములు సాగులేక వివాదాల్లో ఉండేవి. వీటిని పరిష్కరించేందుకు ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. ఇప్పుడు చేస్తున్న కృషి మాటల్లో చెప్పలేం. రెవెన్యూ అధికారులు మా దగ్గరికి వచ్చి సమస్యలు పరిష్కరించడం గొప్ప విషయం.

- బీ సత్యం, రైతు, గుల్లకోట గ్రామం, కరీంనగర్ జిల్లా

చరిత్రలో నిలిచిపోతుంది



రికార్డుల ప్రక్షాళనవల్ల చాలా సమస్యలకు పరిష్కారం దొరికింది. ఎన్నో ఏండ్లుగా గొడవల మధ్య నలిగిన భూమి వినియోగంలోకి వస్తుంది. కోర్టుల చుట్టూ తిరుగాల్సిన అవసరం ఉండదు. భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తవు. ప్రభుత్వ కృషి అమోఘం. టీఆర్‌ఎస్ సర్కారు చేస్తున్న ఈ గొప్ప పని చరిత్రలో నిలిచిపోతుంది.

- రాఘులయ్య, రైతు, వరిపేట, కాసిపేట మండలం, మంచిర్యాల

ఉద్యోగులు.. ప్రభుత్వ కుటుంబసభ్యులు

- ఉద్యమం సమయంలో, పరిపాలనలోనూ తెలంగాణ ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయం
- రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటల రాజేందర్
- తెలంగాణ పునర్నిర్మాణమూ ఉద్యమమే: మంత్రి లక్ష్మారెడ్డి
- ఘనంగా తెలంగాణ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ



ఆదివారం రవీంద్‌భారతిలో తెలంగాణ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రులు ఈటల రాజేందర్, లక్ష్మారెడ్డి. చిత్రంలో కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని సాధించుకొన్న తెలంగాణ రాష్ట్రం.. పరిపాలనలో అగ్రగామిగా ఉన్నదని రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎప్పటికప్పుడు ప్రజలతో మమేకమవుతున్నారని వివరించారు. ఉద్యోగులు ప్రభుత్వ కుటుంబసభ్యులని ఈటల స్పష్టంచేశారు. ఆదివారం రవీంద్రభారతిలో జరిగిన తెలంగాణ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ సభలో మంత్రి ఈటల మాట్లాడారు. రాష్ట్ర సాధనలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ గొప్ప కృషి చేసిందని, సకల జనుల సమ్మె ఢిల్లీ పెద్దలను గడగడలాడించిందని గుర్తుచేశారు. కేంద్రం ఏర్పాటుచేసిన ఉద్యోగుల విభజన కమిటీ చేసిన ఉద్యోగుల విభజనలో లోపాలు ఉన్నాయని, వీటిని సవరించుకోవాల్సిన బాధ్యతలను తెలంగాణ ప్రభుత్వం నిర్వహించాల్సి వస్తున్నదని చెప్పారు. విభజన సమస్యలపై కేంద్రానికి ఎన్నోసార్లు విజ్ఞప్తిచేశామన్నారు. పరిపాలనలో ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం దేశంలోనే నంబర్-1 స్థానాన్ని ఆక్రమించిందని అన్నారు.

ఉద్యోగులు రెట్టింపు బాధ్యతతో భాగస్వాములవుతున్నారు: లక్ష్మారెడ్డి

తెలంగాణ రాష్ట్ర సాధనలోఉద్యోగులు ఎంత బాధ్యతగా ఉన్నారో, అంతకన్నా రెట్టింపు బాధ్యతతో తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములవుతున్నారని మంత్రి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వానికి లభిస్తున్న అవార్డులు రివార్డులు తెలంగాణ ఉద్యోగుల కృషికి నిలువుటద్దాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగికి హెల్త్‌కార్డు అందించామని, హెల్త్‌కార్డుల పట్ల ఉద్యోగుల్లో సంతృప్తి వ్యక్తమవుతున్నదని వివరించారు. ప్రతీశాఖలో, ప్రతీ రిటైర్డ్ ఉద్యోగికీ హెల్త్‌కార్డు అందేవిధంగా చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ దవాఖానలలో నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలన్నింటినీ కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. ఎంపీ కొండావిశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో తనవంతు బాధ్యతను నిర్వర్తిస్తానని చెప్పారు.

ఇప్పటికే 20 వేల ఉద్యోగాల భర్తీ

రాష్ట్ర పబ్లిక్‌సర్వీస్ కమిషన్ సభ్యుడు, తెలంగాణ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సీ విఠల్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ ద్వారా ఇప్పటికే 20వేల ఉద్యోగాలభర్తీ ప్రక్రియ పూర్తయిందన్నారు. టీఎస్‌పీఎస్సీ, పోలీస్ రిక్రూట్‌మెంట్, టీఎస్సార్టీసీ, సింగరేణి కాలరీస్, ఎలక్ట్రిసిటీ బోర్డు వంటి వివిధ విభాగాల ద్వారా ఉద్యోగుల భర్తీ వేగంగా జరుగుతున్నదని చెప్పారు. టీఎస్‌పీఎస్సీ వంద నోటిఫికేషన్లు ఇవ్వగా గ్రూప్-2 కు సంబంధించిన ఒకే ఒక్క విభాగంలో కోర్టు కేసు నడుస్తున్నదని వివరించారు. ప్రభుత్వం ఇప్పటికే 62 వేల ఉద్యోగాలభర్తీకి క్లియరెన్స్ ఇచ్చిందని తెలిపారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో హామీ ఇచ్చిన విధంగా లక్ష ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు ముందు 2004 నుంచి 2014 వరకు దశాబ్దకాలం పాటు ఉద్యోగసంఘాల డైరీల ఆవిష్కరణ సభలు ఉద్యమ వేదికలయ్యాయని, 2015 నుంచి అభివృద్ధి ప్రణాళికల వేదికలయ్యాయని అన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో స్థానికతకు సరైన నిర్వచనం ఇవ్వకపోవడంవల్లనే ఉద్యోగుల విభజనలో చాలా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంట్రి బ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసేవరకు కేంద్ర ప్రభుత్వంపైన ఉద్యోగసంఘాలన్నీ ఒత్తిడి పెంచాలని పిలుపునిచ్చారు. గ్రూప్1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి ప్రక్రియ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నదని చెప్పారు. రెవెన్యూ ఉద్యోగులు 2014లో నిర్వహించిన సమగ్ర సర్వే నుంచి 2016 భూమి రికార్డుల ప్రక్షాళనకు అవిశ్రాంతగా కృషి చేస్తున్నారని రెవెన్యూ సర్వీసెస్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు శివశంకర్ పేర్కొన్నారు. సభాధ్యక్షత వహించిన సంఘం అధ్యక్షుడు పద్మాచారి మాట్లాడుతూ ఉద్యోగుల విభజనలో తెలంగాణకు జరిగిన అన్యాయాలను సవరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, తెలంగాణ ఉద్యోగుల సంఘం సెక్రటరీ టీ శ్రీకాంతరావు, జనరల్ సెక్రటరీ పీ పవన్‌కుమార్‌గౌడ్, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నందకుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర మిషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా గజల్ శ్రీనివాస్ తొలిగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్వచ్ఛాంధ్ర మిషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా గజల్ శ్రీనివాస్‌ను తొలిగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. లైంగిక ఆరోపణలపై అరెస్టయి జైల్లో ఉన్న గజల్ శ్రీనివాస్ బ్రాండ్ అంబాసిడర్ నియామకాన్ని రద్దుచేస్తూ ఆదివారం ఆ రాష్ట్ర పురపాలక శాఖ ఉత్తర్వులిచ్చింది. 2017 మే 28న శ్రీనివాస్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా ఏపీ ప్రభుత్వం నియమించింది.



హృదయ మృదుత్వానికి సరితూగ గల సౌందర్యం లేదు.

జేన్ ఆస్టిన్

చెలిమె

భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడిని ఖండిస్తున్నాం

విజయవాడలో పుస్తక ప్రదర్శనలో కథా రచయిత, కవి స్కైబాబ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. జల్‌జలా, ముఖామి పుస్తకాల ఆవిష్కరణ సభకు అధ్యక్షుడిగా విజయవాడ వెళ్ళిన స్కైబాబను పుస్తక ప్రదర్శన జరుగుతున్న ప్రదేశం నుంచి బయటికి తరిమేయడం గర్హనీయం. ఒక ముస్లింగా, తెలంగాణవాదిగా ఆంధ్రా పాలకుల దురంతాలను నిలదీసినందుకు ప్రతిగా ఈ దాడి జరిగింది. 'తెలంగాణ ఉద్యమ సమయంలో నువ్వు ఆంధ్రాపై విషగక్కినవ్. ఈ గడ్డమీద నువ్వెట్లా అడుగుపెడతవ్, ఇక్కడి నుంచి వెంటనే వెళ్ళిపో' అంటూ దుర్భాషలాడటం అవాంఛనీయం.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి ఆంధ్రా ప్రాంతం వారికి కూడా సగౌరవమైన ఆహ్వానం పలికింది. దీనికి ప్రతిగా ఆంధ్రప్రదేశ్‌లో ఆఖరు నిమిషంలో ముఖ్యమంత్రి పేషీ నుంచి ఒత్తిడి వసున్నదంటూ సభ నిర్వహణకు ఇచ్చిన అనుమతిని రద్దు చేసుకున్నారు. పోలీసు వాళ్ళు జోక్యం చేసుకుంటూ 'లోపటేస్తే ఆర్నెళ్ల వరకు బైటికి రావు' అని బెదిరించడాన్ని కూడా ఖండిస్తున్నాం. ఎప్పుడో ఉద్యమ సమయంలో రాసిన కవితను ఉదాహరిస్తూ ఇప్పుడు దాడికి దిగడం శోచనీయం. రాతలను రాతలతోనే ఎదుర్కోవాలనే ఇంగితం లేకుండా భౌతికంగా దాడికి దిగడం, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడం వారి గుండాగిరికి నిదర్శనం. ఈ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేయడమే గాకుండా ఇలాంటి సంఘటనలు పునరావృతం గాకుండా చర్యలు తీసుకోవాలని కవులు, రచయితలుగా డిమాండ్ చేస్తున్నాం.

– నందిని సిధారెడ్డి, జూలూరు గౌరీశంకర్, దేశపతి శ్రీనివాస్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, పసునూరి రవీందర్, కాసుల ప్రతాపరెడ్డి, అంబటి సురేంద్రరాజు, ఖాజా, సూరేపల్లి సుజాత, సంగిశెట్టి శ్రీనివాస్, షాజహాన, మోహన్ రుషి, నలిమెల భాస్కర్, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, జూపాక సుభద్ర, గుడిపల్లి నిరంజన్ , అన్వర్, సయ్యద్ ఖుర్షీద్, వహీద్ మహమ్మద్, అక్బర్ ఖాన్, అజీద్, సయ్యద్ గఫార్, పెన్నా శివరామకృష్ణ, పర్‌స్పెక్టివ్ ఆర్కె, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, ఎకె ప్రభాకర్, జుగాష్ విలీ, తుమ్మల దేవరావు, ఎం.నారాయణశర్మ ఆశారాజు, గాజుల శ్రీధర్, అన్వర్, పగడాల నాగేందర్, దాసరాజు రామారావు, కార్టూనిస్టు శంకర్, ఆర్టిస్టు అక్బర్.

కవిత్వం



గాలి సోకని గదిలోకి
దూసుకొచ్చిన ఆలోచనలు కొన్ని..
ముసిరిన చీకట్ల నడుమ
తారాడుతున్న తలపులు కొన్ని..
అన్నిటినీ నీ ముంగిట కుప్పపోశాను
కళ్లలోంచి జారిపోయిన కలను
నీ గొంతులో వెతుక్కున్నాను..
నిశీధి అంచున నిలబడి
వసంత గానం వింటున్నాను...

- విద్యారి, 77027 41570

అఖిలభారత కవిసమ్మేళనానికి 'పిచ్చినాన్న' ఎంపిక



ఆలిండియా రేడియో నిర్వహించే అఖిలభారత కవి సమ్మేళనానికి తెలుగు భాష తరపున ప్రసాదమూర్తి కవిత 'పిచ్చిన్నాన్న' ఎంపికైంది. 22 భారతీయ భాషలకు చెందిన 22మంది కవులను ఈ సమ్మేళనానికి ఎంపిక చేశారు. ప్రసాదమూర్తి కవితను ప్రముఖ అనువాద రచయిత్రి శాంతసుందరి హిందీలోకి అనువదించారు. ఈ కవి సమ్మేళనంలో ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతి కవిత 22 భారతీయ భాషల్లోకి అనువదింపబడుతుంది. దీన్ని జనవరి 26న ఆలిండియా రేడియోలో అన్ని ప్రాంతాల్లోనూ ప్రసారం అవుతుంది.

సబలను గుర్తించని సాహితీవేత్తలు

పాల్కుర్కి సోమనాథుని సాహిత్యం అనగానే వీరశైవ సంప్రదాయాలు, ఆ సంప్రదాయ స్త్రీలు ప్రత్యక్షమవుతారు. వీరశైవంలో స్త్రీలకు మహోన్నతస్థానం ఉందని గ్రంథాలు చెబుతున్నాయి. వీర శైవమతం నాడు స్త్రీలను మిక్కిలి ఆకర్షించింది. భార్య శివ భక్తురాలయి, భర్త కాకుంటే ఆమె భర్తను వదిలివేయవచ్చునని శివతత్త్వసారమనే గ్రంథంలో 231-234 పద్యాలు చెబుతున్నాయి. మల్లికార్జున పండితారాధ్యులవారు చక్కగా వివరించారు. నాడు బసవేశ్వరుని సోదరి నాగాంబ అతనితో కలిసి ఇళ్లు వదలివెళ్లి తపస్సు చేసింది. దీన్నిబట్టి నాటి స్త్రీ పరదామాటున లేదని చెప్పవచ్చు. నాడు అంగనాజనము పురుషులతో కలిసి తత్త్వవిచారములు చేసేవారు. స్త్రీలు అన్నిరంగాల్లో రాణించారన్న విషయం తెలుస్తున్నది.

నాడు '**న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి**' అని మనువు చెప్పాడు. మగవాడి ముందు, మగడి ముందు పెద్దల ముందు నిలబడి ఆడది మాట్లాడరాదు. వారితో మాట్లాడవలసి వస్తే, ఆడది తెరచాటు నుంచే మాట్లాడాలి. భర్త కాళ్లు కడిగి.. భార్య ఆ నీటిని నెత్తిన చల్లుకోవాలి. పురాణాల్లో ఇలాంటి కథలనే చెప్పారు. అనసూయ, సుమతి వంటి కథలు ఈ కోవకు చెందినవే. అయితే ఇలాంటి మాటలు చెప్పే స్త్రీలు గత పురాణాలను, గత చరిత్రను పరిపూర్ణంగా పరిశీలించలేదనే చెప్పాలి.

ముందుగా మనం మన చరిత్ర స్థితిగతిని సమ్యక్భావనతో అర్థం చేసుకోవాలి. వేద పురాణేతిహాసాలు చరిత్ర గమనంలో అనేక మార్పుచేర్పులకు గురయ్యాయి. దీంతో ఆయా సమాజాల్లోని కొన్ని ఛాందస భావాలు కూడా ఇందులోకి చొచ్చుకుపోయాయి. అయితే వేదపురాణేతిహాసాదుల మూలాలు ప్రయోగాలకు నిలబడుతాయి. కానీ ఆ మూలాల మీద అల్లబడిన నమ్మకాలు ప్రయోగాల ముందు నిలబడవు.

అయితే నాడు గానీ, నేడు గానీ సాహిత్య ప్రపంచం, వాస్తవ ప్రపంచం ఒకటిగా లేదు. ఉదాహరణకు ప్రాచీన తెలుగు కవుల భాషలో అధిక శాతం సంస్కృతం ఉంటే, నాటి సమాజంలో అధిక శాతం మాండలిక తెలుగు ఉండేది. నాటి సమాజానికి శివకవులు చాలా దగ్గరగా ఉన్నారు. పాల్కుర్కి సోమనాథుని వంటివారి రచనల ద్వారా ఈ విషయం తెలుస్తుంది. అందుకే వారి రచనలను అధికంగా పరిశీలించాలి. అలాగే ప్రాచీన మహర్షుల మనో ప్రపంచం నుంచి వచ్చిన స్త్రీ తేజం గురించి అధికంగా పరిశీలించాలి. అప్పుడే నాటి అసలు స్త్రీ స్వరూపం ఏమిటన్నది తెలుస్తుంది.

మహర్షుల మనో ప్రపంచం అనగానే, లక్ష్మీసరస్వతీ పార్వతి ముందుగా గుర్తుకువస్తారు. అటుపిమ్మట అపాల, ఆకూతి మొదలు సీత ప్రమద్వర, పాంచాలి, రుక్మిణి, సత్యభామ, రేవతి, రేణుక, శతరూప, హంసిక, హంసి, స్వస్తిమతి, సుప్రజ, సుదక్షిణ వంటి స్త్రీ రత్నాలు అనేకమంది ఉన్నారు. అయితే పురాణ స్త్రీలు అనగానే సీత, పాంచాలి, సావిత్రి వంటివారి పేర్లు వినపడినంతగా మిగతా వారి పేర్లు వినపడవు. పరిశీలనలో పరిపూర్ణత లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. రామాయణంలో సీత పాత్రతో పాటు స్వయంప్రభ పాత్రకూడా వస్తుంది. ఈమె మేరు సావర్ణి అనే మనువు దుహిత. అంజనీపుత్రుడు సీతాన్వేషణకు బయలుదేరినప్పుడు, ఆకలి దప్పికలతో ఉన్న హనుమంతుని వెన్నంటి ఉన్న వానరులందరికీ ఈమె ఆకలి తీరుస్తుంది. అటుమీదట సీత జాడను తెలియజేస్తుంది. సముద్రం దగ్గరకు వానరులందరిని పంపిస్తుంది. ఈమెకు మను తత్వం, మానవతత్వం తత్సంబంధ శాస్త్రాదులన్నీ బాగా తెలుసు. ఇలాంటి స్త్రీ మూర్తులు మన రామాయణ భారత భాగవతాది పురాణాల్లో అనేకులున్నారు.

ఇక సీత సావిత్రి పాంచాలి వంటి పురాణ స్త్రీల కథలు తెలుగు సాహిత్యంలో కుప్పలుగా ఉన్నాయి. అసలు రామాయణంలో సీత ఏ గీతను దాటలేదు. అసలు లక్ష్మణ రేఖయే లేదు. తెలుగువారి రామాయణంలో మాత్రం సీత లక్ష్మణరేఖను దాటి కష్టాలను కొని తెచ్చుకుంది. అలాగే అసలు రామాయణంలో సీతా స్వయం వరానికి రావణ బ్రహ్మ రాలేదు. తెలుగువారి రామాయణాల్లో మాత్రం సీతాస్వయంవరానికి రావణ బ్రహ్మ కూడా వస్తాడు. ఉదాత్తానుదాత్తాది స్వరాలతో కూడిన వేదార్థాన్ని జాగ్రత్తగా గమనించి సీత గురించి తెలుసుకుంటే మనకు ఆమె చరిత్రలో అనేక శాస్త్రీయ విషయాలు తెలుస్తాయి. వాటిని పక్కనబెడితే ఆమె చరిత్ర అన్ని తరాలవారిని ఆకర్షిస్తుంది. ఆమెలో అభ్యుదయం ఉంది. ఆదర్శం ఉంది. ఆలోచన ఉంది. సనాతన ఆచారం ఉంది. వెలుగుకు పొంగిపోని తత్వం ఉంది. చీకటికి కుంగిపోని శక్తి ఉంది. వంశ సంరక్షణ చేయాలన్న ఆకాంక్ష ఉంది. తను నిప్పు అని నిరూపించుకోవాలన్న ఆలోచన ఉంది. అందుకు కలిసివచ్చే కాలం కోసం నిరీక్షించే గుణం ఉంది. భర్తమీద పూర్తి నమ్మకం ఉంది. అయితే ఏది ఎంత ఉందన్న విషయం గురించి చెప్పాలంటే, అంత తేలిక కాదు. ఈ సత్యాన్ని గమనించిన కొందరు తెలుగు కవులు రామునికన్నా సీతే మిన్న అన్నట్లు కట్టు కథలల్లారు. అయితే ఈ కథలు కొన్ని సందర్భాల్లో సీత పాత్రను భంగపరిచే రీతిలోకి మారిన ఘటనలు లేకపోలేదు. సీత లక్ష్మణుని తూలనాడటం వంటివి ఇందుకు ఉదాహరణలుగా చెప్పకోవచ్చు. రామాయణంలో సీతామండోదరి స్వయం ప్రభ వంటి స్త్రీమూర్తులు అనేక మంది ఉన్నారు. అయితే కొన్ని స్త్రీ పాత్రలను సామాన్యులకు దగ్గర చేయాలన్న ఉద్దేశంతో ఆయా పాత్రలలోని శాస్త్రీయ సామర్థ్యాన్ని మన పండితులు కొందరు మరుగుపర్చారు. దీనివల్ల పాంచాలికి మొత్తం ఎంతమంది పతులని కొందరు అశాస్త్రీయంగా ప్రశ్నించేస్థాయికి ఎదిగారు.

పురాణ స్త్రీల పుట్టుక, జీవన విధానం వెనుక ఉన్న శాస్త్రాన్ని అర్థం చేసుకోలేని కొందరు పండితులు వారిలో సుర తేజం ఉంది కాబట్టి వారేం చేసినా తప్పు లేదని చెబుతూ స్త్రీలకు కొన్ని నియమాలను విధించారు. ఈ నియమాల వెనుక శాస్త్రం కంటే వర్ణవ్యవస్థ సంరక్షణ వంటి అంశాలే ఎక్కువ ఉన్నాయి. వారు వారి భావజాలాన్ని బలం చేసుకునేందుకు గాను, నాటి వ్యవస్థలో పురుషునితో పాటు సమానంగా కష్టపడి పనిచేసే స్త్రీలను అనార్యులని అన్నారు. ఆపస్తంబ మహర్షి వంటివారు స్త్రీలు పతివ్రతలుగా ఉండటానికి ప్రత్యేక నియమాల గ్రంథాలను రచించారు. ఈ గ్రంథాలను శాస్త్రీయ దృష్టితో చదివితే అశాస్త్రీయ భావజాలం బహిర్గతమవుతుంది. ఉదాహరణకు ఇందు స్త్రీ నియోగపద్ధతిలో సంతానం పొందవచ్చని చెప్పారు. భర్త అనుమతితో స్త్రీ పర పురుషుని ద్వారా సంతానం పొందవచ్చన్న ధర్మాన్ని నియోగపద్ధతి అంటారు. ఇలాంటి అశాస్త్రీయ పద్ధతులు బోధాయనాది మహర్షులు రాసిన గ్రంథాల్లో అనేకం కనబడుతాయి. ఇవన్నీ తక్కువ వర్ణం స్త్రీలను కించపరుచడానికి, తమ వర్ణ స్త్రీలను తమ అదుపులో పెట్టుకోవడానికి జరిగిన తంతే అని సులభంగా గ్రహించవచ్చు. అయితే కాల గమనంలో చదువుకున్న అగ్రవర్ణ స్త్రీలు ఈ సత్యాన్ని గమనించక గత సాహిత్యం తమను కించపరిచిందంటూ స్త్రీవాద సాహిత్యానికి తెరదీశారు. దీనివల్ల గత సంఘంలో అభ్యుదయపథాన పయనించిన స్త్రీల చరిత్రకు మేలు కంటే కీడే ఎక్కువ జరిగింది. దీనికి ప్రధాన కారణం వర్ణవ్యవస్థ సమాజాన్ని వదలకపోవటమే.

వీర శైవమతమున దర్శనమిచ్చే నిమ్మవ్వ, గుడ్డవ్వ, సంగళవ్వ బెజ్జ మహాదేవి దుగ్గళవ్వ వంటి భక్తురాళ్ళు గొప్ప కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించారు. అయితే నాటి కొందరు పండితులు, వారు విధించిన పతివ్రతాధర్మాలను అనుసరించిన స్త్రీలనే గొప్పవారని ప్రచారం చేశారు. అయితే దుగ్గళవ్వలాంటి వారు ఛాందస ఛత్రంలో ఉండి చెప్పిన పండితుల ధర్మాలను అనుసరించకుండానే మంచి పేరును సంపాదించారు. వీరు వర్ణధర్మముల కంటే మానవీయ ధర్మాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే కోడబలి శ్రీ, శాంతిసిరి, బోధిసిరి, వాసిష్ఠీ పుత్రభట్టి దేవి, మల్లమాంబ, రుద్రమదేవి, మగువ మాంచాల, మొల్ల వంటి అనేకమంది మహిళలు రాజకీయంగా, కవన పరంగా మంచి కీర్తిప్రతిష్ఠలను పొందారు. అయితే తెలుగు సాహిత్యం ఇలాంటివారిని వెలికితీసి వారి ఆలోచనలను, ఆచరణలను బహిర్గతంచేసే విషయంలో ఎక్కువ ఆసక్తిని చూపలేదనే చెప్పాలి.

నియమాలను అతిక్రమించడం అంటే సమాజంలో ఉన్న పురాణ స్త్రీల రూపురేఖలను మార్చడం కాదు. అలాగని ఆయా కథల్లో ఉన్న ఛాందస భావాలను అనుసరించమని చెప్పడం కాదు. వేద పురాణేతిహాసాదులను క్షుణ్ణంగా పఠించడం, శాస్త్రీయంగా ఆలోచించడం, కొత్త పథాన్ని ఆశ్రయించడం, ఆశ్రయించిన పథం శాస్త్రీయంగా ఉందో లేదో చూసుకోవడం అన్న సంస్కృతి తెలుగు సాహిత్యానికి తక్కువ ఉన్నది. అందువల్ల చెప్పిందే చెప్పడం, దానినే తిరగేసి చెప్పడం అదే కొత్తదనం అనడం వల్ల యథార్థం మరుగున పడిపోయింది.


తెలుగు సాహిత్యంలో రాజుల చరిత్ర, కవుల చరిత్రలకు ఉన్నంత ప్రాధాన్యం సామాన్యుల చరిత్రకు లేదు. అక్కడక్కడ ఉన్నా అది పేరుకు నాలుగైదు వాక్యాలే ఉంటుంది. చెప్పాలి కాబట్టి చెప్పాలన్నట్లు ఆ వాక్యాలుంటాయి. ఇక స్త్రీల గురించి చెప్పాలంటే.. '**కలకంఠి కంట కన్నీరొలికిన సిరినింట ఉండద**'న్నవారే '**ఆడదాని కన్నీరు సమరాలే చేయిస్తాయ**'ని చెప్పారు. అలాగే ఆడదానికి ఆడదే శత్రువని చెప్పారు. వారకాంత ఉన్న వీధిలో ఉండకూడదన్నారు. ఆడది అబద్ధం ఆడితే గోడ కట్టినట్లుంటుందని చెప్పారు. అలాగే '**స్త్రీని ఎక్కడ పూజిస్తారో అక్కడ దేవతలు తిరుగుతుంటార**'ని చెప్పారు. స్త్రీ కామ బిందువని చెప్పారు. స్త్రీ నిత్యం పతిపూజ చేయాలని చెప్పారు. స్త్రీ తులసి చెట్టును పూజించవచ్చును కానీ తులసి చెట్టుకు నీరుపోయకూడదని చెప్పారు. వీటన్నిటిని వింటూ నమ్ముతూపోతే ఆడది గడపదాటకుండా ఉంటేనే మంచిదనిపిస్తుంది. నిజానికి ఇలాంటి సూక్తులన్నీ చెడు నడతగల స్త్రీ గురించి చెప్పినవై ఉండవచ్చు. చెడు నడతకు, స్త్రీ పురుష భేదమనేది ఉండదు. మగవారిలో చెడ్డవారున్నట్లే, ఆడవారిలో కూడా చెడ్డవారుంటారు. వారిని గురించి చెప్పేటప్పుడు చెడును సూచించే సూక్తులను చెప్పి ఉండవచ్చును. అలాంటి సూక్తులను అన్నిచోట్ల ఆపాదించడం సమంజసం కాదు.

పాలమ్మిన స్త్రీలున్నారు. పశువులను మేపిన స్త్రీలున్నారు. కుండలు చేసిన, చీరలు నేసిన స్త్రీలున్నారు. సోది చెప్పిన స్త్రీలున్నారు. కవనమల్లిన స్త్రీలున్నారు. శాస్త్రాలను రచించిన స్త్రీలున్నారు. రాణివాస స్త్రీలు, రాజ్యాలేలిన స్త్రీలున్నారు. ప్రేమకోసం బతుకు త్యాగం చేసిన స్త్రీలున్నారు. అయితే వీరి ప్రస్తావన తెలుగు సాహిత్యంలో నామమాత్రమే. ఏదేమైనా స్థల కాలాలకు అతీతంగా స్త్రీ పీడనను, వెనుకబాటును చూడకుండా, పురాణేతిహాసాలపై అభాండాలు వేయటం సమాజ పరిణామక్రమాన్ని చూడ నిరాకరించటమే.

- వాగమూడి లక్ష్మీరాఘవరావు, 98494 48947

> **పాలమ్మిన స్త్రీలున్నారు. పశువులను మేపిన స్త్రీలున్నారు. కుండలు చేసిన, చీరలు నేసిన స్త్రీలున్నారు. సోది చెప్పిన స్త్రీలున్నారు. కవనమల్లిన స్త్రీలున్నారు. శాస్త్రాలను రచించిన స్త్రీలున్నారు. రాణివాస స్త్రీలు, రాజ్యాలేలిన స్త్రీలున్నారు. ప్రేమకోసం బతుకు త్యాగం చేసిన స్త్రీలున్నారు. అయితే వీరి ప్రస్తావన తెలుగు సాహిత్యంలో నామమాత్రమే. ఏదేమైనా స్థల కాలాలకు అతీతంగా స్త్రీ పీడనను, వెనుకబాటును చూడకుండా, పురాణేతిహాసాలపై అభాండాలు వేయటం సమాజ పరిణామక్రమాన్ని చూడ నిరాకరించటమే.**

అభివృద్ధి..



చెప్పడానికి నా దేశ సంస్కృతి పవిత్రం..!
రాసుకున్నది ఘనమైన చరితం
మేరా భారత్ మహాన్
సంస్కరణలతో వెలుగుతోంది
మతమౌఢ్య మూడంతో మూలుగుతోంది
గీడ సకల సంపదలకు నెలవు
సంపన్న కుబేరుల కొలువు
హిందూ మనుమయా ధర్మంతో
మూడు కోట్ల దేవతలకు నెలవు..!
గీడ పార్టీల రాజతంత్రం
అభివృద్ధి తారక మంత్రం
ఎవరికి వారు ఎత్తుగడల వ్యూహంలో
అధికారమే పరమావధి!
విలువల వలువలూడి ప్రపంచ వింత
తాజ్ మతం రంగుతో మసకబారింది!
పెద్దనోట్ల రద్దు పెద్దలకు మేలు
జీఎస్టీ బిల్లు పేద జేబుకు చిల్లు
ప్రశ్నించే గొంతుకలపై
హైందవ తల్వార్ సంచారం
పేదరికం-నిరక్షరాస్యత
బడుగు బతుకులు-పేకమేడలు
ఆకలి-అంటరానితనంపై అనాగరికత్వం
గీడ పసిబాలలు హిమాలయాలను అధిరోహించి
దాని మెడలు వంచి
ఇండియా కీర్తి పెంచుతూనే వుంద్రు..
గీడ పసిబాలలు ఆకలి తాళలేక
కొన ఊపిరితో కొట్లులాడి
మొగ్గలోనే రాలుతుంద్రు
గిప్పుడు నా దేశం ఆకలిసూచిలో సెంచరీ బాది
ప్రపంచం ముందు దిగజారి
ఘనకీర్తిని మూటగట్టుకుంది
మన్నించు బాల్యమా..

- భూతం ముత్యాలు, 94904 37978


మన్నుతిన్న పాములు



ఎవడిదుఃఖమో.. ఎవడికో సుఖమైపోతున్నది
ఎవడి అజ్ఞానమో ఎవడినో జ్ఞానిని చేస్తున్నది
విషయం అక్కర్లేదు, విద్యా అక్కర్లేదు
జ్ఞానం అక్కర్లేదు, నైపుణ్యం అక్కర్లేదు
రెండు కాషాయ జతలు,రెండు నెలలు పెంచిన గడ్డం
మనుషుల భయపెట్టే మాయాజాలం
కల్లబొల్లి కబుర్ల మాటకారితనం
మాటలే రాని మందబుద్ధితనమైతే
మరింత రాణించవచ్చు!
మౌనస్వాములకు ఉండే క్రెడిట్టే వేరు!
కష్టించడం చేతకాని గాలిపటం గాళ్ళకు
భలే ఉపాధిరంగం బాబా అవతారం
పరాన్నజీవుల భుక్తిమార్గం!
తరతరాలుగా జాతిని అజ్ఞానంలోకి
ఖర్మసిద్ధాంతాల బూజునంతా మెదళ్ళలోకి కూర్చి
గతజన్మల గందరగోళాన్ని
పాపపుణ్యాల భీతికథల్ని రంగరించి
మనుషులను పద్మవ్యూహాల్లోకి లాగడం
వేల సంవత్సరాల ఈదేశ అజ్ఞానాన్ని
చైతన్యంలేని అంధకారాన్ని
తలలో మోసుకొంటూ.. నుదుటికింత బూడిద
చేతుల్లో రెండు తళాలతో మత్తుబానిసై పోవడం
కళ్ళను మూసుకున్నట్లే.. మెదడునూ మూసుకొని..
ఒక మూఢ తాదాత్మతలోకి పారిపోవడం
చెవులు మూసుకొని.. మనసు మూసుకొని..
చుట్టూ చూడలేని ఒక అందమైన ఊబిలోకి
మునిగి పోవడం..
సమాజం నుండి పారిపోయి
మనిషి నుండి పారిపోయి మనసు నుండి పారిపోయి
అసలేమీ లేని రికామీ లోకాల్లో..
మన్నుతిన్న పాముల్లా మారిపోవడం..!
ఎంత సుఖమో కదా..
ఎంతైనా అజ్ఞానంలో ఉండే ఆనందమే వేరు..!!

- సిహెచ్.ఉషారాణి, 94412 28142

అక్షర శ్రామికుడు అలిశెట్టి



అక్షర సత్యాన్ని నమ్ముకొని జీవించిన ధీశాలి అలిశెట్టి ప్రభాకర్, తన జీవితాన్ని కొవ్వొత్తిగా విలువల వెలుగులు పంచాడు. తన ఊపిరినే చమురుగా చేసి నిరంతరం సమాజంలోని అట్టడుగువర్గాల గోసను, వేదనను తన కవితలలో ప్రతిబింబించిన మనసున్న మనీషి అలిశెట్టి ప్రభాకర్.

రాష్ట్రంలోనే కాదు, ప్రపంచమంతా ప్రభాకర్ కవిత్వానికి ఫిదా కాని వారు లేరు. తెలంగాణ స్వరాష్ట్రంలో ప్రపంచ తెలుగు మహాసభల్లో అల్లిశెట్టి ప్రభాకర్ ప్రాంగణం ఏర్పాటు చేయడం మనకే కాదు, తెలుగు రచయితలకు, కవులకు గర్వకారణం.

తాత్వికరించడం ద్వారా నిర్వచనం రూపొందుతుంది. అలిశెట్టిది నిర్వచన కవిత్వం. నిర్దిష్టాంశాలను, తాత్వికరించి నిర్వచించిన కవి అలిశెట్టి. శతక సాహిత్యం అందుకే ఎక్కువ కోట్ చేయబడుతుంది. అలా తెలుగు భాషలో తరచుగా కోట్ చేయబడుతున్న కవులలో భర్తృహరి, శేషప్ప కవి, సుమతి, వేమన లాంటి తెలుగు శతక కారులను చెప్పుకోవచ్చు. ఆధునిక కాలంలో శ్రీశ్రీ తర్వాత అత్యధికంగా కోట్ చేయబడే కవి అలిశెట్టి ప్రభాకర్.

తల్లిదండ్రులు ఏమాశించి ఆ పేరుపెట్టారో కాని తన పేరుకు తగ్గట్టు తను కాలిపోతూనే, తన ఆరోగ్యం, తన మేధాశక్తి కరుగబెట్టి, రంగరించి సిరాగా మార్చి శ్రమ జీవి తపనను, ఆవేదనను తన బాధగా అనుభవించి అక్షరరూపం ఇచ్చి కవితలుగా, సమాజానికి చురకలంటించిన కవితా శ్రామికుడు ప్రభాకర్.

చదువుకంటే సంస్కారం, సమాజాన్ని, తోటివాన్ని అర్థం చేసుకోగలుగటమే ముఖ్యమనుకొనే ప్రభాకర్, కవితలోని ప్రతి అక్షరం మనిషి బాధల నుంచి విముక్తి కోసం తపనపడింది. అక్షర జ్ఞానం ఉన్న ప్రతివాడు తోటివాడి బాధలను తీర్చడానికి, సామాన్యుని పక్షాన నిలబడి సమాజంలోని అన్నివర్గాల అభ్యున్నతికి తోడ్పడాలని ఉద్బోధించాడు. అదే జీవితమని, అదే మనిషి ఆశయంగా, లక్ష్యంగా ఉండాలని ఆశించిన ఆశాజీవి అలిశెట్టి ప్రభాకర్.

చదువుల పేర బాల్యాన్ని చిదిమేస్తున్న ఈ విద్యావిధానాన్ని విమర్శిస్తూ ఈ పోటీ చదువులు పేకమేడలే కానీ, బతుకు బండి నడుపడానికి ఉపయోగపడేవి కావని నిక్కచ్చిగా చెప్పాడు. చదువుకొన్న ప్రతివాడు నిరుద్యోగిగా మారుతున్నాడే తప్ప ఈ సమాజానికో, తన కుటుంబానికో పనికిరాకుండా పోతున్నాడని ఈ చదు వులను నిరసించాడు. ఈ పోటీ ప్రపంచపు చదువులు మనిషిని, పక్కమనిషికి మరింత దూరంచేస్తూ, తారతమ్యాలను పెంచి పోషిస్తున్నాయని, పెట్టుబడిదారు చేతిలో కీలుబొమ్మలా మారుస్తున్నాయని ప్రభాకర్ తన కవితల్లో ఆవేదన చెందాడు.

ప్రభాకర్ కవిత్వంలో ఉదాహరించడానికి, కోట్ చేయడానికని వెతికితే అతని దృష్టికి రాని అంశం అంటూ లేదు. బాల్యం నుంచి యవ్వనం వరకు, స్త్రీ నుంచి అమ్మ, అక్కాచెల్లెళ్ల వరకు, ఉద్యమాల నుంచి ప్రకృతి విధ్వంసం వరకు, నాగరికత పూర్వం నుంచి అధునాతన నాగరికత వరకు ఈ సమాజాన్ని పట్టి పీడిస్తున్న అన్ని సమస్యలను తన కవితా ఖడ్గంతో చీల్చిచెండాడాడు.

మనిషి మస్తిష్కంలో వేల ఏండ్లుగా మెదిలే అనేక ప్రశ్నలకు, ఆవేదనలకు అక్షర రూపంలో సమాధానం వెతికే ప్రయత్నం చేసిన కృషీవలుడు ప్రభాకర్. అతని రచనా కాలం తక్కువే కావచ్చు, కానీ అతను స్పృజించినన్ని అంశాలను, సంవేదనలను, అతను తోటి మనిషి సమస్యల పట్ల స్పందించినంత వేగంగా మరో కవి స్పందించలేదనడం అతిశయోక్తి కాదు. చాలామంది ఉచ్చరించడానికే సంశయించే వేశ్యల గురించి చిన్నచిన్న పదాలతో వేల గ్రంథాల్లో ఇముడలేనంత తాత్వికతను, ఆర్ద్రతను వెల్లడించాడు.

స్వేచ్ఛా, స్వాతంత్రాల పట్ల ప్రభాకర్‌కు ఎంతో ప్రేమ అభిమానం. ధైర్యంగా బతుకడమే మనిషి లక్ష్యం కావాలని ఆశించాడు. భయపడుతూ బతికే కంటే ఎప్పుడో వచ్చే చావు కోసం ఎదురు చూసే కంటే ఇప్పుడే చావడం మేలన్నాడు. అందుకే భయంతో, అసమర్థతతో అందరికి వొంగి, వొగ్గి జీవించే మనిషిని ఒక నల్లిలా, నత్తలా సమాజానికి ఉపయోగపడని వానిలా ఈసడించుకున్నాడు. అదే విషయాన్ని తన 'భయం అరల్లో' కవితలో ఇలా చెప్పాడు.

'నల్లిలా
నత్త గుల్లలా
ప్రతిక్షణం
భయంతో ముకులించుకుని
భయం అరల్లో దూరిపోయే
ఎవడ్రా నువ్వు..' అంటూ మనిషి జీవితంలో ఓడిపోవడానికి మూలం భయమంటూ తేల్చి చెప్పాడు. వేలవేల పేజీల్లో లక్షల అక్షరాల దొంతరలో చెప్పలేని ఈ ప్రపంచపు కుళ్లును, దానికి మనిషి ఎలా ప్రతిస్పందించి, తనను తానూ ఎలా బాగుచేసుకోవాలో తన కవిత్వంలో చెబుతూ, నేనున్నానే భరోసానిచ్చాడు.


యువత నిరుద్యోగులుగా మారి, జీవితాన్ని గెలుచుకోలేకపోతున్న వేళ, మన సాహిత్యం అతనికి మార్గదర్శనం చేయాల్సిన వేల యువతను పెడదోవ పట్టిస్తున్న సాహిత్యాన్ని సృష్టిస్తున్న కవుల, రచయితల సాహిత్యాన్ని ఎండగట్టాడు. ప్రభాకర్ కవిత్వంలో సామాన్యుని భాష, ఆశ, కనబడుతాయి. సామాన్యుని గొంతుకతో, సమాజాన్ని మార్చాలనే తపన, ధైర్యం ఉన్న ధీశాలి ప్రభాకర్. తన కవిత్వంతో తెలుగు భాషకు అరుదైన గౌరవాన్ని తెచ్చిన గొప్ప కవి అతడు. ఇంతకంటే గొప్ప విశేషణాలను అతనికి తగిలించడానికి సాహసించకపోవడమే కానీ.. అతని కవిత్వాన్ని పోల్చదగిన, సరితూల్చగల కవిత్వం మరేదో ఉందని, మరో కవి ఉన్నాడని మాత్రం కాదు. కవిగా, సమాజ నిబద్ధుడిగా, విప్లవ కవిగా, మనసున్న మనిషిగా చిరస్థాయిగా నిలిచిపోగల వ్యక్తిత్వం ఉన్న కవి అలిశెట్టి.

- సీహెచ్‌వీ ప్రభాకర్‌రావు, 93915 33339

(ఈ నెల 12న అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి సందర్భంగా)

తల్లిచేప

(అల్లం రాజయ్య కథలు)



భూమి చేజారిన రైతుల బతుకులు ఎంతటి విధ్వంసానికి గురయ్యాయో, ఎంతటి వెట్టి బతుకులుగా మారాయో అనితరసాధ్యంగా రాజయ్య ఈ కథల్లో చిత్రిస్తాడు. ఒక నిర్దిష్ట స్థల కాల సామాజిక పరిణామక్రమాన్ని ఈ కథలు వ్యాఖ్యానిస్తాయి. ఈ కథలు ఓ ఐదేండ్లకాలం.. 1981నుంచి 85 దాకా తెలంగాణలో నిర్మాణమైన ప్రజల పోరాట చరిత్రను సజీవంగా మన కండ్లముందు నిలిపిన సామాజిక రాజకీయార్థిక సాంస్కృతిక చరిత్రే ఈ కథలు. అల్లం రాజయ్య సమగ్ర సాహిత్యంలో 'తల్లిచేప' కథలు ఐదవ సంపుటి.

రచన: అల్లం రాజయ్య, వెల: 280
ప్రతులకు: నవోదయ బుక్ హౌజ్, ఆర్య సమాజ్ ఎదురుగా, కాచీగూడ చౌరస్తా, హైదరాబాద్. పర్‌స్పెక్టివ్స్-హైదరాబాద్.

రుద్రప్రయాగ చిరుతపులి



వందేండ్ల క్రితం వాస్తవంగా జరిగిన ఘటనకు జిమ్‌కార్బెట్ అక్షర రూపానికి ఇది స్వేచ్ఛానువాదం. రుద్రప్రయాగ చిరుతపులి ఎనిమిదేండ్లు వందలాది మందిని చంపితినేసింది. ఎవరికీ దొరుకలేదు. ఆఖరికి జిమ్ కార్బెట్ వందల మైళ్లు కాలినడకన తిరిగి 65 రాత్రులు అడవిలో చెట్లమీద గడిపి మాటువేసి దాన్ని చంపగలిగాడు. ఆ విరోచిత గాథే ఈ 'రుద్రప్రయాగ చిరుతపులి'.

రచన :జిమ్ కార్బెట్ అనువాదం: కందుకూరి రవీంద్రనాథ్
వెల: రూ. 225 ప్రతులకు: నవోదయ బుక్ హౌజ్, నవచేతన, ఇతర ప్రముఖ పుస్తక కేంద్రాలు.


మట్టిపూలు (కథలు)



జర్నలిస్టుగా, గుండెలో తడి ఉన్న మనిషిగా తన చుట్టూరా ఉన్న సమాజంలో జరుగుతున్న అనేకానేక ఘటనలూ, సంఘర్షణలూ రామచంద్రారెడ్డిని అతలాకుతలం చేశాయి. ఈ కథల్లో మనుషుల జీవితం ఉన్నది. వారి కన్నీళ్లు ఉన్నాయి. 'మట్టిపూలు' కథలు జనాల ఆగ్రహజ్వాలల ప్రతీకలు.

రచన: కంది రామచంద్రారెడ్డి , వెల: రూ. 60
ప్రతులకు: కంది రామచంద్రారెడ్డి, మణుగూరు,ఖమ్మం జిల్లా. సెల్:9989986600

కుందాపన



భావన ఒక మిఠాయి ఐతే, ఆ మిఠాయికి చుట్టిన రంగు రంగుల కాగితం కవి ఎంచుకునే పదాలు. మన రాత ల్లో మామూలుగా శబ్దించే అక్షరాలు, వాటి అర్థాలు కవి చేతుల్లో సీతాకోక చిలుకల్లా ఎగిరిపోతాయి. అలాంటి అందమైన హృద్యమైన కవిత్వమే.. రవి వీరెల్లి 'కుందాపన'.

రచన: రవి వీరెల్లి, వెల: రూ. 100
ప్రతులకు: 8-145/89, సప్తగిరి కాలనీ, మియాపూర్, హైదరాబాద్-49.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

అమెరికా కాంగ్రెస్‌కు
మరో భారత సంతతి మహిళ!

మేరీల్యాండ్ నుంచి నామినేషన్ దాఖలు చేసిన అరుణామిల్లర్



వాషింగ్టన్, జనవరి 7: అమెరికా పార్లమెంట్‌లో అడుగుపెట్టేందుకు భారత సంతతికి చెందిన మరో మహిళా రాజకీయవేత్త అరుణామిల్లర్ సిద్ధమవుతున్నారు. ఈ మేరకు మేరీల్యాండ్ స్థానం నుంచి ఆమె నామినేషన్ పత్రాలు సమర్పించారు. ప్రస్తుతం ఈ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డెమోక్రటిక్ అభ్యర్థి జాన్ డెలానీ మళ్లీ పోటీచేయబోనని చెప్పారు. ఆయన 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ తరపున అధ్యక్ష పదవికి పోటీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో మేరీల్యాండ్ జిల్లా నుంచి అమెరికా కాంగ్రెస్‌కు పోటీచేసేందుకు తన తల్లి హేమ కాట్రగడ్డతో కలిసి మిల్లర్ నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'వలసదారుగా వచ్చిన నేను ఇక్కడ అద్భుతమైన అవకాశాలను దక్కించుకుంటున్నాను. ఈ విషయంలో ఇంకాస్త ముందుకు వెళ్లాలనుకుంటున్నాను. ఇక్కడ అవకాశాలు దక్కించుకోవడానికి పౌరులందరికీ తలుపులు తెరిచే ఉంటాయి' అని మిల్లర్ తెలిపారు. తన జీవితంలో ఇది సంతోషకరమైన రోజని ఆమె పేర్కొన్నారు. 2010లో తొలిసారిగా ప్రజాప్రతినిధిగా ఎన్నికైన మిల్లర్ (53) ప్రస్తుతం మేరీల్యాండ్ హౌస్‌లో సభ్యురాలిగా ఉన్నారు. మిల్లర్ ఏడేండ్ల వయసులోనే తల్లిదండ్రులతో అమెరికాకు వచ్చి స్థిరపడ్డారు. ఇప్పటికే ఇద్దరు భారతీయ సంతతి మహిళలు అమెరికా పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

వింతైన విడాకులు

నా భర్త.. ఆయన తల్లికంటే నన్నే బాగా చూస్తున్నారు

అమ్మకు మేలు చేయనివాడు భార్యకు మంచి చేస్తాడంటే నమ్మను

ఎప్పటికైనా వ్యతిరేకవుతాడు: కోర్టుకు వివరించిన మహిళ ❑ విడాకులు మంజూరుచేసిన న్యాయస్థానం

రియాద్, జనవరి 7: తాగొచ్చి తన్నుతున్నాడనో.. అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడనో.. అడిగినవి కొనివ్వడంలేదనో భార్యాభర్తలు విడాకుల కోసం వెళ్తుండటం సహజంగా కనిపిస్తుంటుంది. కానీ సౌదీఅరేబియాలో వింతైన కారణంతో విడాకులకు దరఖాస్తు చేసుకున్నారో ఓ మహిళ. భర్త సొంత అమ్మను పక్కన పెట్టి.. ఆమెకంటే తననే బాగా చూసుకుంటున్నాడని.. అందుకే విడాకులు కావాలని ఓ భార్య కోర్టును ఆశ్రయించారు. 'సొంత అమ్మకు కొంతైనా మేలు చేయలేనివాడు.. భార్య కోసం మాత్రం అన్నీ చేస్తాడంటే అలాంటి వారిని నేను నమ్మను. కన్నతల్లి అంటే ఇష్టం ఉండని వ్యక్తి నమ్మకస్తుడు కాలేడు. భవిష్యత్‌లో ఎప్పుడైనా నాకు వ్యతిరేకంగా మారొచ్చు' అంటూ భార్య న్యాయమూర్తికి వివరించింది. 'నా భర్త వాళ్ల అమ్మను వదిలిపెట్టినట్టుగా నన్ను వదిలించుకొనేవరకు ఆయనతో ఉండలేను' అని తెలిపింది. 'నీ కోసం నా కుటుంబాన్ని వదులుకున్నాను' అని భర్త వాదించగా.. అందుకే తాను విడాకులు కోరుకుంటున్నానని భార్య న్యాయస్థానానికి వివరించింది. అయితే, తన భార్యతోనే ఉండాలనుకుంటున్నానని, ఆమెను విడిచి ఉండలేనని, ఆమెను సంతోష పెట్టేందుకు ఏదైనా చేస్తానని భర్త పేర్కొనగా.. అందుకు ఆమె నిరాకరించింది. 'భర్త.. నన్ను విదేశీ పర్యటనలకు తీసుకెళ్లారు. అక్కడ అడిగినవన్నీ కొనిచ్చారు. నన్ను సంతోష పెట్టేందుకు అన్నీ చేశారు. కానీ, నేను తీసుకున్న నిర్ణయాన్ని మాత్రం వెనుకకు తీసుకోలేను' అని ఆమె తేల్చిచెప్పింది. దీంతో న్యాయస్థానం ఆ భార్యకు విడాకులు మంజూరుచేసింది.

పారాసిటమాల్‌తో బిడ్డలకు ముప్పు!

గర్భిణులు అధికంగా వాడితే పిల్లల సంతాన సామర్థ్యం దెబ్బతినే అవకాశం



లండన్, జనవరి 7: గర్భిణులు పారాసిటమాల్‌ను అతిగా వాడితే పుట్టబోయే బిడ్డల సంతాన సామర్థ్యంపై ప్రభావం చూపుతుందని డెన్మార్క్ శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గర్భిణులు నొప్పుల నుంచి ఉపశమనం కోసం పారాసిటమాల్‌ను వాడుతుంటారు. దీనిని అతిగా వాడడం వల్ల మగపిల్లల ప్రత్యుత్పత్తి వ్యవస్థపై ప్రభావం చూపుతున్నదని, సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గే అవకాశం ఉన్నదని పరిశోధకులు గతంలోనే గుర్తించారు. తాజాగా డెన్మార్క్‌లోని కోపెన్‌హగన్ యూనివర్సిటీ హాస్పిటల్‌కు చెందిన శాస్త్రవేత్తలు పారాసిటమాల్‌తో ఆడశిశువుల సంతాన సామర్థ్యం కూడా దెబ్బతినే అవకాశం ఉన్నదని ప్రకటించారు. వారు మూడు వేర్వేరు ల్యాబుల్లో ఎలుకలపై పరిశోధనలు జరిపారు. గర్భిణులు సాధారణంగా తీసుకునే మోతాదులో పారాసిటమాల్‌ను ఎలుకలకు అందించారు. వాటికి పుట్టిన ఆడ ఎలుకల్లో ఎదిగిన తర్వాత అండాల ఉత్పత్తి సామర్థ్యం తగ్గినట్టు గుర్తించారు. దీనిని బట్టి గర్భిణులు పారాసిటమాల్‌ను అతిగా వాడితే ఆడశిశువుల పునరుత్పత్తి వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉన్నదని పరిశోధక బృంద సభ్యుడు డేవిడ్ క్రిస్టీన్ తెలిపారు. అయితే దీనిపై ఇంకా పరిశోధనలు జరుగాల్సి ఉన్నదన్నారు.

పాక్ సరిహద్దు వెంబడి 14వేల బంకర్లు

13,029 వ్యక్తిగత, 1431 సామాజిక భూగర్భ రక్షణగృహాల నిర్మాణం

కేంద్రం ఆమోదం.. 415కోట్ల నిధులు విడుదల

సరిహద్దు గ్రామాల్లో ప్రాణనష్టాన్ని అరికట్టే దిశగా చర్యలు

జమ్ము, జనవరి 7:

పాకిస్థాన్ నుంచి ఎలాంటి ప్రమాదం ఎదురైనా కశ్మీర్ వాసులకు తగిన రక్షణ వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ), అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ) వెంట పలు గ్రామాల్లో 14వేలకు పైగా బంకర్లను నిర్మించడానికి నిర్ణయించింది. వీటి నిర్మాణానికిగాను రూ.415.73కోట్లను విడుదల చేసింది. కశ్మీర్‌కు చెందిన పూంఛ్, రాజౌరి జిల్లాల్లో నియంత్రణ రేఖ వెంబడి 7,298 బంకర్లను.. జమ్ము, కథువా, సాంబా జిల్లాల్లో అంతర్జాతీయ సరిహద్దు వెంట 7,162 బంకర్లను నిర్మించనున్నారు. ఎల్‌వోసీ, ఐబీ వెంట మొత్తం 14460 వ్యక్తిగత, సామాజిక బంకర్లను ప్రభుత్వం నిర్మించతలపెట్టింది. వీటిలో 13,029 వ్యక్తిగత, 1431 సామాజిక బంకర్లున్నాయి. ప్రభుత్వ నిర్ణయంపై సరిహద్దు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

పాకిస్థాన్‌తో భారత్ 3323 కిలోమీటర్ల పొడవైన సరిహద్దును పంచుకుంటున్నది. ఇందులో 221 కిలోమీటర్లు అంతర్జాతీయ సరిహద్దు, 740కిలోమీటర్ల నియంత్రణరేఖ జమ్ముకశ్మీర్ రాష్ట్రంలోనే ఉన్నది. పాక్ సైనికులు తరుచూ కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. జనావాసాలపై మోర్టార్ షెల్స్ ప్రయోగిస్తుండటంతోపాటు సరిహద్దు వెంట ఎప్పుడూ ఉద్రిక్తతలకు కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే భారత ప్రభుత్వం బంకర్ల నిర్మాణం చేపడుతున్నది. రానున్న రోజుల్లో పాక్ ప్రతి చర్యకు భారత్ నుంచి దీటైన సమాధానం ఉంటుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. దాయాది దేశంతో భవిష్యత్తులో యుద్ధం వచ్చినా అందుకు సర్వసన్నద్ధంగా ఉండే దిశగా ఈ చర్యలు చేపట్టినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. సరిహద్దు గ్రామాల వెంట ఉగ్రవాదుల చొరబాట్లు, వాళ్లను ఏరివేసే క్రమంలో భారతసైన్యం చేపట్టే ఆపరేషన్లలో సాధారణ ప్రజలు బలవుతున్నారు. సాధారణ ప్రజానీకాన్ని లక్ష్యంగా చేసుకుని పాక్ సైనికులు కాల్పులు జరిపిన ఘటనలు కోకొల్లలు. గత ఏడాది ఈ తరహా కాల్పుల్లో 23మంది సైనికులు, 12మంది సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొవడంతోపాటు ఇరుదేశాల మధ్య కాల్పుల ఘటనలకు దారితీస్తే, సాధారణ ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా ఉండేందుకు భారీస్థాయిలో బంకర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భూగర్భంలో నిర్మించే గదిని బంకర్‌గా వ్యవహరిస్తారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్మించనున్న వ్యక్తిగత బంకర్ 160 చదరపు గజాలుంటుంది. ఇందులో 8మంది తలదాచుకోవచ్చు. అలాగే 40మంది తలదాచుకునే సామర్థ్యంతో 800 చదరపు గజాలతో సామాజిక బంకర్‌ను నిర్మించనున్నారు.




జమ్ముకశ్మీర్ సరిహద్దులోని ఓ గ్రామంలో ఏర్పాటు చేసిన బంకర్ (ఫైల్)

జిల్లా	వ్యక్తిగత్ల బంకరు	సామాజిక బంకర్లు
రాజౌరి	4,918	372
కథువా	3,076	243
పూంఛ్	1,320	688
జమ్ము	1,200	120
సాంబా	2,515	8
మొత్తం	13,029	1,431

ఎన్నికల బాండ్లపై
సూచనల స్వీకరణకు సిద్ధం

ఫేస్‌బుక్ ఖాతాలో కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ పోస్ట్



న్యూఢిల్లీ, జనవరి 7: రాజకీయ పార్టీలకు అందే ఎన్నికల విరాళాల్లో మరింత పారదర్శక విధానాన్ని అమలుచేయడానికి అవసరమైన సూచనల స్వీకరణకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. ప్రస్తుతం నగదు రూపంలో జరుగుతున్న విరాళాల చెల్లింపులను ఎన్నికల బాండ్ల రూపంలోకి మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అత్యధికంగా నగదు చలామణిలో ఉన్న మన ఆర్థిక వ్యవస్థలో ఆచరణయోగ్యం కాని సలహాలతో ఉపయోగం లేదని జైట్లీ ఆదివారం తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేశారు. నగదు చెల్లింపులకు బదులు చెక్‌లు, ఆన్‌లైన్ చెల్లింపులు, ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో తీసుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేరొందిన భారత్‌లో గత ఏడు దశాబ్దాల్లో పారదర్శక ఎన్నికల విరాళాల విధానం రూపొందించలేకపోయామని వ్యాఖ్యానించారు. 'రాజకీయ పార్టీలు ఏడాది పొడవునా భారీ ఎత్తున నగదు చెల్లింపులు జరుపుతుంటాయి. ఈ వ్యయాలన్నీ వందల కోట్ల రూపాయల్లో ఉంటుంది. కానీ ఇప్పటివరకు దేశ రాజకీయ వ్యవస్థలో పారదర్శక విరాళాల విధానం అమలులోకి రాలేదు' అని జైట్లీ తెలిపారు. ప్రస్తుత సంప్రదాయంగా విరాళాలు తీసుకునే విధానంలో నగదు చెల్లింపులు ఉంటాయన్నారు. అజ్ఞాత వ్యక్తులు, మారుపేర్లతో విరాళాలిచ్చే విధానం అందుబాటులో ఉంది. గుర్తు తెలియని వనరుల ద్వారా వచ్చే అక్రమ నగదు వివరాలు బయటకు తెలియడం లేదు. 'ఇలాంటి విధానం పూర్తిగా పారదర్శక రహితం. పలు రాజకీయ పార్టీలు ప్రస్తుత విధానంతో సంతృప్తి చెందుతున్నా.. యథాతథ విధానం కొనసాగుతుందని భావించొద్దు' అని జైట్లీ పేర్కొన్నారు. గత వారం ఎన్నికల బాండ్ల స్వీకరణ విధానాన్ని ప్రకటించిన ఆర్థిక మంత్రి జైట్లీ.. వాటిని ఎస్బీఐ ద్వారా 15 రోజుల్లో తీసుకోవచ్చునని పేర్కొన్నారు. నగదు విరాళాల చెల్లింపునకు ఎన్నికల బాండ్లు ప్రత్యామ్నాయ విధానమని తెలిపారు.



టికాన్‌పూర్‌లో మోదీకి స్వాగతం పలుకుతున్న హోంమంత్రి రాజ్‌నాథ్

అంతర్గత భద్రత మరింత పటిష్టం

డీజీపీలు, ఐజీపీల సదస్సులో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో భద్రతను మరింత పటిష్ఠ పర్చాలని వివిధ రాష్ట్రాల డీజీపీలు, ఐజీపీల సదస్సులో ప్రధాని నరేంద్రమోదీ నొక్కి చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని టికాన్‌పూర్ బీఎస్ఎఫ్ అకాడమీలో మూడు రోజుల పాటు జరిగిన డీజీపీలు, ఐజీపీల సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సుకు హాజరైన అధికారులు అర్థవంతమైన ప్రజెంటేషన్లు ఇవ్వడంతోపాటు ఫలవంతమైన చర్చలు జరిపారన్నారు. ప్రత్యేకమైన ప్రాంతాల్లో పోలీసింగ్, భద్రతకు తీసుకోవాల్సిన అంశాలపై అధికారులు గ్రూపులుగా సమావేశమై చర్చించారని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. గత మూడేండ్లుగా జరిగిన వివిధ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు ప్రస్తుతం అమలు దశలో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, సహాయ మంత్రి కిరెన్ రిజిజు తదితరులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల డీజీపీలు, పారా మిలిటరీ బలగాల అధిపతులతోపాటు సుమారు 250 మంది ఉన్నతాధికారులు హాజరయ్యారు.


కోరెగావ్ హింసకు జిగ్నేశ్ బాధ్యుడు కాదు

కేంద్రమంత్రి రామ్‌దాస్ అథావలె

ముంబై: పుణెలోని భీమా కోరెగావ్‌లో ఈనెల 1న జరిగిన హింసకు ఎమ్మెల్యే జిగ్నేశ్‌మేవాని బాధ్యుడు కాదని కేంద్రమంత్రి రామ్‌దాస్ అథావలె ఆదివారం స్పష్టంచేశారు. మేవాని రెచ్చగొట్టేలా ప్రసంగం చేశారని పేర్కొంటూ పుణె పోలీసులు ఆయనపై కేసు నమోదుచేసిన మరుసటి రోజే కేంద్రమంత్రి ఈ ప్రకటన చేయడం గమనార్హం. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌తో భేటీ తర్వాత రామ్‌దాస్ అథావలె మీడియాతో మాట్లాడారు. 'భీమా కోరెగావ్‌లో హింసకు జిగ్నేశ్ బాధ్యులు కాదు. ఈ నెల 1న ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ముందుగా నేను అక్కడ పర్యటించిన సమయంలో పరిస్థితులు బాగానే ఉన్నాయి. అందుకే డిసెంబర్ 31న తిరిగి ఢిల్లీ వెళ్లాను. అదేరోజు పుణెలోని షానివార్ వాడలో జిగ్నేశ్ ప్రసంగించారు. ఆయన భీమా కోరెగావ్ వెళ్లలేదు. అదేరోజు రాత్రి కొన్ని గ్రూపులు సమావేశమయ్యాయి. జనవరి 1న హింస జరిగింది' అని ఇండియా రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు అథావలె వివరించారు. పుణెలో ఈ నెల 13న సామాజిక సామరస్య సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. తాను ప్రకాశ్ అంబేద్కర్ నాయకత్వంలో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

లాలూ రోజు కూలీ రూ.93

జైలులో తోటమాలిగా లాలూ విధులు



రాంచీ/ పాట్నా: దాణా కుంభకోణం కేసులో మూడున్నరేండ్ల జైలుశిక్ష పడిన ఆర్జేడీ అధ్యక్షుడు, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ రోజు కూలీగా మారారు. జార్ఖండ్ రాజధాని రాంచీలోని బిర్సాముండా జైలులో ఉన్న లాలూ తోటమాలిగా పనిచేయాలని జైలు అధికారులు నిర్ణయించారు. దీనికి జైలు అధికారులు ఆయనకు రోజుకు రూ.93 చెల్లిస్తారు. కాగా తనకు విధించిన శిక్షతో తానేమీ భయపడి పోవడం లేదని, రాజకీయ సిద్ధాంతాలైన లౌకికవాదం, దళితులు, బీసీల హక్కుల పోరాటంలో ఎటువంటి రాజీ లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు తన ట్విట్టర్ పేజీలో రాసిన ఓపెన్ లెటర్‌లో తన అభిప్రాయాలు పంచుకున్నారు. ఆరెస్సెస్, మనువాదులు తనను లక్ష్యంగా చేసుకుని దాడి చేశారన్నారు. బీజేపీ తనపై చేతబడి చేయించిందని మరో ట్వీట్ చేశారు. కాగా, అనారోగ్యంతో మరణించిన ఆయన సోదరి గంగోత్రి దేవి అంత్య క్రియల కోసం పెరోల్ ఇవ్వాలని లాలూ కోరే అవకాశం ఉన్నది. ఆమె మృతి చెందిన విషయాన్ని లాలూ తనయుడు తేజస్వి యాదవ్ అధికారుల ద్వారా లాలూకు సమాచారం ఇచ్చారు.

కేసుల భారతం!

భారీగా పెండింగ్‌లో ఉన్న వ్యాజ్యాలు... న్యాయవ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడి

సుప్రీంకోర్టులో ఉన్న పెండింగ్ కేసులు 54,719

ఇందులో ఐదేండ్లు పైబడిన కేసులు 30 శాతం

హైకోర్టుల్లో సగటున 1.65 లక్షల కేసులు పెండింగ్‌లోనే

దిగువ కోర్టుల్లో పెండింగ్ కేసులు 2.6 కోట్లు

హైకోర్టుల్లో 36 శాతం జడ్జి పోస్టులు ఖాళీ



న్యూఢిల్లీ:

భారత న్యాయ వ్యవస్థపై కేసుల ఒత్తిడి నానాటికీ పెరిగిపోతున్నది. పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన తాజా గణాంకాలను పరిశీలిస్తే ఏ మేరకు భారం ఉన్నదో అర్థమవుతుంది. ఈ పరిస్థితిని చక్కదిద్ది.. సత్వర న్యాయాన్ని అందించాలంటే పలు రకాల చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని స్పష్టమవుతున్నది. జాతీయ న్యాయ గణాంక వ్యవస్థ (ఎన్‌జేడీజీ) వెబ్‌పోర్టల్‌లో ఉన్న వివరాల ప్రకారం సుప్రీంకోర్టులో 30 శాతం కేసులు ఐదేండ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. కేసుల భారాన్ని తగ్గించేందుకు సత్వర పరిష్కారం పద్ధతిలో పనిచేయాలని.. సెలవుల్లో కూడా క్రిమినల్ కేసులను పరిష్కరించాలని కోరుతూ 24 హైకోర్టులకు భారత ప్రధాన న్యాయమూర్తి ఇటీవల లేఖరాశారు.

- ❖ గత ఏడాది డిసెంబర్ 18 నాటికి సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు 54,719. ఇందులో ఐదేండ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న కేసులు 15,929. పదేండ్లకు పైగా తీర్పు కోసం ఎదురుచూస్తున్న కేసులు 1550 ఉన్నాయి.
- ❖ దేశంలోని ప్రతి హైకోర్టులో సగటున 1.65 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.
- ❖ అలహాబాద్, జమ్ముకశ్మీర్ హైకోర్టులు కాకుండా మిగతా హైకోర్టుల్లో 34.27 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.
- ❖ ఉత్తర్‌ప్రదేశ్ న్యాయశాఖ వెబ్‌సైట్‌లో ఉన్న వివరాల ప్రకారం అక్కడి హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 3.2 లక్షలు.
- ❖ దీని ప్రకారం 23 హైకోర్టుల్లో పెండింగ్ కేసులు 37.47 లక్షలు. ఒక్కో కోర్టులో సగటున ఉన్న కేసులు 1.65 లక్షలు.
- ❖ ఉత్తర్‌ప్రదేశ్ కాకుండా పెండింగ్‌లో ఉన్న 34.27 లక్షల కేసుల్లో దాదాపు 7.46 లక్షల కేసులు (22 శాతం) ఐదు నుంచి పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి.
- ❖ మరో 6.42 లక్షల కేసులు (19 శాతం) పదేండ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి.
- ❖ ఈ రెండింటినీ కలిపితే దాదాపు 40 శాతానికి పైగా కేసులు ఐదేండ్లుగా తీర్పుల కోసం వేచి చూస్తున్నాయి.

దిగువ కోర్టుల పరిస్థితి ఘోరం!

సుప్రీంకోర్టు, హైకోర్టుల సంగతి అలా ఉంచితే దిగువ కోర్టుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉన్నది. గత ఏడాది డిసెంబర్ 26 నాటికి అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, పుదుచ్చేరి, లక్షద్వీప్ కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న దిగువ కోర్టుల్లో 2.6 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

- ◆ 61.58 లక్షల కేసులతో ఉత్తర్‌ప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా ఉన్నది. ఇది మొత్తం కేసుల్లో నాలుగో వంతు.
- ◆ మహారాష్ట్రలో 33.22 లక్షలు, పశ్చిమబెంగాల్ 17.59 లక్షలు, బీహార్ 16.58 లక్షలు, గుజరాత్ 16.45 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.
- ◆ దిగువ కోర్టుల్లో 22,677 జడ్జిలు ఉండాల్సి ఉండగా 5,984 జడ్జి పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- ◆ అత్యధిక కేసులు పెండింగ్‌లో ఉన్న ఐదు రాష్ట్రాల్లో ఉన్న యూపీ, బీహార్, గుజరాత్‌లు.. అత్యధికంగా జడ్జి పోస్టులు ఖాళీగా ఉన్న మొదటి ఐదు రాష్ట్రాల జాబితాలో కూడా ఉండటం గమనార్హం.

ఉన్నత న్యాయస్థానాల్లో 400 పోస్టులు ఖాళీ



దిగువ కోర్టుల్లో ఖాళీగా 5,984 జడ్జి పోస్టులు

గత మూడేండ్లుగా దేశవ్యాప్తంగా న్యాయమూర్తులు, జనాభా నిష్పత్తి స్వల్పంగా పెరిగింది. 2011 జన గణన ప్రకారం సుప్రీంకోర్టు, 24 హైకోర్టులు, దిగువ కోర్టులకు న్యాయమూర్తుల సంఖ్యను ఖరారు చేసినట్లు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ తెలిపింది. దీని ప్రకారం ప్రతి పది లక్షల మందికి 19.66 మంది న్యాయమూర్తులు ఉండాలి. కానీ 2014లో పది లక్షల మంది జనాభాకు 17.48 మంది న్యాయమూర్తులు మాత్రమే ఉన్నారని అధికార గణాంకాలు చెప్తున్నాయి. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 31 మంది న్యాయమూర్తులకు 25 మంది మాత్రమే పనిచేస్తుండగా, దేశంలోని 24 హైకోర్టుల పరిధిలో 1,079 మంది న్యాయమూర్తులకు 684 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మిగతా 395 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 2014లో హైకోర్టుల్లో 906 మంది న్యాయమూర్తులను నియమించాలని కేంద్ర న్యాయశాఖ నిర్ణయించినా.. వాస్తవ రూపం దాల్చలేదు. ఇక దిగువ కోర్టులకు 20,214 న్యాయాధికారులు/ జడ్జిలను నియమించాల్సి ఉండగా, అది 2017 నాటికి 22,677 మందికి చేరింది. కాగా గతేడాది చివరికల్లా దిగువ కోర్టుల్లో 5,984 జడ్జి పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

డేటా అక్రమంగా పొందారంటూ
జర్నలిస్టుపై 'ఆధార్' కేసు



న్యూఢిల్లీ, జనవరి 7: ఆధార్ డేటాను అక్రమంగా పొందారని ఓ పత్రిక జర్నలిస్టుపై భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) కేసు నమోదు చేసింది. వందకోట్ల మందికి సంబంధించిన ఆధార్ డేటాను కొందరు వాట్సాప్ ఆధారంగా అమ్ముతున్నట్లు వార్తను రాసిన జర్నలిస్టుపై యూఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్ బీఎం పట్నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐపీసీలోని 419, 420, 468, 471 సెక్షన్లు, ఐటీ చట్టం 66 సెక్షన్, ఆధార్ చట్టం 36,37 సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఢిల్లీ క్రైమ్‌బ్రాంచ్ జాయింట్ కమిషనర్ అలోక్ కుమార్ తెలిపారు. ఈనెల 3న 'ట్రిబ్యూన్' పత్రికలో ఈ కథనం ప్రచురితమైంది. కేవలం రూ.500తో పదినిమిషాల్లో ఓ ఏజెంట్‌ను పట్టుకుని, లాగిన్ ఐడీని, పాస్‌వర్డ్‌ని సంపాదించానని ఈ కథనాన్ని రాసిన జర్నలిస్టు రచనాఖైరా పేర్కొన్నారు. ఆధార్ డేటా ఏమేరకు భద్రం? అనే అంశాన్ని వెల్లడించేందుకు తానే ఓ కొనుగోలుదారుగా మారి ఐడీ, పాస్‌వర్డ్ సంపాదించానని ఆమె తెలిపారు. వందకోట్ల మందికి చెందిన ఆధార్ నెంబర్ల వివరాలను పరిమితులు లేకుండా పొందేందుకు ఆధార్ ఎకోసిస్టమ్‌ను ఆ పత్రిక సంపాదించిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో యూఐడీఏఐ పేర్కొన్నది. కాగా, తనకు ఎఫ్ఐఆర్ కాపీ అందిందని, తన కథనంపై ఆధార్ ప్రాధికార సంస్థ ఏదోవిధంగా చర్యలు చేపట్టడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. తాను రాసిన కథనంలోని ప్రతీవాక్యం నిజమేనని, దానికి తాను కట్టుబడి ఉన్నానని రచనాఖైరా చెప్పారు.

ఎఫ్ఐఆర్ ఉపసంహరించుకోవాలి: ఎడిటర్స్ గిల్డ్

ట్రిబ్యూన్ జర్నలిస్టుపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఎడిటర్స్ గిల్డ్ కోరింది. యూఐడీఏఐ సంస్థ కేసు పెట్టడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని పేర్కొన్నది. 'ముందుగా యూఐడీఏఐ అంతర్గత విచారణ జరిపాలి. ఎక్కడ నుంచి ఆధార్ డేటా అక్రమంగా బయటకు వెళ్లిందో ఆ వివరాలను ప్రజలముందు ఉంచాలి. దీనిపై కేంద్ర హోంశాఖ జోక్యంచేసుకోవాలి. పత్రిక కథనం ఆధారంగా పెట్టిన కేసును ఉపసంహరించుకోనేలా చర్యలు తీసుకోవాలి. ఈ మొత్తం వ్యవహారంపై నిష్పాక్షిక విచారణ జరిపించాలి' అని ఎడిటర్స్ గిల్డ్ ప్రభుత్వానికి రాసిన లేఖలో డిమాండ్ చేసింది. ఈ అంశంపై ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా ప్రభుత్వంపై విమర్శలకు దిగింది. కీలకమైన విషయాన్ని వదిలేసి.. సమాచారం చేరవేసే వారిపై చర్యలు తీసుకున్నారని కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి రణ్‌దీప్‌సింగ్ సూర్జేవాలా విమర్శించారు. యూఐడీఏఐ కేసు పెట్టడాన్ని అనాలోచిత చర్యగా పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రాల్లో లౌడ్ స్పీకర్లపై నిషేధం

15 లోగా తొలిగించాలి.. యోగి ఆదిత్యనాథ్ సర్కార్ నిర్ణయం

లక్నో, జనవరి 7: దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు తదితర ఆధ్యాత్మిక కేంద్రాల్లో అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లు వినియోగించరాదని ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. శబ్ధ కాలుష్యం నివారణకు అలహాబాద్ హైకోర్టు గత ఏడాది డిసెంబర్ 20న ఇచ్చిన ఆదేశాల ఆధారంగా ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు 10 పేజీల నోటును విడుదల చేసింది. దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు తదితర ప్రాంతాల్లో అనధికారికంగా ఏర్పాటు చేసిన లౌడ్ స్పీకర్లను తొలిగించేందుకు ఈ నెల 15ను గడువుగా పేర్కొన్నది. ఈ గడువులోగా తొలిగించకపోతే 20 నుంచి ప్రభుత్వమే రంగంలోకి దిగుతుంది. ఈ లోగా ఆయా సంస్థల నిర్వాహకులు లౌడ్ స్పీకర్ల ఏర్పాటుకు విధిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని యూపీ హోంశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ తెలిపారు. శబ్ద కాలుష్య నియంత్రణ చట్టాల ప్రకారం ఆధ్యాత్మిక కేంద్రాల్లో 10, బహిరంగ ప్రదేశాల్లో ఐదు డెసిబెల్స్‌కు మించి శబ్దం బయటకు వినిపించరాదు.

త్యాగరాజ ఉత్సవాల ప్రసారం నిలిపేస్తారా?

దూరదర్శన్‌పై రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ మండిపాటు



న్యూఢిల్లీ, జనవరి 7: తమిళనాడులోని తంజావూర్‌లో త్యాగరాజ ఆరాధనోత్సవాల ప్రత్యక్ష ప్రసారాలను దూరదర్శన్ (డీడీ) అర్థంతరంగా నిలిపేయడం పట్ల రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఆరో తేదీ వరకు జరిగిన త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో ప్రత్యక్ష ప్రసారాన్ని కేవలం వాణిజ్య ప్రకటన కోసం నిలిపేశామని 'డీడీ' అధికారులు పేర్కొనడం అనాలోచితం, మందబుద్ధికి నిదర్శనమని ట్వీట్ చేశారు. దీనికి సమాధానమిచ్చిన ప్రసారభారతి సీఈవో శశిశంకర్ వెంపటి ఈ ఘటన దురదృష్టకరమని, దీనికి కారకులైన వారిని కఠినంగా శిక్షిస్తామని పేర్కొన్నారు. అంతకుముందు ఆమె 'సంప్రదాయ త్యాగరాజ సంగీత కీర్తనలను ప్రత్యక్ష ప్రసారం చేసినందుకు డీడీ నేషనల్ చానెల్‌కు ధన్యవాదాలు. ప్రతియేటా జరిగే ఈ ఉత్సవాలు సంగీత ప్రేమికుల్లో పునరుత్తేజం కలిగిస్తాయి' అని ఉత్సాహంగా ట్వీట్ చేశారు. కానీ డీడీ చానెల్ వాణిజ్య ప్రకటన కోసం అర్ధంతరంగా ప్రత్యక్ష ప్రసారాలను నిలిపివేయడంతో ఆమెలోని ఉత్సాహం ఆగ్రహంగా మారింది. 'త్యాగరాజ కీర్తనల్లో 'పంచరత్న కీర్తి' పూర్తయ్యేవరకు మీరు వాణిజ్య ప్రకటనలు, ఇతర అంశాల కోసం కొన్ని నిమిషాలు ఆగలేరా?' అని మండి పడ్డారు.

వెనుకకు పిలిచినట్టే పిలిచి!

పాక్‌లో పాలస్తీనా రాయబారి వాలిద్‌కు మళ్లీ బాధ్యతలు

న్యూఢిల్లీ: 26/11 ముంబై ఉగ్రదాడుల సూత్రధారి హఫీజ్ సయీద్‌తో వేదికను పంచుకున్న తమ రాయబారి వాలిద్ అబూఅలీని వెనుకకు పిలిచిన పాలస్తీనా.. కొద్దిరోజుల్లోనే తన నిర్ణయాన్ని మార్చుకున్నది. వాలిద్ అబూఅలీని మళ్లీ పాకిస్థాన్‌లో రాయబారిగా కొనసాగిస్తూ పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ నిర్ణయం తీసుకున్నట్టు పాకిస్థాన్ ఉలేమా కౌన్సిల్ (పీయూసీ) చైర్మన్ మౌలానా అష్రఫీ వెల్లడించారు. ఈ మేరకు పాకిస్థాన్‌కు చెందిన జియో న్యూస్ కథనాన్ని ప్రసారం చేసింది. ఈ సందర్భంగా మౌలానా అష్రఫీ మాట్లాడుతూ వాలిద్ అలీ బుధవారం పాకిస్థాన్‌కు వచ్చి బాధ్యతలను చేపడుతారని పేర్కొన్నారు.




తెలంగాణ సేవా భారతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 'రన్ ఫర్ చైల్డ్' ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. ఇందులో భాగం గా నిర్వహించిన 2కే, 10కే, 21కే రన్‌ను కేంద్ర పర్యాటకశాఖ మంత్రి మహేశ్‌శర్మ, రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ రన్‌లో దాదాపు ఏడువేల మంది పాల్గొన్నారు.

గాంధీలో మరిన్ని సూపర్ స్పెషాలిటీ విభాగాలు

దవాఖాన మరింత బలోపేతానికి అధికారుల కసరత్తు



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల్లో ఉస్మానియా తర్వాత రెండో అతిపెద్ద సూపర్‌స్పెషాలిటీ దవాఖానగా పేరున్న గాంధీని మరింత బలోపేతం చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా మరిన్ని సూపర్‌స్పెషాలిటీ విభాగాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ కిడ్నీ, గుండె, గ్యాస్ట్రో, ఆర్థో తదితర విభాగాలు పనిచేస్తున్నాయి. కిడ్నీ, మోకాళ్ల మార్పిడి తదితర శస్త్రచికిత్సలు గాంధీలో జరుగుతుండగా, కాలేయ మార్పిడి వంటి శస్త్రచికిత్సలను సైతం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ప్రస్తుతం ఈ శస్త్రచికిత్సలు ఉస్మానియాలో పెద్ద ఎత్తున జరుగుతున్న విషయం తెలిసిందే. ఉస్మానియాలోని కాలేయ మార్పిడి విభాగాన్ని గాంధీకి తరలించి, అన్ని రకాల అవయవమార్పిడుల విభాగాలను ఒకేచోట ఏర్పాటు చేసే దిశగా అధికారులు యోచిస్తున్నారు. ప్రస్తుతం గాంధీలో నిత్యం దాదాపు 3,000 ఓపీ కేసులు నమోదవుతుండగా, 2,000 మంది ఐపీ రోగులు చికిత్స పొందుతున్నారు. ఎక్కువగా దీర్ఘకాలిక వ్యాధులైన కిడ్నీ, గుండె తదితర సమస్యలతోపాటు జనరల్ మెడిసిన్ కోసం రోగులు అధికంగా గాంధీని ఆశ్రయిస్తుంటారు. ఇవికాకుండా రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాల్లో గాయపడిన వారు ఆర్థోవిభాగానికి ఎక్కువగా వస్తుంటారు. ప్రస్తుతం 65 పడకల సామర్థ్యం గల ప్రత్యేక ఐసీయూ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో అత్యవసర సేవలు మరింత మెరుగుపడ్డాయి. అత్యాధునిక వైద్యపరికరాలు, అన్ని రకాల మౌలిక సదుపాయాలను సమకూర్చడంతోపాటు సిబ్బంది కొరత లేకుండా చూడటంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్టు వైద్యులు వివరించారు. మరిన్ని సూపర్‌స్పెషాలిటీ విభాగాలు ఏర్పాటైతే దవాఖాన అన్ని విధాలా బలోపేతమవుతుందని వైద్యులు భావిస్తున్నారు.

తాగుబోతు బీభత్సం

- జూబ్లీహిల్స్‌లో ప్రాణం తీసిన డ్రంక్ అండ్ డ్రైవ్
- అతివేగంతో స్కూటీని ఢీకొట్టిన కారు
- మహిళ మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు



మస్తానీ మృతదేహం, దవాఖానలో చికిత్స పొందుతున్న అనుష, తలకు తీవ్రగాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన ప్రియ(ఫైల్)

హైదరాబాద్ సిటీబ్యూరో/బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: డ్రంక్ అండ్ డ్రైవ్‌కు మరో ప్రాణం బలైంది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఓ తాగుబోతు మద్యం మత్తులో కారును మితిమీరిన వేగంతో నడుపుతూ రోడ్డుపై వెళ్తున్న స్కూటీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పంజాగుట్టలో నివాసం ఉంటున్న పాల విష్ణువర్ధన్(35) హిమాయత్‌నగర్‌లో 'బ్రైట్ స్పార్క్' పేరుతో ప్లే స్కూల్ నడుపుతున్నాడు. అతడి భార్య పంజాగుట్టలోని ఏషియన్ గ్యాస్ట్రో ఎంట్రాలజీలో వైద్యురాలిగా పనిచేస్తున్నది. విష్ణువర్ధన్ శనివారం రాత్రి మాదాపూర్‌లోని స్నేహితుడి ఇంట్లో మద్యం తాగాడు. తాగిన మైకంలోనే అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో కారులో ఇంటికి బయలుదేరాడు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-36 మీదుగా రోడ్ నంబర్-10లోకి ప్రవేశించాడు. డైమండ్ హౌస్ దాటిన తర్వాత మితిమీరిన వేగంతో కారును నడుపుతూ రోడ్డుపై వెళ్తున్న స్కూటీని వెనుక వైపు నుంచి ఢీకొట్టాడు. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న అనూషారెడ్డి అలియాస్ ప్రియ, మస్తానీ, అనూష చెల్లాచెదురుగా పడిపోయారు. తలకు తీవ్రగాయాలు కావడంతో మస్తానీ(35) అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటీ నడుపుతున్న ప్రియ(30) తలకు తీవ్రగాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లగా, మరో యువతి అనూష(19)కు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 వాహనంలో జూబ్లీహిల్స్‌లోని అపోలో దవాఖానకు తరలించారు. ప్రియ పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు తెలిపారు.



ప్రమాదంలో ధ్వంసమైనస్కూటీ

పారిపోతూ డివైడర్‌కు ఢీకొట్టాడు..

ప్రమాదం జరిగిన తర్వాత విష్ణువర్ధన్ పరారయ్యేందుకు ప్రయత్నించాడు. ఓవైపు తాగిన మైకం, మరోవైపు పోలీసులు పట్టుకుంటారనే భయంతో మరింత వేగంగా దూసుకెళ్లాడు. అరకిలోమీటర్ తర్వాత అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. పెట్రోలింగ్ పోలీసులు విష్ణువర్ధన్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతడికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా రీడింగ్ 206 వచ్చింది. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దోస్తును పికప్ చేసుకునేందుకు వెళ్లి..

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన మస్తానీ రెండేండ్ల కిందట హైదరాబాద్‌కు వచ్చింది. ఆమె భర్త తాడేపల్లిగూడెంలో ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేస్తున్నారు. మస్తానీ ప్రస్తుతం యూసుఫ్‌గూడలోని ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నది. అదే ఇంట్లో ఉంటున్న ప్రియ జూనియర్ ఆర్టిస్టుగా పని చేస్తున్నది. వారి స్నేహితురాలు అనూష రెండు రోజుల కిందట రాజమండ్రి నుంచి వచ్చి కూకట్‌పల్లిలోని స్నేహితురాలి ఇంటి వద్ద ఉన్నది. ఆమెను తీసుకురావడానికి మస్తానీ, ప్రియ కలిసి స్కూటీపై వెళ్లారు. ముగ్గురూ కలిసి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

10 నిమిషాల ముందు వరకు తనిఖీలు..

ప్రమాదం జరిగిన ప్రాంతానికి దగ్గర్లోనే రోడ్ నం-10లో శనివారం రాత్రి 11 నుంచి ఒంటి గంట వరకు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. అర్ధరాత్రి తర్వాత జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ ప్రాంతంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌తోపాటు బైక్ రేస్‌లు ఎక్కువగా జరుగుతాయనే ఉద్దేశంతో పోలీసులు తనిఖీలను చెక్‌పోస్ట్ ప్రాంతానికి మార్చారు. ఆ తర్వాత పది నిమిషాలకే విష్ణువర్ధన్ అతివేగంగా కారు నడుపుతూ స్కూటీని ఢీకొట్టాడు. తనిఖీలు మరో 10 నిమిషాలు కొనసాగి ఉంటే విష్ణువర్ధన్ ముందే పోలీసులకు చిక్కేవాడని, ప్రమాదం తప్పేదని చెప్తున్నారు.

ఔటర్‌పై ధగధగలు!

- గచ్చిబౌలి-శంషాబాద్ మార్గంలో ఎల్‌ఈడీ లైట్ల పథకం సక్సెస్
- ఇక రింగ్‌రోడ్డు మొత్తం ఏర్పాటుకు హెచ్‌ఎండీఏ ఏర్పాట్లు
- రూ.130 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు
- జైకా నిధులతో చేపట్టేందుకు సన్నద్ధం
- 25న టెండర్లకు ఆహ్వానం



గచ్చిబౌలి-శంషాబాద్ మార్గంలో ఎల్ ఈడీ వెలుగులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర రాజధాని మణిహారమైన ఔటర్ రింగ్ రోడ్డులోని 158 కిలోమీటర్ల మార్గం దేదీప్యమానం కానున్నది. రూ.30 కోట్ల జైకా నిధులతో గచ్చిబౌలి-శంషాబాద్ 22 కిలోమీటర్ల మార్గంలో 8 లేన్ల మెయిన్ కారిడార్‌లోని సెంట్రల్ మీడియన్‌లో ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటును ప్రయోగాత్మకంగా చేపట్టారు. నగరం నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని తొలుత ఈ మార్గాన్ని ఎంపిక చేసి ఎల్‌ఈడీ వెలుగులను అందుబాటులోకి తెచ్చారు. ఈ మార్గంలో ఎల్‌ఈడీ వెలుగుల్లో ప్రయాణాన్ని ప్రజలు అస్వాదిస్తుండటం, అన్ని వర్గాల నుంచి అనూహ్యస్పందన లభించడం, ఇదే సమయంలో సంస్థకు నిర్వహణ భారం (కరెంట్ బిల్లు) తగ్గడంతో ఔటర్‌లో మిగిలిన 136 కిలోమీటర్ల మేర ఎల్‌ఈడీ వెలుగులు నింపాలని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి కే తారక రామారావు ఇటీవల హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఎల్‌ఈడీ లైట్ల బిగింపునకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ఈ 136 కిలోమీటర్ల మేర ఎల్‌ఈడీ లైట్ల బిగింపు ప్రాజెక్టుకు అయ్యే వ్యయాన్ని 'జైకా' నుంచి తీసుకోవాలని నిర్ణయించారు. ఈ నెల 25న టెండర్లు పిలించేందుకు సిద్ధమైనట్టు ఔటర్ విభాగం ముఖ్య అధికారి ఆనంద్ మోహన్ తెలిపారు.

నిర్వహణ ఖర్చు 50శాతం ఆదా

158 కిలోమీటర్ల ఔటర్ మార్గంలో కండ్లకోయ జంక్షన్ 1.1కి.మీలు మినహా 156.9 కిలోమీటర్ల మేర రహదారి అందుబాటులోకి వచ్చింది. వివిధ జాతీయ రహదారులను కలుపుతూ ఔటర్ ఏర్పాటుకావడంతో నిత్యం 80 లక్షలకుపైగా వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. ఔటర్‌లో జరిగే ప్రమాదాలకు రాత్రి సమయాల్లో సరైన వెలుతురు లేకపోవడము కూడా ఓ ప్రధాన కారణమని గుర్తించారు. ధగధగలాడే కాంతుల నడుమ ప్రయాణం ఉండాలని హెచ్‌ఎండీఏ అధికారులు ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటుకు నిర్ణయించారు. నగరం నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని తొలుత గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వరకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ మేరకు ప్రయోగాత్మకంగా రూ.30 కోట్ల జైకా నిధులతో ఈ 22 కి.మీ మార్గంలో 8 లేన్ల మెయిన్ కారిడార్‌లో సెంట్రల్ మీడియన్‌లో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు పనులను పిలిప్స్ కంపెనీ చేపట్టగా, గత వేసవి నుంచి ఎల్‌ఈడీ లైట్ల నిర్వహణ చేపడుతున్నది. ఐదేండ్లపాటు నిర్వహణ బాధ్యతలు సైతం ఈ కంపెనీ తీసుకున్నది. గడిచిన జూన్‌లో ఈ మార్గంలో ఎల్‌ఈడీ అందుబాటులోకి రాగా, గతంతో పోల్చితే నెలకు దాదాపు రూ.15.45 లక్షలు, 2,11,725 యూనిట్ల విద్యుత్ ఆదా అవుతున్నదని అధికారులు తేల్చారు. ఇదే సమయంలో ప్రయాణికుల నుంచి మంచి స్పందన వస్తున్నది. దీంతో నిర్వహణ ఖర్చు 50శాతం మేర ఆదా అవుతున్నదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పూర్తిస్థాయిలో ఎల్‌ఈడీ పథకాన్ని చేపట్టాలని ఇటీవల మంత్రి కేటీఆర్ హెచ్‌ఎండీఏను ఆదేశించిన దరిమిలా ఈ ఏర్పాటు ప్రక్రియకు దాదాపు రూ.130 కోట్ల మేర వ్యయం కానున్నదని అంచనా వేశారు. ఇందుకు మరోసారి జైకా సహాయాన్ని కోరగా, సదరు సంస్థ నుంచి సానుకూల స్పందన రావడంతో టెండర్ల వైపు చర్యలు చేపట్టారు.

ఎల్ ఈడీ లైట్లతో ప్రయోజనాలు

- పర్యావరణహిత పరిజ్ఞానం
- తక్కువ విద్యుత్ వినియోగం
- ఇతర విద్యుత్ లైట్లతో పోల్చితే 50శాతం విద్యుత్ ఆదా
- జీఎస్‌ఎం ఆటోమెటిక్ సిస్టం ద్వారా ఎక్కడి నుంచైనా పర్యవేక్షించే అవకాశం




చాకలి పోరు గర్జన బహిరంగ సభ వేదికపై అభివాదం చేస్తున్న నేతలు.. సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

- చాకలి ఎస్సీ సాధన సమితి సభలో వక్తలు

ఆర్కేపురం: చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ చాకలి ఎస్సీ సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం మైదానంలో చాకలి పోరు గర్జన బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రజకులు కలిసికట్టుగా ఉండి ఉద్యమిస్తేనే లక్ష్యం నెరవేరుతుందన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ సాధన సమితీ రాష్ట్ర కన్వీనర్ కొత్తకొండ శ్రీలక్ష్మి మాట్లాడుతూ రజకులు ఆర్థికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగాల్లో రాణించాలంటే ఎస్సీ జాబితాలో చేర్చాల్సిందేనని ప్రభుత్వాన్ని కోరారు. ఈ వేదిక ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకం కాదని, తమ డిమాండ్‌ను ప్రభుత్వానికి తెలియజేసేందుకే ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు. బీహార్ మాజీ మంత్రి శ్యాంరజక్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రజకుల మనోభావాలను గౌరవించి, వారిని ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు. ఈ సభలో మాజీ మంత్రి బస్వరాజు సారయ్య, నాయకులు భీమవరపు సుబ్బారావు, వీ చంద్రశేఖర్, అమిత్ ఖత్రీగ, రాఘవేంద్ర దశరథ్, సుంకటి పోశెట్టి, ముదిగొండ వెంకటప్పయ్య, రాయల శ్రీనివాస్, దత్తు, రవి తదితరులు పాల్గొన్నారు.



పోరు గర్జనకు హాజరైన చాకలి కులస్తులు

సర్వేక్షణ్-2018లో భాగస్వాములుకండి

హైదరాబాద్‌వాసులకు మంత్రి కేటీఆర్ పిలుపు



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సర్వేక్షణ్-2018లో గ్రేటర్ హైదరాబాద్ ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ఆదివారం ట్విట్టర్ ద్వారా పిలుపునిచ్చారు. నగరవాసులు రెండు పద్ధతుల్లో తమ స్పందనలు తెలియజేయాలని కోరారు. 1969 నంబర్‌కు డయల్ చేస్తే ఐవీఆర్‌ఎస్ ద్వారా వచ్చే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని లేదా swachhsurvekshan2018.org వెబ్‌సైట్‌లో పొందుపరిచిన వివరాలను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

నాలుగు నెలలుగా నరకం అనుభవిస్తున్నా

- అభిమానులను పవన్‌కల్యాణ్ నియంత్రించడం లేదు
- నా ప్రశ్నలకు పూనమ్ సమాధానమివ్వాలి: కత్తి మహేశ్



బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కత్తి మహేశ్

ఖైరతాబాద్: పవన్‌కల్యాణ్ అభిమానులు తనపై వ్యక్తిగత, సామాజిక దాడులు చేస్తున్నారని, నాలుగు నెలలుగా నరకం అనుభవిస్తున్నానని సినీ విమర్శకుడు కత్తి మహేశ్ పేర్కొన్నారు. సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో చర్చకు రావాల్సిందిగా పవన్‌కు సవాల్ విసిరిన నేపథ్యంలో కత్తి మహేశ్ ఆదివారం ప్రెస్‌క్లబ్‌కు వచ్చారు. అప్పటికే అక్కడికి చేరుకున్న పలువురు పవన్ అభిమానులు నినాదాలు చేస్తూ దూసుకురావడంతో ఉద్రిక్తత నెలకొన్నది. పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. అనంతరం కత్తి మహేశ్ మీడియాతో మాట్లాడారు. పవన్ అభిమానులు సోషల్ మీడియా, వెబ్‌సైట్లలో తనపై, తన కుటుంబంపై తప్పుడు రాతలతో సామాజిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. అయినా పవన్ వారిని నియంత్రించడం లేదని, అభిమానులనే నియంత్రించలేని వ్యక్తి రాష్ట్రాన్ని ఎలా ఏలుతాడని ప్రశ్నించారు. తాను సంధించిన పది ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం రాలేదన్నారు.

పూనమ్‌కౌర్‌కు ఆరు ప్రశ్నలు

నటి పూనమ్ కౌర్‌ను ఆరు ప్రశ్నలు అడుగుతున్నానని, వాటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వీటికి సంబంధించిన పూర్తి ఆధారాలు ఉన్నాయని, అవసరమైన సందర్భాల్లో బయట పెడుతానని చెప్పారు.

- ఎవరి రికమండేషన్‌తో ఏపీ చేనేత బ్రాండ్ అంబాసిడర్ హోదా వచ్చింది?
- తిరుమలలో పవన్‌తో కలిసి ఒకే గోత్రంతో పూజ చేసింది నిజం కాదా?
- పవన్ మోసం చేశాడని ఆత్మహత్యాయత్నం చేసుకున్నది నిజం కాదా? అప్పుడు కాపాడింది ఎవరు? దవాఖాన బిల్లు ఎవరు కట్టారు?
- పవన్ మీ అమ్మను కలిసి చెవిలో ఏం హామీ ఇచ్చారు?
- దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ అంటే మీకు ఎందుకు అంత కోపం?
- క్షుద్ర మాంత్రికుడు నర్సింగ్‌తో ఎందుకు క్షుద్రపూజలు చేయించారు?

నా వెనుక ఏ రాజకీయ పార్టీ లేదు

తన వెనుక ఏ రాజకీయ పార్టీ లేదని, మీడియా నుంచి డబ్బు వస్తున్నదని ఆరోపించడం తగదన్నారు. చంద్రబాబుపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలను అప్పుడే ఖండించానన్నారు. పవన్ మాజీ భార్య రేణు దేశాయిపై కూడా పవన్ ఫ్యాన్స్ సామాజిక దాడికి దిగడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వంపై నమ్మకం ఉన్నదని, తన భద్రత చూసుకుంటుందన్నారు.

నేటి నుంచి సౌత్ ఇండియా సైన్స్ ఫేర్

- సికింద్రాబాద్ సెయింట్ ప్యాట్రిక్స్ పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి
- పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారులు



సెయింట్ ప్యాట్రిక్స్ పాఠశాలలో విద్యాశాఖ అధికారులకు, ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఉన్నతాధికారులు

మారేడ్‌పల్లి: సికింద్రాబాద్ సెయింట్ ప్యాట్రిక్స్ స్కూల్‌లో సోమవారం నుంచి జరుగనున్న సౌత్ ఇండియా సైన్స్ ఫేర్-2018కు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పా ట్లు చేశారు. ఈ నెల 12వ తేదీ వరకు జరుగనున్న ఈ సైన్స్ ఫేర్‌కు తెలంగాణతోపాటు తమిళనాడు, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి, ఆంధ్రప్రదేశ్ నుంచి 300 మంది విద్యార్థులు, 300 ప్రాజెక్టులు, 300 మంది టీచర్లు పాల్గొంటారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఐదు రోజులపాటు బాలికలకు సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలో, బాలురకు సెయింట్ మేరీస్ పాఠశాలలో వసతి ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు భోజన వసతిని రెజిమెంటల్ బజార్‌లోని ఎస్పీజీ స్కూల్‌లో ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి సైన్స్ ఫేర్‌కు వచ్చే బస్సులకు సికింద్రాబాద్ కీస్ హైస్కూల్ మైదానంలో పార్కింగ్ ఏర్పాటు చేయగా, బైక్ పార్కింగ్ కోసం సెవెంత్ డే పాఠశాల మైదానంలో ఏర్పాట్లు చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్వాహణ, పారిశుద్ధ్యం, తాత్కాలిక టాయిలెట్లతోపాటు తాగునీటి వసతిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, టీ పద్మారావు, నగర మేయర్ బొంతు రామ్మోహన్, ఎంపీలు కే కేశవరావు, బండారు దత్తాత్రేయా, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, స్థానిక కార్పొరేటర్ ఆకుల రూప, విద్యాశాఖ చీఫ్ సెక్రటరీ రంజీవ్ ఆర్ ఆచార్య, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జీ కిషన్, అడిషనల్ సెక్రటరీ ఆఫ్ ఎడ్యుకేషనల్ టీ విజయ్‌కుమార్, హైదరాబాద్ కలెక్టర్ యోగితారాణా, డైరెక్టర్ ఎస్సీఈఆర్టీ శేషుకుమారి, డైరెక్టర్ వీఐటీఎం మదన్ గోపాల్, రీజినల్ జేడీ విజయలక్ష్మీబాయి, హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొననున్నారు.

వెరిఫికేషన్ 'వెరీఫాస్ట్'

- పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో సిటీ పోలీసులు భేష్
- మూడేండ్లుగా మొదటి స్థానం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి తక్కువ సమయంలో దరఖాస్తుదారుడికి పాస్‌పోర్ట్ అందించడంలో తెలంగాణ పోలీసులు వరుసగా మూడో ఏడాది మొదటి స్థానంలో నిలిచారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం దరఖాస్తుదారుడికి పాస్‌పోర్ట్ అందాలంటే కనీసం 21 రోజులు పడుతున్నది. ఈ పరిమితిని హైదరాబాద్ పోలీసులు మూడేండ్ల కిందటే దాటేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నాలుగు రోజుల్లోనే వెరిఫికేషన్ పూర్తి చేస్తున్నారు. దీంతో అతి తక్కువ కాలంలో దరఖాస్తుదారుడి చేతికి పాస్‌పోర్ట్ చేరుతున్నది.

యాప్‌తో పెరిగిన వేగం

పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ కోసం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు వెరిఫాస్ట్ మొబైల్ యాప్‌ను వినియోగిస్తున్నారు. 2015 మే నెలలో ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు దీనిని ఉపయోగిస్తున్నారు. ఈ యాప్ హైదరాబాద్ కాప్ మొబైల్ యాప్, సీసీటీఎన్‌ఎస్, రవాణా, జీహెచ్‌ఎంసీ, ఎన్నికల కమిషన్ తదితర విభాగాలతో అనుసంధానమై ఉంటుంది. దరఖాస్తుదారుడికి సంబంధించిన సమాచారాన్ని ఆయా శాఖలకు చెందిన డాటాబేస్ నుంచి సేకరించడంతో వెరిఫికేషన్ చాలా సులభంగా మారింది. మరోవైపు సిబ్బంది పారదర్శకంగా వెరిఫికేషన్ చేస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. గత ఏడాది హైదరాబాద్ నగర పోలీసులు 1.35 లక్షల దరఖాస్తుల వెరిఫికేషన్లను పూర్తి చేశారు. దాదాపు 95 శాతం వరకు మూడు రోజుల లోపే వెరిఫికేషన్ పూర్తవుతున్నది. ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే నాలుగు రోజుల సమయం పడుతున్నది. ఈ విధంగా వేగంగా సేవలు అందిస్తున్న తెలంగాణ పోలీసులకు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అవార్డు అందించింది. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో మూడేండ్లుగా హైదరాబాద్ దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నది.

పారదర్శకతకు పెద్దపీట

వెరిఫికేషన్‌లో భాగంగా పోలీసులు దరఖాస్తుదారుడికి సమాచారం ఇచ్చి, ఏయే సర్టిఫికెట్లను సిద్ధంగా ఉంచుకోవాలో సూచిస్తున్నారు. సిబ్బంది వచ్చి వెళ్లిన తర్వాత వారు ఎలా మాట్లాడారు? డబ్బులు అడిగారా? ప్రవర్తన ఎలా ఉన్నది? తదితర విషయాలపై కమిషనరేట్ కార్యాలయంలోని 'సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్' నుంచి ఆరా తీస్తున్నారు. సమాచారం ఆధారంగా సిబ్బందికి మార్కులు వేస్తున్నారు. బాగా పనిచేసిన వారికి ప్రతి నెల ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. తద్వారా ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందుతున్నాయి.

శంషాబాద్‌కు నాలుగు విమానాల మళ్లింపు

శంషాబాద్: ఉత్తర భారత దేశంలో వాతావరణం అనుకూలంగా లేనికారణంగా ఆదివారం ఉదయం నాలుగు అంతర్జాతీయ విమానాలను శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు. జెడ్డా-లక్నో, సౌది ఆరేబియా-ఢిల్లీ, దుబాయ్-బంగ్లాదేశ్, సింగాపూర్-ఢిల్లీ విమానాలను హైదరాబాద్‌కు మళ్లించారు. రెండు మూడు రోజులుగా ఉత్తర భారతదేశంలో పొగమంచు దట్టంగా పరుచుకుంటున్నది. ఢిల్లీ నుంచి రావాల్సిన పలు విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi
హైదరాబాద్
సోమవారం 8 జనవరి 2018
WWW.NTNEWS.COM



నిరక్షరం నుంచి అక్షరమైన

ఆశా ఖేమ్కా

విద్య ప్రాథమిక హక్కు. కానీ, మన దేశంలో ఈ హక్కు చాలామందికి ఇంకా అందని ద్రాక్షగానే ఉంది. చదువుకునే అవకాశం లేక ఎందరో మట్టిలో మాణిక్యాలుగా మిగిలిపోతున్నారు. వారికే గనుక ఓ అవకాశం ఇచ్చి చూస్తే అద్భుతాలు సృష్టిస్తారనడం అతిశయోక్తి కాదేమో. మనదేశంలో ఇప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో ఆడపిల్లల చదువుపట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. కానీ పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలమని నేటి మహిళలు నిరూపిస్తున్నారు. పట్టుదల, నేర్చుకోవాలనే తపన ఒక భారతీయ మహిళను విదేశాల్లో ఎదిగేలా చేసింది. ఏడవ తరగతి మధ్యలో ఆపేసినా ఆమె బ్రిటన్‌లో ఉన్నత చదువులు చదువడమే కాకుండా 2017 సంవత్సరానికి గాను 'ఏషియన్ బిజినెస్ ఉమన్ ఆఫ్ ది ఇయర్'గా ఎదిగారు. ఎక్కడో బీహార్‌లోని మారుమూల ప్రాంతంలో పుట్టి పెరిగిన ఆశా ఖేమ్కా విద్యావేత్తగా ఎదిగిన తీరు స్ఫూర్తిదాయకం.

సక్సెస్ మంత్ర



ప్రిన్స్ చార్లెస్‌తో...



బిజినెస్ ఉమెన్ అవార్డు అందుకుంటూ...



బ్రిటీష్ ఎంపైర్ అవార్డు అందుకుంటూ...

బీహార్‌లోని చిన్న పట్టణమైన సీతామర్హిలో 1951 అక్టోబర్‌లో జన్మించిన ఆశా ఖేమ్కా పెళ్లితో దేశంకానీ దేశానికి పయనమై వెళ్లారు. కేవలం ఏడవ తరగతి చదువుతో ఎలాంటి ఇంగ్లిష్ పరిజ్ఞానం లేకుండా విమానం ఎక్కిన ఆమె అక్కడే ఉన్నత చదువులు చదివారు. అంతేకాదు నేడు వేలాది మంది బ్రిటీష్ విద్యార్థుల జీవితాల్ని మార్చే యజ్ఞంలో నిమగ్నమయ్యారు.

ప్రాథమిక విద్యతోనే ఫుల్‌స్టాప్

ఆశా పదమూడేళ్ల వరకే పాఠశాలకు వెళ్లారు. ఆ తర్వాత కుటుంబసభ్యులు ఆమె చదువు మాన్పించేశారు. ఆశాను పాఠశాలకు వెళ్లకుండా కట్టడి చేసిన కుటుంబసభ్యులు, ఆ తర్వాత 15 ఏళ్ల వయస్సులో ఓ డాక్టర్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. ముగ్గురు పిల్లలు పుట్టాక, ఆమె 25 ఏళ్ల వయస్సులో భర్త లండన్‌లో ఉద్యోగం వెతుక్కున్నాడు. ఆయనతోపాటు ఆశా కూడా 1978లో పిల్లల్ని తీసుకొని బయల్దేరారు.

పట్టుదలకు పదునుపెట్టి

లండన్ వెళ్లిన తొలినాళ్లలో నానా పాట్లూ పడ్డారు. ఇంగ్లిషు రాదు. చుట్టుపక్కలవాళ్లు ఏం మాట్లాడుతున్నారో అర్థమయ్యేది కాదు. అలాంటి దశలో పట్టుదలతో టీవీ షోలు చూసి ఇంగ్లిషు నేర్చుకున్నారు. తనలాంటి ఇతర గృహిణులతో వచ్చీరాని ఇంగ్లిషులో మాట్లాడుతూ తన భాషకు పదును పెట్టుకున్నారు. ఓ వైపు ఇంటిని చూసుకుంటూ, పిల్లల్ని సముదాయించుకుంటూనే కార్డిఫ్ యూనివర్శిటీలో చేరి, బిజినెస్‌లో డిగ్రీ పట్టా తీసుకున్నారు.

అంచెలంచెలుగా ఎదిగి..

బిజినెస్‌లో డిగ్రీ పూర్తిచేసిన ఆశా అంతటితో ముగించలేదు. 2006లో మొదట ట్యూటర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత వెస్ట్ నాటింగ్‌హమ్షైర్ కాలేజీలో లెక్చరర్‌గా చేరారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రిన్సిపాల్‌గా ఎంపికయ్యారు. ఆ తర్వాత అదే కాలేజీకి సీఈఓ కూడా అయ్యారు.

కుటుంబం

ఆశా భర్త శంకర్‌లాల్ ఖేమ్కా పాట్న సంతతికి చెందినవాడు. ఆయన 1975లో పాట్న మెడికల్ కాలేజీ నుంచి వైద్యశాస్త్రం పూర్తి చేశాడు. ఆయన కీళ్ల శాస్త్రవైద్యుడు. విద్యాభ్యాసం అవ్వగానే నేషనల్ హెల్త్‌సర్వీస్‌లో చేరి సేవలందించారు. ఆ తర్వాత లండన్ వెళ్లాల్సి వచ్చింది. వారికి ముగ్గురు పిల్లలు షాలిని, కుమారులు షీల్, స్నే.

బాధ్యతను పెంచిన అవార్డులు

విద్యారంగంలో ఆశా చేసిన కృషికిగాను 2013లో బ్రిటన్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'డేమ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్' అవార్డు వరించింది. ఆశా యుకెలో ఈ అవార్డును దక్కించుకున్న రెండవ ప్రవాస భారతీయురాలు కావడం విశేషం. భారతీయ మహిళ ఆశా ఖేమ్కాకు బ్రిటీష్ రాజకుటుంబం చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం విశేషం. విశిష్ట సామాజిక సేవలను అందిస్తున్నందుకు గాను ఆమెకు ఈ అవార్డు దక్కింది. బ్రిటన్ రాణి, రాజు స్వహస్తాలతో ఈ టైటిల్ అందుకున్న రెండో భారతీయ మహిళ ఆశాఖే మ్కా. ఇంతకు ముందు 1931లో ధార్ మహారాణి లక్ష్మీదేవి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. మగవాళ్లకు ఇచ్చేది 'నైట్ హుడ్' అయితే, ఆడవాళ్లకు ఇచ్చేది 'డేమ్ హుడ్'. డేమ్ కమాండర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ టైటిల్‌ను ఆశా ఖేమ్కా బకింగ్ హామ్ ప్యాలెస్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్స్ చార్లెస్ చేతుల మీదుగా అందుకున్నారు. ఇక తాజాగా 2017లో ఆమెను ఏషియన్ బిజినెస్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వరించింది. 30 ఏళ్లుగా బ్రిటన్‌లోనే నివసిస్తున్న ఆశా ఖేమ్కాకు బ్రిటన్ పౌరసత్వమూ లభించింది.

ఆశా ఖేమ్కా విద్యారంగంలో చేస్తున్న సేవలకుగాను పలు అవార్డులు అందుకున్నారు.

- ది నేషనల్ జ్యువెల్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ హెల్త్ కేర్ అండ్ ఎడ్యుకేషన్–2007
- ది ఏషియన్ ఉమెన్ ఆఫ్ ఎచీవ్‌మెంట్ అవార్డు–2008
- ది మిడ్‌ల్యాండ్ బిజినెస్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్ –2009
- ది ఎన్నారై వెల్ఫేర్ సొసైటీ ఆఫ్ ఇండియా గోల్డ్‌మెడల్ (విద్యారంగంలో కృషికి), నాన్ రెసిడెంట్ ఇండియన్ – 2010
- ఇన్స్‌ప్రేషనల్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్, డెర్బీషైర్ అండ్ నాటింగ్‌హమ్షైర్ చాంబర్ ఆఫ్ కామర్స్–2011
- బిజినెస్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ యాష్ఫీల్డ్ అండ్ మాన్స్‌ఫీల్డ్ చాడ్–2011

పుట్టిన గడ్డను మరువను

లండన్ వెళ్లినప్పటికీ తను పుట్టినగడ్డను ఎన్నటికీ మరువలేనంటున్న ఆశా, త్వరలో ఇండియాలోనూ విద్యాపరమైన సేవలు అందించేందుకు నడుం బిగిస్తున్నారు. దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో ఆశా 'ది ఇన్‌స్పైర్ అండ్ అచీవ్ ఫౌండేషన్' పేరుతో సామాజిక సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా తొలి ఏడాదిలోనే సుమారు 700 మందికి ఉద్యోగవకాశాలు కల్పించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. అలాగే దీనికి సంబంధించిన తొలి స్కిల్ సెంటర్‌ను చండీఘడ్‌లో ఏర్పాటు చేసి ఆన్‌లైన్ కోచింగ్ ద్వారా ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్‌లో శిక్షణ ఇవ్వాలనుకుంటున్నారు. తరువాత బీహార్‌లోనూ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

ఎందరికో స్ఫూర్తి

చదువుకునే అవకాశం లేక ఎందరో మట్టిలో మాణిక్యాలుగా మిగిలిపోతున్నారు. వారికే గనుక ఓ అవకాశం ఇచ్చి చూస్తే అద్భుతాలు సృష్టిస్తారనడానికి సజీవ తార్కాణం ఆశా ఖేమ్కా. కనీసం ఇంగ్లీషు రాయడం కూడా రాని ఆమె ఈ రోజు ఓ విద్యావేత్త. ఎందరికో జీవితాన్ని ఇచ్చిన ఆమె వారి జీవనగతినే మార్చేశారు.



అరుదైన కళాకారిణి

కళకు ధనిక, పేద అనే తేడా ఉండదు. కుల, మత భేదాలు అసలే ఉండవు. ఈ మాటను నిజం చేసి చూపించింది ఈ మహిళ.

రాజస్థాన్‌కు చెందిన తేజు బెహన్ కొన్నేళ్ల కిందటే భర్తతో కలిసి అహ్మదాబాద్‌కు వచ్చేసింది. అక్కడ రోజుకు ఐదు రూపాయల దినసరి కూలీ తీసుకొంటూ పనిచేసేది. కానీ 58 ఏళ్ల తేజు.. ఇప్పుడొక ప్రత్యేకమైన కళాకారిణి. సాధన, కృషి ఆమెను ఈ స్థాయికి తీసుకొచ్చాయి. దినసరికూలీగా పనిచేస్తున్నప్పుడే.. హకుషా అనే ఆర్టిస్టు దగ్గర పనికి చేరారు తేజు దంపతులు. ఆ ఆర్టిస్టు దగ్గర మెల్లిమెల్లిగా పెయింటింగ్‌లో పాఠాలు నేర్చుకొన్న తేజు.. భర్త ప్రోత్సాహంతో విభిన్నమైన బొమ్మలను అలవోకగా గీయడం అలవాటు చేసుకున్నది. ఆమెలో మంచి ఆర్టిస్టును గుర్తించిన వాళ్లిద్దరూ.. మరింత తర్ఫీదు పొందేలా ఉత్సాహాన్నిచ్చారు. నిజ జీవితంలో ఎదురయ్యే సంఘటనల నుంచి స్ఫూర్తి పొంది, అవి కళ్లకు కట్టినట్టు కనిపించేలా బొమ్మలు గీయడం నేర్చుకున్నదామె. ముఖ్యంగా జానపద కళల నేపథ్యాన్ని తెలిపే కళను ప్రత్యేకంగా నేర్చుకొని.. తనకు తాను ఒక నమ్మకాన్ని ఏర్పర్చుకొన్నది. ఆమె గీసిన ఆ అరుదైన ఆర్ట్స్.. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఫేమస్ అయ్యాయి. పలు చోట్ల ప్రదర్శనకూ ఉంచబడ్డాయి. అలా ఒక రోజు కూలీగా పనిచేసిన తేజు బెహన్ ఒక స్పెషల్ ఆర్టిస్టుగా ఇప్పుడు ప్రత్యేక గుర్తింపును పొందుతున్నది.



కొత్త క్యాంపెయిన్!

ఎంతమంది ఆడవాళ్లు భయపడకుండా రాత్రిపూట అడుగు బయట పెడుతున్నారు? దీనికి చరమగీతం పాడేందుకు 'సిట్ సేఫ్టీ గ్రిప్' పేరుతో కొత్త క్యాంపెయిన్ మొదలైంది.

70 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో రాత్రి ఆడవాళ్లు ఒంటరిగా ప్రయాణించలేకపోతున్నారు. ఆడవాళ్ల మీద జరిగే నేరాలు దశాబ్దకాలంలో రెండింతలయ్యాయి. వారిలో ధైర్యం కల్పించేందుకు, ఆత్మస్థైర్యం నింపడానికి ఎవరో ఒక మంచి ఆలోచనతో ముందుకొచ్చారు. ఇప్పటికే బ్యాగుల్లో పెప్పర్ స్ప్రేలు పెట్టుకొని తిరుగుతున్నారు అమ్మాయిలు. కానీ అది వెతికేసరికే పుణ్యకాలం కాస్త అయిపోతున్నది. అలా కాకుండా ఉండేందుకు బైక్ ముందే ఈ పెప్పర్ స్ప్రే హోల్డర్స్ తగిలించేలా ఏర్పాటు చేశారు. తమపై దాడి జరుగుతుందనేలోపే ఆ పెప్పర్ స్ప్రేతో తమను తాము రక్షించుకోవచ్చు. ఇది ప్రతి ఒక్కరూ తమ బండికి తగిలించుకోవాలని కోరుతూ క్యాంపెయిన్ చేపట్టారు. ఇప్పటికే ఈ క్యాంపెయిన్‌కి స్పందించి బండ్లకి ఈ హోల్డర్స్ బిగించేశారు.

అందమైన మోచేతుల కోసం..



అందం విషయంలో ఏ మాత్రం రాజీపడరు మహిళలు. చేతుల విషయంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంటారు. చాలా మందికి మోచేతి దగ్గర నల్లగా ఉండడంతో దాచే ప్రయత్నం చేస్తుంటారు. ఈ చిట్కాలు పాటించి నలుపునకు చెక్ చెప్పండి.

- ఒక స్పూన్ బియ్యం పిండిలో 4 స్పూన్ల రోజ్‌వాటర్ కలిపి.. మోచేతుల వద్ద రాయాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడుగాలి. రోజు రెండుసార్లు చేస్తే ఫలితం ఉంటుంది.
- తాజా బంగాళదుంప పేస్ట్ నుంచి రసం తీసుకొని మోచేతుల వద్ద రాయాలి. 20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడుగాలి. రోజులో మూడుసార్లు ఇలా చేయాలి.
- అర స్పూన్ బేకింగ్ సోడాకు స్పూన్ డిస్టిల్డ్ వాటర్ కలుపాలి. ఈ పేస్టును మోచేతులపై రాయాలి. 15 నిమిషాల తర్వాత శుభ్రం చేయాలి. ఇలా రోజుకు ఒకసారి చేయాలి.
- తాజా పెరుగును నలుపు ఉన్న ప్రాంతంలో రాసి 20 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజుకు మూడుసార్లు ప్రయత్నించొచ్చు.
- ఫ్రెష్ అలోవెర రెమ్మ నుంచి జెల్ తీసుకొని మోచేతులకు రాయాలి. అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో కడుగాలి.
- కొబ్బరి నూనెను రాత్రి పడుకునే ముందు మోచేతులకు రాయాలి. ఉదయం గోరువెచ్చని నీటితో కడిగితే నలుపు తగ్గుతుంది. తర్వాత లైట్ మాయిశ్చరైజర్ రాస్తే మంచిది.



గోళ్లతో సమస్యలు!

- గోళ్లను పెంచడం వల్ల చాలా నష్టాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.
- గోళ్లను కొరికితే క్రిములన్నీ సులభంగా శరీరంలోకి ప్రవేశిస్తాయి.
- బాగా పెరిగిన గోళ్లు ఉండడం వల్ల దురద పెట్టినప్పుడు గోకడంతో గాయమయ్యే ప్రమాదమున్నది.
- భోజనానికి ముందు ఎంత శుభ్రంగా గోళ్లను కడిగినా వాటిల్లో మురికి అలాగే ఉంటుంది.
- గోళ్లకు ఏదైనా దెబ్బ తగిలితే విపరీతమైన నొప్పి ఉంటుంది.
- స్నానానికి ముందు గోళ్లను కత్తిరించుకోవడం మంచిది.
- రాత్రివేళ్లలో గోళ్లు కత్తిరించకూడదు. ఎందుకంటే అవి కుచ్చుకొని రక్తస్రావమయ్యే ప్రమాదమున్నది.

అలర్జీ అంటున్నారు ఏం చెయ్యాలి?



మా పాప వయసు 5 సంవత్సరాలు. తరుచుగా జలుబు చేస్తున్నది. అప్పడప్పుడు దగ్గు కూడా ఉంటున్నది. డాక్టర్‌కు చూపించి మందులు వేసినా కొంత తగ్గి మళ్లీ ఎక్కువ అవుతున్నది. ఇలా తరుచుగా అనారోగ్యం కలుగడం వల్ల స్కూల్‌కు కూడా సరిగ్గా వెళ్లలేకపోతున్నది. అలర్జీ అంటే ఏమిటి? ఎందుకు వస్తుంది? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? పూర్తి వివరాలు తెలుపగలరు.

- ఎస్. నర్సింహులు, మామిడ

అడుగండి చెబుతా

శరీరంలోకి వ్యాధి కారకాలు ప్రవేశించినపుడు నిరోధక వ్యవస్థ స్పందించి శరీరానికి వ్యాధిని ఎదుర్కొనే శక్తిని సమకూరుస్తుంది. అయితే ఒక్కోసారి నిరోధక వ్యవస్థ అతిగా స్పందిస్తుంది. ఆలాంటి స్థితినే అలర్జీ అంటారు. ఇలా అలర్జీలు రావడానికి రకరకాల కారణాలు ఉండొచ్చు. అందరిలో ఒకే విధంగా కూడా ఉండకపోవచ్చు. సాధారణంగా పెంపుడు జంతువులు, బొద్దింకలు, దుమ్ము, ధూళీ, కొందరిలో కొన్ని రకాల ఆహార పదార్థాలు తీసుకోవడం కూడా అలర్జీకి కారణం కావచ్చు. ఇలా అలర్జీకి కారణమయ్యే వాటిని అలర్జన్స్ అంటారు. అలర్జీ వల్ల శరీరంలో అధికంగా యాంటీబాడీస్ ఉత్పత్తి అవుతాయి. రక్తంలో యాంటీబాడీస్ స్థాయి పెరిగిపోవడం వల్ల శ్వాసనాళాల వాపు రావడం, ముక్కు కారుతుండడం, తుమ్ములు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు, పొగతాగే వారి పరిసరాల్లో ఉండే పిల్లలు, వాయుకాలుష్యానికి ఎక్కువగా గురయ్యే పిల్లలు ఎక్కువగా అలర్జీల బారిన పడుతుంటారు.

తరుచుగా జలుబు, జ్వరం వస్తున్నా, ముక్కు దిబ్బడతో బాధ పడుతున్నా, చెవిలో ఇన్‌ఫెక్షన్లు వస్తున్నా ఆ పిల్లల్లో అలర్జీ సమస్య ఉన్నట్టు అనుమానించాల్సి ఉంటుంది. వీలైనంత త్వరగా చికిత్స ప్రారంభించడం వల్ల వాటిని ఎదుర్కొని సాధారణ జీవితం గడిపేందుకు అవకాశం ఏర్పడుతుంది. అలర్జీకి కారణమవుతున్న సందర్భాలను గుర్తించి వాటికి దూరంగా ఉండేట్టు చూసుకోవాలి. పిల్లలు ఉండే ఇంటి పరిసరాలు, ఇంట్లోనూ దుమ్ము, ధూళి చేరకుండా జాగ్రత్త పడాలి. మీ పాపకు వీలైనంత త్వరగా చికిత్స ప్రారంభించి ఆమె సమస్య తీవ్రతరం కాకుండా జాగ్రత్త పడడం అవసరం.



డాక్టర్ వై. గోపి కృష్ణ
సీనియర్ ఇంటర్‌వెన్షనల్ పల్మనాలజిస్ట్, యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్

సిరిముగ్గు

మా చిరునామా:

సిరి ముగ్గు,
నమస్తే తెలంగాణ,
8–2–603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నెం – 10,
హైదరాబాద్ – 500034.
zindagi@ntdaily.news
zindagi.nt@gmail.com



పారిజాత
మిర్యాల గూడ,
నల్లగొండ



12 చుక్కలు 4 వరుసలు..
8 చుక్కలు 2 వరుసలు
4 చుక్కలు 2 వరుసలు



27 చుక్కలు సందు
14 వచ్చే వరకు



కె. సునీత
ఎన్జీవోస్ కాలనీ
వనస్థలిపురం,
హైదరాబాద్

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 8 జనవరి 2018

ఫుట్‌వేర్ డిజైనింగ్ కోర్సులు

దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకమైన ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లలో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు: ఫుట్‌వేర్ డిజైన్ & డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) భారత ప్రభుత్వ సంస్థ. కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ పరిధిలో ఇది పనిచేస్తుంది. ఇది జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థ. దీనిలో కోర్సు పూర్తిచేసిన వారికి ఉద్యోగావకాశాలు పుష్కలంగా లభిస్తాయి.

- **డిగ్రీ కోర్సులు:** బ్యాచిలర్ ఆఫ్ డిజైనింగ్. ఇవి నాలుగేండ్ల కోర్సులు.
- బీ డిజైనింగ్ (ఫుట్‌వేర్ డిజైన్ & ప్రొడక్షన్)
- బీ డిజైనింగ్ (రిటైల్ & ఫ్యాషన్ మర్చండైజ్)
- బీ డిజైనింగ్ (లెదర్ గూడ్స్ & యాక్ససరీస్ డిజైన్)
- బీ డిజైనింగ్ (ఫ్యాషన్ డిజైనింగ్)
- **పీజీ ప్రోగ్రామ్స్:** ఇవి రెండేండ్ల కాలవ్యవధి కోర్సులు.
- ఎం.డిజైన్ (ఫుట్‌వేర్ డిజైన్ & ప్రొడక్షన్)
- ఎంబీఏ (రిటైల్ & ఫ్యాషన్ మర్చండైజ్)
- ఎం.డిజైన్ (క్యాడ్)
- **క్యాంపస్‌లు:** హైదరాబాద్, నోయిడా, రోహతక్, కోల్‌కతా, చెన్నై, పుర్సత్‌గంజ్ (లక్నో దగ్గర), జోధ్‌పూర్, గుణ, చింద్వారా, అంకలేశ్వర్ (గుజరాత్), చండీగఢ్, పాట్నా.
- **వెబ్‌సైట్:** www.fddindia.com



విశ్లేషణ

అంతర్జాతీయ సూచికలు - భారత్

సాంకేతిక విప్లవంతో ప్రపంచం కుగ్రామంగా మారిపోయిన ప్రస్తుత కాలంలో ఒక దేశంలో ఎలాంటి పరిస్థితులు ఏర్పడినా అది దాని పొరుగు దేశాలనే కాకుండా ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేస్తున్నది. అందుకే ప్రపంచంలోని అన్ని దేశాల్లో అభివృద్ధి, సంక్షేమం, ప్రజా భద్రత, మానవాభివృద్ధి తదితర అంశాలపై కొన్ని సంస్థలు ప్రతిఏటా అధ్యయనం చేసి ర్యాంకుల సూచికలను ప్రకటిస్తున్నాయి. ఈ సూచికలపై పోటీ పరీక్షల్లో క్రమం తప్పకుండా ప్రశ్నలు అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో 2017లో ప్రకటించిన వివిధ సూచికలు, వాటిలో భారత్ స్థానంపై ప్రత్యేక కథనం నిపుణ పాఠకుల కోసం..

ప్రపంచ మానవాభివృద్ధి సూచిక

- 188 దేశాలతో ఈ సూచికను యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (యూఎన్‌డీపీ) ప్రచురించింది.
- దీనిలో నార్వే, ఆస్ట్రేలియా, స్వీడన్, స్విట్జర్లాండ్ దేశాలు వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. డెన్మార్క్, సింగపూర్‌లు సంయుక్తంగా ఐదో స్థానంలో ఉన్నాయి.
- భారతదేశం 131వ స్థానంలో ఉంది. అంతకుముందు భారతదేశం 130వ స్థానంలో ఉంది.
- యూఎన్‌డీపీ ప్రధాన కార్యాలయం న్యూయార్క్‌లో ఉన్నది. దీనికి డైరెక్టర్ జనరల్‌గా అచిమ్ స్టీనర్ వ్యవహరిస్తున్నారు.

గ్లోబల్ కనెక్టివిటీ ఇండెక్స్

- 50 దేశాలతో ఈ సూచికను హువాయ్ అనే సమాచార, సాంకేతిక పరిజ్ఞాన సంస్థ రూపొందించింది.
- దీనిలో అమెరికా, సింగపూర్, స్వీడన్, స్విట్జర్లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) వరుసగా మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి.
- భారతదేశం 43వ స్థానంలో నిలిచింది. అంతకుముందు 44వ స్థానంలో ఉంది.
- హువాయ్ ప్రధాన కార్యాలయం చైనాలోని షెన్‌జెన్‌లో ఉంది. దీని ప్రస్తుత సీఈవో రెన్ జెంగ్‌ఫెయ్.

గ్లోబల్ కాంపిటీటివ్‌నెస్ ఇండెక్స్

- ఈ సూచికను 137 దేశాలతో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రచురించింది.
- దీనిలో మొదటి ఐదు స్థానాల్లో స్విట్జర్లాండ్, అమెరికా, సింగపూర్, నెదర్లాండ్స్, జర్మనీ నిలిచాయి.
- భారతదేశం 40వ స్థానంలో ఉంది. అంతకుముందు 39వ స్థానంలో ఉంది.
- వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్‌లోని కొలోగ్నిలో ఉంది.
- దీని వ్యవస్థాపకుడు, ప్రస్తుత సీఈవో క్లాస్ ష్వాబ్



ఎన్విరాన్‌మెంటల్ పెర్ఫామెన్స్ ఇండెక్స్

- ఈ సూచికను 180 దేశాలతో యేల్ యూనివర్సిటీ విడుదల చేసింది.
- 2016లో విడుదల చేసిన ఈ నివేదికను రెండేండ్లకోసారి వెల్లడిస్తారు.
- దీనిలో వరుసగా మొదటి ఐదు స్థానాల్లో ఫిన్లాండ్, ఐస్‌లాండ్, స్వీడన్, డెన్మార్క్, స్లొవేనియా నిలిచాయి.
- భారత్ 141వ స్థానంలో ఉన్నది. అంతకుముందు 155వ స్థానంలో ఉంది.
- 1701లో స్థాపించిన యేల్ యూనివర్సిటీ అమెరికాలోని న్యూ హెవెన్‌లో ఉంది.

మిలిటరీ ఎక్స్‌పెండిచర్

- 186 దేశాలతో ఈ నివేదికను స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసింది.
- దీనిలో వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో అమెరికా, చైనా, రష్యా, సౌదీ అరేబియాలు ఉన్నాయి.
- భారత్ 5వ స్థానంలో ఉన్నది.

ఎకనామిక్ ఫ్రీడమ్ ఇండెక్స్

- ఈ సూచికను 186 దేశాలతో ది హెరిటేజ్ ఫౌండేషన్ ప్రచురించింది.
- దీనిలో హాంకాంగ్, సింగపూర్, న్యూజిలాండ్, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా వరుసగా మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.
- భారత్ 143వ స్థానంలో ఉన్నది. అంతకుముందు 123వ స్థానంలో ఉంది.
- ది హెరిటేజ్ ఫౌండేషన్‌ను ఎడ్విన్ ఫీల్‌నర్, జోసెఫ్ కూర్స్, పాల్ వేరిచ్ స్థాపించారు.
- దీని ప్రధాన కార్యాలయం అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో ఉంది.
- దీని ప్రస్తుత సీఈవో కే కోల్స్ జేమ్స్.



ఇంటర్నేషనల్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఇండెక్స్

(ప్రపంచ మేథో సంపత్తి సూచిక)

- ఈ సూచికను 45 దేశాలతో యూఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ సెంటర్ (జీఐపీసీ) విడుదల చేసింది.
- దీనిలో అమెరికా, యూకే, జర్మనీ, జపాన్, స్వీడన్ వరుసగా మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.
- జీఐపీసీ ప్రధాన కార్యాలయం అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో ఉంది.
- దీనికి అధ్యక్షుడు, సీఈవోగా డేవిడ్ హిర్ష్‌మన్ వ్యవహరిస్తున్నారు.



గ్లోబల్ రెసిలియన్స్ ఇండెక్స్

- 130 దేశాలతో ఈ సూచికను ఎఫ్‌ఎం గ్లోబల్ ప్రచురించింది. దీనిలో స్విట్జర్లాండ్, లక్సెంబర్గ్, స్వీడన్, ఆస్ట్రియా, జర్మనీ మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.
- భారత్ 60వ స్థానంలో నిలిచింది. అంతకుముందు 107వ స్థానంలో ఉంది.
- ఎఫ్‌ఎం గ్లోబల్ కార్యాలయం అమెరికాలోని రోడ్ ఐలాండ్ జాన్స్‌టన్‌లో ఉంది.
- దీని సీఈవో థామస్ ఏ లాసన్, చైర్మన్ శివన్ ఎస్ సుబ్రమణియన్.



గ్లోబల్ హ్యూమన్ క్యాపిటల్ ఇండెక్స్

- ఈ సూచికను కూడా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ప్రచురించింది. 130 దేశాలతో ఈ నివేదికను వెలువరించింది.
- దీనిలో నార్వే, ఫిన్లాండ్, స్విట్జర్లాండ్ మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.
- భారతదేశం 103వ స్థానంలో నిలిచింది. అంతకుముందు 105వ స్థానంలో ఉంది.

గ్లోబల్ పీస్ ఇండెక్స్

- 163 దేశాలతో ఈ సూచికను ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ (ఐఈపీ) రూపొందించింది.
- దీనిలో ఐస్‌లాండ్, న్యూజిలాండ్, పోర్చుగల్, ఆస్ట్రేలియా, డెన్మార్క్ వరుసగా మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి.
- భారతదేశం 137వ స్థానంలో నిలిచింది. అంతకుముందు 141వ స్థానంలో ఉంది.
- ఐఈపీ ప్రధాన కార్యాలయం ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఉంది.
- దీని చైర్మన్ స్టీవ్ కిల్లెలీ.

గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్

- 130 దేశాలతో ఈ సూచికను కార్నెల్ యూనివర్సిటీ, ఇన్‌సీడ్ (INSEAD), ప్రపంచ మేథోసంపత్తి సంస్థ (వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్-డబ్ల్యూఐపీవో) ప్రచురించింది.
- దీనిలో స్విట్జర్లాండ్, స్వీడన్, నెదర్లాండ్స్, అమెరికా, యూకే వరుసగా మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.
- భారతదేశం 60వ స్థానంలో నిలిచింది. అంతకుముందు 66వ స్థానంలో ఉంది.
- డబ్ల్యూఐపీవో ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉంది.
- దీని ప్రస్తుత సీఈవో ఫ్రాన్సిస్ గుర్రి.

వరల్డ్ హ్యాపీనెస్ ఇండెక్స్

- ఈ సూచికను 155 దేశాలతో యునైటెడ్ నేషన్స్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్ నెట్‌వర్క్ ప్రచురించింది.
- దీనిలో నార్వే, డెన్మార్క్, ఐస్‌లాండ్, స్విట్జర్లాండ్ వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి.
- భారతదేశం 122వ స్థానంలో ఉన్నది. అంతకుముందు 118వ స్థానంలో ఉంది.
- యునైటెడ్ నేషన్స్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్ నెట్‌వర్క్ ప్రధాన కార్యాలయం అమెరికాలోని న్యూయార్క్‌లో ఉంది.
- ఈ సంస్థకు డైరెక్టర్‌గా జెఫ్రీ సాచ్స్ వ్యవహరిస్తున్నారు.

గ్లోబల్ ఇండెక్స్ ఆఫ్ టాలెంట్ కాంపిటీటివ్‌నెస్ ఇండెక్స్

- ఈ సూచికను 118 దేశాలతో హ్యూమన్ క్యాపిటల్ లీడర్‌షిప్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్, ది అడెకో గ్రూప్ భాగస్వామ్యంలో INSEAD ప్రచురించింది.
- దీనిలో స్విట్జర్లాండ్, సింగపూర్, యూకే, అమెరికా, స్వీడన్ వరుసగా మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.
- భారత్ 92వ స్థానంలో ఉన్నది. అంతకుముందు 89వ స్థానంలో ఉంది.
- ది అడెకో గ్రూప్ ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో ఉంది.
- దీని సీఈవో అలెన్ దిహాజే

ట్రావెల్ అండ్ టూరిజం కాంపిటీటివ్‌నెస్

- ఈ సూచికను 130 దేశాలతో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ప్రచురించింది.
- దీనిలో స్పెయిన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, యూకే మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి.
- భారత్ 40వ స్థానంలో ఉన్నది. అంతకుముందు 52వ స్థానంలో ఉంది.

సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్

- ఈ సూచికను 157 దేశాలతో సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్ నెట్‌వర్క్ (ఎస్‌డీఎస్‌ఎన్) అండ్ ది బెర్టెల్స్‌మన్ స్టిఫ్టంగ్ రూపొందించింది.
- దీనిలో స్వీడన్, డెన్మార్క్, ఫిన్లాండ్, నార్వే, చెక్ రిపబ్లిక్ వరుసగా మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి.
- భారత్ 116వ స్థానంలో ఉన్నది. అంతకుముందు 110వ స్థానంలో ఉంది.

వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్

- ఈ సూచికను 180 దేశాలతో రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ ప్రచురించింది. దీనిలో నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, డెన్మార్క్, నెదర్లాండ్స్ దేశాలు వరుసగా మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.
- భారతదేశం 136వ స్థానంలో ఉంది. అంతకుముందు 133వ స్థానంలో నిలిచింది.
- రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ ప్రధాన కార్యాలయం ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఉంది.
- దీని డైరెక్టర్ జనరల్ క్రిస్టోఫ్ డెలాయిరే.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్

- 190 దేశాలతో ఈ నివేదికను ప్రపంచ బ్యాంక్ గ్రూప్ ప్రచురించింది. దీనిలో న్యూజిలాండ్, సింగపూర్, డెన్మార్క్, దక్షిణ కొరియా, హాంకాంగ్‌లు మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.
- భారతదేశం 130వ స్థానంలో ఉంది. అంతకుముందు 131వ స్థానంలో ఉంది.
- ప్రపంచ బ్యాంక్ గ్రూప్ ప్రధాన కార్యాలయం అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో ఉంది.
- దీని అధ్యక్షుడు జిమ్ యాంగ్ కిమ్

గ్లోబల్ మిల్క్ ప్రొడక్షన్ ఇండెక్స్

- ఈ సూచికను ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆఫ్ ది యునైటెడ్ నేషన్స్ విడుదల చేసింది.
- దీనిలో 2వ స్థానంలో అమెరికా, 3వ స్థానంలో చైనా, 4వ స్థానంలో పాకిస్థాన్, 5వ స్థానంలో బ్రెజిల్ ఉన్నాయి.
- భారత్ మొదటి స్థానంలో ఉన్నది.
- ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆఫ్ ది యునైటెడ్ నేషన్స్ ప్రధాన కార్యాలయం రోమ్‌లో ఉంది.
- దీనికి డైరెక్టర్ జనరల్‌గా జోస్ గ్రేజియానో డ సిల్వ వ్యవహరిస్తున్నారు.

వరల్డ్ మోస్ట్ వ్యాల్యుబుల్ నేషన్ బ్రాండ్

- ఈ సూచికను 100 దేశాలతో బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసింది.
- దీనిలో అమెరికా, చైనా, జర్మనీ, జపాన్, యూకేలు మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.
- భారత్ 8వ స్థానంలో ఉంది. అంతకుముందు 7వ స్థానంలో ఉంది.
- బ్రాండ్ ఫైనాన్స్ ప్రధాన కార్యాలయం యూకేరాజధాని లండన్‌లో ఉంది.
- దీనికి సీఈవోగా డేవిడ్ హైఫ్ (Haigh) వ్యవహరిస్తున్నారు.

కరప్షన్ పర్సెప్షన్ ఇండెక్స్ (సీపీఐ)

- ఈ సూచికను 79 దేశాలతో ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ప్రచురించింది.
- దీనిలో మొదటి స్థానంలో జాయింట్‌గా డెన్మార్క్, న్యూజిలాండ్‌లు నిలిచాయి. మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఫిన్లాండ్, స్వీడన్, స్విట్జర్లాండ్ ఉన్నాయి.
- భారత్ 79వ స్థానంలో ఉన్నది. అంతకుముందు 76వ స్థానంలో ఉంది.
- టీఐ కార్యాలయం జర్మనీలోని బెర్లిన్‌లో ఉంది.
- దీని చైర్మన్ జోస్ ఉగాజ్.

ఫారెన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎఫ్‌డీఐ)

- 25 దేశాలతో ఈ సూచికను ఏటీ కియర్నీ సంస్థ ప్రచురించింది.
- దీనిలో అమెరికా, జర్మనీ, చైనా, యూకే, కెనడా మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి.
- భారతదేశం 8వ స్థానంలో నిలిచింది. అంతకుముందు 9వ స్థానంలో ఉంది.
- ఏటీ కియర్నీ ప్రధాన కార్యాలయం అమెరికాలోని చికాగో, ఇల్లినాయిస్‌లలో ఉంది.
- దీని స్థాపకుడు ఆండ్ర్యూ థామస్ కియర్నీ. దీని ప్రస్తుత సీఈవో జోహాన్ ఔరిక్.



గ్లోబల్ హంగర్ ఇండెక్స్

- 119 దేశాలతో ఈ సూచికను ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసింది.
- దీనిలో బెలారస్, బోస్నియా, చిలీ మొదటి మూడు స్థానాల్లో నిలువగా 119వ స్థానంలో సెంట్రల్ ఆఫ్రికా రిపబ్లిక్, 118వ స్థానంలో చాద్‌లు నిలిచాయి.
- భారత్ 100వ స్థానంలో ఉన్నది. అంతకుముందు 97వ స్థానంలో ఉంది.
- ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రధాన కార్యాలయం అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో ఉంది.
- దీనికి డైరెక్టర్ జనరల్‌గా షెంగెన్ ఫ్యాన్ వ్యవహరిస్తున్నారు.

..✍ సత్యం

STUDY GUIDE

కెరీర్ @ లా

క్లాట్ -2018 నోటిఫికేషన్

ప్రపంచంలో ఎవర్‌గ్రీన్ వృత్తుల్లో న్యాయవాద వృత్తి ఒకటి. ఇటీవల కార్పొరేట్ సెక్టార్లో దీని అవసరం మరింత పెరిగింది. దీంతో మంచి జీతభత్యాలు, హోదాలతో లా అభ్యర్థులకు అవకాశాలు పెరిగాయి. అంతేకాదు ప్రతి సెక్టారులో న్యాయనిపుణుల అవసరాలు రోజురోజుకు అధికమవుతున్నాయి. మారుతున్న కాలానుగుణంగా కొత్తచట్టాలు రూపొందుతున్నాయి. ప్రస్తుతమున్న న్యాయస్థానాలను రానున్న రోజుల్లో రెట్టింపు చేయాల్సిన స్థితి నెలకొన్నదని స్వయంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు పలు సందర్భాల్లో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సంస్థల్లో యూజీ, పీజీ లా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే 'క్లాట్' నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఆ వివరాలు...

- **క్లాట్:** కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్) - 2018. దేశవ్యాప్తంగా ఉన్న 18 నేషనల్ లా యూనివర్సిటీలు రొటేషన్ పద్ధతిలో క్లాట్‌ను నిర్వహిస్తాయి. ఈసారి నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్, కొచ్చి (కేరళ) క్లాట్‌ను నిర్వహిస్తుంది.

కోర్సులు - అర్హతలు:

యూజీ ప్రోగ్రామ్స్ (ఐదేండ్ల లా కోర్సులు):

- జనరల్/ఓబీసీ/ స్పెషల్లీ ఏబుల్డ్ పర్సన్స్ అభ్యర్థులు 10+2లో కనీసం 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు అయితే 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. మార్చి/ఏప్రిల్‌లో ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాయబోతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- క్లాట్ 2018కి గరిష్ఠ వయోపరిమితి లేదు.

పీజీ ప్రోగ్రామ్:

- జనరల్/ఓబీసీ, పీహెచ్‌సీ కనీసం 55 శాతం మార్కులతో ఎల్‌ఎల్‌బీ/ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ (ఆనర్స్) లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఫైనల్ ఇయర్ పరీక్షలు రాయనున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- గరిష్ఠ వయోపరిమితి లేదు.

ఎంపిక: యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే ఆన్‌లైన్ ఎగ్జామ్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్)లో వచ్చిన ర్యాంక్ ఆధారంగా కౌన్సిలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు. ప్రశ్నపత్రాలు ఇంగ్లిష్‌లో మాత్రమే ఉంటాయి.

- నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు జవాబుకు 0.25 మార్కుల కోత విధిస్తారు.
- పరీక్ష కాలవ్యవధి 2 గంటలు. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.
- మొత్తం 150 ప్రశ్నలు, 150 మార్కులు. పరీక్ష కాలవ్యవధి 2 గంటలు.
- నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. తప్పు జవాబుకు 0.25 మార్కులు కోతవిధిస్తారు.

ఉద్యోగావకాశాలు:

- క్లాట్‌లో ర్యాంక్ సాధించి ఆయా విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుంది. ఇటీవల కాలంలో జరిగిన ప్లేస్‌మెంట్లలో లా చదివినవారికి ఆకర్షణీయమైన జీతభత్యాలతో కార్పొరేట్ కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్ లభించాయి.
- లా కోర్సులతోపాటు యూజీసీ నెట్‌లో క్వాలిఫై అయినవారికి పీఎస్‌యూ, నవరత్న, మహరత్న, మినీరత్న తదితర కంపెనీలతోపాటు పలు ఎంఎన్‌సీలు లా ఆఫీసర్లుగా, ఎగ్జిక్యూటివ్‌లుగా, ట్రెయినీ లా ఆఫీసర్లు తదితర ఉద్యోగాల్లో నియమిస్తున్నాయి.
- వీటితోపాటు సొంతంగా ప్రాక్టీస్ పెట్టుకోవడం, లా అసోసియేట్స్‌లో పనిచేయడం, సీనియర్ న్యాయవాదుల వద్ద పనిచేయడంతో అనుభవం గడించి భవిష్యత్‌లో మంచి లాయర్‌గా ఎదగవచ్చు.
- రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న న్యాయవాది పోస్టులకు, లీగల్ అడ్వైజర్ పోస్టుల ద్వారా ఉద్యోగాలను పొందవచ్చు.



పీజీ ప్రోగ్రామ్ పరీక్ష విధానం

సబ్జెక్టు, మార్కులు

కాన్‌స్టిట్యూషనల్ లా 50
జ్యూరిస్‌ప్రుడెన్సీ 50
ఇతర లా సబ్జెక్టులు 50
మొత్తం 150

యూజీ కోర్సులకు పరీక్ష విధానం

సబ్జెక్టు	ప్రశ్నలు	మార్కులు
ఇంగ్లిష్, కాంప్రహెన్షన్	40	40
జీకే, కరెంట్ అఫైర్స్	50	50
ఎలిమెంటరీ మ్యాథ్స్ (న్యూమరికల్ ఎబిలిటీ)	20	20
లీగల్ ఆప్టిట్యూడ్	50	40
లాజికల్ రీజనింగ్	40	40
మొత్తం	200	200

ముఖ్యతేదీలు:

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 31
- **అడ్మిట్‌కార్డు డౌన్‌లోడింగ్‌కు చివరితేదీ:** మే 12
- **పరీక్షతేదీ:** మే 13 (మధ్యాహ్నం 3-5 వరకు)
- **ప్రాథమిక కీ విడుదల:** మే 15
- **ఫైనల్ కీ విడుదల:** మే 26
- **ఫలితాల వెల్లడి:** మార్చి 31
- **వెబ్‌సైట్:** http://www.clat.ac.in

క్లాట్ ద్వారా ప్రవేశాలు కల్పించే విశ్వవిద్యాలయాలు

నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ - బెంగళూరు
నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా - హైదరాబాద్
నేషనల్ లా యూనివర్సిటీ - భోపాల్
వెస్ట్‌బెంగాల్ నేషనల్ లా యూనివర్సిటీ ఆఫ్ జ్యూరిడికల్ సైన్సెస్ - కోల్‌కతా
నేషనల్ లా యూనివర్సిటీ - జోధ్‌పూర్
హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ - రాయ్‌పూర్
డా. రామ్ మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీ - లక్నో
గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ - గాంధీనగర్
చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ - పాట్నా
నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ - కొచ్చి
రాజీవ్‌గాంధీ నేషనల్ లా యూనివర్సిటీ - పాటియాల
నేషనల్ లా యూనివర్సిటీ - కటక్
నేషనల్ లా యూనివర్సిటీ అండ్ జ్యూడీషియల్ అకాడమీ - గువాహటి
దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ - విశాఖపట్నం
మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ - ముంబై
తమిళనాడు నేషనల్ లా స్కూల్ - తిరుచిరాపల్లి
మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ - నాగపూర్
మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ - ఔరంగాబాద్
నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ స్టడీ అండ్ రిసెర్చ్ ఇన్ లా - రాంచీ

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 8 జనవరి 2018

'కొచ్చిన్' క్యాట్ 2018



కొచ్చిన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ 2018-19 అకడమిక్ ఇయ రేకుగాను వివిధ డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్) నోటిఫికేషన్ విడుదలైంది.

- **వివరాలు:** ఈ యూనివర్సిటీని 1971లో ఏర్పాటుచేశారు.
- **టెస్ట్ పేరు:** సీయూశాట్ క్యాట్ 2018
- **విభాగాలు:** మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఎమ్మెస్సీ), బీటెక్, ఎంటెక్, ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ (కామర్స్), బీకాం-ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీబీఏ, ఎంఏ, బీబీఏ-ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఎంసీఏ, డ్యూయల్ డిగ్రీ ఎల్ఎల్ఎం (ఐపీ) పీహెచ్‌డీ అండ్ ఎల్ఎల్ఎం (ఐపీఆర్), పీహెచ్‌డీ
- **అర్హత:** డిగ్రీ కోర్సులకు ఇంటర్, పీజీ కోర్సులకు డిగ్రీ, పీహెచ్‌డీ కోర్సులకు మాస్టర్ డిగ్రీలో ఉత్తీర్ణత.
- **పరీక్ష కేంద్రాలు:** న్యూఢిల్లీ, కోల్‌కతా, ముంబై, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, జంషెడ్‌పూర్, అలహాబాద్, లక్నో, రాంచీ, వారణాసి, కోటా, బొకారో, పాట్నా, కన్నూర్, పాలక్కడ్‌తో సహా దేశవ్యాప్తంగా మొత్తం 28 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1000/- (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 500/-)
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 15
- **కామన్ ఎంట్రెన్స్ తేదీ:** ఏప్రిల్ 28, 29
- **వెబ్‌సైట్:** cusat.nic.in

విశ్లేషణ

జీవశాస్త్ర పరిజ్ఞానం మానవజాతి అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నది. ఆహార, ఆరోగ్య సమస్యల పరిష్కారం నుంచి అంతరిక్షయానం వరకు ఎన్నో అద్భుతాలు శాస్త్రవిజ్ఞానంవల్లే సాధ్యమయ్యాయి. ఇందుకు ఎంతో మంది స్వదేశీ, విదేశీ శాస్త్రవేత్తలు తమవంతు కృషిచేశారు. టీఆర్‌టీ బయాలజీ పరీక్షలో శాస్త్రవేత్తలు, వారి ఆవిష్కరణలకు సంబంధించి మూడు లేదా నాలుగు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కొందరు ప్రముఖ భారతీయ శాస్త్రవేత్తలు, వారు కనుగొన్న అంశాలకు సంబంధించిన సమాచారం టీఆర్‌టీ బయాలజీ అభ్యర్థుల కోసం...

... తోట నాగరాజు



భారతీయ జీవశాస్త్రవేత్తలు

ఎం.ఎస్. స్వామినాథన్




- స్వామినాథన్ వ్యవసాయ శాస్త్రవేత్త. ఈయన పూర్తిపేరు మానకొంబు సాంబశివన్ స్వామినాథన్. 1925 ఆగస్టు 7న తమిళనాడులోని కుంభకోణంలో జన్మించారు. కుంభకోణం పట్టణంలో మెట్రిక్యులేషన్ పూర్తిచేసి, కేరళలోని త్రివేండ్రం యూనివర్సిటీ నుంచి బీఎస్సీ డిగ్రీ పొందారు. అనంతరం తమిళనాడు వ్యవసాయ కళాశాల నుంచి బీఎస్సీ (అగ్రికల్చర్) పూర్తిచేశారు.
- దేశంలో ఆహారకొరతను అధిగమించడం కోసం స్వామినాథన్.. గోధుమ, వరి సంకర రకాలతో పాటు ఆలుగడ్డ, నార రకాలను ఉత్పత్తి చేశారు. వ్యవసాయంలో ఆధునిక మార్గాలను ప్రవేశపెట్టారు. ఈయన కృషివల్ల స్వాతంత్ర్యం అనంతరం కొన్నేండ్లలోనే దేశంలో ఆహారోత్పత్తి పెరిగింది. ఈ దశను 'హరిత విప్లవం' అంటారు.
- దేశంలో వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం, అధిక ఆహారోత్పత్తి కోసం స్వామినాథన్ చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనకు అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు లభించాయి.
- స్వామినాథన్.. 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్' (ICAR)కు డైరెక్టర్ జనరల్‌గా, ఫిలిప్పైన్స్‌లోని ఇంటర్నేషనల్ రైస్ రిసెర్చ్ సంస్థకు డైరెక్టర్‌గా పనిచేశారు. 'స్వామినాథన్ రిసెర్చ్ ఫౌండేషన్'ను స్థాపించారు

పంచానన్ మహేశ్వరి




- పంచానన్ మహేశ్వరి 1904 నవంబర్ 9న రాజస్థాన్‌లో జన్మించారు. అలహాబాద్‌లోని ఎవింగ్ క్రిస్టియన్ కళశాలలో చదివారు. 1925లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, 1931లో డాక్టర్ ఆఫ్ సైన్స్ డిగ్రీలు పూర్తిచేశారు.
- 1934లో బెంగళూరులోని భారతీయ విజ్ఞాన శాస్త్ర అకాడమీ గౌరవ సభ్యులయ్యారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో వృక్ష శాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఈయన వృక్షాల పిండోత్పత్తి శాస్త్రంలో విశేష కృషి చేశారు. ఈయనను వృక్షాల ఆధునిక పిండోత్పత్తి శాస్త్రానికి పితామహుడిగా కీర్తిస్తారు.
- 'పరిస్థానిక ఫలదీకరణం' అనే పద్ధతిని కనుగొన్నారు. ఈ పద్ధతిలో వృక్షాల ఫలదీకరణాన్ని పరీక్షనాళికలో జరుపుతారు. ఇది వృక్షాల ప్రజననంలో, ఆర్థిక, అనువర్తిత వృక్షశాస్త్రాల అభివృద్ధికి తోడ్పడింది. పరిస్థానిక ఫలదీకరణ పద్ధతితో సహజంగా సంకరణం గావించబడని మొక్కలను సంకరణం చేయించి, కొత్త రకాల మొక్కలను ఉత్పత్తి చేయవచ్చు. పంచానన్ మహేశ్వరి 1966 మే 18న ఢిల్లీలో మరణించారు.

డా. యల్లాప్రగడ సుబ్బారావు




- యల్లాప్రగడ ప్రముఖ జీవరసాయన శాస్త్రవేత్త. 1895 జనవరి 12న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జన్మించారు. రాజమండ్రిలో మెట్రిక్యులేషన్, మద్రాస్ మెడికల్ కాలేజీలో వైద్య విద్య పూర్తిచేశారు.
- ఫోలిక్ ఆమ్లం, టెట్రా సైక్లిన్‌లు, క్యాన్సర్ నిరోధక ఔషధాలను ఉత్పత్తిచేసే పద్ధతులను యెల్లాప్రగడ అభివృద్ధి చేశారు. బోదకాలు, టైఫాయిడ్, పాండు రోగం మొదలైన వ్యాధులను పూర్తిగా నిర్మూలించగల మందులను కనుగొన్నారు. ఈయన రూపొందించిన హెట్రజాన్ అనే ఔషధం ఫైలేరియాసిస్ నివారణకు ఉపయోగపడింది. అందుకే ఈయనను 'అద్భుత ఔషధ సృష్టికి మంత్రగాడు' (Wizard of the wonder Drug) అంటారు.
- టెట్రాసైక్లిన్లవల్ల ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఎంతోమంది ప్లేగు వ్యాధి నుంచి రక్షించబడ్డారు. టెట్రాసైక్లిన్‌ను 'ప్రపంచానికి సుబ్బారావు ఇచ్చిన బహుమానం'గా కీర్తిస్తారు. ఈయన అనారోగ్యంతో 1948 ఆగస్టు 9న అమెరికాలో మరణించారు.

బీర్బల్ సాహ్నీ



- బీర్బల్ సాహ్నీ 1891 నవంబర్ 14న పశ్చిమ పంజాబ్ రాష్ట్రం (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది) షహరాన్‌పూర్ జిల్లాలోని బెహరా పట్టణంలో జన్మించారు. విద్యాభ్యాసం లాహోర్ యూనివర్సిటీలో జరిగింది. లండన్ యూనివర్సిటీ నుంచి 'డాక్టర్ ఆఫ్ సైన్స్' పట్టా పొందారు. అనంతరం లక్నో యూనివర్సిటీలో వృక్షశాస్త్ర ఆచార్యులుగా పనిచేశారు.
- పురావృక్షశాస్త్రానికి సాహ్నీ విశేష సేవలు చేశారు. లక్షల ఏండ్ల క్రితం జురాసిక్ రాక్షసబల్లుల కాలానికి చెందిన ఎన్నో వృక్ష శిలాజాలను తన పరిశోధనల ద్వారా నిర్దిష్టంగా లెక్కగట్టి ప్రకటించారు. ఆయన కృషి ఫలితంగా వృక్షజాతుల, శిలాజాల అధ్యయనం కోసం ప్రత్యేక విభాగం ఏర్పడి విశ్వవిద్యాలయ స్థాయికి ఎదిగింది.
- భూగర్భ శాస్త్రవేత్త కూడా అయిన సాహ్నీ భూమి ఒకప్పుడు ఒకే ఖండంగా ఉందని, కాలక్రమేణ రోదసిలో చోటుచేసుకున్న అనేక భౌతిక, రసాయన మార్పుల కారణంగా భూమిమధ్య నీరు ఏర్పడి 5 ఖండాలుగా రూపాంతరం చెందిందని పేర్కొన్నారు.
- సాహ్నీ పరిశీలనలు ఖండాల కదలిక సిద్ధాంతానికి రుజువులను ఇచ్చాయి. ఖండాలు ఒకదానికి ఒకటి దూరంగా జరుగుతున్నాయన్నదే 'ఖండాల కదలిక సిద్ధాంతం'.
- 1917లో ప్రొఫెసర్ స్టివార్ట్‌తో కలిసి బీర్బల్ సాహ్నీ భారతీయ గోండ్వానా వృక్షాల మీద విస్తృత పరిశోధనలు చేశారు. దేశంలోని వృక్షజాతుల మీదనేగాక పాశ్చాత్య దేశాల్లో పెరిగే వృక్షజాతుల లక్షణాల మీద కూడా లోతైన అధ్యయనం చేశారు. ఈయన 1949 ఏప్రిల్ 10న పుణెలో మరణించారు.

సర్ రోనాల్డ్ రాస్




- రాస్ ప్రముఖ ఆంగ్లో-ఇండియన్ శాస్త్రవేత్త. 1857 మే 13న ఉత్తరాఖండ్‌లోని అల్మోరాలో జన్మించారు. తండ్రి సర్ గ్రాంట్ రాస్ బ్రిటిష్ ఇండియా ఆర్మీలో పనిచేసేవారు. 8 ఏండ్ల వయసులో విద్యాభ్యాసం కోసం ఇంగ్లండ్ వెళ్లిన రాస్.. 1875-80 మధ్య లండన్‌లోని సెయింట్ బార్తొలోమ్ హాస్పిటల్‌లో వైద్యవిద్య పూర్తిచేశారు.
- 1881లో రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ సభ్యత్వం పొంది ఇండియన్ మెడికల్ సర్వీస్‌లో చేరారు. ముందుగా మద్రాస్‌లో, అనంతరం హైదరాబాద్‌లో మలేరియాపై పరిశోధనలు చేశారు. ఆ రోజుల్లో భారత్, ఆఫ్రికా దేశాల్లో మలేరియా అతి భయంకరమైన వ్యాధి. ఆయా దేశాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో మలేరియా వ్యాధి సోకి అనేక వేలమంది మరణించారు.
- దోమలు మలేరియా వ్యాధిని ఒకరి నుంచి మరొకరికి వ్యాపింపజేస్తాయని రోనాల్డ్ రాస్ కొనుగొన్నారు. దీనివల్లే దోమ తెరలు వాడటం, దోమలు పెరిగే ప్రాంతాల్లో 'డీడీటీ' చల్లడం ద్వారా మలేరియాను అదుపులో ఉంచవచ్చన్న ముఖ్య విషయం తెలిసింది.
- మలేరియా పరాన్నజీవి జీవితచక్రానికి సంబంధించి చేసిన పరిశోధనకుగాను రాస్‌కు 1902లో నోబెల్ బహుమతి లభించింది. రాస్ 1932 సెప్టెంబర్ 16న తన 75వ ఏట లండన్‌లో మరణించారు.

హరగోవింద్ ఖొరానా



- ఖొరానా ఇండో-అమెరికన్ జీవరసాయన శాస్త్రవేత్త. 1922 జనవరి 9న పంజాబ్ రాష్ట్రంలోని రాయపూర్ గ్రామంలో (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది) జన్మించారు. లాహోర్ విశ్వవిద్యాలయం నుంచి 1943లో బీఎస్సీ, 1945లో ఎమ్మెస్సీ పూర్తిచేశారు. 1945 నుంచి 1948 వరకు అమెరికాలోని లివర్‌పూల్ యూనివర్సిటీలో పరిశోధనలు చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఆ తర్వాత రెండేండ్లు స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో పరిశోధనలు సాగించారు.
- 1951-1952లో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో మాంసకృత్తులు, న్యూక్లిక్ ఆమ్లాలకు సంబంధించిన పరిశోధనలు చేశారు. ఈయన 'కృత్రిమ జీన్'ను సృష్టించారు. ఈ ఆవిష్కరణ 'జెనెటిక్ ఇంజినీరింగ్' అనే నూతన శాస్త్ర అధ్యయనానికి దారితీసింది. 'జన్యు స్మృతి'ని వెలుగులోకి తెచ్చిన వారిలో ఈయన ఒకరు.
- ఈయన జన్యువును కృత్రిమంగా ల్యాబొరేటరీలో సంశ్లేషణ చేశారు. జన్యుశాస్త్రంలో, అణు జీవశాస్త్రంలో చేసిన సేవలకు గుర్తింపుగా ఈయన మరో ఇద్దరు శాస్త్రవేత్తలు మార్షల్, రాబర్ట్ హోలీలతో సంయుక్తంగా 1968లో నోబెల్ బహుమతి అందుకున్నారు. తన 89వ ఏట 2011 నవంబర్ 9న అమెరికాలో మరణించారు.

సలీం మొయినుద్దీన్ అబ్దుల్ అలీ



- 1896 నవంబర్ 12న బొంబాయిలో జన్మించారు. బొంబాయి, బర్మాల్లో విద్యాభ్యాసం సాగింది. ఉన్నత విద్యను అభ్యసించలేదు.
- శాస్త్ర ప్రపంచంలో ఈయనను 'సలీం అలీ' అంటారు. ఈయనకు చిన్నప్పటి నుంచి పక్షులను పరిశీలించడమంటే సరదా. ఆర్నిథాలజీకి సంబంధించి దేశంలో ఈయనే అగ్రగణ్యుడు.
- హైదరాబాద్, కొచ్చిన్, గ్వాలియర్, తిరువాన్కూర్, ఇండోర్, భోపాల్‌లలో స్థానిక సంస్థానాధీశుల సాయంతో ఆయా సంస్థానాల్లో ఉన్న పక్షులు, వాటి సహజసిద్ధ నివాసస్థలాల గురించి అధ్యయనం చేశారు.
- పక్షుల పరిశోధనలో చేసిన కృషికిగాను సలీం అలీ అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. వన్యమృగ సంరక్షణార్థం ఇచ్చే 'పాల్‌గెట్టి అవార్డు' కూడా సలీం అలీకి లభించింది. సలీం అలీని 'బర్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పిలుస్తారు. ఈయన 1987 జూన్ 20న ముంబైలో మరణించారు.

STUDY GUIDE

ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ -2018

ఇంజినీరింగ్, మెడిసిన్‌కు దీటైన కోర్సులు చాలానే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు ఉన్న రంగం ఆతిథ్యం, హోటల్ అడ్మినిస్ట్రేషన్ రంగాలు. జాతీయ, అంతర్జాతీయంగా రోజురోజుకు డిమాండ్ పెరుగుతున్న రంగాల్లో టూరిజం, హోటల్ మేనేజ్‌మెంట్ అగ్రభాగాన ఉన్నాయి. చదువు పూర్తి కాకముందే క్యాంపస్ ప్లేస్‌మెంట్లతో మంచి జీతభత్యాలు, మంచిహోదాతో ఉద్యోగాలకు పుష్కలమైన అవకాశాలు. స్వయం ఉపాధి కింద సొంతంగా సంస్థలను ఏర్పాటు చేసుకోవడానికి అవకాశాలు ఉన్నాయి. దీనికోసం బీఎస్సీ హాస్పిటాలిటీ, మేనేజ్‌మెంట్ కోర్సులు చదవాలి. వీటికి సంబంధించి దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిష్ఠాత్మక కాలేజీల్లో బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ -2018 నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో కోర్సు వివరాలు, అవకాశాలపై సంక్షిప్తంగా...

ఎన్‌సీహెచ్‌ఎంసీటీ:

- నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ & క్యాటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్‌ఎంసీటీ) అనేది కేంద్ర టూరిజం మంత్రిత్వశాఖ పరిధిలోని స్వతంత్ర సంస్థ. దేశవ్యాప్తంగా ఉన్న 21 సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, రాష్ట్రప్రభుత్వాల పరిధిలోని 22 హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్లు, పబ్లిక్ సెక్టార్‌లోని ఒక సంస్థ, 14 ప్రైవేట్ ఇన్‌స్టిట్యూషన్లు, 12 ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్లు తదితర సంస్థలను ఎన్‌సీహెచ్‌ఎంసీటీ నియంత్రిస్తుంది.
- ఈ కాలేజీల్లో నాణ్యమైన విద్య, శిక్షణను అందిస్తున్నది. ఆతిథ్యం, ఇతర సర్వీస్ సెక్టార్లలో నిష్ణాతులను తయారుచేయడానికి ఈ సంస్థ కృషి చేస్తుంది. ఇప్పటివరకు సుమారు లక్షమందికి పైగా హాస్పిటాలిటీ మేనేజర్లను, ఎగ్జిక్యూటివ్‌లను, ఈ రంగానికి సంబంధించిన నిపుణులను అందించింది.



సబ్జెక్టు	ప్రశ్నల సంఖ్య
న్యూమరికల్ ఎబిలిటీ, అనలిటికల్ ఆప్టిట్యూడ్ –	30
రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్ –	30
జీకే అండ్ కరెంట్ అఫైర్స్ –	30
ఇంగ్లిష్ లాంగ్వేజ్ –	60
ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ –	50
మొత్తం ప్రశ్నలు –	200

బీఎస్సీ హాస్పిటాలిటీ & హోటల్ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రామ్

- ఈ బీఎస్సీ ప్రోగ్రామ్‌ను నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీలు కలిసి అందిస్తున్నాయి.
- కోర్సు కాలవ్యవధి మూడేండ్లు. ఆరు సెమిస్టర్లు. ఆతిథ్య రంగానికి కావాల్సిన మెలకువలు, జ్ఞానాన్ని, అభిరుచిని పెంచేవిధంగా కరికులం ఉంటుంది.
- ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్, బేవరేజీ సర్వీస్, ఫ్రంట్ ఆఫీస్ ఆపరేషన్, హౌస్ కీపింగ్, హోటల్ అకౌంటెన్సీ, ఫుడ్ సేఫ్టీ, క్వాలిటీ, హెచ్ఆర్ మేనేజ్‌మెంట్, ఫెసిలిటీ ప్లానింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, టూరిజం మార్కెటింగ్ అండ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలలో తర్ఫీదునిస్తారు.
- **అర్హతలు:** 10+2 / ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత. ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాయనున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే కౌన్సిలింగ్ సమయానికి సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది.
- **వయస్సు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులు 2018, జూలై 1 నాటికి 22 ఏండ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏండ్లు మించరాదు.

గమనిక: జేఈఈలో వచ్చిన ఆల్ ఇండియా ర్యాంక్ ఆధారంగా బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు చేపడుతారు. ఎటువంటి గ్రూప్ డిస్కషన్స్/ఇంటర్వ్యూలు ఉండవు.

పరీక్ష విధానం

- **పరీక్షతేదీ:** 2018, ఏప్రిల్ 28 (ఉదయం 10 నుంచి 1 గంట వరకు)
- ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీలో ఉంటుంది.
- నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ఆయా సబ్జెక్టులకు వేర్వేరుగా మార్కుల కోత విధిస్తారు.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్‌తోపాటు దేశవ్యాప్తంగా 33 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.

ఉపాధి అవకాశాలు

- జాతీయ, అంతర్జాతీయస్థాయి హోటళ్లు, ఆతిథ్య రంగంలో
- కిచెన్ మేనేజ్‌మెంట్/హౌస్‌కీపింగ్ మేనేజ్‌మెంట్ రంగాల్లో
- భారత నావికాదళంలోని ఆతిథ్య విభాగాల్లో
- హోటళ్లు, ఇతర సర్వీస్ సెక్టారుల్లోని గెస్ట్/కస్టమర్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్‌లుగా
- అంతర్జాతీయ, జాతీయ ఫాస్ట్ ఫుడ్ చైన్స్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీ/ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలుగా
- హోటల్ మేనేజ్‌మెంట్/ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్లలో ఫ్యాకల్టీ అవకాశాలు
- నౌకాయానం, క్రూయిజ్ రంగంలో
- రైల్వేలో క్యాటరింగ్ సర్వీస్ సెక్టారులో
- రాష్ట్ర పర్యాటక సంస్థల్లో
- రిసార్ట్ మేనేజ్‌మెంట్లలో
- స్వయం ఉపాధిగా ఎంట్రప్రెన్యూర్‌షిప్, మల్టీనేషనల్ కంపెనీలలో ఆతిథ్య రంగంలో అవకాశాలు

రాష్ట్రంలో కాలేజీల వివరాలు

- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (డీడీ కాలనీ), (సెంట్రల్ ఐహెచ్‌ఎం) – 230 సీట్లు
- నిథిమ్ (స్టేట్ ఐహెచ్‌ఎం), గచ్చిబౌలి – 60 సీట్లు
- తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, కోహీర్ క్రాస్ రోడ్స్ – 60 సీట్లు
- ఐహెచ్‌ఎం – శ్రీశక్తి వెన్యూస్ ప్లాజా, బేగంపేట (ప్రైవేట్) – 120 సీట్లు

నోట్: దేశవ్యాప్తంగా 58 ఇన్‌స్టిట్యూట్లలో ప్రవేశాలు కల్పిస్తారు.

ముఖ్యతేదీలు

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 11
- అడ్మిట్‌కార్డ్ డౌన్‌లోడింగ్ – ఏప్రిల్ 20 నుంచి
- **పరీక్షతేదీ:** ఏప్రిల్ 28
- **ఫలితాల వెల్లడి:** మే మూడోవారం
- **వెబ్‌సైట్:** http://nchm.nic.in

- కేశవపంతుల వేంకటేశ్వరశర్మ

NOTIFICATION

నేషనల్ హాస్పిటాలిటీ టెట్ -2018

నేషనల్ హాస్పిటాలిటీ టీచింగ్ ఎలిజిబిలిటీ టెస్ట్ 2018 నోటిఫికేషన్‌ను నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్‌ఎంటీ) విడుదల చేసింది.



- **వివరాలు:** ఐహెచ్‌ఎం, టూరిజం, హాస్పిటాలిటీ, హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీల్లో అసిస్టెంట్ లెక్చరర్, టీచింగ్ అసోసియేట్స్‌గా పనిచేయాలంటే (డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో) తప్పనిసరిగా నేషనల్ హాస్పిటాలిటీ టెట్‌లో అర్హత సాధించాలి.
- **పరీక్ష:** నేషనల్ హాస్పిటాలిటీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్- 2018 (ఎన్‌హెచ్‌టెట్ - మార్చి 2018).
- **అర్హతలు:** ఇంటర్ తర్వాత హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్/హోటల్ మేనేజ్‌మెంట్ ఫుల్‌టైం డిగ్రీ కోర్సులో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం సంబంధిత పరిశ్రమలో రెండేండ్ల అనుభవం ఉండాలి. లేదా బీఎస్సీ (హాస్పిటాలిటీ/హోటల్ మేనేజ్‌మెంట్ లేదా అడ్మినిస్ట్రేషన్)లో ఫుల్‌టైం పీజీ కోర్సు (హాస్పిటాలిటీ/హోటల్ మేనేజ్‌మెంట్ లేదా అడ్మినిస్ట్రేషన్)లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. పీజీ ఫైనల్ సెమిస్టర్ రాయనున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయస్సు:** 2018, ఏప్రిల్ 30 నాటికి 30 ఏండ్లు, ఓబీసీలు 33, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలు 35 ఏండ్లు మించరాదు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 20
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న కాపీ ప్రింట్‌ను ఫిబ్రవరి 28లోగా ఎన్‌సీహెచ్‌ఎంసీటీ, నోయిడాకు పంపాలి.

పరీక్ష కేంద్రాలు: దేశవ్యాప్తంగా 16 పట్టణాల్లో పరీక్ష నిర్వహించనున్నారు.

- **పరీక్షతేదీ:** మార్చి 18
- **ఫలితాల వెల్లడి:** మార్చి 27
- **వెబ్‌సైట్:** www.thims.gov.in

సుడోకు

డైలీ సుడోకు 93 సమాధానం

1	7	8	3	6	2	4	5	9
9	2	6	5	4	8	7	1	3
5	4	3	9	7	1	8	6	2
7	3	9	8	1	6	2	4	5
8	1	4	2	9	5	3	7	6
6	5	2	7	3	4	1	9	8
4	8	5	6	2	7	9	3	1
3	6	7	1	8	9	5	2	4
2	9	1	4	5	3	6	8	7

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -94

	9				8	1	6	
		1	7					
2				1				3
3		8	4					6
		9				2		
6					7	8		4
8				4				9
					2	6		
	6	7	1				5	



ఐదువేల నృత్యకారులతో...

రకుల్‌ప్రీత్‌సింగ్

గత ఏడాది పంజాబీ సుందరి రకుల్‌ప్రీత్‌సింగ్‌కు బాగా కలిసొచ్చింది. అభినయ ప్రధానమైన పాత్రలతో మంచి విజయాల్ని దక్కించుకుంది. ఈ సంవత్సరం కూడా ఇదే ఉత్సాహంతో కెరీర్‌లో దూసుకుపోతానని చెబుతున్నది రకుల్‌ప్రీత్‌సింగ్. ఆమె నటిస్తున్న తాజా హిందీ చిత్రం 'అయ్యారీ' ఈ నెల 26న ప్రేక్షకులముందుకురానుంది. ప్రస్తుతం ఈ చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో రకుల్ బిజీగా వుంది. బాలీవుడ్‌లో ఆమె నటిస్తున్న రెండో చిత్రమిది కావడంతో తన పాత్రపరంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని చెబుతున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయాన్ని చిత్రబృందం సోషల్‌మీడియా ద్వారా పంచుకుంది. మిలట్రీ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అనుపమ్‌ఖేర్, నసీరుద్దీన్‌షా, మనోజ్‌బాజ్‌పాయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ సినిమా కోసం 'కోయి కహానీ షురూతో కర్' అనే గీతాన్ని చిత్రీకరిస్తున్నారు. ఇందులో రకుల్‌ప్రీత్‌సింగ్ 5000మంది విద్యార్థులతో కలిసి నృత్యం చేయబోతుంది. బాలీవుడ్ చిత్ర పరిశ్రమలో ఈ పాట ప్రత్యేకంగా నిలిచిపోతుందని, ఐదువేల మందితో ఓ గీతాన్ని దృశ్యమానం చేయడం ఇదే ప్రథమమని చిత్ర బృందం పేర్కొంది. 'అయ్యారీ' బాలీవుడ్‌లో తనకు బ్రేక్‌నిస్తుందనే నమ్మకం ఉందని రకుల్‌ప్రీత్‌సింగ్ విశ్వాసం వ్యక్తం చేసింది.

'అగ్ర కథానాయకుడిగా పేరుతెచ్చుకున్నా నా మూలాలను మాత్రం మర్చిపోలేదు. ఇప్పటికీ ఆ రోజులు కళ్ల ముందు కదలాడుతూనే ఉన్నాయి. సినిమాల్లోకి రాకముందు ఓ ఎక్స్‌పోర్ట్ సంస్థలో ఏడువందల ఇరవై ఆరు రూపాయల నెల జీతానికి పనిచేశాను. ఆఫీస్‌లో ప్యాకింగ్ నుంచి క్లీనింగ్ వరకు అన్ని పనులు నేనే చేసేవాడిని. స్కూల్, కాలేజీలకు బస్సుల్లోనే వెళ్లేవాడిని. ఆ రోజులన్ని ఈ సినిమాతో మళ్లీ గుర్తొచ్చాయి' అని అన్నారు సూర్య. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'గ్యాంగ్'. విఘ్నేష్‌శివన్ దర్శకుడు. ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకురానున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో సూర్య పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..



సూర్య

ఆ రోజులు మళ్లీ గుర్తొచ్చాయి!

'గ్యాంగ్' నేపథ్యమేమిటి?


• 1987లో మన దేశంలో జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందిన చిత్రమిది. గ్రేట్ ఇండియన్ రాబరీగా పేరుగాంచిన ఒపేరా హౌస్ దోపిడీ కేసు నేపథ్యంలో కథ సాగుతుంది. ఓ యువకుడు తన గ్యాంగ్‌తో కలిసి ఆ కేసును ఎలా ఛేదించాడన్నదే ఈ చిత్ర ఇతివృత్తం.

సినిమాలో మీ పాత్ర ఎలా ఉంటుంది?

• శివపుత్రుడు, వీడొక్కడే అనంతరం చాలా రోజుల తర్వాత వినోదప్రధానంగా సాగే పాత్రలో నేను కనిపిస్తున్న చిత్రమిది. వినోదం, భావోద్వేగాలు, కమర్షియల్ హంగులతో జనరంజకంగా నా పాత్ర ఉంటుంది.

హిందీ చిత్రం 'స్పెషల్ చబ్బీ స్'ను రీమేక్ చేయాలని ఎందుకనిపించింది?

• 'స్పెషల్‌చబ్బీస్' మూలకథను తీసుకొని తమిళ, తెలుగు నేటివిటీకి అనుగుణంగా చాలా మార్పులు చేశాం. 1980లలో తమిళంలో కమల్‌హాసన్ కథానాయకుడిగా తెరకెక్కిన 'సత్య', బాలచందర్ 'వరుమ యిన్ నిరమ్ శివప్పు' చిత్రాల్లో నిరు



ద్యోగ సమస్యను, ఉద్యోగాలు దొరక్క యువతరం పడే సంఘర్షణను కళ్లకు కట్టినట్లుగా చూపించారు. ఆ సినిమా తర్వాత నిరుద్యోగుల కష్టాలను యదార్థ కోణంలో ఆవిష్కరించిన చిత్రమిది. నా కెరీర్ మొదలుపెట్టడానికి ముందు చదువు పూర్తిచేసుకున్న తర్వాత ఏ వృత్తిని ఎంచుకోవాలి? ఎటు వైపు అడుగులు వేయాలో తెలియని సందిగ్ధావస్తను ఎదుర్కొన్నాను. నా చదువుకు తగిన ఉద్యోగం వస్తుందో?రాదో? అనే భయాలు ఉండేవి. అవన్నీ ఈ సినిమాలోనూ కనిపిస్తాయి.

ఈ సినిమాను అంగీకరించడానికి మీకు ప్రేరణనిచ్చిన అంశాలేవి. ?

• ఈ సినిమా చేస్తున్నప్పుడు నా యవ్వనపు రోజులు గుర్తొచ్చాయి. ఇరవై ఏళ్లు వెనక్కి వెళ్లిన అనుభూతి కలిగింది. కెరీర్ తొలినాళ్లలో నేను ఎలా ఉండేవాడినో అలాగే ఈ సినిమాలో కనిపిస్తాను. దర్శకుడు విఘ్నేష్ శివన్ కథను సిద్ధంచేసిన తీరు, తెరకెక్కించిన విధానం, నటీనటుల అభినయం అన్ని వైవిధ్యంగా ఉంటాయి. ఆ కొత్తదనం నచ్చే ఈ సినిమాను అంగీకరించాను. కథ, కథనాలు, సన్నివేశాల పరంగా నా గత చిత్రాలకు పూర్తి విభిన్నంగా ఈ సినిమా ఉంటుంది.

విఘ్నేష్‌శివన్‌కు ఇంతకుముందు రెండు సినిమాలకు దర్శకత్వం వహించిన అనుభవముంది. ఏ నమ్మకంతో ఆయనతో సినిమా చేశారు?

• విఘ్నేష్‌శివన్ బహుముఖప్రజ్ఞాశాలి. దర్శకుడిగానే కాకుండా డ్రమ్మర్, గేయరచయితగా ప్రతిభను చాటుకున్నారు. సినిమాటిక్ ఫీల్‌తో కాకుండా ఆద్యంతం సహజంగా సినిమాను తీర్చిదిద్దారు. నిజ జీవితంలో స్నేహితులతో ఎలా మాట్లాడుకుంటామో అలాగే ఇందులో సంభాషణలు కనిపిస్తాయి. వాస్తవికతను ప్రతిబింబిస్తూ సాగే ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు సరికొత్త ఫీల్‌ను కలిగిస్తుందని అనుకుంటున్నాను.

తెలుగులో తొలిసారి మీ పాత్రకు సొంతంగా డబ్బింగ్ చెప్పారు. ఆ అనుభవం ఎలా ఉంది?

• ప్రపంచంలోనే అతి సుందరమైన భాష తెలుగు. చిన్నప్పటి నుంచి నేను చదువుకున్న తమిళసాహిత్యంలో కూడా అదే విషయాన్ని తెలుసుకున్నాను. సినిమాలో నా పాత్రకు నేనే సొంతంగా డబ్బింగ్ చెప్పుకోవడం సరికొత్త అనుభూతిని పంచింది. సాధారణంగా తమిళ సినిమాలకు సంబంధించి నా పాత్రకు డబ్బింగ్ చెప్పుకోవడానికి ఎనిమిది రోజులు పడుతుంది. కానీ తెలుగులో ఆరు రోజుల్లోనే పూర్తి చేశాను.

రాజకీయాల్లో అడుగుపెట్టే ఆలోచన మీకు ఉందా?

• ప్రస్తుతానికైతే అలాంటి ఆలోచనలు లేవు. అగరం ఫౌండేషన్ ద్వారా పదేళ్లుగా విద్య సంబంధిత కార్యక్రమాల్ని చేపడుతున్నాను. నేను వెళుతున్న ఈ దారి సంతృప్తినిస్తుంది.

రజనీకాంత్, కమల్ హాసన్ రంగప్రవేశంతో తమిళనాడు రాజకీయాల్లో ఎలాంటి మార్పులు వస్తాయని అనుకుంటున్నారు?

• రాజకీయాల పరంగా భవిష్యత్తులో తమిళనాడులో చాలా మార్పులు వస్తాయని ఆశిస్తున్నాను. ఆ ఫలితాల కోసం నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాము. రజనీకాంత్, కమల్‌హాసన్ భిన్న ధృవాల్లాంటి వ్యక్తులు. చిత్రసీమలో తమ కంటూ ప్రత్యేకతను సృష్టించుకున్నారు. సినీనటీనటులు రాజకీయాల్లోకి రావడం ఇది కొత్తేమీ కాదు. గతంలో పలువురు నటులు రాజకీయాల్లో తమదైన ముద్రను వేశారు. రాజకీయాల్లో రాణించాలంటే వ్యక్తిగతంగా చాలా సమయాన్ని వెచ్చించాలి. ప్రజలతో మమేకమై అన్ని విషయాల్ని తెలుసుకోనే ప్రయత్నం చేయాలి. అప్పుడే ఆశించిన లక్ష్యాలను చేరుకోగలుగుతాము.

తదుపరి సినిమా విశేషాలేమిటి?

• సెల్వారాఘవన్, కె. వి. ఆనంద్‌లతో సినిమాలు చేయబోతున్నాను. సెల్వారాఘవన్ సినిమాలో సాయిపల్లవి, రకుల్‌ప్రీత్‌సింగ్ కథానాయికలుగా నటించనున్నారు.



ప్రముఖ నిర్మాత బి.ఏ.రాజు ఆదివారం జన్మదినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు కథానాయకుడు సూర్య శుభాకాంక్షలు అందజేశారు.



జ్ఞానవేల్‌రాజా, ప్రమోద్, విఘ్నేష్‌శివన్, రమ్యకృష్ణ, కీర్తి సురేష్, సూర్య, అల్లు అరవింద్

నా జీవితానికి పూర్తి అర్థాన్నిచ్చింది మీరే!

'ప్రతి ఇక్కరి జీవితంలో 'గ్యాంగ్' అనేది చాలా ముఖ్యమైనది. మన అందరికి స్కూల్, కాలేజ్, పనిచేసే చోట గ్యాంగ్ ఖచ్చితంగా వుంటుంది. అది మన జీవితంలో చాలా ముఖ్యం. ఈ సినిమాకు 'గ్యాంగ్' అని పేరు పెట్టడం చాలా సంతోషంగా వుంది' అన్నారు సూర్య. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'గ్యాంగ్'. విఘ్నేష్ శివన్ దర్శకుడు. యు.వి క్రియేషన్స్ సమర్పణలో కె.ఇ. జ్ఞానవేల్‌రాజా ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇటీవల రాత్రి ప్రీ రిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. హీరో సూర్య మాట్లాడుతూ 'సంక్రాంతికి పవర్‌స్టార్ సినిమాతో పాటు మా సినిమా కూడా విడుదలవుతున్నది. దర్శకుడు విఘ్నేష్‌శివన్ ఈ సినిమాలో నన్ను చాలా భిన్నంగా చూపించారు. రమ్యకృష్ణ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆమె డైలాగ్‌లు చెబుతుంటే నేను నా డైలాగ్‌లు మర్చిపోయేవాడిని. కీర్తిసురేష్ మా 'గ్యాంగ్'కు అదనపు ఆకర్షణ. నా జీవితానికి పూర్తి అర్థాన్నిచ్చింది మీరే. కుటుంబంతో వచ్చి సినిమా చూడండి'అన్నారు.

చిలుకూరి మహిమ ఇది



అల్లాణి శ్రీధర్, అశోక్‌కుమార్

'చిలుకూరి బాలాజీ' సినిమాకు తెలుగు ప్రేక్షకుల నుంచి అపూర్వమైన స్పందన లభిస్తున్నది. భక్తిప్రధాన ఇతివృత్తంతో మంచి సినిమా చేశారని ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారు' అని అన్నారు అల్లాణి శ్రీధర్. ఆయన స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'చిలుకూరి బాలాజీ'. సాయికుమార్, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం, భానుశ్రీమెహ్రా ప్రధాన పాత్రలను పోషించారు. ఇటీవలే ఈ చిత్రం విడుదలైంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకనిర్మాత అల్లాణి శ్రీధర్ మాట్లాడుతూ ' తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన చిలుకూరి బాలాజీ ఆలయ చరిత్ర, గొప్పతనాన్ని ఆవిష్కరిస్తూ రూపొందించిన సినిమా ఇది. చరిత్రకు పౌరాణిక అంశాలను మిళితం చేసి తెరకెక్కించాం. విడుదలలో జాప్యం చోటుచేసుకోవడం, పౌరాణిక సినిమాల్ని నేటితరం చూడరని కొందరు విమర్శించడంతో తొలుత కొంత నిరాశలో మునిగిపోయాను. పేరున్న నటీనటులతో, కథ, కథనాల పరంగా ఎక్కడ రాజీపడకుండా తెరకెక్కించిన సినిమా ఇలా అయిపోయిందేమిటని బాధపడ్డాను. ఈ తరుణంలో రమణాచారి, దిల్‌రాజు నాకు ఎనలేని సహాయాన్ని అందించారు. వారి వల్లే సినిమా జనాల్లోకి వెళ్లింది. తెలంగాణ, ఆంధ్రాలో కలిపి 40 నుంచి 50 థియేటర్లలో విడుదలచేశాం. కథలోని భావోద్వేగాలతో ప్రతి ఒక్కరూ కనెక్ట్ అవుతున్నారు. పెద్ద సినిమాల స్థాయిలో ఆదరిస్తున్నారు. ఈ చిత్రం దర్శకనిర్మాతగా ఎనలేని సంతృప్తినిచ్చింది. ఊహించని విజయమిది. చిలుకూరి బాలాజీ మహిమలవల్లే ఈ విజయం దక్కిందని భావిస్తున్నాను. ఈ నెల 19 నుంచి మరికొన్ని థియేటర్లను పెంచుతున్నాం. త్వరలో ఈ సినిమాను ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి చూపించాలనే ఆలోచనలో ఉన్నాం. ప్రస్తుతం 'నేను సరోజ' పేరుతో ఓ సినిమా చేస్తున్నాను. సందేశాత్మక కథాంశంతో మహిళా ప్రధాన ఇతివృత్తంగా ఈ సినిమా సాగుతుంది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నటుడు అశోక్‌కుమార్, పంపిణీదారుడు రామచంద్ర వారణాసి పాల్గొన్నారు.



దీపికాపదుకునే

25న 'పద్మావత్'?

'పద్మావతి' చిత్ర విడుదలకు మార్గం సుగమం అవుతున్నది. వివాదాలు ఒక్కొక్కటిగా పరిష్కారమవుతుండటంతో ఈ చిత్రాన్ని ఈ నెల 25న విడుదల చేయడానికి చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. రాజ్‌పుత్‌ల ఆందోళనలు నేపథ్యంలో గత ఏడాది డిసెంబర్ 1న విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని వాయిదా వేశారు. ఈ చిత్ర వివాదాన్ని పరిష్కరించడానికి ఇటీవల సెన్సార్‌బోర్డ్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో ప్రముఖ చరిత్రకారులు, మేధావులకు చోటు కల్పించారు. చిత్రాన్ని సమీక్షించిన సెన్సార్ బోర్డ్ 'పద్మావతి' పేరును 'పద్మావత్'గా మార్చమంటూ సూచించిన విషయం తెలిసిందే. అదే సమయంలో సినిమాలోని కొన్ని వివాదాస్పద సన్నివేశాల్ని, ఓ గీతాన్ని తొలగించాలని ఆదేశించింది. సెన్సార్ సూచనల మేరకు సినిమాలో మార్పుల్ని చేస్తామని చిత్ర బృందం హామీ ఇచ్చింది. దీంతో ఈ చిత్రాన్ని రిపబ్లిక్ డే సందర్భంగా ఈ నెల 25న విడుదల చేయబోతున్నారని సమాచారం. సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో రూపొందిన 'పద్మావతి' చిత్రంలో దీపికాపదుకునే టైటిల్‌రోల్‌ని పోషించారు. రణవీర్‌సింగ్, షాహిద్‌కపూర్ ప్రధాన పాత్రల్లో నటించారు.

కొత్తదనం నచ్చింది



సీరత్‌కపూర్, వి.ఐ.ఆనంద్, అల్లు శిరీష్

'నవ్యమైన కథాంశాల్ని ఎంచుకొని సినిమాలు చేస్తే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని 'ఒక్క క్షణం' చిత్రం నిరూపించింది. ఈ విజయం అందించిన స్ఫూర్తితో కథల ఎంపికలో మరింత వైవిధ్యాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నిస్తాను' అన్నారు అల్లు శిరీష్. ఆయన కథానాయకుడిగా నటించిన 'ఒక్క క్షణం' చిత్రం ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది. వి.ఐ.ఆనంద్ దర్శకుడు. చక్రి చిగురుపాటి నిర్మాత. చిత్ర విజయాన్ని పురస్కరించుకొని శనివారం హైదరాబాద్‌లో థ్యాంక్స్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు శిరీష్ మాట్లాడుతూ 'గత సంవత్సరం నాకు ఎన్నో మధురానుభూతుల్ని మిగిల్చింది. ఇప్పటివరకు ఐదు సినిమాల్లో నటించాను. అందులో 'ఒక్క క్షణం' ఉత్తమ చిత్రమని భావిస్తాను. కథలో కొత్తదనం ఉంటే తప్పకుండా విజయం దక్కుతుందని విశ్వసించాను. నా నమ్మకాన్ని నిలబెట్టిందీ చిత్రం. అదే సమయంలో ఈ ఏడాది మోహన్‌లాల్‌గారితో కలిసి మలయాళ సినిమాలో నటించాను. ఆ చిత్రంలో నా నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. ఇలా గత ఏడాది నాకు మంచి జ్ఞాపకాల్ని మిగిల్చింది' అన్నారు. విడుదలైన అన్ని కేంద్రాల్లో ప్రేక్షకులు అద్భుతమైన ఆదరణ కనబరుస్తున్నారని, కాన్సెప్ట్‌లోని కొత్తదనానికి ప్రేక్షకులు విజయం కట్టబెట్టారని దర్శకుడు పేర్కొన్నారు. తనను సోషల్‌మీడియా ద్వారా ఎంతోమంది అభినందిస్తున్నారని, తన కెరీర్‌లో వైవిధ్యభరితమైన చిత్రమిదని కథానాయిక సీరత్‌కపూర్ చెప్పింది.

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	30.0	9.3
నిర్మల్	30.0	9.3
మంచిర్యాల	30.0	9.3
కుమ్రంభీం ఆసిఫాబాద్	30.0	9.3
జగిత్యాల	29.5	10.0
వికారాబాద్	29.6	10.5
ఖమ్మం	30.0	11.0
వరంగల్ రూరల్	29.0	12.0
జనగామ	30.0	12.0
పెద్దపల్లి	30.4	12.4
యాదాద్రి భువనగిరి	27.0	13.0
వరంగల్ అర్బన్	29.0	13.5
సూర్యాపేట	28.0	13.0
జయశంకర్ భూపాలపల్లి	29.0	14.0
మహబూబాబాద్	29.0	14.0
నాగర్‌కర్నూల్	29.0	14.0
జోగుళాంబ గద్వాల	30.0	15.0
వనపర్తి	30.5	15.0
భద్రాద్రి కొత్తగూడెం	30.0	16.0
మహబూబ్‌నగర్	31.4	16.0
కరీంనగర్	34.0	16.5
రాజన్న సిరిసిల్ల	29.0	17.0
మెదక్	30.1	14.4
సంగారెడ్డి	30.1	14.4
సిద్దిపేట	30.1	14.4
నల్లగొండ	28.8	15.6
నిజామాబాద్	29.0	16.0
కామారెడ్డి	29.0	16.0
హైదరాబాద్	23.0	17.0
రంగారెడ్డి	23.0	17.0
మేడ్చల్	23.0	17.0

ఆదిలాబాద్‌లో చలిపంజా

హైదరాబాద్‌లో స్వల్పంగా పెరిగిన చలి

హైదరాబాద్ సిటీబ్యూరో/ ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ: ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతున్నది. ఆదివారం జిల్లాలో 9.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గరిష్ఠ ఉష్ణోగ్రత 30 డిగ్రీలుగా ఉన్నది. శనివారం జిల్లాలో 7.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. రోజురోజుకూ చలి తీవ్రత తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతున్నది. చలిగాలులు వీయడంతో ప్రజలు సాయంత్రం 6 గంటల నుంచే చలిమంటలు కాచుకుంటున్నారు. హైదరాబాద్‌లో రాత్రి ఉష్ణోగ్రతల్లో స్వల్ప పెరుగుదల నమోదయినట్టు ఇక్కడి వాతావరణ కేంద్రం తెలిపింది. చలిగాలుల తీవ్రత తగ్గడంతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కాస్త పెరిగినట్టు ఆ శాఖ అధికారులు ఆదివారం తెలిపారు. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల నుంచి 16 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. హైదరాబాద్‌లో గరిష్ఠంగా 30, కనిష్ఠంగా 13 డిగ్రీలు కాగా.. భద్రాచలంలో 10 డిగ్రీలు, మెదక్‌లో 11 డిగ్రీలు, ఖమ్మం, రామగుండంలో 12 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితను ఆదివారం రాష్ట్ర పోలీసు హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వేట్రాక్‌లపై రాత్రి గస్తీ

పెట్రోలింగ్‌లో పాల్గొన్న రైల్వేబోర్డు చైర్మన్



రాత్రి గస్తీ తీరును పర్యవేక్షిస్తున్న రైల్వే బోర్డు చైర్మన్ అశ్వనీ లోహానీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చలికాలంలో రైల్వేట్రాక్‌లపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ భద్రతా ప్రమాణాలను పాటించాలని రైల్వే బోర్డు చైర్మన్ అశ్వనీ లోహానీ అధికారులకు సూచించారు. 6, 7 తేదీల్లో ఢిల్లీ- రేవరీ సెక్షన్‌లోని రైల్వేట్రాక్‌పై లోహానీ పెట్రోలింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాక్ తీరుతెన్నులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి వివరించారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్ నిర్వహించే సిబ్బందికి చలిని తట్టుకునే విధంగా అధునాతన జాకెట్స్ అందించాలని, నాణ్యమైన బూట్లు, హైలెవల్ చార్జింగ్ టార్చ్‌లైట్లు, ఎల్‌ఈడీ ల్యాంపులు అందించాలని అధికారులను ఆదేశించారు. పెట్రోలింగ్ వాచ్‌లో భాగంగా నాలుగు కిలోమీటర్లు ట్రాక్‌పై నడిచి తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైల్వే అధికారులు, ట్రాక్ పర్యవేక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సాయంపై సన్నాహాలు

- రైతుల అభిప్రాయం మేరకే పంటలకు పెట్టుబడి
- నల్లగొండ జిల్లా చిట్యాలలో రైతులతో మాట్లాడిన మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి

చిట్యాల:



నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో రైతులకు పెట్టుబడి పథకంపై ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్న మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జీ జగదీశ్‌రెడ్డి

పంటసాగులో స్వర్ణయుగాన్ని తీసుకొచ్చే ప్రయత్నాలను రాష్ట్రప్రభుత్వం పక్కాగా అమలు చేస్తున్నది. ఇప్పటికే 24 గంటల విద్యుత్ సరఫరాతో దేశంలో ఏ ప్రభుత్వం చేయనివిధంగా సహకారం అందిస్తున్నది. ఈ వానాకాలం నుంచే వ్యవసాయానికి పెట్టుబడి మద్దతు పథకాన్ని కూడా ప్రారంభించనున్నది. ఈ పథకం అమలు కోసం వ్యవసాయశాఖమంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన కమిటీ వేసిన సంగతి తెలిసిందే. శనివారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో మంత్రులు పోచారం, జీ జగదీశ్‌రెడ్డి రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సమైక్య పాలకులు వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో తెలంగాణ రైతాంగం నష్టపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకం ద్వారా ఎకరాకు రెండు పంటలకు రూ. 8 వేలు చొప్పున ఇవ్వడం హర్షణీయమని పేర్కొన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలోని ధర్మారెడ్డి పిల్లాయపల్లి, బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టులను పూర్తిచేసిన అనంతరం వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందజేయాలని, ప్రస్తుతం 12 గంటల కరంటు ఇస్తేచాలన్నారు. లేదంటే భూగర్భ జలాలు ఇంకిపోయే అవకాశం ఉన్నదని వారు అభిప్రాయపడ్డారు.

పోస్టాఫీసు ద్వారా ఎకరాకు రూ.4వేలు చెల్లించాలి

ఆసరా పథకం కింద ఇస్తున్న పింఛన్ల మాదిరిగానే పోస్టాఫీసు ద్వారా వ్యవసాయ పెట్టుబడి పథకం కింద ప్రభుత్వం ఇచ్చే రూ.4 వేలు ఇవ్వాలి. ఆ విధంగా ఇస్తే ఎలాంటి అన్యాయం జరుగదు. గ్రామాలలో ఏఈవోల సహకారంతో పంటను కూడా పరిశీలించి పథకం వర్తించేలా ప్రభుత్వం సన్నాహాలు చేపట్టాలి.
– నర్రా మోహన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్

బ్యాంకుల ద్వారానే ఇవ్వాలి

ఈ పథకం ద్వారా రైతులకు అందించే పెట్టుబడి బ్యాంకు ద్వారానే ఇస్తే బాగుంటుంది. బ్యాంకుల్లో రుణాలు ఎక్కువ, తక్కువ ఉంటే రూ.4 వేలు బ్యాంకుకు చెల్లుతాయనే భయం ఉంటుంది. ఈ అవకాశం గ్రామీణ బ్యాంకులకు ఇస్తే రైతులకు మేలు జరుగుతుంది. పంటల సాగు విషయంలో ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో అవగాహన కల్పించాలి.
– వెంకటేశ్వరశర్మ, రైతు

రైతు చేతికి నగదు అందజేయాలి

ప్రభుత్వం వ్యవసాయ పెట్టుబడి పథకం కింద అందించే రూ. 4 వేలు నేరుగా రైతుల చేతికే అందించాలి. పంట పండించని రైతులు, కౌలు రైతుతో వ్యవసాయం చేయించేవారు.. వీటిని తీసుకోకుండా అధికారులు ప్రత్యక్షంగా చూసి నేరుగా వారి చేతికే అందించాలి. బ్యాంకుల్లో అయితే క్యాష్ లేదని, ఇతరత్రా కారణాలు చెప్పడంతో నిరక్షరాస్యులైన రైతులు ఇబ్బందులుపడుతారు.
– పీ సత్తిరెడ్డి, రైతు



శ్రీవారి ఆలయంలో కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు

తిరుపతి నుంచి ఇండిగో సర్వీసులు

ప్రారంభించిన విమానయానశాఖ మంత్రి అశోక్‌గజపతిరాజు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇతర ప్రాంతాలకు ఇండిగో సర్వీసులను విమానయానశాఖ మంత్రి అశోక్ గజపతిరాజు ఆదివారం ప్రారంభించారు. తిరుమల శ్రీవారిని దర్శించుకొన్న అనంతరం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న మంత్రికి ఎంపీలు, అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన తిరుపతి నుంచి హైదరాబాద్, బెంగళూరు నగరాలకు ఇండిగో సర్వీసులను ప్రారంభించారు. ప్రపంచంలో దేశీయ విమానాల రాకపోకల్లో భారత్ మొదటి స్థానంలో ఉన్నదని చెప్పారు. విమానాశ్రయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా మరిన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రారంభించిన సర్వీసుల్లో కొన్నింటిని హైదరాబాద్‌కు, మరికొన్నింటిని బెంగళూరుకు నడుపనున్నారు. ఇప్పటివరకు రేణిగుంట నుంచి కేవలం హైదరాబాద్, విజయవాడలకు మాత్రమే విమాన సర్వీసులు నడుస్తున్నాయి. ఎయిర్‌ఇండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్, స్పైస్‌జెట్, ట్రూజెట్‌లు సర్వీసులను కొనసాగిస్తున్నాయి. ఆదివారం నుంచి ఇండిగో సర్వీసులు కూడా అందుబాటులోకి వచ్చాయి.



లాహోర్ రైల్వే స్టేషన్‌లో భారత జాలర్లు

147 మంది భారత జాలర్లను విడుదలచేసిన పాకిస్థాన్

ఇస్లామాబాద్, జనవరి 7: పాకిస్థాన్ 147 మంది భారత జాలర్లను ఆదివారం విడుదలచేసింది. తమ జలాల్లో చేపలు పట్టారనే కారణంతో ఎనిమిది నెలల క్రితం వారిని పాకిస్థాన్ అధికారులు అరెస్ట్‌చేశారు. ఈ క్రమంలో పాకిస్థాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మహమ్మద్ ఫైజల్ మొత్తం 292 మంది భారత జాలర్లను విడుదలచేస్తామని ప్రకటించారు. ఇందులోభాగంగా డిసెంబర్ 28న 145 మందిని.. ఆదివారం మరో 147 మంది విడుదలచేశారు. వారు కరాచీ నుంచి లాహోర్‌కు అల్లమా ఇక్బాల్ ఎక్స్‌ప్రెస్‌లో తీసుకొచ్చారని 'డాన్' పత్రిక తన కథనంలో పేర్కొన్నది. జాలర్ల ప్రయాణ వ్యయాన్ని 'ఈది ఫౌండేషన్' భరించింది. జాలర్లను వాఘా సరిహద్దులో భారత జవాన్లకు అప్పగించినట్టు వెల్లడించింది. ఇంకా పాకిస్థాన్ జైళ్లలో 262 మంది భారత జాలర్లు ఉన్నట్టు మలిర్ జైలు సూపరింటెండెంట్ హసన్ తెలిపారు.

పొంచివున్న ఉష్ణ ముప్పు

మొదటిపేజీ తరువాయి...

ప్రతికూల మార్పులు పెద్దగాలేవని, పర్యావరణ పరిస్థితులు క్షీణించి ఉన్న రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో పరిస్థితి మెరుగ్గా ఉన్నదని చెప్పింది. కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ సూచన మేరకు ఈపీటీఆర్ఐ నాలుగేండ్లకు ఒకసారి నివేదికను రూపొందిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1999, 2003, 2009లో అధ్యయనం చేసింది. తెలంగాణలో జరిపి మొదటి నివేదిక ఇది. రాష్ట్రంలోని పూర్వ నిజామాబాద్, హైదరాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్, మెదక్, రంగారెడ్డి, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో అడవులు, పర్యావరణం, జీవవైవిధ్యం, నీటి వనరులు, సాగునీటి రంగం, వ్యవసాయరంగం దాని అనుబంధ రంగాలు, విద్యుత్, ఖనిజ వనరులు, పర్యావరణ కాలుష్యం, వేస్ట్ మేనేజ్‌మెంట్, పరిశ్రమలు ఇలా మొత్తం 17 రంగాల అభివృద్ధి, పర్యావరణంపై ప్రభావం అనే అంశాలను స్టేట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ రిపోర్ట్-2015లో గణాంకాలతోసహ పొందుపరిచారు. ఈ నివేదిక తయారీకి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా స్టీరింగ్ కమిటీ వేశారు. దీంట్లో ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ కల్యాణ్ చక్రవర్తి, సలహాదారు ఎస్డీ ముఖర్జీ ప్రముఖ శాస్త్రవేత్తలు ఎన్ సునీలా, శేషాచలం, అన్ని ప్రభుత్వశాఖల ముఖ్యకార్యదర్శులు, వివిధరంగాలకు చెందిన 20మంది నిష్ణాతులు,శాస్త్రవేత్తలు, పరిశోధకులు సభ్యులుగా ఉన్నారు.

క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

వేసవి, శీతాకాలం, వానకాలాల్లో వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈపీటీఆర్ఐ సగటు ఉష్ణోగ్రతలు ఎలా పెరుగుతున్నాయో అంచనా వేసింది. 1980వ సంవత్సరం నుంచి ఉష్ణోగ్రతలను, కాలాలను పరిగణలోకి తీసుకున్నది. రాష్ట్రంలో మొత్తంగా 0.4 డిగ్రీ సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత పెరిగిందని తెలిపింది. మార్పు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో పరిస్థితిని ఈపీటీఆర్ఐ విశదీకరించింది. మెదక్ జిల్లాలో సగటు ఉష్ణోగ్రత 31.9 నుంచి 34.1 డిగ్రీల సెల్సియస్‌కు, హైదరాబాద్‌లో 32.2 నుంచి 33.2 డిగ్రీలకు, మహబూబ్‌నగర్‌లో 33 నుంచి 33.9 డిగ్రీలకు, హన్మకొండలో 33.6 నుంచి 34.6 డిగ్రీలకు, నిజామాబాద్‌లో 33.4 నుంచి 34.6 డిగ్రీలకు పెరిగినట్టు తెలిపింది. నల్లగొండ, రామగుండంలో 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగాయని ఈపీటీఆర్ఐ శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఎండాకాలంలో హన్మకొండ, రామగుండం, నల్లగొండ, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 48 నుంచి 49 డిగ్రీల వరకు పెరుగవచ్చని చెప్పన్నారు. ఉమ్మడి కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో థర్మల్ పవర్‌ప్లాంట్ల వల్ల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. సమీప భవిష్యత్‌లో నల్లగొండ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని తెలిపారు.

మెరుపు వరదలు పెరిగే ప్రమాదం

పర్యావరణ సమతుల్యత దెబ్బతిని రాష్ట్రంలో కుండపోత వర్షాలు, మెరుపు వరదలు పెరిగే అవకాశమున్నది. గత కొన్నేండ్లుగా హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, భద్రాచలం, రామగుండం, హన్మకొండ, ఖమ్మం, మెదక్ జిల్లాల్లో ఒకేరోజు 200 నుంచి 355 మిల్లీమీటర్ల వరకు వర్షం కురిసిందని శాస్త్రవేత్తలు ఉదాహరణగా పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కోయిడలో ఒకేరోజు అత్యధికంగా 675 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని చెప్పారు. నష్ట నివారణకు కొన్ని నిర్దిష్టమైన చర్యలను తీసుకోవాలని సూచించారు. కుండపోత వర్షాలను తట్టుకునేలా వరద నీటి కాల్వలను నిర్మించడం, ఉన్న కాల్వల నిడివిని పెంచడం, చెరువులను తవ్వడంతో పాటు చెట్లను విరివిగా పెంచాలని చెప్పారు. రాష్ట్రంలో మిషన్ కాకతీయ పథకం కింద చెరువులను తవ్వడం, హరితహారం కింద కోట్ల సంఖ్యలో మొక్కలను నాటడం ఆహ్వానించదగ్గ పరిణామమని ఈపీటీఆర్ఐ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.



పర్యావరణానికి దోహదం చేసేలా రాష్ట్ర ప్రభుత్వ చర్యలు



తెలంగాణలో వాతావరణ పరిస్థితులు, వివిధ రంగాల్లో అభివృద్ధి, పర్యావరణంపై ప్రభావాన్ని సమగ్రంగా అధ్యయనం చేశాం. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో పెద్దగా ప్రతికూల మార్పులు లేవు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ, హరితహారం వంటి బృహత్తర కార్యక్రమాలు విజయవంతమైతే ప్రస్తుతం అంచనా వేసినట్టు సగటు ఉష్ణోగ్రతలు పెరుగకపోవచ్చు. మాస్ గ్రీన్ హౌజ్ గ్యాసెస్‌ను తగ్గించడానికి నిర్దిష్టమైన నివారణ చర్యలను తీసుకోవాల్సిన అవసరముంది. బొగ్గు ద్వారా ఉత్పత్తి అయ్యే థర్మల్ విద్యుత్‌ను తగ్గించి సోలార్, విండ్ పవర్ ద్వారా విద్యుత్ ఉత్పాదనను పెంచాలని నివేదికలో సూచించాం. వాహనాల కాలుష్యం తగ్గించడానికి మాస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ విధానాన్ని ప్రోత్సహించాలి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు పర్యావరణానికి దోహదపడేలా ఉన్నాయి. అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా వస్తున్న వాతావరణ మార్పులను దృష్టిలో పెట్టుకుని మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.
- కల్యాణ్ చక్రవర్తి, ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్, సీనియర్ ఐఏఎస్ అధికారి

బడ్జెట్ లెక్కల కసరత్తు

మొదటిపేజీ తరువాయి...

ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించడం ద్వారా ప్రారంభించనున్నారు. ఈసారి బీసీ సంక్షేమానికి కేటాయింపులు భారీగా పెరుగుతాయని సమాచారం. ప్రణాళిక, ప్రణాళికేతర పద్దులు లేకుండా రాష్ట్రప్రభుత్వం ప్రగతి పద్దు, నిర్వహణ పద్దు పేరుతో 2017-18 బడ్జెట్‌ను వినూత్నంగా ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అభివృద్ధికి మానవీయ కోణాన్ని జోడించి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసింది. ప్రస్తుతం నడుస్తున్న ఆర్థిక సంవత్సరంలో రూ.1,49,646 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనల్లో ప్రగతి పద్దు రూ.88వేల కోట్లు, నిర్వహణ పద్దు రూ.61వేల కోట్లు కేటాయించారు. ఈసారి కూడా ప్రగతిపద్దు పరిమాణం అధికంగా ఉండే అవకాశం ఉన్నది. ఈ మేరకు బడ్జెట్ అంచనాలు కనీసం 15 శాతం వరకు పెరిగే అవకాశం ఉన్నదని సమాచారం. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పథకాలను పూర్తిచేయడానికి ఎక్కువ నిధులను వెచ్చించాలని యోచిస్తున్నట్లు సమాచారం.

ఏడు అంశాలతో ఎజెండా

కేంద్రం నుంచి రాష్ర్టానికి వచ్చే ఆదాయం, రాష్ట్ర ప్రభుత్వానికి సొంతంగా వచ్చే ఆదాయం ఎంత? ప్రభుత్వ ప్రాధాన్యతలు, పథకాల ఆధారంగా బడ్జెట్ అంచనాలు సిద్ధం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సోమవారంనాటి సీఎస్‌తో జరిగే సమావేశంలో ప్రధానంగా చర్చిస్తారు. ఈ సమావేశం కోసం సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ఏడు అంశాలతో ఎజెండాను ఖరారు చేసింది. ఖరారు చేసిన ఎజెండా ప్రకారం అన్ని వివరాలతో సమావేశానికి హాజరుకావాలని అన్ని శాఖల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులకు సర్క్యులర్ పంపించింది. ఈ ఏడు అంశాలలో ముఖ్యంగా అన్ని శాఖల కార్యదర్శులు, ప్రధాన శాఖాధిపతుల కార్యాలయాలు పౌరసేవలను ఏ విధంగా అందిస్తున్నాయి?.. 15వ ఆర్థిక సంఘం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం సమాచారం ఇవ్వాలని నిర్దేశించారు. వీటితోపాటు కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలు, శాఖలవారీగా ఉద్యోగుల విభజన, తుది కేటాయింపుల సమస్యలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వినియోగ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో సమర్పించడం, రాష్ట్రపతి ఉత్తర్వులు, బెంగుళూరులో ఇటీవల జరిగిన పదో స్టాండింగ్ కమిటీ దక్షిణ జోనల్ కౌన్సిల్ చేసిన సిఫార్సుల అమలులో ప్రగతి, ఇతర ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. ఆయా శాఖలకు ప్రస్తుత సంవత్సరం కేటాయించిన నిధులలో ఇంతవరకు ఎంత ఖర్చయింది, ఇంకా ఎన్ని నిధులు అవసరమున్నాయనే విషయంపై అన్ని ప్రభుత్వ శాఖలు నివేదిక తయారు చేస్తున్నాయి.. ఈనెల 9వ తేదీలోగా అన్ని శాఖలు బడ్జెట్ ప్రతిపాదనలను పంపాలని ఆర్థిక శాఖ ఇప్పటికే ఆదేశాలు జారీచేసింది. దీంతో అన్ని ప్రభుత్వ శాఖలు ఇప్పటికే బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించడంలో నిమగ్నమయ్యాయి.

తుమ్మిళ్లకు నేడు శంకుస్థాపన



రాజోళి మండలం తుమ్మిళ్ల వద్ద జరుగుతున్న ఎత్తిపోతల పథకం మొదటివిడుత పనులు



తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన అనంతరం జరిగే సభా ప్రాంగణం

మొదటిపేజీ తరువాయి...

ఎత్తిపోస్తారు. ఇప్పటివరకూ ఆర్డీఎస్ ద్వారా గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లోని 75గ్రామాల పరిధిలోని 87,500 ఎకరాలకు నీరు రావాల్సి ఉండగా కేవలం 36శాతం అంటే 31వేల ఎకరాలకు మాత్రమే నీరు అందుతున్నది. మిగిలిన 64శాతం ఆయకట్టుకు (55,600 ఎకరాలు) నీళ్లివ్వటం కోసం తుమ్మిళ్ల పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం రూపొందించింది.

నిజాంకాలంలోనే ఆర్డీఎస్ ద్వారా నిండుగా సాగునీరు పారించుకొన్న నడిగడ్డను నాటి ఏపీ సర్కార్ కష్టాల్లోకి నెట్టింది. ఉద్యమకాలంలోనే, ముఖ్యమంత్రి కేసీఆర్ నడిగడ్డ రైతు కోసం గొంతువిప్పారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ చొరవతో మంత్రి హరీశ్‌రావు నడిగడ్డ రైతుల ప్రయోజనాల కోసం అత్యంత ప్రాధాన్యమిచ్చి తుమ్మిళ్ల ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టారు. రెండేండ్లపాటు సర్వేలు చేయించి అన్ని డిజైన్లను పూర్తి చేసి రైతాంగానికి చివరి ఎకరం వరకూ నీళ్లు అందించే పథకాన్ని రూపొందించారు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.783 కోట్లను కేటాయించారు. ఈ నిధులతో రెండు విడుతల్లో పనులు చేయించేందుకు కార్యచరణ చేపట్టారు. మొదటివిడుత పనులను రూ.397 కోట్లతో, రెండో విడుతను రూ.386 కోట్లతో చేపట్టేలా రూపొందించారు. మొదటి విడుత పనుల కోసం గత సెప్టెంబర్‌లో టెండర్లు పూర్తిచేసి.. తుమ్మిళ్ల గ్రామం రాజోళి గ్రామం దగ్గర పనులు ప్రారంభించారు. సుంకేశుల రిజర్వాయర్ ద్వారా ఏర్పాటు చేస్తున్న ఈ ఎత్తిపోతలలో మూడు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసి, ఆర్డీఎస్ 75వ కిలోమీటరు దగ్గర కాలువ ద్వారా డీ-24 డిస్ట్రిబ్యూటర్ నుంచి సాగునీటిని అందిస్తారు. సోమవారం రాజోళి మండలం తుమ్మిళ్ల దగ్గర మంత్రి హరీశ్‌రావు ఎత్తిపోతల పథకం పనులను లాంఛనంగా ప్రారంభించిన అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

ప్రాజెక్టు స్వరూపం..

- తుమ్మిళ్ల గ్రామం వద్ద తుంగభద్ర నది నుంచి 650 మీటర్ల మేర అప్రోచ్ చానల్ నిర్మిస్తారు. తర్వాత 80 మీటర్ల నీటి సంప్ (ఫోర్‌బే) ఆపై పంపుహౌస్‌ను నిర్మించి 5.5 మెగావాట్ల సామర్థ్యంతో రెండు పంపులు, 10.5 మెగావాట్ల సామర్థ్యంతో మరో పంపును ఏర్పాటు చేస్తారు.
- మొదటి దశలో ఆర్డీఎస్ కాల్వకు సమాంతరంగా రెండు పైపులైన్ల ద్వారా సుమారు 687 క్యూసెక్కుల నీటిని తరలించి.. 75 కిలోమీటర్ దగ్గర ఆర్డీఎస్ కాల్వలో పోస్తారు.
- రెండో దశలో.. మల్లమ్మకుంట, జూలకల్, వల్లూర్ రిజర్వాయర్లతోపాటు.. లింక్ కెనాల్స్, ఫీడర్ చానళ్లను నిర్మిస్తారు. రిజర్వాయర్ల నిర్మాణం కోసం 2,553 ఎకరాల మేర భూసేకరణ పనిలో అధికారులు ఉన్నారు.
- రెండో దశలో 10.5 మెగావాట్ల సామర్థ్యంతో మూడో పంపును ఏర్పాటుచేసి.. లిఫ్టు చేసిన 392 క్యూసెక్కుల నీటిని నేరుగా మల్లమ్మ కుంటలో పోస్తారు. ఆపై మిగిలిన రెండు రిజర్వాయర్లకు తరలిస్తారు.

ఆర్థిక అంచనాలు

- తుమ్మిళ్ల అంచనా వ్యయం – రూ.783 కోట్లు:
- మొదటి దశ పాలనా అనుమతి – 397 కోట్లు (ఇందులో గతంలోనే కొనుగోలు చేసిన పైపులు, పంపులు, మోటర్లను వినియోగిస్తున్నారు)
- అధికారులు టెండర్లు పిలిచిన పనుల విలువ – రూ.162.19 కోట్లు
- టెండర్లు దక్కించుకున్న కంపెనీలు – 1.89 శాతం తక్కువకు.. స్యూ ఇన్‌ఫ్రా, వీఎస్‌సీ ఇన్‌ఫ్రా (జాయింట్ వెంచర్)

పనుల పురోగతి...

- మొదటి దశకు కావలసిన 94 ఎకరాల్లో 43.06 ఎకరాలు సేకరించారు. మరో 26.42 ఎకరాలకు పరిహారం చెల్లించే ప్రక్రియ పురోగతిలో ఉంది.
- అప్రోచ్ చానల్, పంపుహౌజ్, ఇతరత్రా అన్ని రకాల డిజైన్లు సిద్ధమయ్యాయి.
- పంపుహౌస్ నుంచి నీటిని తరలించేందుకు వినియోగించే పైపులైన్లను ఇందిరాసాగర్ ప్రాజెక్టు నుంచి తుమ్మిళ్లకు తరలిస్తున్నారు. భూమిలో గతంలోనే పూడ్చిన 15,600 రన్నింగ్ మీటర్ల పైప్‌లైన్లకుగాను 8406 మీటర్ల మేర పైపులను బయటికి తీసి తుమ్మిళ్ల పథకానికి తరలించారు.
- అప్రోచ్‌చానల్, నీటి సంపు (ఫోర్‌బే), పంపుహౌస్, ప్రెషర్ మెయిన్, సిస్టర్న్ నిర్మాణాలకు సంబంధించి.. 7,30,830 క్యూబిక్ మీటర్ల మట్టి పనికిగాను 3, 39, 442 మీటర్ల పని పూర్తయింది. 33, 986 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని పూర్తయింది.
- ఒప్పంద విలువ 159.12 కోట్లలో 14 కోట్ల విలువైన పనులు ఇప్పటికే పూర్తయ్యాయి.

హరీశ్‌రావు పర్యటన వివరాలు

మధ్యాహ్నం 12 గం. : హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో ప్రయాణం
12.30 గం. : నాగర్‌కర్నూల్ జిల్లా తీగలపల్లి గ్రామం ఏదుల రిజర్వాయర్ పరిశీలన
2.30 గం.: తుమ్మిళ్ల రిజర్వాయర్‌కు శంకుస్థాపన: బహిరంగ సభలో ప్రసంగం
సాయంత్రం4.10గం.: తుమ్మిళ్ల నుంచి తిరుగు పయనం



ఆదివారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న రాజ్యసభ సభ్యుడు డీ శ్రీనివాస్

సాగునీటి ప్రాజెక్టులతో
తెలంగాణ సస్యశ్యామలం

- సాగునీటిరంగానికి విద్యాసాగర్‌రావు ఎనలేని కృషి
- ట్రీ-2018 డైరీ ఆవిష్కరణలో జేఎన్టీయూహెచ్ మాజీ వీసీ డీఎన్‌రెడ్డి
- కృష్ణా, గోదావరి బేసిన్లపై అధ్యయనానికి బృందాల ఏర్పాటు
- 'గోదావరి-పెన్నా-కావేరి' నదుల అనుసంధానంపై కేంద్రం ప్రతిపాదనలు ఆమోదయోగ్యం కాదు



ఆదివారం ఎర్రమంజిల్ ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం డైరీని ఆవిష్కరించిన డీఎన్‌రెడ్డి. చిత్రంలో అధ్యక్షుడు చంద్రమౌళి, జనార్ధన్, ప్రసాద్‌రెడ్డి, మదన్‌మోహన్ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గతంలో తెలంగాణ అంటే కేవలం బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేసే ప్రాంతమని.. కానీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా, గోదావరి నదులపై చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులతో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం అవుతుందని జెఎన్టీయూహెచ్ మాజీ వైస్‌చాన్స్‌లర్ డీఎన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎర్రమంజిల్‌లోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్ల సంఘం (ట్రీ) రూపొందించిన డైరీ-2018ని పలువురు ప్రముఖులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ డైరీని ప్రభుత్వ సలహాదారుగా పనిచేసిన సాగునీటిరంగ నిపుణులు ఆర్ విద్యాసాగర్‌రావుకు అంకితం చేశారు. అనంతరం డీఎన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమానికి ముందు, ఆ తర్వాత కూడా తెలంగాణ ఇంజినీర్లు చేస్తున్నకృషి అభినందనీయమని కొనియాడారు. సాగునీటి రంగానికి ఆర్ విద్యాసాగర్‌రావు చేసినసేవలు మరువలేనివని.. పలు ప్రాజెక్టుల రూపకల్పనలో ఆయన భాగస్వామ్యం ఉన్నదని చెప్పారు. తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్ల సంఘం తరపున కేవలం సాగునీటి ప్రాజెక్టులపైనే కాకుండా భూగర్భజలాలను పెంపొందించేందుకుగాను వాననీటి సంరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని ట్రీ అధ్యక్షుడు చంద్రమౌళి చెప్పారు. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా తమిళనాడు, కర్ణాటకలోనూ ట్రీ తరపున వాననీటి సంరక్షణపై విస్తృతంగా పనిచేస్తున్నామని ట్రీ ప్రధాన కార్యదర్శి ఎం శ్యాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలో మంత్రి జగదీశ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కోరిక మేరకు ఏకంగా వంద గ్రామాల్లో వాననీటి ఇంకుడు గుంతలు నిర్మించినట్టు వెల్లడించారు. కాగా ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 'గోదావరి-పెన్నా-కావేరి' నదుల అనుసంధానంపై చేస్తున్న ప్రతిపాదనతో తాము విభేదిస్తున్నట్టు పేర్కొన్నారు. కంతనపల్లి నుంచి నాగార్జునసాగర్ మీదుగా పెన్నా.. ఆపై కావేరికి గోదావరిజలాల తరలింపును తాము ప్రతిపాదిస్తున్నామని, దీనిపై త్వరలో సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. కృష్ణా, గోదావరి బేసిన్లకు 15 మంది చొప్పున ట్రీ నిపుణులతో అధ్యయన బృందాలను ఏర్పాటుచేసినట్టు ఆయన ప్రకటించారు. కృష్ణాబేసిన్ అధ్యయన బృందానికి చైర్మన్‌గా కెప్టెన్ ఆర్ జనార్దన్, కన్వీనర్‌గా రవూఫ్, గోదావరి బేసిన్ అధ్యయన బృందానికి చైర్మన్‌గా అనంతరాములు, కన్వీనర్‌గా వేణుగోపాల్‌రావు వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఎన్సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు, సీఈ లింగయ్య, తెలంగాణ ఇంజినీర్ల జేఏసీ అధ్యక్షుడు టీ వెంకటేశం, ఎలక్ట్రిసిటీ ఇంజినీర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ, పలువురు రిటైర్డ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

దుర్గగుడి ఈవో సూర్యకుమారి బదిలీ

- దేవాదాయశాఖ కమిషనర్ అనూరాధకు ఇంచార్జి బాధ్యతలు



హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ: విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గ ఆలయం ఈవో సూర్యకుమారిని బదిలీ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. దేవాదాయశాఖ కమిషనర్ అనూరాధకు ఇంచార్జి ఈవోగా బాధ్యతలు అప్పగించారు. సూర్యకుమారిని ప్రభుత్వం సాధారణ పరిపాలనశాఖకు సరెండర్ చేసింది. డిసెంబర్ 26వ తేదీ అర్ధరాత్రి అమ్మవారి ఆలయంలో పూజలు జరిగిన మాట వాస్తవమని పోలీసులతోపాటు ప్రభుత్వం నియమించిన రెండు కమిటీలు నివేదికలు ఇచ్చిన నేపథ్యంలో ఏపీ సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. తాంత్రిక పూజలు జరుగకున్నా, ఆలయ నిబంధనలకు విరుద్ధమైన పూజలను దుర్గగుడితో సంబంధంలేని అర్చకుల పర్యవేక్షణలో నిర్వహించినట్టు విచారణలో వెల్లడైంది. ఆలయానికి సంబంధం లేని వ్యక్తులు అంతరాలయంలోకి ప్రవేశించకుండా నిరోధించడంలో ఈవో సూర్యకుమారి విఫలమయ్యారని నివేదికలు స్పష్టంచేశాయి. ఈ నేపథ్యంలోనే ఈవో సూర్యకుమారిపై ప్రభుత్వం బదిలీ వేటువేసింది.

ప్రభుత్వ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టండి

- ప్రభుత్వాన్ని కోరిన టీఎస్‌యూటీఎఫ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యను బలోపేతం చేసేందుకు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) కోరింది. ఇంగ్లిష్ మీడియం తరగతులు ప్రారంభిస్తేనే తల్లిదండ్రులను ప్రభుత్వ విద్య వైపు ఆకర్షించే అవకాశముందని అభిప్రాయపడింది. హైదరాబాద్‌లోని స్థానిక కార్యాలయంలో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అధ్యక్షుడు చిలుకరాజు రాములు మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో గ్రామీణ విద్యాసదస్సులు నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు జూలై నుంచి రావాల్సిన డీఏను ప్రభుత్వం ప్రకటించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి విజ్ఞప్తిచేశారు. పీఆర్సీని ప్రకటించాలని, కోర్టు వివాదంలో ఉన్న ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసుల సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు సీహెచ్ దుర్గాభవాని, కే సోమశేఖర్, కోశాధికారి ఎన్ కిష్టయ్య, కార్యదర్శులు ఏ నర్సిరెడ్డి, పీ మాణిక్‌రెడ్డి, బీ నర్సింహారావు, టీ లక్ష్మారెడ్డి, ఎం దేవదాసు, ఎన్ సరళ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ 1బీ వీసాలపై జోక్యం చేసుకోవాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హెచ్ 1బీ వీసాల జారీని కట్టుదిట్టం చేయాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ప్రధానమంత్రి మోదీ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు జోక్యం చేసుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ కోరారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ట్రంప్ తీసుకున్న నిర్ణయం వల్ల భారతదేశానికి చెందిన సుమారు 15 లక్షల మంది హెచ్1బీ వీసాదారులు ఇబ్బంది పడతారన్నారు. పాకిస్థాన్‌కు అమెరికా సహాయాన్ని నిలిపివేయడాన్ని బీజేపీ తమ ఘనతగా చెప్పుకుంటున్నదని, అయితే హెచ్1బీ వీసాల విషయంలో మాత్రం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

వికలాంగుల కల్యాణ వేదిక ఓ దేవాలయం

వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వికలాంగుల కల్యాణ వేదిక కులమతాలకు అతీతంగా నిర్మించిన దేవాలయం అని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వికలాంగుల కల్యాణవేదిక ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లో జరిగిన లూయిస్ బ్రెయిలీ 209 జయంతి వేడుకల్లో మంత్రి పోచారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులకు సేవ చేస్తే సమాజానికి చేసినట్లేనని చెప్పారు. దివ్యాంగులైన బాలికలను దత్తత తీసుకొని, విద్య నేర్పి, పెండ్లి చేసి, ఉపాధి కల్పిస్తున్న వికలాంగుల కల్యాణ వేదిక సంస్థ అధ్యక్షుడు సుభాశ్‌గుప్త, ఆయన సతీమణిని మంత్రి పోచారం అభినందించారు. సీఎం కేసీఆర్ ఆడబిడ్డల పెండ్లి ఖర్చుల కోసం కల్యాణలక్ష్మి పథకం ప్రవేశపెట్టారని.. మూడేండ్లలో సుమారు 4 లక్షల మందికి ప్రయోజనం లభించిందన్నారు. బాసరలో నిర్మిస్తున్న అంధుల పాఠశాలకు ఎకరం స్థలం నిర్వాహకులు అడిగారని, దీనిపై ఆ జిల్లా కలెక్టర్‌తో చర్చించి స్థలం ఇప్పించడానికి కృషి చేస్తానని మంత్రి హామీఇచ్చారు. సంస్థ నిర్వహణకు తన వంతుగా రూ.లక్ష అందిస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యదర్శి ఎం జగదీశ్, వేదిక నిర్వాహకులు పాల్గొన్నారు.



ఆదివారం సరూర్‌నగర్‌లో వికలాంగుల కల్యాణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

డబుల్ బెడ్‌రూం ఇండ్లలో వికలాంగులకు ఐదుశాతం కోటాపై హర్షం

సీఎం కేసీఆర్, ఎంపీ కవితకు వికలాంగుల నెట్‌వర్క్ సంస్థ కృతజ్ఞతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డబుల్ బెడ్‌రూం ఇండ్లలో వికలాంగులకు ఐదు శాతం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించడం దేశానికే ఆదర్శమని వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రీనివాసులు అన్నారు. ఐదు శాతం కోట ఇవ్వడం పట్ల వికలాంగులు సంతోషంగా ఉన్నారని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు. జాగృతి వికలాంగుల విభాగం కన్వీనర్ అంజనారెడ్డితో ఎంపీ కల్వకుంట్ల కవితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పౌరుషానికి ప్రతీక సమ్మక్క-సారలమ్మ

సమ్మక్క-సారలమ్మ దివ్యచరిత్ర సీడీలను ఆవిష్కరించిన ఎంపీ కవిత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కోట్లాది భక్తుల కొంగుబంగారమై వెలసిన సమ్మక్క- సారలమ్మలు.. ఆత్మగౌరవానికి, పౌరుషానికి ప్రతీక అని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. మేడారం సమ్మక్క-సారలమ్మ పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తినిస్తుందని చెప్పారు. సమ్మక్క-సారలమ్మ దివ్యచరిత్రపై తెలంగాణ జాగృతి సాంస్కృతిక విభాగం రూపొందించిన పాటల సీడీలను ఆదివారం హైదరాబాద్‌లో తన కార్యాలయంలో ఎంపీ కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ మట్టిపొరల్లోంచి మొలకెత్తిన వీరగాథ మేడారం సమ్మక్క-సారలమ్మ దివ్య చరిత్ర అని పేర్కొన్నారు. కరువుతో అల్లాడుతున్న అడవిబిడ్డలను శిస్తుకట్టాలని పీడించడమే కాకుండా.. మేడారం రాజ్యంపై చతురంగ దళాలతో దాడిచేసిన కాకతీయసేనను సంప్రదాయ ఆయుధాలతో నిలువరించే ప్రయత్నం చేసిన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, జంపన్న త్యాగాలను కండ్లకు అద్దుకుందామని చెప్పారు. వారి పోరాటపటిమ అనన్య సామాన్యమని పేర్కొన్నారు. పిలుస్తే పలికే దైవంగా నీరజనాలు అందుకుంటున్న సమ్మక్క, సారలమ్మ జాతరను రెండేండ్లకోసారి గిరిజన సంప్రదాయం ప్రకారం నిర్వహిస్తారని, కోట్లాదిమంది తరలివస్తారని వివరించారు. సమ్మక్క-సారలమ్మ దివ్య చరిత్రను సమాజానికి తెలియజేసేందుకు కష్టపడిన జాగృతి సాంస్కృతిక విభాగం కన్వీనర్ కొదారి శ్రీనును ఎంపీ కవిత అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌ఆచారి, ఉపాధ్యక్షుడు మేడే రాజీవ్‌సాగర్, యువజన, విద్యార్థి విభాగాల కన్వీనర్లు కోరబోయిన విజయ్‌కుమార్, పసుల చరణ్‌తోపాటు సాజన్, బబ్బీ, రజీ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం హైదరాబాద్‌లో సమ్మక్క-సారలమ్మ దివ్యచరిత్ర సీడీలను ఆవిష్కరిస్తున్న నిజామాబాద్ ఎంపీ కవిత

కోటి విలువైన విదేశీ మద్యం సీజ్

- ఏడుగురు నిందితుల అరెస్టు
- 220 బాటిళ్లు, ఒక ట్రావెల్స్ బస్సు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ వెల్లడి



ఆదివారం హైదరాబాద్‌లో అక్రమంగా విదేశీ మద్యం విక్రయిస్తున్న ముఠా వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అక్రమంగా విదేశీ మద్యం విక్రయిస్తున్న ముఠా ఆగడాలకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అడ్డుకట్టవేశారు. సుమారు రూ.కోటి విలువైన విదేశీ మద్యాన్ని పట్టుకుని ఏడుగురు నిందితులతో కూడిన ముఠాను అరెస్టుచేశారు. మిగతా ముగ్గురు పరారీలో ఉన్నారు. వీరికోసం గాలింపు చర్యలు చేపట్టారు. అక్రమ విదేశీ మద్యం ముఠా వివరాలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. విదేశీ మద్యాన్ని మలేషియా, శ్రీలంక దేశాల నుంచి చెన్నై సముద్రతీరానికి తెచ్చి.. అక్కడి నుంచి ట్రావెల్స్ బస్సుల ద్వారా హైదరాబాద్‌కు తీసుకొస్తున్నట్టు తెలిపారు. ఇలా గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం నిర్వహిస్తున్న 10 మంది సభ్యుల ముఠా హైదరాబాద్‌లో ఏడాదికి రూ.6 కోట్ల వరకు వ్యాపారం చేస్తున్నదని చెప్పారు. చెన్నైకి చెందిన మాణిక్యం అనే నిందితుడు విదేశీ మద్యాన్ని హైదరాబాద్‌లో అమ్మేందుకు హరీశ్‌సింగ్ (ధూల్‌పేట్)ను ఏజెంట్‌గా పెట్టుకున్నాడు. అతను కొంతమంది ఏజెంట్లను నియమించుకుని నెలకు 500 నుంచి 600 బాటిళ్లను విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు హరీశ్‌సింగ్ అమీర్‌పేటలో నిర్వహిస్తున్న గోదాంపై దాడులు చేసి విదేశీ మద్యాన్ని పట్టుకున్నారు. అలాగే ఎల్‌బీనగర్‌లో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేస్తుండగా రెండు విదేశీ మద్యం బాటిళ్ల బ్యాగులు లభించాయి. వేర్వేరు చోట్ల చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో డ్యూటీ చెల్లించని విదేశీ మద్యం బాటిళ్లు 220 లభ్యమయ్యాయి. విచారణలో భాగంగా రాజేశ్, కాకాని భాస్కర్ (బస్సు డ్రైవర్), గోపీకృష్ణ (బస్సు డ్రైవర్), గంజి అనిల్‌కుమార్, నిరంజన్‌రెడ్డి, దాసరి మహేశ్‌కుమార్ (పేట్ బషీరాబాద్)లను అరెస్టు చేశారు. కార్తీక్ (ఆరంఘర్) మాణిక్యం (చెన్నై), నరేశ్ (చెన్నైలోని మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ మేనేజర్) అనే ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. వీరికోసం ప్రత్యేక బృందం గాలింపు చర్యలు చేపట్టిందని అకున్ సబర్వాల్ తెలిపారు. విదేశీ మద్యాన్ని సరఫరా చేస్తున్న ఒక ట్రావెల్స్ బస్సు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు చెప్పారు. తక్కువ ధరకు విదేశీ మద్యం అని విక్రయాలు చేస్తున్నారని.. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుందని తెలిపారు. నాన్ డ్యూటీ పెయిడ్ (ఎన్‌డీపీ) మద్యం అసలుదా? నకిలీదా? అనేది స్పష్టత ఉండదని వివరించారు. కొన్ని సందర్భాల్లో ఈ మద్యాన్ని తీసుకుంటే అనర్థాలు జరిగి ప్రాణనష్టం కూడా సంభవించే ప్రమాదం ఉంటుందని అకున్ సబర్వాల్ హెచ్చరించారు.

అక్రమరవాణా చేస్తే బస్సులు వేలం..

అక్రమ మత్తు పదార్థాలు, విదేశీ మద్యం రవాణా చేసే ట్రావెల్స్ బస్సులను వేలం వేసి అమ్మేస్తామని తెలిపారు. ఎక్సైజ్ చట్టం ప్రకారం ట్రావెల్స్ బస్సు అక్రమంగా సరుకు రవాణా చేస్తే కేసు నమోదు చేసిన 60 రోజుల్లో సదరు బస్సును బహిరంగ మార్కెట్‌లో వేలం వేసి అమ్మే హక్కు ఉన్నదని ఆయన వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో హైదరాబాద్, రంగారెడ్డి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లు వివేకానందరెడ్డి, ఖురేషీ, ఎస్టీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ హరికిషన్ పాల్గొన్నారు. దాడుల్లో ఏఈఎస్ పవన్‌కుమార్, మలక్‌పేట ఎక్సైజ్ సీఐ రాజేశ్వర్‌రావు, కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ సీఐ వెంకటేశం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని జిల్లాల్లో
ఆధునిక పోలీసింగ్..

- ఆన్‌లైన్ మోసాలను అరికట్టడానికి సిబ్బంది ఎంపిక
- కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న పోలీసులకు ప్రత్యేక శిక్షణ
- జిల్లాల పర్యటనలో పోలీసు అధికారులకు డీజీపీ ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నూతన సంవత్సరంలో రాష్ట్ర పోలీస్ విభాగాన్ని ఆధునిక టెక్నాలజీతో అనుసంధానించేందుకు కార్యాచరణను ప్రారంభించారు. ఒకవైపు కమ్యూనిటీ పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో జిల్లాల్లో జనంలోకి వెళ్లేందుకు కార్యక్రమాలు చేపడుతూనే.. టెక్నాలజీ వినియోగం, ఆన్‌లైన్ మోసాలను అరికట్టడం, సీసీ కెమెరాలు ఏర్పాటు తదితర విషయాలపై రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని డీజీపీ మహేందర్‌రెడ్డి నిర్ణయించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉన్న సిబ్బందిని ఎంపికచేసి వారికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని డీజీపీ ఇప్పటికే అన్ని జిల్లాల ఎస్పీలకు సూచించారు. నేటి జీవనం మొత్తం ఆన్‌లైన్‌తో ముడిపడి ఉంది. సమాచార సేకరణ, బ్యాంక్ లావాదేవీలు మొదలు అన్నిరంగాల్లో మొబైల్, కంప్యూటర్ వాడకం పెరిగింది. నేరగాళ్లు కూడా ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ నేరాలు రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతున్నాయి. 2016లో రాష్ట్రవ్యాప్తంగా 513 సైబర్ నేరాలు నమోదుకాగా, 2017లో ఈ నేరాల సంఖ్య 1,136కు పెరిగింది. సైబర్ నేరాలు హైదరాబాద్‌తోపాటు పట్టణాలు, గ్రామాలకు కూడా వ్యాపించాయి. రాష్ట్రవ్యాప్తంగా 2018లో టెక్నాలజీ సహాయంతో నేరాలను అదుపు చేయడంతోపాటు శాంతి భద్రతల పరిరక్షణ, నేరగాళ్లపై నిఘాపెట్టి ప్రజల్లో భద్రతపై భరోసా కల్పించాలన్న లక్ష్యంతో పోలీసుశాఖ ముందుకు వెళ్తున్నది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో రెండేండ్ల కిందట ఏర్పాటు చేసిన సైబర్ ల్యాబ్ మంచి ఫలితాలను ఇస్తున్నది. ఈ ల్యాబ్ ఏర్పాటుతో నేరగాళ్లపై నిఘా పెట్టడంతోపాటు, వారిని త్వరగా పట్టుకునేందుకు అవకాశం ఉంటున్నది. టెక్నాలజీ సహాయంతో ట్రాకింగ్ చేసి నేరగాళ్లు ఎక్కడ దాచుకున్నా గుర్తించడంతోపాటు, పూర్తి ఆధారాలతో కోర్టుల్లోచార్జిషీట్ దాఖలు చేస్తున్నారు. ఈ ప్రక్రియను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాలని డీజీపీ మహేందర్‌రెడ్డి నిర్ణయించారు. జిల్లాల పర్యటనలో భాగంగా దీనిపై ఆయా జిల్లాల పోలీస్ అధికారులకు దీనిని వివరిస్తున్నారు. ఆసక్తి, కేసు దర్యాప్తులో చురుకుదనం, కంప్యూటర్‌పై అవగాహన ఉన్న సిబ్బందిని ఎంపిక చేయాలని సూచిస్తున్నారు. సెల్‌ఫోన్, కంప్యూటర్, ల్యాప్‌టాప్ వాడకం, సంఘటనా స్థలం నుంచి ఆధారాల సేకరణకు సాంకేతిక పరికరాల వినియోగం వంటి అంశాలపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

గర్భిణులకు మిడ్‌వైఫరీ నర్సుల అండ

- దేశంలోనే తొలిసారిగా సిబ్బందికి శిక్షణ
- ప్రసవాలు అధికంగా జరిగే దవాఖానల్లో త్వరలో వారి నియామకం
- రెగ్యులర్ వేతనంతోపాటు అదనంగా రూ.15 వేల చెల్లింపు
- వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక చర్యలు



మిడ్‌వైఫరీ కోర్సులో నర్సులకు శిక్షణ ఇస్తున్న కరీంనగర్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

మన దేశంలో ప్రతిఏటా దాదాపు 10 లక్షల మంది మహిళలు గర్భధారణ, ప్రసవ సంబంధ కారణాల వల్ల మరణిస్తున్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మాతా శిశు సంరక్షణలో భాగంగా త్వరలోనే మిడ్‌వైఫరీ సిబ్బందిని అందుబాటులోకి తీసుకురానున్నది. ప్రస్తుత సమాజంలో గర్భధారణ, ప్రసవం అనేది ఒక సమస్యగా మారింది. గర్భందాల్చిన నాటి నుంచి ప్రసవం వరకు జరిగే ప్రక్రియలను అత్యంత సాధారణంగా భావించేలా సేవలు, సలహాలు, చికిత్సలు అందించడమే ధ్యేయంగా దేశంలోనే తొలిసారి మిడ్‌వైఫరీ నర్స్ ప్రాక్టీషనర్ డిప్లొమాను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. మాతా శిశు మరణాలు తగ్గించి వారి సంరక్షణ కోసం మిడ్‌వైఫరీలను అందుబాటులో తెచ్చేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ శిక్షణ కార్యక్రమాలు చేపట్టింది. తొలి బృందానికి రెండు నెలలుగా కరీంనగర్‌లో శిక్షణ ఇస్తున్నది.

మిడ్‌వైఫరీ సిబ్బంది అంటే...

ప్రసవ సమయంలో మహిళలు ప్రాణాలు కోల్పోకుండా ఉండాలంటే సరైన సేవలు, చికిత్స పట్ల అవగాహన అవసరం. గర్భధారణ, ప్రసవ సంబంధ కారణాల వల్ల జరిగే అనారోగ్యాలను పూర్తిగా నిరోధించాల్సి ఉన్నది. తల్లీ బిడ్డల సంరక్షణకు అన్నిచర్యలు, జాగ్రత్తలు తీసుకునేందుకు ప్రభుత్వం మిడ్‌వైఫరీ నర్స్ ప్రాక్టీషనర్ డిప్లొమా కోర్సును ప్రవేశపెట్టింది. గర్భందాల్చిన నాటి నుంచి ప్రసవం వరకు మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్య సహాయం, ప్రసవానంతరం నవజాత శిశువుకు అందించాల్సిన సేవలపై మిడ్‌వైఫరీ కార్యకర్తలకు శిక్షణతో పూర్తి అవగాహన కల్పిస్తారు. మిడ్‌వైఫరీ అంటే సహజ ప్రసవాలకు నమ్మకమైన, వృత్తిపరమైన నిపుణురాలు అని అర్థం. గర్భధారణ, ప్రసవ సంబంధ సమస్యలను తగ్గించడం, సహజ ప్రసవం జరిగేలా జాగ్రత్త పడటం, శస్త్రచికిత్స (సీ-సెక్షన్) ఆవశ్యకతను వీలైనంత తగ్గించడం, ప్రసవం కోసం ప్రతితల్లి తనకు అనుకూలమైన స్థలాన్ని ఎన్నుకొనేలా, సుఖ ప్రసవం కోసం సలహాలు, శిశువుకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించడం మిడ్‌వైఫరీ విధులు.

శిక్షణ ఇలా...

రాష్ట్రంలో మిడ్‌వైఫరీ నర్స్ ప్రాక్టీషనర్ డిప్లొమా కోర్సును జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసి ప్రభుత్వ సర్వీసులో ఉన్న 40 ఏండ్లలోపు వారికి శిక్షణ ఇస్తున్నారు. ఏడాదిపాటు ఇచ్చే శిక్షణలో ప్రతి బ్యాచ్‌లో 30 మంది ఉంటారు. శిక్షణ కాలంలో వారికి వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారు. శిక్షణ అనంతరం వారిని మిడ్‌వైఫరీ కార్యకర్తలుగా సూచిస్తూ జిల్లాల్లో ప్రసవాలు అధికంగా జరిగే దవాఖానల్లో నియమిస్తారు. ప్రత్యేక శిక్షణ పొంది డెలివరీ సెంటర్లలో పనిచేస్తున్నందుకు వీరికి రెగ్యులర్ వేతనంతోపాటు అదనంగా నెలకు రూ.15 వేలు చెల్లిస్తారు.

మాతాశిశు మరణాల నియంత్రణకోసం..

రాష్ట్రంలో మాతాశిశు మరణాల నియంత్రణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ల పథకం కారణంగా సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెరిగింది. సిజేరియన్ల అవసరం లేకుండా సహజ ప్రసవాలు జరిగేలా దేశంలోనే తొలిగా మన రాష్ట్రంలో మిడ్‌వైఫరీ సిబ్బందిని అందుబాటులోకి తీసుకొస్తున్నాం. మిడ్‌వైఫరీ నర్స్ ప్రాక్టీషనర్ డిప్లొమా కోర్సును ప్రవేశపెట్టి నర్సులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. తద్వారా ప్రసవ మరణాలకు ఫుల్‌స్టాప్ పడనున్నది.

- లక్ష్మారెడ్డి, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి

కేసీఆర్ పాలనలో తెలంగాణ సుభిక్షం

- పాలమూరు లిఫ్ట్ పనులకు అడ్డంకులు తొలుగుతాయి..
- మూడు నెలల్లో హైకోర్టు విభజన: ఎంపీ జితేందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: గతంలో ఏ ప్రభుత్వ హయాంలో జరుగని అభివృద్ధి సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్నదని టీఆర్‌ఎస్ పార్లమెంటరీ నేత, పాలమూరు ఎంపీ జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేవలం 288 ఎకరాల్లో మాత్రమే అడ్డంకులున్నాయని.. మిగిలిన ప్రాంతాల్లో వేగంగా పనులు సాగుతున్నాయన్నారు. 2004లో పాలమూరు జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తే.. నేడు 7.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడిన 15 రోజుల్లోనే జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాంచల్‌లో హైకోర్టులు ఏర్పాటు చేశారన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి మూడేండ్లు పూర్తయినా.. కొందరి స్వార్థ రాజకీయాల వల్ల హైకోర్టు ఏర్పాటు జాప్యమైందన్నారు. ఈ విషయంపై పార్లమెంట్‌ను రెండురోజులపాటు స్తంభింపజేశామని వివరించారు. న్యాయమైన డిమాండ్‌ను గుర్తించిన కేంద్రం ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడి హైకోర్టు విభజనపై నిర్ణయం తీసుకోవాలని సూచించిందని పేర్కొన్నారు. సికింద్రాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు రూ.1200 కోట్లతో రైల్వే డబ్లింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. పాలమూరు జిల్లా రైతులకు మేలు చేసేందుకు సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. దీంతో రంగారెడ్డి, మెదక్, నల్లగొండ తదితర జిల్లాల రైతులకు ఎంతో వెసులుబాటు కల్గిందన్నారు. పాస్‌పోర్టు కోసం హైదరాబాద్‌కు వెళ్లి దళారుల దగ్గర పాలమూరు బిడ్డలు మోసపోయేవారని, ప్రస్తుతం వారికి పాస్‌పోర్టు కష్టాలు లేకుండా చేశామన్నారు. సమావేశంలో టీఆర్‌ఎస్ పాలమూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాద్మి శివకుమార్, ఈజీఎస్ డైరెక్టర్ కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ ఫిర్యాదుల కోసం ఎస్‌వోపీ

న్యూఢిల్లీ, జనవరి 7: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలు నేపథ్యంలో యాంటీ ప్రాఫిటీరింగ్ రూల్స్ క్రింద ఫిర్యాదుల సంఖ్య నానాటికీ పెరిగిపోతుండటంపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ఈ సమస్య పరిష్కారానికి ఓ ప్రామాణిక నిర్వహణ విధానం (ఎస్‌వోపీ)తో త్వరలో ముందుకు రానున్నది. ఒకే దేశం.. ఒకే పన్ను.. ఒకే మార్కెట్ లక్ష్యంతో ఈ ఏడాది జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. అయితే జీఎస్టీతో చేకూరిన ప్రయోజనాలు కొనుగోలుదారులకు దక్కకుండా లాభాపేక్షతో ఆయా వస్తువులను వ్యాపారులు అధిక ధరలకు అమ్ముకుంటుండటం ప్రభుత్వ ఆశయాన్ని నీరుగార్చుతున్నది. జీఎస్టీలో పన్నులు తగ్గినా.. పాత పన్నుల ప్రకారమే వస్తువులను ఎక్కువ మొత్తానికి విక్రయిస్తున్నారంటూ వినియోగదారుల నుంచి 170 ఫిర్యాదులు స్టాండింగ్ కమిటీ, స్క్రీనింగ్ కమిటీలకు వచ్చాయి. ఇందులో 50 కేసులు తదుపరి దర్యాప్తు నిమిత్తం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సేఫ్‌గార్డ్స్ (డీజీఎస్)కు సిఫారసు చేయగా, ఐదు కేసుల్లో విచారణ కూడా మొదలైంది. అయితే నిర్ణీత మూడు నెలల వ్యవధిలో ఈ ఫిర్యాదుల పరిశీలన, నివేదికలను నేషనల్ యాంటీ-ప్రాఫిటీరింగ్ అథారిటీకి అందించడం డీజీఎస్‌కు కష్టతరంగా మారింది. దీంతో మరో మూడు నెలల సమయం కోరుతుండటంతో ఫిర్యాదులను స్టాండింగ్ కమిటీ, స్క్రీనింగ్ కమిటీలే పర్యవేక్షించేలా ఎస్‌వోపీ మార్గదర్శకాలను ఆర్థిక శాఖ సిద్ధం చేస్తున్నది. సత్వర పరిష్కారమే లక్ష్యంగా ఎస్‌వోపీ ఉండనుంది.





ఇప్పుడే వద్దు

పునరుద్ధరణకు ఐదేండ్ల గడువివ్వాలి

ఎయిరిండియా ప్రైవేటీకరణపై పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ, జనవరి 7: అప్పుల ఊబిలో కూరుకుపోయిన ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియాను ప్రైవేటీకరించేందుకు ఇది సరైన సమయం కాదని, ఆ సంస్థ నుంచి పెట్టుబడుల ఉపసంహరణకు తీసుకున్న నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచన చేసి, ఇతర ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించాలని పార్లమెంటరీ కమిటీ స్పష్టం చేసింది. దేశానికే గర్వకారణమైన ఎయిరిండియా రుణాలను రద్దుచేయడండతో పాటు అప్పుల ఊబి నుంచి ఆ సంస్థ బయటపడేందుకు కనీసం ఐదేండ్ల గడువివ్వాల్సిన అవసరం ఉందని కమిటీ పేర్కొంది. ఎయిరిండియాలో మూలధన సమీకరణ దశల వారీగా చేపట్టడంతో సంస్థ ఆర్థిక, నిర్వహణా సామర్థ్యం దెబ్బతిని అధిక వడ్డీలకు రుణాలు తీసుకోవాల్సి వచ్చిందని రవాణా, పర్యాటక, సాంస్కృతిక రంగాలకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం అభిప్రాయపడింది. ఈ అభిప్రాయాలకు సంబంధించిన సవరణలతో ఒక ముసాయిదాను కమిటీ రూపొందించింది. టర్న్ ఎరౌండ్ ప్లాన్ (టీఏపీ), ఆర్థిక పునర్నిర్మాణ పథకం (ఎఫ్‌ఆర్‌పీ) కింద అప్పుల్లో ఉన్న ఎయిరిండియాను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం గతంలో 2012 నుంచి 2022 వరకు సమయమిచ్చిన విషయం తెలిసిందే. ఇదే విధానాన్ని ప్రభుత్వం పరిశీలించాలని, ఆ గడువు పూర్తయ్యే నాటికి ఎయిరిండియా పనితీరు మెరుగుపడిందా? లేదా? అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుని పెట్టుబడుల ఉపసంహరణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కమిటీ సూచించింది. అలాగే ఎయిరిండియా వాటాదారుల వాదనను కమిటీ పరిశీలించింది. ఎయిరిండియా ఇప్పుడిప్పుడే లాభాలను ఆర్జిస్తోందని, కనుక ఇటువంటి సమయంలో ఆ సంస్థను ప్రైవేటీకరించడం సరికాదని కమిటీ అభిప్రాయపడింది. ఎయిరిండియా అనుబంధ సంస్థల్లోని ఏఐఏటీఎస్‌ఎల్ (ఎయిరిండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్), ఏఐఎస్‌ఏటీఎస్ (ఎయిరిండియా ఎస్‌ఏటీఎస్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్), అలయన్స్ ఎయిర్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ లాంటి సంస్థలు లాభాలను ఆర్జిస్తున్నాయని, కనుక ఈ సంస్థలను ప్రైవేటీకరించరాదని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. ఎయిరిండియా నుంచి పెట్టుబడులను ఉపసంహరించాలన్న ప్రభుత్వ నిర్ణయం వలన ఆ సంస్థలో పనిచేస్తున్న ఎంతో మంది ఉద్యోగాలను కోల్పోయే ప్రమాదం ఉందని కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం నిర్ణయించినట్లుగా ఎయిరిండియాతో పాటు దాని అనుబంధ సంస్థల నుంచి పెట్టుబడులను ఉపసంహరించడం అనివార్యమైతే తొలుత ఉద్యోగుల ప్రయోజనాలను పరిరక్షించాలని ఈ కమిటీ పేర్కొన్నది.

అన్ని రైల్వే స్టేషన్లలో వైఫై

వచ్చే ఏడాది మార్చికల్లా మొత్తం 8,500 స్టేషన్లలో ఏర్పాటు.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణికులతోపాటు ప్రజలకూ ఉచిత ఇంటర్నెట్

రూ.700 కోట్ల వ్యయంతో రైల్వే మంత్రిత్వ శాఖ ప్రణాళిక.. డిజిటల్ ఇండియాకు ఊతమిస్తూ నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 7:

దేశంలోని అన్ని రైల్వే స్టేషన్లలో వైఫై సేవలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామీణ, మారుమూల ప్రాంతాలుసహా దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 8,500 రైల్వే స్టేషన్లకు రూ.700 కోట్ల వ్యయంతో వైఫై సౌకర్యాన్ని కల్పించాలని రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. వచ్చే ఏడాది మార్చికల్లా మొత్తం వైఫై స్టేషన్లే ఉండాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్న రైల్వే శాఖ.. ఈ ఏడాది మార్చినాటికి 600 స్టేషన్లను టార్గెట్‌గా పెట్టుకున్నది. కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు తలపెట్టిన ప్రతిష్ఠాత్మక డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 216 ప్రధాన స్టేషన్లలో రైల్వే శాఖ వైఫై సౌకర్యాన్ని కల్పించిన విషయం తెలిసిందే. దీనివల్ల 70 లక్షల ప్రయాణికులు ఉచితంగా ఇంటర్నెట్‌ను వినియోగించుకోగలుగుతున్నారు. 'దైనందిన జీవితంలో ఇంటర్నెట్ అవసరం రోజురోజుకూ పెరిగిపోతున్నది. అలాంటి ఈ సౌకర్యాన్ని మేము దేశంలోగల అన్ని రైల్వే స్టేషన్లలో అందించనున్నాం' అని రైల్వే మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇటీవలి సమావేశంలో ఈ మేరకు ఓ ప్రణాళికను ఆమోదించగా, ప్రయాణికుల సౌకర్యార్థం 1,200 స్టేషన్లలో వైఫై సేవలను ప్రారంభించనున్న రైల్వే శాఖ.. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోగల సుమారు 7,300 స్టేషన్లలో మాత్రం అటు ప్రయాణికులకు, ఇటు స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా వైఫైని అందుబాటులోకి తీసుకురానుండటం గమనార్హం.



గ్రామీణ భారతానికి డిజిటల్ హంగులు

ఈ-గవర్నెన్స్‌కు ఊతమిచ్చేలా ఈ 7,300 స్టేషన్లలో విస్తృతస్థాయి వైఫై నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. డిజిటల్ బ్యాంకింగ్, ఆధార్ నమోదు, జనన, మరణ తదితర ప్రభుత్వ ధ్రువపత్రాల జారీ, పన్నుల దాఖలు, బిల్లుల చెల్లింపులు ఇతరత్రా సేవలను ప్రజానీకం ఇంటర్నెట్ ద్వారా పొందేలా గ్రామీణ రైల్వే స్టేషన్లలో వైఫైతో కూడిన కియోస్క్‌లను పెట్టనున్నారు. ఈ కియోస్క్‌ల ద్వారా గ్రామీణ ప్రజలు ఆన్‌లైన్ షాపింగ్‌నూ చేయవచ్చు. వివిధ ఈ-కామర్స్ పోర్టల్స్‌పై వస్తువులను ఆర్డర్ చేసి తెప్పించుకోవచ్చు. 'స్థానిక ప్రజల కోసం ప్రైవేట్ భాగస్వామ్యంతో స్టేషన్లలో ఈ కియోస్క్‌లను నిర్వహిస్తాం. టెలికం మంత్రిత్వ శాఖతో కలిసి వీటిని డిజిటల్ హాట్ స్పాట్లుగా మార్చుతాం' అని సదరు సీనియర్ అధికారి చెప్పారు. రైల్ వైఫై వ్యవస్థను కేవలం ప్రయాణికులకే గాకుండా మరింతమంది ప్రజలకూ దగ్గర చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఇది ప్రభుత్వ 'డిజిటల్ ఇండియా' కలనూ నేరవేర్చేందుకు దోహదపడగలదన్న విశ్వాసాన్ని ఆయన ఈ సందర్భంగా వెలిబుచ్చారు.



ఆన్‌లైన్‌లో 'పతంజలి' వ్యాపార విస్తరణ

- ఎనిమిది ఈ-కామర్స్ సంస్థలతో ఈ నెలలోనే ఒప్పందాలు

న్యూఢిల్లీ, జనవరి 7: ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్ ఆధ్వర్యంలోని పతంజలి ఆయుర్వేద సంస్థ ఆన్‌లైన్‌లో తమ వ్యాపారాన్ని మరింతగా విస్తరించేందుకు కసరత్తు చేస్తున్నది. ఎఫ్‌ఎంసీజీ (ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్) రంగంలో అనేక రకాల స్వదేశీ ఉత్పత్తులను అమ్ముతున్న పతంజలి ఈ ప్రణాళికలో భాగంగా ఎనిమిది ప్రఖ్యాత ఈ-కామర్స్ సంస్థలతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకోనున్నది. హరిద్వార్ కేంద్రంగా పనిచేస్తున్న తమ సంస్థ అమెజాన్, పేటీఎం మాల్, 1ఎంజీ, బిగ్‌బాస్కెట్, గ్రోఫర్స్, షాప్‌క్లూస్, స్నాప్‌డీల్ తదితర ప్రముఖ ఆన్‌లైన్ రిటైల్ వ్యాపార సంస్థలతో ఈ నెలలోనే ఒప్పందాలను కుదుర్చుకునే అవకాశం ఉందని, దీంతో తాము అమ్ముతున్న వివిధ రకాల ఉత్పత్తులు ఇకమీదట ఆన్‌లైన్‌లో కూడా వినియోగదారులకు లభ్యమవుతాయని పతంజలి కంపెనీ అధికారి ఒకరు ఆదివారం వెల్లడించారు. ఆన్‌లైన్‌లో వ్యాపారాన్ని విస్తరించాలన్న ప్రణాళికలో భాగంగా పతంజలి ఈ నెల 16న న్యూఢిల్లీలో ఒక కార్యక్రమాన్ని నిర్వహించనున్నది. రామ్‌దేవ్‌తో పాటు పతంజలి మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణ పాల్గొనే ఈ కార్యక్రమానికి అన్ని ఆన్‌లైన్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని ఆ సంస్థ భావిస్తున్నది. 'మా వ్యాపారాన్ని భారీ స్థాయిలో విస్తరించబోతున్నాం. ఇందులో భాగంగా మా ఉత్పత్తులన్నింటినీ ఆన్‌లైన్‌లోకి తీసుకొచ్చేందుకు ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకోబోతున్నాం. ఈ ప్రక్రియ పూర్తయితే మా ఉత్పత్తులు అట్టడుగు స్థాయి వినియోగదారులకు సైతం చేరువవుతాయి' అని పతంజలి సంస్థ అధికార ప్రతినిధి ఎస్కే తిజారావాలా స్పష్టం చేశారు.

ఆర్థిక ఫలితాలపై ఆధారం

ఐఐపీ, ద్రవ్యోల్బణ గణాంకాలూ కీలకమే

ముడి చమురు ధరలు, రూపాయి విలువపైనా మదుపరుల దృష్టి

న్యూఢిల్లీ, జనవరి 7: దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, ఐఐపీ, ద్రవ్యోల్బణ గణాంకాల ఆధారంగా ట్రేడ్ కావచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. భారతీయ ఐటీ దిగ్గజాలు టీసీఎస్, ఇన్ఫోసిస్ ఈ ఆర్థిక సంవత్సరం (2017-18) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్)గాను ఈ వారమే తమ ఆర్థిక ఫలితాలను ప్రకటిస్తున్నాయి. గురువారం టీసీఎస్, శుక్రవారం ఇన్ఫోసిస్ సంస్థలు ఫలితాలను వెల్లడిస్తున్నాయి. అలాగే శుక్రవారమే నవంబర్‌కుగాను పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) గణాంకాలు, డిసెంబర్‌కుగాను వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ద్రవ్యోల్బణం గణాంకాలు విడుదలవుతున్నాయి. దీంతో వీటి ఆధారంగా మదుపరులు తమ పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకోవచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ క్యాపిటల్ మార్కెట్ వ్యూహకర్త, ప్రైవేట్ క్లయింట్ గ్రూప్ అధిపతి వీకే శర్మ అన్నారు. టీసీఎస్‌తో క్యూ3 ఫలితాల వెల్లడి మొదలవుతున్నదని, కాబట్టి దీని ఫలితాల ప్రభావం మార్కెట్ తీరుతెన్నులపై అధికంగా ఉండొచ్చని ఎపిక్ రిసెర్చ్ సీఈవో ముస్తఫా నదీమ్ అంచనా వేశారు. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, విదేశీ పెట్టుబడుల తీరు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల కదలికలు భారతీయ స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేయగలవన్న అంచనాల్ని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఈ ఏడాదికి శుభారంభాన్నిస్తూ గత వారం సెన్సెక్స్ 97 పాయింట్లు, నిఫ్టీ 28 పాయింట్లు లాభపడిన విషయం తెలిసిందే.



నేడు ప్రభుత్వ బాండ్ల వేలం

విదేశీ మదుపరుల కోసం సోమవారం రూ.6,600 కోట్లకుపైగా విలువైన ప్రభుత్వ బాండ్లను బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) వేలం వేయనుంది. ఇటీవలికాలంలో ఈ బాండ్లలో పెట్టుబడులకు విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) అమితాసక్తిని ప్రదర్శిస్తున్న నేపథ్యంలో ఈసారి వేలానికీ విశేష స్పందన రాగలదన్న ఆశాభావాన్ని బీఎస్ఈ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. కాగా, సాధారణ ట్రేడింగ్ అనంతరం మధ్యాహ్నం 3:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండు గంటలపాటు ఈ వేలం జరుగనున్నది. 'జనవరి 8న మా 'ఈబిడ్‌ఎక్స్చేంజ్' వేదికపై రూ.6,666 కోట్ల విలువైన ప్రభుత్వ రుణ సెక్యూరిటీలను ఎఫ్ఐఐ/ఎఫ్‌పీఐల కోసం వేలం వేస్తున్నాం' అని ఓ ప్రకటనలో బీఎస్ఈ తెలియజేసింది. గత నెలలో జరిగిన వేలంలో రూ.3,074 కోట్ల విలువైన ఆఫర్‌కు రూ.4,061 కోట్ల విలువైన బిడ్లు విదేశీ మదుపరుల నుంచి దాఖలయ్యాయి.

రూ.27 వేల కోట్లు ఆవిరి


గత వారం ట్రేడింగ్‌లో టాప్-10 సంస్థల్లో ఏడింటి మార్కెట్ విలువ రూ.26,971 కోట్లు ఆవిరైపోయింది. టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, హెచ్‌యూఎల్, మారుతి సుజుకీ, ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్ సంస్థల షేర్ల విలువ పడిపోయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ, ఓఎన్‌జీసీ విలువ మాత్రం రూ.7,500 కోట్లకుపైగా పెరిగింది. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం టాప్-10 కంపెనీల్లో రిలయన్స్ రూ.5,84,582.37 కోట్లతో మొదటి స్థానంలో ఉండగా, టీసీఎస్ రెండో స్థానంలో కొనసాగుతున్నది.



ప్రగతి పథంలో పతంగుల పరిశ్రమ

- గుజరాత్‌లో 48 వేల మందికి ఉపాధి
- ఈ ఏడాది 2.5 శాతం పెరుగనున్న వృద్ధి

అహ్మదాబాద్, జనవరి 7: గుజరాత్‌లోని పతంగుల తయారీ పరిశ్రమ ప్రగతి పథంలో దూసుకెళ్తున్నది. 48 వేల మందికిపైగా ఉపాధి కల్పిస్తున్న ఈ పరిశ్రమ గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.5 శాతం ఎక్కువ వృద్ధిని నమోదు చేసే అవకాశాలున్నాయని ఆ రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్‌జే హైదార్ అహ్మదాబాద్‌లో విలేకరులకు తెలిపారు. గుజరాత్‌లో నిర్వహించే ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ (అంతర్జాతీయ పతంగుల ఉత్సవం)కు ప్రజాదరణ విపరీతంగా పెరుగుతుండటంతో రాష్ట్రంలో పతంగుల తయారీ పరిశ్రమ కూడా స్థిరమైన వృద్ధితో ముందుకు సాగుతున్నదని ఆయన చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పరిశ్రమ రూ.625 కోట్ల నుంచి రూ.630 కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తుందని అంచనా వేస్తున్నామని, గత ఆర్థిక సంవత్సరం (2016-17)లో వచ్చిన ఆదాయంతో పోలిస్తే ఇది 2.5 శాతం అధికమని ఆయన వివరించారు. 2015-16లో రూ.572 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిన గుజరాత్ పతంగుల తయారీ పరిశ్రమ 2016-17లో 7.5 శాతం వృద్ధితో రూ.615 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని, అయితే దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలుతో తలెత్తిన ఇబ్బందుల వలన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని, ఏది ఏమైనప్పటికీ త్వరలోనే పరిస్థితులు చక్కబడి వృద్ధిరేటు పరిమాణం మళ్లీ పెరుగుతుందని భావిస్తున్నామని ఆయన తెలిపారు. ఇదిలావుంటే, ఈ ఏడాది గుజరాత్‌లో నిర్వహిస్తున్న 29వ అంతర్జాతీయ పతంగుల ఉత్సవాన్ని తిలకించేందుకు ఆదివారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకూ సందర్శకులను అనుమతించనున్నారు. ఈ ఉత్సవాన్ని ఆ రాష్ట్ర గవర్నర్ ఓపీ కోహ్లీ, ముఖ్యమంత్రి విజయ్ రూపానీ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్ రూపానీ మాట్లాడుతూ.. గుజరాత్ కైట్ ఫెస్టివల్‌కు అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ప్రజాదరణ లభిస్తున్నదని, రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ఇది ఎంతగానో దోహదం చేస్తున్నదని సంతోషాన్ని వ్యక్తం చేశారు.



మొండి బకాయిలను రాబట్టుకోవడంలో

చిన్న బ్యాంకులే నయం


ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించడంలో పెద్ద బ్యాంకుల వెనుకంజ

న్యూఢిల్లీ, జనవరి 7:

నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) సమస్యను పరిష్కరించుకోవడం ద్వారా మొండి బకాయిలను రాబట్టుకునేందుకు ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్)ని ఆశ్రయించి, దివాలా చట్టం కింద చర్యలు చేపట్టడంలో పెద్ద బ్యాంకుల కంటే చిన్న బ్యాంకులే ముందంజలో ఉన్నాయి. ఈ జాబితాలోని పెద్ద బ్యాంకుల్లో బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) అగ్రస్థానంలో నిలువగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) లాంటి మిగిలిన పెద్ద బ్యాంకుల కంటే యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, దేనా బ్యాంక్ లాంటి చిన్న బ్యాంకులే ఎన్‌సీఎల్‌టీకి ఎక్కువ కేసులను నివేదించడం విశేషం. అయితే ఇటువంటి కేసుల విలువ పరంగా చూస్తే ఈ జాబితాలో ఎస్‌బీఐ అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాది సెప్టెంబర్ చివరి నాటికి ఈ బ్యాంకు దాదాపు రూ.34,100 కోట్ల మొండి బకాయిలకు సంబంధించిన 18 కేసులను ప్రారంభించింది. సెప్టెంబర్ 30వ తేదీ నాటికి దివాలా చట్టం కింద చర్యలు ప్రారంభమైన మొత్తం కేసుల సంఖ్య 330 గానూ, వాటి మొత్తం ఆస్తుల విలువ రూ.1.07,000 కోట్లు గానూ ఉన్నట్లు ప్రముఖ జాతీయ పత్రిక స్పష్టం చేసింది. సమాచార హక్కు (ఆర్‌టీఐ) ద్వారా రాబట్టిన సమాధానాలను ఆధారంగా చేసుకుని ఈ వివరాలను వెల్లడించిన ఆ పత్రిక.. ఇటువంటి కేసులు ఇంకా ఎన్నో ఉండవచ్చని పేర్కొన్నది. ఆర్‌టీఐ కింద తాము అడిగిన సమాచారాన్ని 17 బ్యాంకులు ఇచ్చాయని, అయితే ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్ ఈ సమాచారాన్ని అందజేసేందుకు నిరాకరించాయని ఆ పత్రిక తెలిపింది. అలాగే బ్యాంకుల వారీగా అడిగిన ఈ సమాచారం తమ వద్ద లేవని రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) పేర్కొంటూ, ఆ వివరాలను అందజేయాల్సిందిగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌కు సూచించిందని, అయితే ఆ వివరాలను ఎన్‌సీఎల్‌టీ ఇప్పటివరకూ అందజేయలేదని ఆ పత్రిక వివరించింది. రూ.46,300 కోట్ల విలువైన 5.30 లక్షల నిరర్థక ఆస్తుల ఖాతాలను కలిగివున్న బ్యాంక్ ఆఫ్ బరోడా గత ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ నాటికి వీటిలో 55 కేసులను ఎన్‌సీఎల్‌టీకి నివేదించిందని, ఈ కేసులకు సంబంధించిన మొత్తం మొండి బకాయిలు రూ.12,294 కోట్లుగా ఉన్నాయని ఆ పత్రిక వెల్లడించింది. అలాగే రూ.52,000 కోట్ల నిరర్థక ఆస్తులను కలిగివున్న బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.14,856 కోట్ల మొండి బకాయిలకు సంబంధించిన 51 కేసులను, యూకో బ్యాంక్ రూ.7,265 కోట్ల మొండి బకాయిలకు సంబంధించిన 30 కేసులను, పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.3,400 కోట్ల మొండి బకాయిలకు సంబంధించిన 23 కేసులను, దేనా బ్యాంక్ రూ.3,400 కోట్ల మొండి బకాయిలకు సంబంధించిన 23 కేసులను, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర రూ.5,296 కోట్ల మొండి బకాయిలకు సంబంధించిన 28 కేసులను, ఆంధ్రా బ్యాంకు రూ.5,766 కోట్ల నిరర్థక ఆస్తులకు సంబంధించిన కేసులను, కెనరా బ్యాంక్ ఒకే ఒక్క కేసును ఎన్‌సీఎల్‌టీకి నివేదించాయని ఆ పత్రిక వివరించింది.

టాప్-6 జాబితా

బ్యాంకు	ఎన్‌సీఎల్‌టీలో కేసులు	ఎన్‌పీఏలు (రూ. వందల కోట్లలో)
బ్యాంక్ ఆఫ్ బరోడా	55	123
బ్యాంక్ ఆఫ్ ఇండియా	51	149
యూకో బ్యాంక్	30	73
పంజాబ్ నేషనల్ బ్యాంక్	23	34
దేనా బ్యాంక్	23	34
ఎస్‌బీఐ	18	341



రూ.100 కోట్లకు మించి ఎగ్గొట్టిన సంస్థలు 1,463

ఎస్‌బీఐ ఖాతాలే ఎక్కువ.. తర్వాతి స్థానాల్లో పీఎన్‌బీ, కెనరా

దేశంలోని పలు కార్పొరేట్ సంస్థలతో పాటు బడా వ్యాపార, పారిశ్రామికవేత్తలు బ్యాంకులకు భారీ మొత్తంలో రుణాలను ఎగవేస్తుండటంతో వాటిలో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) గణనీయంగా పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ రంగంలోని 21 బ్యాంకులకు రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ మొత్తంలో రుణాలను ఎగ్గొట్టిన సంస్థలు 1,463 వరకు ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల్లో అతిపెద్దదైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్) ముగిసే నాటికి ఎస్‌బీఐలో ఇటువంటి ఖాతాలు 265 ఉండటంతో ఆ మొండి బకాయిలు రూ.77,538 కోట్లకు చేరాయి. ఈ జాబితాలో ఎస్‌బీఐ తర్వాత పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ద్వితీయ స్థానంలో నిలిచింది. పీఎన్‌బీకి రూ.100 కోట్ల కంటే ఎక్కువ మొత్తంలో రుణాలను ఎగ్గొట్టిన ఖాతాలు 143 ఉండటంతో ఆ మొండి బకాయిలు రూ.45,973 కోట్లకు పెరిగాయి. పీఎన్‌బీ తర్వాత ఈ జాబితాలో కెనరా బ్యాంకు తృతీయ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ రంగంలోని చిన్న బ్యాంకుల జాబితాలో యూనియన్ బ్యాంకు ఇటువంటి 79 ఖాతాలతో అగ్రస్థానంలో నిలువగా, రూ.100 కోట్ల కంటే ఎక్కువ మొత్తంలో రుణాలు ఎగ్గొట్టిన ఖాతాలు ఓరియంటల్ బ్యాంక్‌లో 68, యూకో బ్యాంక్‌లో 62 ఉన్నట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఇటువంటి ఖాతాల సంఖ్య నానాటికీ పెరుగుతుండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సర రెండో త్రైమాసికం చివరి నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు రూ.7.34 లక్షల కోట్లకు చేరుకున్న విషయం తెలిసిందే.







1. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో 'నమస్తే తెలంగాణ' ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో ముగ్గులు వేస్తున్న మహిళలు
2. మెదక్‌లోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ముగ్గులను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి
3. నిర్మల్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వల్లకొండ శోభారాణి తదితరులు

ఆకట్టుకున్న రంగవల్లులు

'నమస్తే తెలంగాణ' ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: సంక్రాంతిని పురస్కరించుకొని 'నమస్తే తెలంగాణ' ఆధ్వర్యంలో ఆయా జిల్లాల్లో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు ఉత్సాహంగా కదలివచ్చి పోటీపడి రంగురంగుల ముగ్గులు వేశారు. మెదక్‌లోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పోటీలో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి ముగ్గు వేసి అందరిని ఆకట్టుకున్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మల్లికార్జున ఆలయ ఆవరణలో, ఆందోల్ వాసవీ కల్యాణమండపం ఆవరణలో, కరీంనగర్‌లోని పద్మానగర్ మానేరు ఉన్నత పాఠశాలలో, సూర్యాపేటలో, నల్లగొండ ఎన్జీ కాలేజీ మైదానం, భూపాలపల్లిలోని సింగరేణి అంబేద్కర్ స్టేడియం, నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో పోటీలు నిర్వహించారు.



గద్వాల జిల్లా అయిజ మండలం ఉడిగొనిపల్లిలో ప్రసంగిస్తున్న మంత్రి తలసాని. చిత్రంలో జెడ్పీ చైర్మన్ భాస్కర్ తదితరులు

రాష్ట్రానికి 37లక్షల గొర్రెల దిగుమతి

రూ.5వేల కోట్లతో గొర్రెల పథకం: మంత్రి తలసాని

జోగుళాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి: గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా రాష్ట్రానికి 37లక్షల గొర్రెలను దిగుమతి చేసుకోగా వాటికి దాదాపు 13 లక్షల పిల్లలు పుట్టినట్టు పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఉడిగొనిపల్లిలో గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ పథకానికి గాను రూ.5వేల కోట్లను కేటాయించి 75శాతం సబ్సిడీతో రెండు విడతల్లో గొర్రెలను అందజేస్తున్నామని తెలిపారు. గొర్రెల చికిత్స కోసం 1962 వాహనం ద్వారా వైద్య సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గొల్ల కురుమల అభివృద్ధి సంస్థ చైర్మన్ రాజేశ్వర్ యాదవ్, జెడ్పీ చైర్మన్ భాస్కర్, ఎమ్మెల్యే సంపత్, బీసీ కమిషన్ సభ్యుడు ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.



తాండూరు నియోజకవర్గం బషీరాబాద్ మండలం జీవన్గీ వంతెన పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ. 342 కోట్ల నిధులు

పనులను పరిశీలించిన రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు, నమస్తే తెలంగాణ: వికారాబాద్ జిల్లాలోని ఆర్‌అండ్‌బీ రోడ్లు, వంతెనల పనులకు ఏడాది కాలంలోనే రూ.342 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని.. ఈ నిధులతో జిల్లాలో 28 చోట్ల పనులు కొనసాగుతున్నాయని రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం తాండూరు నియోజకవర్గం బషీరాబాద్, పెద్దేముల్ మండలాలతోపాటు తాండూరు పట్టణంలో విస్తృతంగా పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. జీవన్గీ వంతెనకు కాంగ్రెస్ నాయకులు 1988లో శంకుస్థాపన చేసి వదిలేశారని.. టీఆర్‌ఎస్ సర్కార్ అధికారంలో వచ్చాక రూ. 18 కోట్ల నిధులు కేటాయించి జీవన్గీ వంతెన పనులను చేపడుతున్నదన్నారు. తాండూరు పట్టణంలో, పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలో కొండా వెంకటరంగారెడ్డి ఫౌండేషన్, అపోలో దవాఖానల సౌజన్యంతో నిర్వహించిన హెల్త్ క్యాంపులను ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు.



కొత్తచెరువు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న నిరంజన్‌రెడ్డి

గట్టుఖానాపూర్‌లో కొత్త చెరువు నిర్మాణం

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పెద్దమందడి: వ్యవసాయానికి అనువైన ప్రతీ చోట కొత్త చెరువులను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి మండలంలోని గట్టుఖానాపూర్ గ్రామంలో పల్లెబస చేసిన నిరంజన్‌రెడ్డి ఆదివారం ఉదయం గ్రామంలో పర్యటించి, సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలోని కోటగట్టు, దేవర్లగట్టు నడుమ కొత్త చెరువు ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. సంక్రాంతి తర్వాత సర్వే చేయించి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.



సభలో ప్రసంగిస్తున్న టీఎమ్మార్పీస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

మాదిగలు అన్నిరంగాల్లో రాణించాలి

- టీఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగ
- ముగిసిన రెండు రాష్ట్రాల కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులు

నాగార్జున సాగర్: మాదిగలు విద్య, ఆర్థిక, రాజకీయాల్లో రాణించినప్పుడే నిర్ణయాత్మక శక్తిగా ఎదిగే అవకాశం ఉంటుందని టీఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగ పేర్కొన్నారు. విద్యలో వెనుకబడటం వల్లే మాదిగలు అభివృద్ధిలో వెనకబడి పోయారన్నారు. రాబోయే రోజుల్లో జంబూద్వీప జ్ఞానకేంద్రాలను ప్రతి మాదిగ పల్లెల్లో ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆదివారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయవిహార్‌లో తెలుగు రాష్ట్రాల టీఎమ్మార్పీఎస్ కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. మాదిగలకు రాజకీయ చైతన్యం లేకపోవడం వల్లే వివక్షకు గురవుతున్నారని పేర్కొన్నారు. అనంతరం ప్రజాగాయకుడు గద్దర్ మాట్లాడుతూ. ప్రాధాన్యం లేని అంశాలను వదిలిపెట్టి రాజ్యాధికారం వైపుగా మాదిగలు పయనించాలన్నారు. మాదిగల్లో చైతన్యం కలిగించే బాధ్యత టీఎమ్మార్పీస్ పైనే ఉన్నదని పేర్కొన్నారు. ప్రొఫెసర్ కొల్లూరి చిరంజీవి, ప్రముఖ న్యాయవాది వైకే, ఎంబీసీ నేత కోప్రా, జంబూద్వీప శక్తి పీఠాధిపతి భగవతి మహరాజ్, జాతీయ ప్రధాన కార్యదర్శి మేడిపాపయ్యమాదిగ, జిల్లా ఇంచార్జి లింగాల పెద్దన్న, జిల్లా అధ్యక్షుడు మొండికత్తి లింగయ్య, అల్లారం రత్నయ్య పాల్గొన్నారు.

కేజీబీవీల్లో పెరిగిన నాన్‌వెజ్ కోటా

- నెలలో ఆరుసార్లు..
- ఈ నెల నుంచి మెనూ మార్చాం
- ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి



నాగర్‌కర్నూల్ జిల్లా రాయలగండిలో విద్యార్థినులతో ముచ్చటిస్తున్న ఉపముఖ్యమంత్రి కడియం

అచ్చంపేట, నమస్తే తెలంగాణ: విద్యారంగంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టిసారించారని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో పర్యటించారు. ముందుగా పదర మండలం రాయలగండి వద్ద ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రూ.50లక్షల నిధులచే ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమి పూజచేశారు. అనంతరం కేజీబీవీ విద్యార్థినులకు కాస్మోటిక్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. కొత్తగా 81 కేజీబీవీలను ఏర్పాటు చేశామన్నారు. ఈనెల నుంచి కొత్త మెనూ ప్రవేశపెట్టినట్టు చెప్పారు. ఇదివరకు నెలకు రెండుసార్లు చికెన్ అందించగా, తాజాగా నెలలో ఆరుసార్లు మాంసాహారం అందిస్తున్నామన్నారు. ఇందులో నాలుగుసార్లు చికెన్, రెండు సార్లు మటన్ పెట్టాలని ఆదేశించినట్టు చెప్పారు. కేజీబీవీల్లో వసతుల కల్పన, మెరుగైన విద్య అందించేందుకు రూ. 375కోట్లు ఖర్చు చేశామన్నారు. సీసీ కెమెరాలు, మినరల్ వాటర్ కోసం ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థినుల ఆరోగ్యం కోసం మూడు నెలలకోసారి 15 రకాల వస్తువులతో హెల్త్ కిట్స్ అందిస్తున్నట్టు చెప్పారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన 100మంది కడియం, ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

దళితుల జీవితాల్లో వెలుగులే కేసీఆర్ లక్ష్యం

ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట జిల్లాకేంద్రంలో నిర్వహించిన దళిత యువజన సదస్సును ఉద్దేశించి మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి

కుడకుడరోడ్డు (సూర్యాపేట): దళితుల జీవితాల్లో వెలుగులు నింపడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖల మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేటలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన నియోజకవర్గ దళితుల సదస్సులో మంత్రి పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు బడ్జెట్‌లో పెద్దపీట వేశారన్నారు. రాష్ట్రంలో ఎస్సీ యువత స్వశక్తితో నిలబడేలా దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.5లక్షల సబ్సిడీతో రుణాలందిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని 73గ్రామాలకు చెందిన దళిత యువతకు 162 క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం సూర్యాపేటలోని గాంధీపార్కులో సుధాబ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళికా ప్రకాశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వై వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కాకి కృపాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నేరెళ్ల లక్ష్మి, ప్రముఖ సినీ గాయకులు కేబీకే మోహన్‌రాజు, ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా సత్యనారాయణ, బ్యాంకు ఎండీ పెద్దిరెడ్డి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ జిల్లా బేల మండలం కొగ్దూర్ గ్రామంలో ఎడ్లబండిపై మంత్రి జోగు రామన్న

దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ

బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ: అద్భుతమైన సంక్షేమ పథకాలతో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కురుమ సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి రూ.5 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం జైనథ్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యం అందుతున్న తీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బేల మండలంలో కోగ్దూర్ గ్రామంలో రూ.5లక్షల వ్యయంతో నిర్మించనున్న ట్యాంకుకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఒక వరమని మంత్రి తెలిపారు.

ఉక్కుపరిశ్రమ ఏర్పాటుకు ముందడుగు

- మహబూబాబాద్, కొత్తగూడెం జిల్లాల్లో కేంద్ర బృందం పర్యటన
- పరిశ్రమ ఏర్పాటుకు స్థల పరిశీలన



మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం ధర్మాపురం రెవెన్యూ గ్రామంలో అటవీ ప్రాంతానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న మైకాన్ సంస్థ ప్రతినిధులు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ/ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు మరో ముందడుగు పడింది. కేంద్రబృందం ఆదివారం మహబూబాబాద్ జిల్లా పరిధిలోని బయ్యారం ప్రాంతంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం ఉల్వనూరు, కిన్నెరసాని, లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి, లాలుతండా ప్రాంతాల్లోని భూములను పరిశీలించింది. మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతంతోపాటు పొరుగునే ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో ఇనుప నిక్షేపాలున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో అనువైన స్థలంలో ఉక్కు కర్మాగారం నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వ బృందం బయ్యారం ప్రాంతంలో పర్యటించింది. బయ్యారం ఇనుప రాతి గుట్టల సమీపంలో ఉన్న స్థలాన్ని పరిశీలించింది. కేంద్రం హామీ మేరకు రాంచీకి చెందిన మైకాన్ సంస్థకు చెందిన కొముతి రంజన్, ఆనంద్‌కుమార్, యూఎస్ రజాక్, శశిభూషణ్‌కుమార్‌తో కూడిన ప్రతినిధుల బృందం సభ్యులు బయ్యారంలో పర్యటించి ఇనుపరాతి గుట్టలు, అక్కడున్న స్థలాలకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. వీరివెంట భూగర్భ గనులశాఖ జేడీ రషీ అహ్మద్‌తోపాటు జిల్లాకు చెందిన భూగర్భ గనులశాఖ అధికారి రామాచారి, బయ్యారం తహసీల్దార్ రాధాకృష్ణ ఉన్నారు. ఈ సందర్భంగా స్థలంతోపాటు నీరు, రైలు మార్గాలకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా బయ్యారం మండలం ధర్మపురంలో భూమిని పరిశీలించారు. బయ్యారం పెద్ద చెరువును సందర్శించి నీటి లభ్యతను తెలుసుకున్నారు. బయ్యారం, గార్ల మధ్య రహదారులతోపాటు గార్లలో రైలు మార్గాన్ని, పరిశ్రమకు అవసరమైన విద్యుత్ కోసం అనంతాద్రిలోని సబ్‌స్టేషన్, కొత్తగూడెం జిల్లా పరిధిలోని కిన్నెరసానిలో స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన నీటి లభ్యతను పరిశీలించి సమగ్ర వివరాలను సేకరించారు.

టీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు



మహబూబ్‌నగర్‌లో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లోకి వలసలు జోరుగా సాగుతున్నాయి. ఆదివారం కూడా భారీగా చేరారు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలో 50 మంది కాంగ్రెస్ నాయకులు ఎంపీ బీబీపాటిల్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలంలో 20మంది యువకులు ఎమ్మెల్సీలు కశిరెడ్డి నారాయణరెడ్డి, నరేందర్‌రెడ్డి సమక్షంలో, వరంగల్ రూరల్ జిల్లా పరకాలలో కాంగ్రెస్, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు సమక్షంలో, నర్సంపేట మండలంలో కాంగ్రెస్ నాయకులు సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో, మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడకు చెందిన 65 మంది టీడీపీ, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో, కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో 150 మంది యువకులు, బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్‌లో 30 మైనార్టీ కుటుంబాలు ఆర్మూరు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో సీపీఐ, కాంగ్రెస్‌కు చెందిన వంద మంది ఎమ్మెల్యే చిన్నయ్య సమక్షంలో, నల్లగొండ జిల్లా మునుగోడులో 250మంది ఎమ్మెల్యే కే ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో, కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో డెబ్బై కుటుంబాల వారు ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.



వికారాబాద్ జిల్లా తుంకిమెట్లలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్సీలు కశిరెడ్డి నారాయణరెడ్డి, నరేందర్‌రెడ్డి



కోటిలింగాలకు పర్యాటక సందడి

వెల్గటూర్: జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల వద్ద గోదావరిలో శనివారం నుంచి బోటింగ్ ప్రారంభించడంతో ఆదివారం పర్యాటకుల సందడి కనిపించింది. శాతకర్ణి, పులోమావి బోట్లతో పాటు, స్పీడ్ బోటులో పర్యాటకులు జలవిహారం చేసి గోదావరి అందాలను తిలకించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

పుట్టింటికి పంపిన భర్త, అత్త మామలు

భర్త ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన బాధితురాలు

దుగ్గొండి: అదనపు కట్నం తేవాలంటూ భర్త, అత్తమామలు పుట్టింటికి పంపించడంతో తనకు న్యాయం చేయాలంటూ ఓ మహిళ అత్తగారింటి ఎదుట బైఠాయించింది. వరంగల్‌రూరల్ జిల్లా దుగ్గొండి మండలం పొనకల్ గ్రామంలో ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకున్నది. బాధితురాలి కథనం ప్రకారం.. దుగ్గొండి మండలం పొనకల్ గ్రామానికి చెందిన బస్వాటి రాజేశ్వర్‌రావు, రాధాబాయిల కుమారుడు శరత్‌బాబుకు వరంగల్ అర్బన్ కమలాపురం మండలం గుండేడు గ్రామానికి చెందిన కుడుతాజి భూమాజీరావు, తిరుమల దంపతుల కుమార్తె శిరీషకు నాలుగేండ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తలు కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి పాప జన్మించింది. శరత్‌బాబు ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అత్త రాధాబాయి అదనపు కట్నం తీసుకురావాలని వేధించి శిరీషను తల్లిగారింటికి పంపించింది. దీంతో తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శిరీష తన కూతురుతో కలిసి ఆందోళన దిగింది.

ఆర్టీసీ బస్సు బోల్తా.. 15మందికి గాయాలు

చివ్వెంల: ఆర్టీసీ బస్సు బోల్తా పడి 15మందికి గాయాలైన సంఘటన ఆదివారం తెల్లవారుజామున సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలో చోటుచేసుకున్నది. విజయవాడ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు (ఏపీ16జడ్0151) 32 మంది ప్రయాణికులతో శనివారం రాత్రి 11గంటలకు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. ఆదివారం తెల్లవారుజామున సుమారు 2గంటల సమయంలో చివ్వెంల మండలం దురాజ్‌పల్లి ఆవాసం తెల్లబండకాలనీ వద్దకు చేరుకోగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లాకు చెందిన చిరంజీవి, సాంబశివరావు, శ్రీనివాస్, భానుమూర్తి, డ్రైవర్ సహా మరో 11మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో సూర్యాపేట ఏరియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణమని ఎస్సై చెప్పారు.

ఛత్తీస్‌గఢ్‌లో కందకాలు తవ్విన మావోయిస్టులు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమ జిల్లా కుంట బ్లాక్ పరిధిలో కిస్టారం పోలీసుస్టేషన్ సమీపంలో గల కాచారం బేస్ క్యాంపు వద్ద నూతనంగా నిర్మిస్తున్న రోడ్డుపై మావోయిస్టులు కందకాలు తవ్వి నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టుకు ఏర్పాటు చేసిన సెంట్రింగ్‌ను దహనం చేశారు. సుమారు 500 మంది మిలీషియా సానుభూతిపరులు తవ్వకంలో పాల్గొన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. సమీపంలోని కాచారం బేస్ క్యాంప్‌నకు భద్రతా బలగాలు వస్తున్నాయనే సమాచారంతో వారిపై దాడికి పూనుకునేందుకు ప్రయత్నించగా భద్రతా బలగాలు వేరే మార్గం గుండా బేస్ క్యాంప్‌కు తరలివెళ్లినట్టు సమాచారం. వ్యూహాత్మకంగా మావోయిస్టులు దాడిచేసేందుకు ప్రయత్నించినప్పటికీ అది విఫలం కావడంతో ఈ సంఘటనకు పాల్పడినట్టు తెలిసింది.

సీపీఐ(ఎంఎల్) రాయల వర్గం దళ సభ్యుడి అరెస్ట్

గుండాల: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాయలవర్గానికి చెందిన అజ్ఞాత దళ సభ్యుడు మంగన్న అలియాస్ మంగును పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలోని కచనపల్లి గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా మంగుని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. న్యూడెమోక్రసీ రాయల వర్గానికి చెందిన రమేశ్ దళంలో మంగు పనిచేస్తున్నట్టు సీఐ తుమ్మా గోపి, ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఐదు ఇండ్లు దగ్ధం

బూర్గం పహాడ్: విద్యుదాఘాతంతో ఐదు ఇండ్లు అగ్నికి ఆహుతయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గం పహాడ్ మండలం ఇరవెండి పంచాయతీ పరిధిలోని కొత్తూరు కాలనీలో ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకున్నది. సుమారు రూ. 9 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామంలోని ఇర్పా పుల్లయ్య ఇంట్లో సంభవించిన విద్యుదాఘాతంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఇర్పా వీరాస్వామి, అలావత్ కృష్ణవేణి, కొర్సా మారయ్య, రమేశ్, వెంకటేశ్‌కు చెందిన ఇండ్లు దగ్ధమయ్యాయి.

బావిలో పసికందు మృతదేహం

టేకులపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని బోడు పంచాయతీ రామచంద్రుడిపేట గ్రామసమీపంలోని నీలంవారి బావిలో ఆదివారం గుర్తుతెలియని మగశిశువు మృతదేహం లభ్యమైంది. బావి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పరిశీలించగా అందులో మృతదేహం కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారమందించారు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
సోమవారం 8 జనవరి 2018



సచిన్ కూతురుకి వేధింపులు

వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

ముంబై: బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తె సారాకూ వేధింపులు తప్పలేదు. పశ్చిమ బెంగాల్ మిడ్నాపూర్‌కు చెందిన దేవ్‌కుమార్ మైటి అనే వ్యక్తి ఈ వేధింపులకు ప్పాలడినట్లు గుర్తించిన పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గత నెలలో దేవ్‌కుమార్.. సచిన్ ఇంటి ల్యాండ్‌లైన్‌కు ఫోన్ చేసి సారాను కిడ్నాప్ చేసి పెండ్లి చేసుకుంటానని అసభ్యంగా మాట్లాడాడు. దాదాపు 20సార్లు ఫోన్ చేసి వేధించడంతో డిసెంబర్ 5న సారా బాంద్రా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి రంగంలోకి దిగిన పోలీసులు మొబైల్ ఫోన్ టవర్ సిగ్నల్ ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. 'టీవీలో మ్యాచ్ చూస్తున్నప్పుడు సారా గ్యాలరీలో కనిపించేది. ఆ క్షణంలోనే నేను ఆమెతో ప్రేమలో పడ్డాను. సారాను పెండ్లి చేసుకోవాలనుకుంటున్నా. సచిన్ ఇంటి ఫోన్ నంబర్‌ను సేకరించి ఫోన్లు చేశా. అయితే సారాను మాత్రం బయట ఎక్కడా, ఎప్పుడు చూడలేదు' అని విచారణలో దేవ్‌కుమార్ అంగీకరించాడు. అయితే దేవ్‌కుమార్ మానసిక పరిస్థితి సరిగా లేదని అతని తల్లి పోలీసులకు తెలిపింది. తన కొడుకు ఇంటర్‌తోనే చదువు ఆపేశాడని, ఈ మధ్యనే అతని తండ్రి చనిపోయాడని చెప్పింది. పోలీసులు మాత్రం దేవ్‌కుమార్ వైద్య నివేదికలను పరిశీలించాకే అతని మానసిక పరిస్థితిపై ఒక అంచనాకు వస్తామన్నారు.

సర్జుబాల, జ్యోతి ముందంజ

రోహతక్: జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సర్జుబాలా దేవి, జ్యోతి ముందంజ వేశారు. ఆదివారం జరిగిన 48-51 కేజీల విభాగంలో సర్జుబాలా దేవి (మణిపూర్) 5-0తో సిమ్రన్ (ఢిల్లీ)పై గెలిచింది. ప్రపంచ చాంపియన్‌షిప్ రజత పతక విజేత సర్జుబాలా పంచ్‌లకు అనుభవం అంతగా లేని సిమ్రన్ ఎదురునిలువలేకపోయింది.51-54 కేజీలలో జ్యోతి (రాజస్థాన్) 5-0తో బబిత (ఢిల్లీ)పై, శిక్ష (ఆర్‌ఎస్‌పీబీ) 5-0తో గజల్ మాథ్యూ (కర్ణాటక)పై నెగ్గారు. ఇతర విభాగాలలో ఫ్యాన్సీ దేవి (ఏఐపీ).. రింపీపై, దులతీ... నీరా కుమారి (సిక్కిం)పై గెలిచారు.

లోధా సిఫారసులకు ఓకే

హెచ్‌సీఏ సర్వసభ్య సమావేశంలో తీర్మానం ■ హైకోర్టు తీర్పు తర్వాత కొత్త క్లబ్బులు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: జస్టిస్ లోధా సిఫారసులను యధావిధిగా అమలు చేస్తామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) తీర్మానం చేసింది. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో 16 అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిపి వాటికి ఆమోద ముద్ర వేసింది. అయితే సస్పెన్షన్ వేటు పడిన కార్యదర్శి శేష్ నారాయణపై ఎలాంటి నిర్ణయాన్ని తీసుకోలేదు. వాడివేడిగా సాగిన ఈ సమావేశంలో సభ్యుల గందరగోళం మధ్య మూడుసార్లు వాయిదాపడింది. శేష్ భవితవ్యంపై ఎపెక్స్ కౌన్సిల్, అంబుడ్స్‌మన్ తుది నిర్ణయం తీసుకుంటాయని హెచ్‌సీఏ అధ్యక్షుడు జీ వివేక్ వెల్లడించారు. సమావేశాలకు గైర్హాజరుకావడం, సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించడం, ఎపెక్స్ కౌన్సిల్ నిర్ణయాలను గౌరవించకపోవడం వల్లనే అతనికి ఈ పరిస్థితి ఎదురైందన్నారు. 'లోధా సిఫారసులకు అనుగుణంగానే హెచ్‌సీఏ పని చేస్తుంది. సమావేశం ప్రశాంతంగానే జరిగింది. సిఫారసులన్నింటినీ ఆమోదించాం. గత కార్యవర్గం ఈ సిఫారసులను అమలు చేయకపోవడం వల్లే కొన్ని నిధులు ఆగిపోయాయి. కానీ ఇప్పుడు ఆ ఇబ్బందిలేదు. గ్రామం నుంచి మొదలుకొని అన్ని స్థాయిల వరకు క్రికెట్‌ను అభివృద్ధి చేస్తాం. హైకోర్టు తీర్పు వచ్చిన వెంబడే జిల్లాల్లో క్లబ్‌లు ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం ఉన్న కమిటీలో చర్చించి టోర్నీలు నిర్వహిస్తాం. ఎవరు విమర్శించినా క్రికెట్‌ను అభివృద్ధి చేయడమే మా లక్ష్యం' అని వివేక్ పేర్కొన్నారు.

మైక్ విరగొట్టిన వీహెచ్..

మాజీ క్రికెటర్ అజరుద్దీన్‌ను సమావేశానికి అనుమతించకపోవడంతో.. కాంగ్రెస్ నేత వీ హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసభ్యపదజాలంతో మాట్లాడుతూ మైక్‌ను విరగొట్టారు. వివేక్, బీసీసీఐ మాజీ ఉపాధ్యక్షుడు శివలాల్ యాదవ్ జోక్యం చేసుకుని పరిస్థితిని సద్దుమణిగేలా చేశారు. హెచ్‌సీఏ, బీసీసీఐతో సంబంధంలేని ఓ క్రికెట్ అసోసియేషన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న అజర్‌ను ఈ సమావేశానికి అనుమతించడం సరైంది కాదని వివేక్ అన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రికెటర్‌గా హాజరైతే తప్పనిసరిగా సమావేశానికి ఆహ్వానిస్తామన్నారు.

కోహ్లీ ఔట్..
అభిమాని ఆత్మహత్యాయత్నం!

రత్లామ్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ 5 పరుగులకే ఔట్‌కావడాన్ని ఓ వ్యక్తి జీర్ణించుకోలేకపోయాడు. మధ్యప్రదేశ్‌లోని రత్లామ్ జిల్లాకు చెందిన 65 ఏండ్ల బాబుబాల్ భైర్వ విశ్రాంత రైల్వే ఉద్యోగి. శుక్రవారం తన గదిలో కూర్చొని మ్యాచ్‌ను వీక్షించిన భైర్వ.. కోహ్లీ ఔటైన వెంటనే కిరోసిన్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. బాధను భరించలేక గట్టిగా అరువడంతో కుటుంబ సభ్యులు మంటల్ని ఆర్పేసి జిల్లా దవాఖానాకు తరలించారు. వెంటనే చికిత్స అందించిన వైద్యులు అతన్ని ప్రాణాపాయం నుంచి గట్టెక్కించారు. భైర్వ.. తల, ముఖం, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు.

ధోనీ మరో అకాడమీ



ముంబై: భారత మాజీ కెప్టెన్ ధోనీ తన అకాడమీలను విస్తరిస్తున్నాడు. ప్రతిభ కల్గిన క్రికెటర్లను వెలుగులోకి తీసుకొచ్చే ఉద్దేశంతో ఇప్పటికే దుబాయ్‌లో అకాడమీని నెలకొల్పిన ధోనీ..త్వరలో సింగపూర్‌లో మరో క్రికెట్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించబోతున్నాడు. ఈనెల 20న సింగపూర్‌లో తన అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్వయంగా పాల్గొననున్నాడు. అకాడమియా7, ఆర్కా స్పోర్ట్స్ సహకారంతో రానున్న రోజుల్లో ఆసియాలో మరో 12 అకాడమీలు నెలకొల్పేందుకు ధోనీ సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. సింగపూర్‌లో అకాడమీలో చేతన్ సూర్యవంశీ, చమీందా రువాన్, దివియ జీకే క్రికెటర్లకు శిక్షణ ఇవ్వనున్నారు.

మూడో రోజు ఆట వర్షార్పణం



ఒక్క బంతి కూడా సాధ్యపడలేదు

కేప్‌టౌన్: ఉత్కంఠభరితంగా సాగుతున్న భారత్, దక్షిణాఫ్రికా తొలి టెస్టుకు వరుణుడు అడ్డు తగిలాడు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా ఆదివారం మూడో రోజు ఆట పూర్తిగా రద్దయింది. ఔట్ ఫీల్డ్ చిత్తడిగా మారడంతో ఒక్క బంతి కూడా సాధ్యపడలేదు. తెల్లవారుజామున చిరుజల్లులతో మొదలైన వర్షం మధ్యలో స్వల్ప విరామాలు ఇస్తూ సాయంత్రం వరకు కొనసాగింది. మైదానం సిబ్బందికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. దీంతో అంపైర్లు సూపర్ సాపర్‌లను దించాలని చూసినా ఫలితం లేకపోయింది. స్థానిక కాలమానం ప్రకారం మూడున్నర గంటలకు మైదానాన్ని పరిశీలించిన అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. నాలుగు, ఐదో రోజు ఆట 98 ఓవర్ల పాటు కొనసాగనుంది. చివరి సెషన్‌ను 15 నిమిషాలు పొడిగించారు. అయితే వాతావరణం నివేదిక ప్రకారం సోమవారం కూడా వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.





మ్యాచ్ ఎంతకు తగ్గకపోవడంతో చిర్రెత్తుకొచ్చిన అభిమాని తాగిన మైకంలో మైదానంలోని పిచ్‌పైకి దూసుకొచ్చాడు. కవర్లపై పరుగెత్తుతూ కాలు జారి పడిపోయాడు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది.. అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

ఇండోర్‌లో ప్రాక్టీస్

లంచ్ తర్వాత మైదానంలోకి వచ్చిన టీమ్‌ఇండియా ఇండోర్ నెట్స్‌లో ప్రాక్టీస్ చేసింది. భువనేశ్వర్, బుమ్రా, సంజయ్ బంగర్, భరత్ అరుణ్ తొలి విడుతగా ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. తర్వాత మిగతా ప్లేయర్లు బరిలోకి దిగారు.

ఫలితం వస్తుందా..?

మూడో రోజు ఆట రద్దు కావడంతో మ్యాచ్‌లో ఫలితం తేలడంపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లలో 2 వికెట్లకు 65 పరుగులు చేసింది. రబడ (2 బ్యాటింగ్), ఆమ్లా (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఓవరాల్‌గా 142 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్న సఫారీ జట్టు నాలుగో రోజు వేగంగా ఆడి టీమ్‌ఇండియా ముందు భారీ లక్ష్యాన్ని ఉంచుతుందా? లేక డ్రావైపు వెళ్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. మ్యాచ్‌కు రెండు రోజులే మిగిలి ఉండటం, వాతావరణం కూడా మేఘావృతంగా ఉంటుందన్న వార్తల నేపథ్యంలో ఈ మ్యాచ్‌లో విరాట్‌సేన కనీసం డ్రాతోనైనా గట్టెక్కుతుందా? అన్నది కూడా ఆసక్తి రేపుతున్నది. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 286 పరుగులకు ఆలౌట్‌కాగా, భారత్ 209 పరుగులు చేసింది.

పెండ్లి చేసుకోలేదు..
కానీ చేసుకుంటా: ఇమ్రాన్

ఇస్లామాబాద్: తాను రహస్యంగా మూడో పెండ్లి చేసుకున్నట్టు వస్తున్న వార్తలను పాకిస్థాన్ మాజీ క్రికెటర్, తెహ్రీక్ ఇన్సాఫ్ పార్టీ (పీటీఐ) అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్ ఖండించాడు. తన ఆధ్యాత్మిక గురువు బుష్రా మనేకను పెండ్లి చేసుకోవాలనుకుంటున్న మాట వాస్తవమేనని, అయితే రహస్యంగా నిఖా జరిగిందన్న వార్తల్లో నిజం లేదని చెప్పాడు. 'ఇమ్రాన్ పెండ్లి కోసం మనేక అభిప్రాయం కోరాడు. ఆమె కొంత సమయం కావాలని చెప్పింది. మీడియా మాత్రం అనేక కథనాలు రాసేసింది. వారి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించి ఇరు కుటుంబాలను ఒత్తిడికి గురి చేసింది. ఇది రెండు కుటుంబాల మధ్య అంతరంగిక వ్యవహారం. ఎప్పుడూ ప్రజా జీవితంలో గడపని ఆమెను ఇలా బహిర్గతం చేయడం తగదు. పెండ్లికి మనేకా అంగీకరిస్తే ఇమ్రాన్ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడిస్తాడు' అని క్రికెటర్ తరపు ప్రతినిధి పేర్కొన్నాడు.

ట్రోఫీని గెలువడమే లక్ష్యం

- అండర్-19 కెప్టెన్ పృథ్వీషా ధీమా
- అట్టహాసంగా ప్రపంచకప్ ఆరంభ వేడుక



సెల్ఫీ తీసుకుంటున్న అన్ని జట్ల కెప్టెన్లు

క్రైస్ట్‌చర్చ్: ఎన్ని అడ్డంకులు వచ్చినా.. ప్రపంచకప్ ట్రోఫీతోనే భారత్‌కు తిరిగి వెళ్తామని అండర్-19 జట్టు కెప్టెన్ పృథ్వీ షా ధీమా వ్యక్తం చేశాడు. ఈ మెగా ఈవెంట్ కోసం బాగా సిద్ధమయ్యామని, కోచ్ ద్రవిడ్ నేతృత్వంలో మరింత రాటుదేలామన్నాడు. ఆదివారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న షా మాట్లాడుతూ.. ట్రోఫీని గెలువడం మా లక్ష్యం. వారం రోజుల నుంచి ఇక్కడే ఉన్నాం. రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడాం. ప్రస్తుతానికి అంతా సవ్యంగా సాగుతున్నది. ఈనెల 13న ఆసీస్‌తో జరిగే తొలి మ్యాచ్‌పైనే ప్రధానంగా దృష్టిపెట్టాం. శుభారంభం లభిస్తే జట్టులో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది' అని షా పేర్కొన్నాడు. ఇక క్రైస్ట్‌చర్చ్‌లో ఈ ఆరంభ వేడుక అట్టహాసంగా జరిగింది. న్యూజిలాండ్ సంస్కృతిని ప్రతిబింబించేలా కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకకు 16 జట్లు హాజరవ్వగా.. క్రైస్ట్‌చర్చ్ కౌన్సిలర్ ఆరోన్ కీవన్, న్యూజిలాండ్ క్రికెట్ అధ్యక్షుడు డెబ్బీ హక్లీ ఆయా జట్లకు స్వాగతం పలికారు. కాగా నేటి నుంచి వామప్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. తొలి మ్యాచ్ జనవరి 13, ఫైనల్ మ్యాచ్ ఫిబ్రవరి 3న జరుగనుంది.

హైదరాబాద్ అదుర్స్



సాయి ప్రణీత్

చెన్నై: భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ (అవధ్ వారియర్స్)ను కరోలినా మారిన్ (హైదరాబాద్ హంటర్స్) చిత్తుగా ఓడించగా...సాయి ప్రణీత్ చేతిలో కిదాంబి శ్రీకాంత్ ఖంగుతిన్నాడు. ఫలితంగా పీబీఎల్‌లో హైదరాబాద్ హంటర్స్ 6-(-1)తో అవధ్ వారియర్స్‌ను వైట్ వాష్ చేసింది. దీంతో అవధ్ వారియర్స్ లీగ్ దశను అత్యంత పేలవంగా ముగించింది. ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో మొదట పురుషుల డబుల్స్‌లో కిడో, సియోంగ్ (హైదరాబాద్) జోడి 14-15, 15-6, 15-11తో చున్‌మన్, చిన్‌చంగ్‌పై, పురుషుల సింగిల్స్‌లో లీ హ్యున్ (హైదరాబాద్) 13-15, 15-9, 15-14తో కశ్యప్‌పై విజయం సాధించాడు. వారియర్స్ తమ ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకున్న పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్‌ను సాయిప్రణీత్ (హైదరాబాద్) చిత్తు చేశాడు. ప్రణీత్ 15-10, 15-10తో శ్రీకాంత్‌పై గెలిచి హైదరాబాద్‌కు విజయాన్ని ఖరారు చేశాడు. ఇక మహిళల సింగిల్స్‌లో కరోలినా మారిన్ (హైదరాబాద్) 15-5, 15-7తో సైనాను, మిక్స్‌డ్ డబుల్స్‌లో బెర్నాడెత్, రాంకిరెడ్డి (హైదరాబాద్) జోడి 15-9, 15-9తో సెటియావన్, పెడర్‌సెన్‌ను ఓడించింది.

బరోడా గెలుపు

- సయ్యద్ ముస్తాక్ అలీ టీ20



దీపక్ హుడా (66)

రాజ్‌కోట్: దీపక్ హుడా (39 బంతుల్లో 66; 8 ఫోర్లు, 1 సిక్స్), ఉర్విల్ ముకేశ్ పటేల్ (28 బంతుల్లో 50; 7 ఫోర్లు, 2 సిక్సర్లు) దుమ్మురేపడంతో.. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీని బరోడా విజయంతో ప్రారంభించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 13 పరుగుల తేడాతో ముంబైపై గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బరోడా 20 ఓవర్లలో 3 వికెట్లకు 210 పరుగులు చేసింది. దేవ్‌ధర్ (38), ఉర్విల్ తొలి వికెట్‌కు 91 పరుగులు జోడించారు. చివర్లో క్రునాల్ పాండ్యా (26 బంతుల్లో 44; నాటౌట్; 1 ఫోర్, 3 సిక్సర్లు) చెలరేగి.. హుడాతో మూడో వికెట్‌కు 106 పరుగులు జోడించాడు. తర్వాత ముంబై 20 ఓవర్లలో 8 వికెట్లకు 198 పరుగులే చేసింది. సిద్ధేశ్ లాడ్ (51 బంతుల్లో 82; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) ఒంటరి పోరాటం వృథా అయింది. సూర్యకుమార్ (22), దూబే (33) కాసేపు నిలిచినా జట్టును గెలిపించలేకపోయారు. షేత్, మిరివాలా చెరో మూడు వికెట్లు తీశారు.

'మార్ష్' ద్వయం మెరుపులు

శతకాలతో చెలరేగిన షాన్, మిచెల్
గెలుపు దిశగా ఆస్ట్రేలియా



మిచెల్ మార్ష్ (101)
షాన్ మార్ష్ (156)

సిడ్నీ: యాషెస్ సిరీస్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా మరో విజయానికి చేరువైంది. ఐదు టెస్టుల సిరీస్‌ను ఇప్పటికే 3-0తో కైవసం చేసుకున్న ఆసీస్.. సిడ్నీ టెస్టుపై మరింత పట్టు బిగించింది. మార్ష్ సోదరులు షాన్ (291 బంతుల్లో 156; 18 ఫోర్లు), మిచెల్ (141 బంతుల్లో 101; 15 ఫోర్లు, 2 సిక్సర్లు) శతకాలతో చెలరేగడంతో... ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌ను 193 ఓవర్లలో 649/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 46 ఓవర్లలో 4 వికెట్లకు 93 పరుగులు చేసింది. రూట్ (42 బ్యాటింగ్), బెయిర్‌స్టో (17 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం ఇంగ్లండ్ ఇంకా 210 పరుగులు వెనుకబడి ఉంది. 15 పరుగులకే ఓపెనర్లు కుక్ (10), స్టోన్‌మన్ (0) వికెట్లను కోల్పోయిన ఇంగ్లిష్ జట్టును లియోన్ (2/31) దెబ్బతీశాడు. ఈ దశలో రూట్ సాధికారికంగా ఆడుతూ.. జేమ్స్ విన్సీ (18)తో కలిసి మూడో వికెట్‌కు 28 పరుగులు జోడించాడు. అయితే ఇన్నింగ్స్ గాడిలో పడిందనకున్న సమయంలో విన్సీ, మాలన్ (5) స్వల్ప విరామాల్లో వెనుదిరగడంతో మరోసారి ఇంగ్లండ్ కష్టాల్లో పడింది. అంతకుముందు 479/4 ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన ఆసీస్‌కు మార్ష్ సోదరులు అండగా నిలిచారు. ఇంగ్లీష్ బౌలింగ్ తుత్తునీయలు చేస్తూ సెంచరీలతో జోరు చూపెట్టారు. ఈ ఇద్దరు ఐదో వికెట్‌కు 169 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో ఆసీస్ భారీ స్కోరు సాధ్యమైంది. చివర్లో 52 పరుగుల తేడాతో వీరిద్దరు ఔట్‌కాగా, పైనీ (38 నాటౌట్), స్టార్క్ (11), కమిన్స్ (24 నాటౌట్) సమయోచితంగా ఆడారు. మొయిన్ అలీ 2 వికెట్లు తీశాడు.

3

టెస్టుల్లో ఆస్ట్రేలియా తరపున ఒకే ఇన్నింగ్స్‌లో సెంచరీలు చేసిన మూడో జోడీగా మార్ష్ సోదరులు నిలిచారు. గతంలో గ్రెగ్ చాపెల్, ఇయాన్ చాపెల్, స్టీవ్‌వా, మార్క్‌వా శతకాలు చేశారు. ఓవరాల్‌గా టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇది ఎనిమిదోసారి.

కుక్ @ 12000

ఇంగ్లండ్ ఓపెనర్ అలిస్టర్ కుక్ అరుదైన రికార్డును అందుకున్నాడు. టెస్టుల్లో 12 వేల పరుగులు పూర్తిచేసుకున్న ఆరో బ్యాట్స్‌మన్‌గా రికార్డుల్లోకెక్కాడు. ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరుగుతున్న ఐదో టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో ఈ ఫీట్‌ను అందుకున్నాడు. దీంతో సచిన్, రికీ పాంటింగ్, కలిస్, ద్రవిడ్, సంగక్కర లాంటి దిగ్గజ క్రికెటర్ల సరసన నిలిచాడు.

ఆటగాడు	పరుగులు
సచిన్	15,921
పాంటింగ్	13,378
కలిస్	13,289
ద్రవిడ్	13,288
సంగక్కర	12,400
కుక్	12,005



'బ్రిటిష్' ఓపెన్ రన్నరప్ నీల్ జోషి

బర్మింగ్‌హామ్: బ్రిటిష్ జూనియర్ ఓపెన్ స్క్వాష్ టోర్నీలో భారత కుర్రాడు నీల్‌జోషి రన్నరప్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన అండర్-15 ఫైనల్లో జోషి 11-8, 14-16, 0-11, 12-14తో స్యామ్ టాడ్(ఇంగ్లండ్) చేతిలో ఓడాడు. తొలి సెట్‌ను నీల్ కైవసం చేసుకున్నప్పటికీ..స్యామ్ ఒక్కసారిగా పుంజుకుని వరుస సెట్లను దక్కించుకున్నాడు. బాలుర అండర్-17 సెమీస్‌లో తుషార్ సహానీ 11-9, 2-11, 3-11, 8-11తో ఒమర్ ఎల్ టర్కీ(ఈజిప్టు) చేతిలో ఓడాడు.

ముస్తాఫిజుర్‌కు పిలుపు

ఢాకా: స్వదేశంలో జరుగనున్న ముక్కోణపు టోర్నీ కోసం బంగ్లాదేశ్ జట్టును ప్రకటించారు. చీలమండ గాయంతో ఆటకు దూరమైన పేసర్ ముస్తాఫిజుర్ మళ్లీ పిలుపు అందింది. సౌమ, పేసర్ టస్కిన్ అహ్మద్‌లపై వేటు పడింది. బంగ్లాతో పాటు శ్రీలంక, జింబాబ్వే ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి.

నలుగురు పవర్ లిఫ్టర్ల దుర్మరణం

- ఢిల్లీ ఔటర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
- తీవ్రంగా గాయపడ్డ సాక్షమ్ యాదవ్



సాక్షమ్ యాదవ్



న్యూఢిల్లీ: ఢిల్లీ-చండీగఢ్‌పై జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు పవర్ లిఫ్టర్లు దుర్మరణం పాలయ్యారు. పవర్‌లిఫ్టింగ్ ప్రపంచ చాంపియన్ సాక్షమ్ యాదవ్‌తో పాటు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పానిపట్‌లో అథ్లెటిక్స్ మీట్ ముగించుకుని వస్తున్న సాక్షమ్ యాదవ్ కారు... ఆదివారం ఉదయం 4 గంటల ప్రాంతంలో అత్యంత వేగంతో సింగ్ బోర్డర్ దగ్గరలోని అలీపూర్ గ్రామం వద్ద డివైడర్ పోల్‌ను ఢీకొట్టి నాలుగైదు ఫల్టీలు కొట్టింది. కారు పైభాగం నుజ్జునుజ్జు కావడంతో నలుగురు లిఫ్టర్లు అక్కడిక్కడే మరణించారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనం అతి వేగానికి తోడు దట్టమైన పొగమంచు ఉండటంతో ఈ ఘటన చోటు చేసుకుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. హరీశ్, టింకు, సూరజ్‌ను మృతులుగా గుర్తించగా, నాలుగో వ్యక్తి ఎవరన్నది ఇంకా తెలియరాలేదు. మృతులను, సాక్షమ్ యాదవ్‌ను దగ్గర్లోని దవాఖానాకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

వడోదర మారథాన్‌లో విషాదం

వడోదర: ఉత్సాహంగా సాగిన వడోదర మారథాన్ అంతర్జాతీయ మారథాన్‌లో ఆదివారం విషాదం చోటు చేసుకున్నది. 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న భరత్ సమాని (62) అనే వ్యక్తి గుండెపోటుతో మరణించాడు. రన్నింగ్ చేస్తూ వచ్చిన భరత్.. తాజ్ గేట్‌వే హోటల్ వద్ద గల ప్రొడక్టివిటీ రోడ్ మార్గంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అతని వెనకాలే వస్తున్న ముగ్గురు డాక్టర్ల బృందం వెంటనే చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో అంబులెన్స్‌ను పిలిచి దగ్గర్లోని ప్రైవేట్ దవాఖానాకు తరలించినా ప్రయోజనం లేకపోయింది.



ఆదివారం చెన్నైలో జరిగిన చెన్నైయిన్, ఢిల్లీ డైనమోస్ ఐఎస్‌ఎల్ మ్యాచ్‌కు హాజరైన చెన్నైయిన్ ఎఫ్‌సీ సహ యజమాని అభిషేక్ బచ్చన్, అతని భార్య ఐశ్వర్య రాయ్, కూతురు ఆరాధ్య బచ్చన్.

అమెరికా, కెనడాలపై హిమఖడ్గం

రికార్డ్ స్థాయికి పతనమైన ఉష్ణోగ్రతలు ■ న్యూయార్క్‌కు విమానరాకపోకల నిలిపివేత


మంచు తుఫాన్‌తో గడ్డకట్టుకుపోయిన జనజీవనం

కార్గిల్‌లో మైనస్ 18.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు

న్యూయార్క్, జనవరి 7: అమెరికా, కెనడాలపై మంచుతుఫాన్ తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఆర్కిటిక్ నుంచి వీస్తున్న ప్రమాదకర చలిగాలులకు ఇరు దేశాలు వణికిపోతున్నాయి. అమెరికాలోని మూడింట రెండు వంతుల రాష్ట్రాల్లో మైనస్ 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవగా, కెనడాలోని ఉత్తర అంటారియో, క్యూబెక్‌లలో ఉష్ణోగ్రత మైనస్ 50 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. మంచుతుఫాన్ కారణంగా టెక్సాస్ నుంచి విస్కాన్సిన్ వరకు ఇప్పటివరకు 19మంది మృతిచెందిన విషయం తెలిసిందే. న్యూయార్క్, దక్షిణ కరోలినా సహా పలు ప్రాంతాల్లో విమానాల రాకపోకల్ని నిలిపివేశారు. 2250 విమానాలు ఆలస్యంగా నడిచాయి. పలు నగరాల్లో విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. మరోవారం రోజులపాటు ఉష్ణోగ్రతలు ఇలాగే కొనసాగుతాయని అమెరికాలోని జాతీయ వాతావరణ కేంద్రం ప్రకటించింది. మిన్నెసోటాలో చలిమంట కాచుకుంటుండగా జరిగిన అగ్నిప్రమాదంలో రోజ్‌మేరీ కొల్లార్డ్ (59), జేమ్స్ విల్లిస్ షాండ్లర్ (49) దంపతులు మృతిచెందారు. మరోవైపు స్పెయిన్‌లో హిమపాతం కారణంగా వాహనాల్లో చిక్కుకుపోయిన వందలాదిమంది డ్రైవర్లను రక్షించేందుకు ఆర్మీ రంగంలోకి దిగింది.



మంచు కప్పిన శ్రీనగర్-లేహ్ రహదారి



గడ్డకట్టిన నయాగరా జలపాతం

కశ్మీర్‌లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు

కశ్మీర్‌లో ఈ సీజన్‌లోనే అత్యల్ప రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. లఢక్ మీదుగా వీస్తున్న శీతలగాలుల కారణంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పతనమవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రికార్డుస్థాయిలో లఢక్ ప్రాంతంలో, కార్గిల్‌లో మైనస్ 18.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శ్రీనగర్‌లో శనివారం నాడు మైనస్ 1.2 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, ఒక్క రోజులోనే ఐదు డిగ్రీలు పతనమైంది. కశ్మీర్‌లోని మిగతా పట్టణాలు గుల్‌మార్గ్ (మైనస్ 9.4), ఖాజీగుండ్, కుప్వారా (మైనస్ 4.6), కోకర్నాగ్ (మైనస్ 4.4)ల్లోనూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొత్త రికార్డుల్ని నెలకొల్పాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని కొండప్రాంతం కేలాంగ్‌లో మైనస్ 12.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఢిల్లీతోపాటు పంజాబ్, హర్యానా, పలు రాష్ట్రాల్లో పొగమంచు కారణంగా 39 రైళ్లను ఇప్పటివరకు రద్దు చేసినట్లు రైల్వేశాఖ ప్రకటించింది. మరో 50 రైళ్లు ఆలస్యంగా నడుపుతుండగా, 16 రైళ్లను వాయిదా వేసినట్లు తెలిపారు. హర్యానాలో చలితీవ్రత కారణంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు.

చైనా తీరంలో నౌకల ఢీ

32 మంది గల్లంతు



ఓడల నుంచి వెలువడుతున్న మంట, పొగ

బీజింగ్: చైనా తీరంలో శనివారం రాత్రి రెండు నౌకలు ఢీకొన్నాయి. ఇరాన్ నుంచి దక్షిణకొరియాకు చమురు (ఆయిల్) తీసుకెళ్తున్న 'సంచీ' అనే నౌక.. 'సీఎఫ్ క్రిస్టల్' అనే మరో నౌకను షాంఘైకి తూర్పున 160 నాటికల్ మైళ్ల దూరంలో ఢీకొట్టింది. ఈ ప్ర మాదంలో 32 మంది సిబ్బం ది గల్లంతయ్యారు. వీరిలో 30 మంది ఇరాన్ దేశానికి చెందినవారు ఉండగా.. ఇద్దరిది బం గ్లాదేశ్ అని చైనా రవాణశాఖ అధికారులు తెలిపారు. సంచీ నౌకలో 1.36 లక్షల టన్నుల చమురు, క్రిస్టల్ నౌకలో 64 వేల టన్నుల ధాన్యం తరలిస్తున్నారు. ఈ ప్రమాదంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో చైనాకు చెందిన సీఎఫ్ క్రిస్టల్ అనే నౌక ధ్వంసమయిందని అధికారులు వెల్లడించారు. ఇది అమెరికా నుంచి చైనాలోని గుయంగ్డోంగ్‌కు ప్రయాణిస్తున్నదని తెలిపారు. ప్రమాదం జరిగిన ప్రదేశానికి సహాయం నిమిత్తం ఎనిమిది నౌకలను పంపించినట్టు వివరించారు.

యూపీ రోడ్డు ప్రమాదంలో 11 మంది మృతి

ఫిరోజాబాద్: ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ జిల్లా పరిధిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 11 మంది మరణించారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు బాలలు ఉన్నారని జిల్లా ఎస్పీ మనోజ్ కుమార్ చెప్పారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో కాన్పూర్ నుంచి ఆగ్రా వెళుతున్న ట్రక్కు.. అదుపు తప్పి ఎదురుగా వెళుతున్న త్రిచక్ర వాహనాన్ని.. ఆపై కారును ఢీ కొట్టింది. దీంతో ఘటనా స్థలంలోనే పది మంది మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రగాయాలతో ఆగ్రాకు తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మరణించాడని పోలీసులు తెలిపారు.

కిమ్‌తో మాట్లాడుతా: ట్రంప్



క్యాంప్‌డేవిడ్: ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో ఫోన్‌లో మాట్లాడటానికి తనకు ఎటువంటి అభ్యంతరం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఈ మేరకు ఆయన అమెరికా మేరీల్యాండ్‌లోని క్యాంప్ డేవిడ్‌లో మీడియాతో మాట్లాడారు. దక్షిణకొరియాతో చర్చలకు ఉత్తరకొరియా అంగీకరించడంతో ట్రంప్ తన దూకుడును తగ్గించారు. దక్షిణకొరియాలో జరిగే శీతాకాల ఒలింపిక్స్‌లో పాల్గొంటామని కిమ్ ప్రకటించడంతో ట్రంప్ మెత్తబడ్డారు. అంతకుముందు అణుదాడి బటన్ తన టేబుల్‌పైనే ఉంటుందని కిమ్ అమెరికాకు హెచ్చరికలు జారీచేయడంతో ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. దీనిపై ట్రంప్ స్పందిస్తూ తన వద్ద అంతకంటే పెద్ద అణు బటన్ ఉన్నదని తీవ్రంగా ప్రతిస్పందించారు. ఈ నేపథ్యంలో చర్చలకు రావాలని ఉత్తరకొరియాను దక్షిణకొరియా కోరింది. సంయుక్త సైనిక విన్యాసాలను వాయిదా వేయాలని అమెరికా, దక్షిణకొరియా నిర్ణయించడంతో చర్చలకు ఉత్తరకొరియా అంగీకరించింది. కిమ్‌తో మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ట్రంప్ సమాధానమిస్తూ 'కిమ్‌తో తప్పకుండా మాట్లాడుతా. అతనితో మాట్లాడటానికి నాకు ఎటువంటి సమస్యా లేదు. ఇది శుభారంభం' అని పేర్కొన్నారు.

కాషాయరంగు పడింది!

- మొన్న సెక్రటేరియట్.. నిన్న హజ్ హౌజ్... నేడు లక్నో పోలీస్‌స్టేషన్
- క్రమంగా రంగు మార్చుకుంటున్న యూపీ ప్రభుత్వ కార్యాలయాలు

లక్నో: ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ కార్యాలయాలు క్రమంగా కాషాయరంగు పులుముకుంటున్నాయి. సచివాలయ భవనానికి కాషాయరంగు వేసిన కొద్దిరోజులకే లక్నోలోని హజ్ కార్యాలయానికీ అదే రంగు వేయడం వివాదాస్పదమైంది. దీన్ని రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి మొహసిన్ రజా సమర్థించుకున్నారు కూడా. ప్రహరీ గోడలకే కొత్త రంగు వేశామని, కాషాయం కాంతికి, శక్తికి సంకేతమని వివరణిచ్చారు. పలు సంస్థలు ఈ చర్యను వ్యవతిరేకించడంతో చివరకు హజ్‌హౌజ్ గోడలకు రంగు మార్చారు. ఇది జరిగి 24గంటలైనా కాకముందే తాజాగా లక్నో పోలీస్‌స్టేషన్‌కూ కాషాయరంగు పడింది.



ఖైసర్‌భాగ్ పోలీస్ స్టేషన్ గోడలకు కాషాయ రంగు

సీఎం యోగి ఆదిత్యనాథ్ కాషాయ దుస్తులనే ధరిస్తారు. ప్రభుత్వాధినేత మనసెరిగిన అధికారులు ఇలా ఆఫీసుల్ని కాషాయరంగులోకి మార్చేస్తున్నారు. సీఎంగా ఆదిత్యనాథ్ బాధ్యతలు చేపట్టాక అన్నీ కాషాయ వర్ణాన్నే సంతరించుకుంటున్నాయి. అన్నీ క్రమంగా కాషాయరంగులోకి మారాయి. ఈ జాబితాలో కొత్తగా లక్నోలోని చారిత్రక ఖైసర్‌భాగ్ పోలీస్ స్టేషన్ వచ్చి చేరింది. 1939లో నిర్మించిన ఈ పోలీస్‌స్టేషన్‌కు ఇప్పటివరకు పసుపు, ఎరుపు రంగుల్నే సంప్రదాయంగా వేస్తూ వచ్చారు. కానీ, ఈసారి మాత్రం స్టేషన్ పిల్లర్లకు, పైభాగానికి చిక్కటి కాషాయరంగును వేశారు. సీఎంవోకు కూతవేటు దూరంలోని లాల్‌బహదూర్ శాస్త్రి భవన్‌కు గత ఏడాది అక్టోబర్‌లో కాషాయరంగు వేశారు. సీఎం ఆదిత్యనాథ్ తన కార్యాలయంలోని తన సీటులో కాషాయ టవలే ఇష్టపడతారు. ఇటీవలే ఆయన 50 కాషాయరంగులతో కూడిన బస్సుల్ని జెండా ఊపి ప్రారంభించారు . దీంతో విద్యాశాఖ తరపున అందించిన స్కూల్‌బ్యాగులు కూడా కాషాయరంగులోనే ఉన్నాయి. కాగా, కాషాయీకరణలో భాగంగానే ప్రభుత్వ కార్యాలయాల రంగులు మారుస్తున్నారని ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ విమర్శిస్తున్నది.

మణిపూర్‌లో భూకంపం

న్యూఢిల్లీ: మయన్మార్ – భారత్ సరిహద్దు రాష్ట్రమైన మణిపూర్‌లో ఆదివారం మధ్యాహ్నం 12.17 గంటలకు భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దాని తీవ్రత 6.0గా నమోదైందని జాతీయ భూకంప శాస్త్ర కేంద్రం తెలిపింది. 35 కిమీ లోతున భూకంప కేంద్రం కేంద్రీకృతమైంది. ఈ భూకంపం వల్ల ఎటువంటి నష్టం జరిగినట్లు సమాచారం అందలేదు.

బార్క్‌లో సైంటిఫిక్ ఆఫీసర్లు

డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డీఏఈ)కి చెందిన బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్) ట్రెయినింగ్ స్కూల్ ద్వారా 2018-19 అకడమిక్ ఇయర్‌కుగాను వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ట్రెయినీ సైంటిఫిక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- బీఈ/బీటెక్, ఎంటెక్, పీజీ (సైన్స్) అభ్యర్థులకు అవకాశం
- శిక్షణ తర్వాత సైంటిఫిక్ ఆఫీసర్ హోదాలో ఉద్యోగం
- గేట్ స్కోర్, స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూతో ఎంపిక
- ఫిబ్రవరి 4 చివరితేదీ

వివరాలు:

- పోస్టు పేరు: ట్రెయినీ సైంటిఫిక్ ఆఫీసర్
- ఈ ట్రెయినింగ్ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులను సైంటిఫిక్ ఆఫీసర్స్ గ్రూప్–ఏ ప్రభుత్వోద్యోగులుగా నియమిస్తారు. బార్క్ రెండు రకాల స్కీమ్–1, స్కీమ్–2లను అందిస్తుంది.
- ఒసీఈఎస్ 2018 (స్కీమ్–1)
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్, సైన్స్ పోస్టు గ్రాడ్యుయేట్స్ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. వీరికి ఏడాది ట్రెయినింగ్ పోగ్రామ్ ఉంటుంది.
- ఒసీఈఎస్ క్యాంపస్‌లు: బార్క్ ముంబై, ఇందిరా గాంధి సెంటర్ ఫర్ అటామిక్ రిసెర్చ్ (కల్పకం), రాజా రామన్న సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ (ఇండోర్), న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (హైదరాబాద్), అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రిసెర్చ్ (హైదరాబాద్)
- స్టయిఫండ్: నెలకు రూ.35,000 + బుక్ అలవెన్స్ కింద రూ.10,000/- ఇస్తారు.
- డీజీఎఫ్ఎస్ 2018 (స్కీమ్–2)
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంటెక్/ఎం.కెమికల్ ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందిన ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్, మాస్టర్ డిగ్రీ (ఫిజిక్స్) దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి రెండేండ్ల డీఏఈ గ్రాడ్యుయేట్ ఫెలోషిప్ లభిస్తుంది.
- డీజీఎఫ్ఎస్ క్యాంపస్‌లు: ఐఐటీ బాంబే, ఢిల్లీ, గువాహటి, కాన్పూర్, మద్రాస్, రూర్కీ, బీహెచ్‌యూ వారణాసి, నిట్ రూర్కెలా, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ–ముంబై,
- స్టయిఫండ్ : కోర్సు ట్యూషన్ ఫీజు+నెలకు రూ.35,000+బుక్ అలవెన్స్ కింద రూ. 10,000+ కాంటిజెన్సీ గ్రాంట్ కింద రూ.25,000 ఇస్తారు. ఎంటెక్/ఎం.కెమికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసిన వారికి డీజీఎఫ్ఎస్ ఫెలో అభ్యర్థులు అదనపు ఇంక్రిమెంట్లతో డీఏఈ - సైంటిఫిక్ ఆఫీసర్‌గా నియమిస్తారు.
- పే స్కేల్: శిక్షణ పూర్తయిన తర్వాత రూ. 56,100 (7వ వేతన పే స్కేల్ ప్రకారం), ఇతర అలవెన్స్‌లతో కలుపుకొని రూ. 84,000/- నెలకు జీతం చెల్లిస్తారు.
- అర్హత కింద పరిగణించే ఇంజినీరింగ్ విభాగాలు:
- బీఈ/బీటెక్, బీఎస్సీ (ఇంజినీరింగ్), ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ (మెకానికల్, కెమికల్, మెటలర్జికల్/మెటీరియల్స్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, న్యూక్లియర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, న్యూక్లియర్ ఇంజినీరింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్, న్యూక్లియర్ టెక్నాలజీ .



అర్హత కింద పరిగణించే సైన్స్ విభాగాలు:

- ఎమ్మెస్సీ (ఫిజిక్స్, అప్లయిడ్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోసైన్స్, జియోఫిజిక్స్, అప్లయిడ్ జియోఫిజిక్స్, ఎమ్మెస్సీ/ఎంటెక్ (జియాలజీ, అప్లయిడ్ జియాలజీ, అప్లయిడ్ జియోకెమిస్ట్రీ, ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ (జియాలాజికల్ టెక్నాలజీ, జియోఫిజికల్ టెక్నాలజీ), బీఈ/బీటెక్ ఇన్ ఇంజినీరింగ్ ఫిజిక్స్, బీఈ/బీటెక్, బీఎస్సీ (టెక్నాలజీ) ఇన్ ఫుడ్ టెక్నాలజీ.
- ఎంపిక: గేట్ –2017/2018 స్కోర్ ఆధారంగా స్క్రీనింగ్ లేదా ఆన్‌లైన్ టెస్ట్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహిస్తారు. అదేవిధంగా ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలో మెరిట్ పొందిన అభ్యర్థులకు బార్క్‌లోఎమ్మెస్సీ (ఇంజినీరింగ్)/ పీహెచ్‌డీ, డిప్లొమా ఇన్ రేడియాలాజికల్ ఫిజిక్స్ అడ్మిషన్ పొందవచ్చు.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- ఆన్‌లైన్ టెస్ట్: 2018 మార్చిలో
- పర్సనల్ ఇంటర్వ్యూ: మే, జూన్‌లో
- ఇంటర్వ్యూ ప్రదేశం: హైదరాబాద్, ముంబై
- చివరితేదీ: ఫిబ్రవరి 4
- గేట్ స్కోర్ అప్‌లోడింగ్‌కు చివరితేదీ: ఏప్రిల్ 2
- వెబ్‌సైట్: http://www.barc.gov.in

ఇంజినీర్ ట్రెయినీలు

టీహెచ్‌డీసీ ఇండియా లిమిటెడ్‌లో ఇంజినీర్ ట్రెయినీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

- పోస్టు: ఇంజినీర్ ట్రెయినీ
- ఖాళీల సంఖ్య – 40 (సివిల్ – 15, ఎలక్ట్రికల్ – 15, మెకానికల్ – 10)
- పేస్కేల్: రూ. 20,600 – 46,500/-
- అర్హతలు: సంబంధిత విభాగంలో ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత.
- వయస్సు: 30 ఏండ్లు మించరాదు.
- ఎంపిక: గేట్ – 2018 స్కోర్ ఆధారంగా
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 31
- వెబ్‌సైట్: http://thdc.gov.in

సీసీఆర్‌టీలో 650 స్కాలర్‌షిప్స్

సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రెయినింగ్ (సీసీఆర్‌టీ) 2018-19 అకడమిక్ ఇయర్‌కు గాను వివిధ సాంస్కృతిక విభాగాల్లో యంగ్ చిల్డ్రన్ ఫెలోషిప్స్ పొందడానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

భారత ప్రభుత్వ సాంస్కృతిక విభాగం పరిధిలో పనిచేస్తుంది.

- మొత్తం ఫెలోషిప్‌ల సంఖ్య: 650
- ప్రతి ఏడాదికి 650 యంగ్ చిల్డ్రన్ ఫెలోషిప్స్ ఇస్తారు.
- విభాగాలు : సంగీతం, నృత్యం, నాటకం, పెయింటింగ్, శిల్పకళ, కళలు, సాహిత్య సాంస్కృతిక రంగాలు.
- అర్హత: గుర్తింపు పొందిన పాఠశాలలో 10 నుంచి 14 ఏండ్ల వయస్సులో ఉన్న ప్రతిభావంతులైన పిల్లలు.
- స్టయిఫండ్: ఏడాదికి రూ. 3600/-, సంస్థకు లేదా గురు/ఉపాధ్యాయుడికి ప్రత్యేక శిక్షణ కోసం ట్యూషన్ ఫీజు కింద రూ.9000/- చెల్లిస్తారు.
- ఈ స్కాలర్ షిప్ ప్రోగ్రామ్ రెండేండ్లకు ఇస్తారు. తర్వాత పునరుద్ధరించబడుతుంది.



- ఎంపిక: టెస్ట్/ఇంటర్వ్యూ ద్వారా.
- ఇంటర్వ్యూ/టెస్ట్ తేదీలు, సమయాలు, వేదిక/ప్రదేశం విషయాలను పోస్టు ద్వారా తెలియజేస్తారు. 2018 మేలో ప్రాంతీయ స్థాయిలో నిర్వహిస్తారు.
- దరఖాస్తు: ఆఫ్‌లైన్ ద్వారా.

చిరునామా: CCRT Regional Centre, OPP. CII , New Google Office, Kondapur Main Road, Madhapur, Hyderabad-500084

- చివరితేది: జనవరి 31
- వెబ్‌సైట్: www.ccrtindia.gov.in

అసిస్టెంట్ ప్రొఫెసర్లు



తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- పోస్టులు: అసిస్టెంట్ ప్రొఫెసర్లు (ఫేజ్ – 1)
- ఖాళీల సంఖ్య – 125
- ఆర్ట్స్, సైన్సెస్, ఇంజినీరింగ్, దూరవిద్య, ఇంజినీరింగ్ బ్రాంచీల్లో ఖాళీలు ఉన్నాయి.
- ఫేజ్ –2లో అసిస్టెంట్ ప్రొఫెసర్స్ – 48 ఖాళీలు.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఫేజ్ –1కు ఫిబ్రవరి 2, ఫేజ్ – 2కు ఫిబ్రవరి 5
- వెబ్‌సైట్: www.svuniversity.edu.in

డ్రాఫ్ట్స్‌మెన్ ట్రెయినీలు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న డ్రాఫ్ట్ స్మెన్ ట్రెయినీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- పోస్టు పేరు: డ్రాఫ్ట్స్‌మెన్ ట్రెయినీ
- మొత్తం ఖాళీల సంఖ్య: 14 (మెకానికల్–1, ఎలక్ట్రికల్–13)
- శిక్షణకాల వ్యవధి: రెండేండ్లు
- స్టయిఫండ్: మొదటి ఏడాది నెలకు రూ.8,500, రెండో ఏడాది నెలకు రూ.8900, అదనపు పనిగంటలకు నెలకు రూ.4200/-
- అర్హత: పదోతరగతితోపాటు ఇంజినీరింగ్‌లో డిప్లొమా (మెకానికల్/ఎలక్ట్రికల్) ఉత్తీర్ణత
- వయస్సు: 25 ఏండ్లు మించరాదు.
- ఎంపిక: రాతపరీక్ష, ప్రాక్టికల్ టెస్ట్



- దరఖాస్తు : ఆన్‌లైన్‌లో
- దరఖాస్తు ఫీజు: రూ.100
- చివరితేదీ: 2018 జనవరి 15
- హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ: 2018, జనవరి 19
- వెబ్‌సైట్: www.cochinshipyard.com

సూరత్ నిట్‌లో ప్రొఫెసర్లు

గుజరాత్ (సూరత్)లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌వీఎన్ఐటీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది.

వివరాలు

SVNIT SURAT

- పోస్టు పేరు: ప్రొఫెసర్
- మొత్తం ఖాళీల సంఖ్య: 19
- విభాగాలు: ఇంజినీరింగ్ (మెకానికల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, కెమికల్, ఎలక్ట్రానిక్స్), అప్లయిడ్ మ్యాథమెటిక్స్, హ్యుమానిటీస్.
- అర్హత: సంబంధిత విభాగంలో పీహెచ్‌డీతోపాటు పరిశోధన, బోధన రంగంలో అనుభవం.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్‌లో. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తుకు అవసరమైన సర్టిఫికెట్లను జతచేసి పర్సనల్ అధికారికి పంపాలి.
- చివరితేదీ: 2018, ఫిబ్రవరి 16
- వెబ్‌సైట్: www.svnit.ac.in

ఐఐపీలో ప్రాజెక్ట్ అసిస్టెంట్లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం (ఐఐపీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రాజెక్ట్ అసిస్టెంట్/ రిసెర్చ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఐఐపీ అనేది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిధిలో పనిచేస్తున్న సంస్థ

- మొత్తం ఖాళీల సంఖ్య–20 పోస్టులు
- ప్రాజెక్ట్ అసిస్టెంట్ (గ్రేడ్ 2) –15 పోస్టులు
- అర్హత : కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్, ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ)లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- ప్రాజెక్ట్ అసిస్టెంట్ (గ్రేడ్ 3) –2 పోస్టులు
- అర్హత: కెమికల్/మెకానికల్ ఇంజినీరింగ్‌లో 55 శాతం మార్కులతో ఎంటెక్ లేదా బీఈ/బీటెక్‌లో ఉత్తీర్ణత.
- రిసెర్చ్ అసోసియేట్ (గ్రేడ్ 1)– 3 పోస్టులు
- అర్హత: కెమిస్ట్రీ/క్యాటలిసిస్, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీలో పీజీతో పాటు పీహెచ్‌డీ ఉండాలి.
- పే స్కేల్: ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ. 25,000 లేదా రూ. 28,000/-అసోసియేట్‌కు రూ. 36,000/-స్టయిఫండ్ ఇస్తారు
- ఎంపిక: పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- ఇంటర్వ్యూ తేదీ: జనవరి 17,18,19
- వెబ్‌సైట్ : www.iip.res.in